
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 25

బుధవారం 17-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## దివ్యం.. భవ్యం.. రమ్యం.. రామచరితం

పితృవాక్పాలన, ధర్మవర్తన, సదా సత్యమే పలకడం, ప్రజానురంజకమైన పాలనను అందించడం.. వంటి ఎన్నో లక్షణాలను బట్టి అందరి గుండెల్లో దేవుడిగా కొలువు తీరాడు రాముడు. చిన్నప్పుడు లాల పోసి శ్రీరామ రక్ష చెప్పడం దగ్గరనుంచి 'రామాలాలీ.. మేఘశ్యామాలాలీ' అనే జోలపాటతో బిడ్డలను నిద్ర పుచ్చడం వరకు... అందరి జీవితాలలో రాముడు ఒక భాగంగా మారిపోయాడు. నేడు ఆ జగదభిరాముడు ఇలపై పుట్టినరోజు.. సీతారాముల పెళ్లిరోజు కూడా. ఈ సందర్భంగా ఆ పురుషోత్తముడి గురించి... -IIలో

నేడు శ్రీరామనవమి

పితృవాక్పాలన, ధర్మవర్తన, సదా సత్యమే పలకడం, ప్రజానురంజకమైన పాలనను అందించడం.. వంటి ఎన్నో లక్షణాలను బట్టి అందరి గుండెల్లో దేవుడిగా కొలువు తీరాడు రాముడు. అయితే మన నిత్యజీవితంలో అసలు రామ శబ్దం లేనిదెప్పుడు? చిన్నప్పుడు లాల పోసి శ్రీరామ రక్ష చెప్పడం దగ్గరనుంచి 'రామాలాలీ.. మేఘశ్యామా లాలీ' అనే జోలపాటతో బిడ్డలను నిద్ర పుచ్చడం వరకు... అందరి జీవితాలలో రాముడు ఒక భాగంగా మారిపోయాడు. నేడు ఆ జగదభిరాముడు ఇలపై పుట్టిన రోజు.. అంతేనా... ఆదర్శదంపతులుగా పేరు పొందిన సీతారాముల పెళ్లిరోజు కూడా. ఈ సందర్భంగా ఆ పురుషోత్తముడి గురించి...

# దివ్యం.. భవ్యం.. రమ్యం
# రామచరితం



ఆయన ఇక్ష్వాకు కుల తిలకుడు. దశరథ మహారాజ తనయుడు. తండ్రి మాటను నిలబెట్టడం కోసం రాజ్యంతోబాటు సర్వ సంపదలనూ, అన్ని సుఖాలనూ విడనాడి నారదుస్తులు ధరించి పదునాలుగేళ్లపాటు అరణ్యవాసం చేశాడు. ఎన్ని కష్టాలొచ్చినా వెరవలేదు. తాను నమ్మిన సత్య, ధర్మ మార్గాలనే అనుసరించాడు. ఒక మంచి కొడుకులా, అనురాగాన్ని పంచే భర్తలా, ఆత్మీయతను అందించే అన్నలా, ప్రజలను కన్నబిడ్డల్లా పాలించే రాజులా ... అందరితో అన్ని విషయాలలోనూ వినమ్రతతో మెలిగే మర్యాద పురుషోత్తముడిలా... ఇలా ఎవరితో ఏవిధంగా ఉండాలో ఆ విధంగానే నడుచుకున్నాడు. అన్నివేళలా ధర్మాన్నే పాటించాడు. ఆపన్నులకు స్నేహహస్తాన్ని అందించాడు. ఆత్మీయులకు, మిత్రులకు అండగా నిలిచాడు. తాను అవతార పురుషుడినని అనలేదు. అనుకోలేదు కూడా... దేవుడినని ఎన్నడూ చెప్పుకోలేదు. ఎవరికీ ఏ ధర్మాన్నీ బోధించలేదు. తాను ఆచరించినదే ధర్మం – అనుకునే విధంగా వ్యవహరించాడు. అందుకే ధర్మం రూపు దాల్చితే రాముడిలా ఉంటుందేమో అనుకునేలా ప్రవర్తించాడు.

**సంపూర్ణావతారం**

ధర్మ పరిరక్షణ కోసం శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాలన్నింటిలోనూ సంపూర్ణమైనవి రామావతారం, కృష్ణావతారాలే. మిగిలినవి అంశావతారాలు. అంటే అప్పటికప్పుడు ఆవిర్భవించినవి. మత్స్య, కూర్మ, హయగ్రీవ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, కల్కి అవతారాలు. మానవాళిని సత్యవాక్య పాలకులుగా తీర్చిదిద్ది, సన్మార్గంలో నడిపించడం కోసం మానవుడిలా పుట్టాడు. అందరిలాగే ఎన్నో కష్టనష్టాలను అనుభవించాడు. అయితేనేం, ధర్మాన్ని ఎక్కడా తప్పలేదు. అందుకే కదా... అతి సామాన్యులనుంచి అసామాన్యుల వరకు అందరికీ ఆరాధ్య దైవమయ్యాడు. ఉత్తమ మానవుడు ఎలా ఉండాలో తన నడవడిక ద్వారా నిరూపించి, సకల గుణాభిరాముడయ్యాడు.

**కల్యాణ వైభోగం**

ఆ శ్రీహరి రామునిగా ఇలపై అవతరించిన పుణ్య తిథి శ్రీరామ నవమి. ఈ పండుగను తొమ్మిది రోజులు జరుపుతారు. చైత్ర శుక్ల పాడ్యమి నుంచి శ్రీరామనవమి వరకూ పూజాదికాలు, రామనామ పారాయణం చేస్తారు. అసలు చైత్ర మాస ప్రారంభం నుంచే ఇంటింటా, వాడవాడలా, వీధివీధినా చలువ పందిళ్లు, మామిడాకు తోరణాలు... ఇలా ప్రతిచోటా కళ్యాణోత్సవ సంరంభాలు మొదలవుతాయి. కంచర్ల గోపన్న భక్తరామదాసుగా శ్రీరామసేవా దీక్షను స్వీకరించాడు. ప్రతి సంవత్సరం శ్రీరామ జన్మదినోత్సవమైన శ్రీరామనవమి నాడు శ్రీసీతారాములకు తిరుకల్యాణ మహోత్సవాన్ని జరిపించే సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టాడు. సిరికల్యాణ తిలకంతో, మణిమయ బాసికాలతో ఆణిముత్యాలే తలంబ్రాలుగా జాలువారే ముగ్ధమోహనమైన, మనోరంజకమైన సీతారాముల పెళ్ళి వేడుక జగదానందకారకమై భాసిస్తుంది. శ్రీరామనవమి మరుసటి రోజు దశమి నాడు శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు.

**తారక మంత్రం**

'శ్రీరామ రామరామేతి రమే రామే మనోరమే .. సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే' అనే శ్లోకం విష్ణుసహస్ర నామంతో సమానమైనదంటారు. మోక్షాన్ని ప్రసాదించే మహామంత్రాలు ఓం నమో నారాయణాయ. ఓం నమశ్శివాయల నుంచి తీసుకున్న అక్షరాల కలయిక అయిన రామనామాన్ని జపిస్తే ఈ రెండు మంత్రాలను జపించడం వల్ల కలిగే ఫలితం కంటె ఎక్కువ ఫలం కలుగుతుంది. మన పెదవులు రామనామంలోని 'రా' అనే అక్షరాన్ని పలికినపుడు మనలోని పాపాలన్నీ బయటకు వెళ్లిపోతాయి. 'మ' అనే అక్షరాన్ని ఉచ్చరించినప్పుడు అవి లోపలకు రాకుండా మూసుకుంటాయి. కాబట్టి 'రామ' అనే రెండక్షరాల తారక మంత్రాన్ని సదా స్మరిస్తుండడం వల్ల పాపాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని కబీరుదాసు, భక్త రామదాసు, తులసీదాసు వంటి మహాభక్తులు ఉవాచించారు.

**పుట్టినరోజునే పెళ్లి వేడుకలా.!?**

శ్రీరాముడు జన్మించిన పుణ్యతిథి చైత్ర శుద్ధ నవమి, పునర్వసు నక్షత్రం, కర్కాటక రాశి, కర్కాటక లగ్నం. ఆనాడు రాముని జన్మదిన వేడుకలు జరిపించాలి. అయితే శ్రీ సీతారామకళ్యాణం జరిపించడంలోని అంతరార్థం ఏమిటనేదానికి పురుషోత్తమ సంహిత అనే ఆగమ శాస్త్ర గ్రంథం ఏమి చెబుతోందంటే– ఆ పరమాత్ముడు అవతారమూర్తిగా ఏ రోజున ఈ పుణ్యపుడమిపై అవతరిస్తే ఆ రోజునే కళ్యాణం జరిపించాల్సి ఉందనీ, ఒకవేళ ఆ తిథి తెలియకపోతే ఏకాదశి రోజున కళ్యాణం జరిపించడం సంప్రదాయమని పేర్కొంది. అందుకే లోక కళ్యాణం కోసం సీతారాములకు పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమినాడు అభిజిత్ లగ్నంలో పెళ్లి వేడుకలు జరిపిస్తున్నారు.

**శుభప్రదం... రామచరిత పారాయణం**

రాముని కాలంలో ధర్మం నాలుగు పాదాలా నడిచింది. దేశం సుభిక్షంగా ఉంది. అందుకే నేటికీ ప్రజలు రాముని వంటి రాజుకోసం– రామరాజ్యం నాటి పాలన కోసం పరితపిస్తుంటారు. తులసీదాసు, రామదాసు, కబీరుదాసు వంటి వారందరూ ..."అంతా రామ మయం.... ఈ జగమంతా రామమయం" అని వేనోళ్ల స్తుతించారు. ఆ పురాణ పురుషుని పుణ్యచరితమైన రామాయణాన్ని విన్నా, చదివినా, అందులోని శ్లోకాలను, ఘట్టాలను మననం చేసుకున్నా, శుభం కలుగుతుందని ప్రతీతి.

**శ్రీరామ నవమినాడు ఏం చేయాలి?**

ఈరోజు రామునితోబాటు సీతాదేవి ని, ఆంజనేయుని, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను కూడా పూజించాలి. రామునికి జన్మనిచ్చిన కౌసల్యను, దశరథుని కూడా స్తుతించడం సత్ఫలితాలనిస్తుంది. సీతారామ కళ్యాణం జరిపించడం, ఆ వేడుకలలో పాల్గొనడం, చూడడం, శ్రీరామ నవమి వ్రతాన్ని ఆచరించడం, విసనకర్రలు దానం చేయడం మంచిది.

**సమర్పించవలసిన నైవేద్యం**

పానకం, వడపప్పు, చలిమిడి, మామిడిపండ్లు, చక్కెర పొంగలి, చెరకు, విప్పపూలు నివేదించాలి. సీతారామ కళ్యాణ తలంబ్రాలను ధరిస్తే ఆటంకాలు తొలగి సత్వరం వివాహం అవుతుందని పెద్దలంటారు.

ఏటా చైత్రశుద్ధ నవమి రోజున పునర్వసు నక్షత్రంలో అభిజిత్ లగ్నంలో పాంచరాత్ర ఆగమం ప్రకారం శ్రీసీతారామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవాన్ని భద్రాద్రిలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలను తిలకించేందుకు దేశం నలు మూలల నుంచి భక్తులు తరలివస్తారు. తానీషా గోల్కొండ నవాబుగా ఉన్న కాలం నుంచి– ఆనాటి సాంప్రదాయం మేరకు నేటికీ భద్రాద్రిలో జరిగే శ్రీ సీతారామ కళ్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సమర్పించడం ఆనవాయితీ.

**12 గంటలకు ఎందుకు?**

రాముడు త్రేతాయుగంలో వసంత ఋతువు, చైత్ర శుద్ధ నవమి రోజున పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నం, అభిజిత్ ముహూర్తం అంటే మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు జన్మించాడు. అందుకే చైత్ర శుద్ధ నవమి రోజున శ్రీరాముడి వివాహం, పదునాలుగు సంవత్సరాల అరణ్యవాసం, రావణ సంహారం తరువాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడు అయిన రోజు కూడా చైత్ర శుద్ధ నవమి. శ్రీరామ నవమి రోజున ప్రతి శ్రీరాముని దేవాలయాలలో సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించి సాయంత్రం వీధులలో ఊరేగిస్తారు. శ్రీరాముడు మధ్యాహ్నం 12:00 గంటలకు పుట్టాడు కాబట్టి శ్రీరామనవమి రోజున మధ్యాహ్నం 12 గంటలకు పూజ చేస్తే శ్రీరామానుగ్రహంతో కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వాసం.

**నిత్యజీవితంలో రాముడు...**

లాల పోసేటప్పుడు శ్రీరామ రక్ష, జోలపాడేటప్పుడు రామాలాలీ మేఘ శ్యామాలాలీ... ఓదార్పుగా అయ్యోరామ... అనకూడని మాట వింటే రామ రామ... పద్దు పుస్తకాలను ప్రారంభిస్తూ శ్రీరామ... కూర్చునేటప్పుడు లేచేటప్పుడూ రామా... ఇలా ఆయన అందరి నాలుకలమీదా నర్తిస్తూనే ఉన్నాడు... ఉంటాడు.

అల్లరి చేస్తే కిష్కింద కాండ, కఠినమైన ఆజ్ఞ ఇస్తే సుగ్రీవాజ్ఞ విశాలమైన ఇంటి గురించి చెప్పేటప్పుడు లంకంత ఇల్లు పాతవాటి గురించి చెప్పాలనుకుంటే ఇక్ష్వాకుల కాలం నాటిది...

సామెతలు: రామాయణంలో పిడకల వేట; రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుందన్నట్టు... చూసి రమ్మంటే కాల్చి వచ్చినట్టు

ఆకారం గురించి చెప్పాలంటే రాముడిలా ఆజానుబాహువంటారు.

ఎంతకీ చూడ్డానికి రాబోతే సీతకన్నేశావంటారు

సైన్యంలా వస్తే రామదండు అంటారు.

చక్కని జంటను సీతారాముల్లా ఉన్నారంటారు.

ఎవరైనా కొట్టుకుంటే రామరావణ యుద్ధమంటారు.

అందరిళ్లలోని గిల్లి కజ్జాలను ఇంటింటి రామాయణమంటారు.

రాముడు మనకు విలువలను, వ్యక్తిత్వాన్నీ నేర్పితే రామాయణం మనకు జీవిత పాఠాలు బోధిస్తుంది.

రామచంద్ర ప్రభువు చల్లని చూపులు మనందరి మీదా ప్రసరించాలని కోరుకుంటూ....

– డి.వి.రామ్ భాస్కర్

---

* వయసు @ 70

# సోలో ట్రావెలర్



నీరూ సలూజా

"వయసు కాదు ప్రతి ఒక్కరూ తమ హృదయ లయను అర్థం చేసుకొని, దానిని అనుసరించాలని నమ్ముతాను. ఇతరుల గుండె చప్పుడులో జీవించాలని ఎప్పుడూ అనుకోవద్దు" అంటోంది రిటైర్డ్ ప్రొఫెసర్ జైపూర్‌వాసి నీరూ సలూజా. జీవితం ఎప్పుడూ ఒక కంఫర్ట్ జోన్ బయటే ఉంటుందనే వాస్తవాన్ని గట్టిగా నమ్మే ఈ ప్రొఫెసర్ డెబ్బై ఏళ్ల వయసులో సోలో ట్రావెలర్‌గా 80 దేశాలు చుట్టొచ్చింది. భిన్న సంస్కృతులను, పర్యావరణాన్ని అర్థం చేసుకోవడానికి, ఎంతో మందిని కలుసుకొని కొత్త ఉత్తేజాన్ని పొందడానికి ఈ ప్రయాణం ఎంతగానో తోడ్పడింది అని చెబుతుంది.



"పసిఫిక్‌లోని గాలా పాగోస్ దీవుల నుండి అట్లాంటిక్ మంచుతో నిండిన క్షితిజాల వరకు చేసిన పర్యటనల ద్వారా ఎన్నో స్మారక చిహ్నాలను సేకరించాను. వాటితో అలంకరించిన నా ఇంటిని చూసిన వాళ్లు ప్రపంచ మ్యాప్‌లా ఉంటుందని అంటారు. ఈ జ్ఞాపకాలు అన్నీ ఇప్పటి వరకు నేను చేసిన సాహసాలను గుర్తుచేస్తాయి. ఇంకా నా ఇంటి గోడలపై మిగిలిన ఖాళీ స్థలాలు రాబోయే చిహ్నాల కోసం నాతో సవాల్ చేస్తున్నట్టుగా కనిపిస్తాయి.



**కల వెనకాల రహస్యం**

నాకు ప్రయాణాల పట్ల ఆసక్తి కలగడానికి స్కూల్ రోజుల్లోనే బీజం పడింది. స్కూల్‌కి సైకిల్‌పై వెళుతుండగా ప్రమాదానికి గురై ఎడమ కాలు విరిగింది. ఫిజియోథెరపీ సెషన్‌లతో పాటు నెలల తరబడి బెడ్‌రెస్ట్‌లో ఉండిపోయాను. ఇతర పిల్లలు స్కూల్లో ఉంటే నేను గదికి పరిమితం అయ్యాను. అప్పట్లో వినోదానికి టీవీ లాంటి ఏ సాధనమూ లేదు. దీంతో పడకగదిలోని కిటికీ లోంచి బయటకు చూస్తూ గంటల తరబడి కాలం గడపవలసి వచ్చింది. అక్కడ నుంచి ఆకాశం కేసి చూస్తూ ఉండేదాన్ని. ప్రపంచాన్ని అన్వేషించాలనుకునేదాన్ని. దాదాపు ఆరు దశాబ్దాల తరువాత అలా నా కల నిజమైంది.

**ప్రేమ వారసత్వం**

కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగ నిర్వహణ, భార్యగా విధులు, తల్లిగా బాధ్యతలు, ఇంటి నిర్మాణం.. అన్నీ నిర్వర్తించాను. నా పిల్లలు స్థిరపడ్డారు. నా భర్తతో కలిసి చాలా టూర్లకు వెళ్లేవాళ్లం. ఆయన నాకు భర్త మాత్రమే కాదు నా ట్రావెలర్ ఫ్రెండ్ కూడా. 2010లో ఆయన మరణించడంతో మా ప్రేమ వారసత్వాన్ని నేను కొనసాగించాలని నిర్ణయించుకున్నాను. స్నేహితులు, కుటుంబ సభ్యుల రాక కోసం ఎదురుచూస్తూ ఉండలేను. ఆ విధంగా ఎనభైకి పైగా దేశాలను చుట్టొచ్చాను. ప్రపంచాన్ని అన్వేషించగలగడం ఒక అదృష్టంగా భావించకూడదు. అదొక ప్రయాణం.

**దృష్టి కోణాన్ని మార్చింది**

మొదటి ఒంటరి ప్రయాణం మాత్రం నాకు ఒక సాహసమే అని చెప్పగలను. 2014లో యూరప్ క్రిస్మస్‌కి క్రూయిజ్ ద్వారా వెళ్లాను. ఆ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. ఒంటరిగా ప్రయాణించడం ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ యాత్రతో నాకు అర్థమైంది. నిరుత్సాహమైనదని కొందరు అంటుంటారు. కానీ, నేనది అంగీకరించను. ప్రయాణ ప్రణాళికను బాగా ప్లాన్ చేసుకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముందు తెలుసుకున్నాను. మనతో ఒకరు తోడు కావాలనుకుంటే మాత్రం మార్గంలో ఎంతో మంది కొత్త స్నేహితులు కలుస్తారు. కాబట్టి నిజంగా ఒంటరిగా ఉన్నాననే ఆలోచనే రాదు. ఈ యాత్ర నా దృష్టి కోణాన్ని పూర్తిగా మార్చింది.



ఒంటరిగా ప్రయాణించడం, గన్యాలను, ప్రయాణ మార్గాలను నిర్ణయించుకునే స్వేచ్ఛ ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఇదే ఒక సమూహం, కుటుంబ పర్యటన అయితే ఒక సమయపాలనకు కట్టుబడి ఉండాలి. ఆ గ్రూప్‌లో ఎవరు ఏం చేస్తారో మీరూ అదే చేయాల్సి ఉంటుంది. కానీ, ఒంటరి యాత్రికుల విషయంలో అలాంటి డిమాండ్స్ ఏవీ ఉండవు.

**అడుగడుగునా ఉత్సుకత**

నా జీవితంలో అతి ఎక్కువగా గుర్తుండిపోయేది 2017 చలికాలంలో స్వీడన్ పర్యటన. నార్తర్న్ లైట్స్‌కు ప్రసిద్ధి చెందిన స్టాక్ హోమ్ నుండి అబిస్కోకు రైలు ఎక్కడం ద్వారా ఇది ప్రారంభమైంది. మన దేశం రైళ్లకు, అక్కడి రైళ్లకు ఏ మాత్రం పోలిక లేదు. బోర్డింగ్‌లో ప్రతి వ్యక్తికీ వాష్ రూమ్‌కి ఒక కీ ఇస్తారు. అదొక ఖరీదైన హోటల్ లాంటిది. అక్కడి బాత్రూమ్‌లో ఒక గంట సమయం గడపాలనుకున్నాను. తిరిగి కంపార్ట్‌మెంట్‌కు వచ్చినప్పుడు అది లాక్ అయిపోయింది. ఎవరూ సాయం చేసేవాళ్లు లేరు. కంగారు పడ్డాను. కానీ, చివరకు మార్గాన్ని కనుక్కోగలిగాలను. ఇలాంటి ఎన్నో ఉత్కంఠలు, ఉత్సుకతలు, సాహసాలు.. ఒక్కరోజులో చెప్పలేను. అబిస్కోలో ఒక మంచు గదిలో బస. అక్కడ అది ఎంతో అందంగా, సహజంగా ఉంది. కానీ, బాత్‌రూమ్‌లు లేవని ఆలస్యంగా తెలిసింది. అక్కడ పడిన పాట్లు ఒక్క మాటలో చెప్పలేను. మాస్కో నుండి బీజింగ్ వరకు ట్రాన్స్ –సైబీరియన్ రైలు ప్రయాణం.. అదొక ప్రపంచం. మెల్‌బోర్న్‌లో 12 వేల అడుగుల నుండి స్కై డైవింగ్ చేయడం అత్యంత ఉత్కంఠను కలిగించింది. ఇలా చెబుతూ పోతే ఎన్నో జ్ఞాపకాలు. ఒక స్వేచ్ఛ విహంగమై చేస్తున్న ప్రయాణం నాకు ఎన్నో తీరాలను పరిచయం చేస్తోంది" అని వివరిస్తుంది ఈ ట్రావెలర్.

నీరూ సలూజా



---

యూత్ పల్స్

# కథర్నాక్

'కథలు చెప్పకు' అని పేరెంట్స్‌తో, ఫ్రెండ్స్‌తో సుతిమెత్తని తిట్లు తినని వారు యూత్‌లో తక్కువగానే ఉంటారు. అయితే ప్రసిద్ధ బ్రాండ్స్ మాత్రం 'కథలు చెప్పండి ప్లీజ్' అంటూ యంగ్ టాలెంట్‌కు ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రకటనలకు సంబంధించి ఎఫెక్టివ్ స్టోరీ టెల్లింగ్ అనేది బ్రాండ్స్‌కు, కన్జ్యూమర్‌లకు మధ్య బలమైన వారధిగా మారింది. రకరకాల బ్రాండ్‌లకు సంబంధించి భావోద్వేగాలతో మిళితమైన యాడ్స్ యువ సృజనకారులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.




అమూల్ బ్రాండ్ 'అమూల్ గర్ల్' ద్వారా సమకాలీన సంఘటనలతో కనెక్ట్ కావడానికి చేస్తున్న టాపికల్ యాడ్స్ పాపులర్ అయ్యాయి. నగల బ్రాండ్ 'తనిష్క' తమ వ్యాపార ప్రకటనల్లో 'స్టోరీ టెల్లింగ్' ఫార్మట్‌ను బలంగా ఉపయోగించుకుంటుంది. ఇక 'లైఫ్‌బాయ్' దగ్గరకు వస్తే... ఎఫెక్టివ్ స్టోరీ టెల్లింగ్ అనేది ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేయడానికే కాదు పబ్లిక్ హెల్త్ అవేర్‌నెస్ విషయంలోనూ ఉపయోగపడుతుందనేది అర్థమవుతుంది.

శాస్త్ర, సాంకేతిక విషయాలపై వినియోగదారుల్లో ఆసక్తి కలిగించడానికి, పెంచడానికి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, స్టైజ్‌డ్ విజువల్స్‌ను ఉపయోగించుకుంటుంది అమెరికన్ మల్టీనేషనల్ కంపెనీ జనరల్ ఎలక్ట్రిక్.

బ్రాండ్‌లు విస్తృత స్థాయిలో కన్జ్యూమర్‌లతో కనెక్ట్ కావడానికి తమ ప్రొడక్ట్‌కు సంబంధించిన అడ్వర్‌టైజింగ్ విషయంలో భావోద్వేగాలతో కూడిన ఎఫెక్టివ్ స్టోరీ టెల్లింగ్‌ను కోరుకుంటున్నాయి. అడ్వర్‌టైజింగ్ ప్రపంచంలో స్ట్రాటజిక్ స్టోరీ టెల్లింగ్ అనేది కీలకంగా మారింది. ఈ పవర్‌ఫుల్ టూల్ బ్రాండ్స్‌కు, కన్జ్యూమర్‌లకు మధ్య బలమైన వారధిగా మారింది.

సర్వేల ప్రకారం ప్రొడక్ట్‌లకు సంబంధించి సంప్రదాయ అడ్వర్‌టైజింగ్‌ల కంటే మిత్రుల మాటలనే విశ్వసిస్తోంది యువత. వారిలో నమ్మకం కలిగించాలంటే యాడ్ అనేది యూత్‌ఫుల్‌గా, మిత్రుడు కొత్త విషయం చెప్పినట్లుగా ఉండాలి. ఇందుకోసం బ్రాండ్స్ యువ స్టోరీ టెల్లర్స్‌ను ఉపయోగించుకుంటున్నాయి.

వారి స్టోరీ టెల్లింగ్‌లోని తాజాదనానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి.

థీమ్‌ను గుర్తించడం, సెంట్రల్ క్యారెక్టర్స్‌ను డిజైన్ చేసుకోవడం, కస్టమర్‌ల హృదయాలను తాకేలా యాడ్‌ను తీర్చిదిద్దడం అనేవి స్టోరీ టెల్లింగ్‌లో కీలక విషయాలు. ఇలాంటి విషయాలలో యువ సృజనకారులు తమలోని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు.

ఈ డిజిటల్ శకంలో స్టోరీ టెల్లింగ్ అనేది కొత్త రూపాలతో సృజనాత్మకంగా వికసిస్తోంది. వర్చువల్ రియాలిటీ(వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), గేమింగ్ టెక్నాలజీ... మొదలైనవి స్టోరీ టెల్లింగ్‌లో కొత్త ద్వారాలు తెరుస్తున్నాయి.

'స్టోరీ టెల్లింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది బలమైన సాధనం. టార్గెట్ ఆడియెన్స్‌ను మెప్పించేలా స్టోరీ టెల్లింగ్ కోసం ఏ.ఐ సాంకేతికత ఉపయోగపడుతుంది. పవర్‌ఫుల్ స్టోరీ టెల్లింగ్ ఉనేది బలమైన భావోద్వేగాల సమ్మేళనం' అంటున్నాడు 'పోకో' ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్.

సినిమాల నుంచి ఇంటర్వ్యూల వరకు యూట్యూబ్ వీడియోలు చూస్తున్నప్పుడు ప్రకటనలు ప్రత్యక్షమైతే చిరాగ్గా అనిపిస్తుంది. కోల్‌కతాకు చెందిన ఇరవై రెండు సంవత్సరాల నివేదిత మాత్రం పనిగట్టుకొని రకరకాల అడ్వర్‌టైజ్‌మెంట్స్‌ను చూస్తుంటుంది.

'ఒకప్పటి వ్యాపార ప్రకటనల్లో వారి బ్రాండ్‌కు సంబంధించిన గోల మాత్రమే ప్రధానంగా కనిపించేది. ఇప్పటి ప్రకటనల్లో మాత్రం ఇంటలెక్చువల్ ఫ్లేవర్, క్రియేటివిటీ కనిపిస్తోంది. వాటిని చూస్తుంటే ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది. నాకు కూడా రకరకాల ఐడియాలు వస్తుంటాయి' అంటుంది నివేదిత.

ముంబైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ వికాస్ స్టోరీ టెల్లింగ్ ఫార్మాట్‌లో 'నేను అయితే ఈ యాడ్‌ను ఇలా తీస్తాను' అంటూ నోట్స్ రాసుకోవడం అలవాటు.

ఒక్కముక్కలో చెప్పాలంటే నివేదిత, వికాస్‌లాంటి యువ ఉత్సాహవంతులను బ్రాండ్స్ కోరుకుంటున్నాయి. తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రతిభను నిరూపించుకుంటే ఇక వారికి తిరుగేలేదు.


**స్టోరీ టెల్లింగ్ మంత్ర**

యాడ్‌లో స్టోరీ టెల్లింగ్ ఫార్మట్ అనేది కంపెనీకి, కస్టమర్‌లకు మధ్య భావోద్వేగాలతో కూడిన ఒక బంధాన్ని ఏర్పరుస్తుంది. ఎక్కడ.. ఎలా... ఎంత చెప్పాలో అంతే చెప్పాలనేది స్టోరీ టెల్లింగ్‌లో భాగం. మిస్ ఫైర్ అయితే మొదటికే మోసం వస్తుంది. ప్రకటనలకు సంబంధించి కొన్ని కంపెనీలు విఫలం కావడానికి కారణం... తమ ప్రొడక్ట్ గురించి తప్ప కన్జ్యూమర్ గురించి పట్టించుకోకపోవడం. అందుకే కన్జ్యూమర్‌ను హీరో చేసేలా స్టోరీ బిల్డ్ చేయాలి అనేది ముఖ్యమైన స్టోరీ టెల్లింగ్ మంత్ర. 'ఫలానా యాడ్ ఎందుకు విఫలమైంది' అనే విషయంలో యువ సృజనకారులు పోస్ట్ మార్టం చేయడంతో పాటు ఒక యాడ్ సూపర్ డూపర్ హిట్ కావడంలోని కీలక అంశాలను ఔపోసన పడుతున్నారు. 'వాట్ మేక్స్ ఏ గ్రేట్ స్టోరీ' అనే కోణంలో కస్టమర్ ఛాలెంజ్‌లను అధ్యయనం చేస్తున్నారు.



సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 25
బుధవారం 17-4-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



### నేడే భద్రాద్రి రామయ్య కల్యాణం
- పెళ్లి వేడుకలకు ముస్తాబైన ఆలయం..
- ఎదుర్కోలు వేడుక సందర్భంగా ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్ - 16లో



### రాజ్యాంగానికి రుణపడి ఉన్నా..
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తాను ఎంతగానో రుణపడి ఉన్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- వివరాలు 6లో



### దోపిడీకి మరో రూపం
ప్రధాని మోదీ చేసే దోపిడీకి మరో రూపమే ఎలక్టోరల్ బాండ్లు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.
- వివరాలు 6లో



### కాంగ్రెస్ చెమటోడ్చాల్సిందే!
247 స్థానాలున్న 12 రాష్ట్రాల్లో పూర్వవైభవం సాధించడం కాంగ్రెస్‌కు ఈసారి కూడా తలకు మించిన భారంలా తయారైంది.
- వివరాలు 6లో



### బహిరంగ క్షమాపణ చెప్పండి
కోర్టు ధిక్కార కేసులో వారంలోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణను సుప్రీంకోర్టు ఆదేశించింది.
- వివరాలు 6లో

# నెత్తురోడిన బస్తర్

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 29 మంది మావోయిస్టుల మృతి


శంకర్‌రావు(ఫైల్)
ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో ఎన్‌కౌంటర్ సందర్భంగా భద్రతా దళాల కదలికలు

### ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం..
- బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్, ఎస్పీ కళ్యాణ్ ఎలిసెల్లి వెల్లడి
- బస్తర్ అడవుల్లోని కాంకేరు జిల్లా ఛోట్ బెటియా ప్రాంతంలో ఘటన
- మావోస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో కూంబింగ్ చేపట్టిన భద్రతా దళాలు.. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగిన ఎదురుకాల్పులు
- మృతుల్లో ఏపీకి చెందిన అగ్రనేత సుగులూరి చిన్నన్న అలియాస్ శంకర్‌రావు.. ఈయన తలపై రూ. 25 లక్షల రివార్డు
- ఇద్దరు తెలంగాణ వాసులు కూడా గుర్తింపు
- రాష్ట్రానికి చెందిన మరికొందరు కూడా మరణించి ఉంటారనే అనుమానాలు.. ముగ్గురు భద్రతా సిబ్బందికి గాయాలు
- ఘటనా స్థలంలో ఏడు ఏకే-47లు, మూడు ఎల్ఎంజీలు, ఇతర ఆయుధాలు స్వాధీనం

సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంట్ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో రక్తం ఏరులై పారింది. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న భీకర ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మరణించారు. భద్రతా దళాలకు చెందిన ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. మృతుల్లో ఇప్పటివరకు ముగ్గురిని గుర్తించగా.. వారిలో ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మరికొందరు తెలంగాణ వాసులు కూడా మృతి చెంది ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీఎస్ఎఫ్, డీఆర్‌జీ బలగాలు.. మావోయిస్టులకు మధ్య మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్, ఎస్పీ కళ్యాణ్ ఎలిసెల్లి మంగళవారం రాత్రి వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. ఏపీలోని కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వడ్ల రామపురం గ్రామానికి చెందిన ఈయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది. మరోవైపు దండకారణ్యం స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాంధర్ అలియాస్ మజ్జిదేవ్ కూడా మరణించినట్లు తెలుస్తోంది. గత పదిహేనేళ్లలో బస్తర్ అడవుల్లో ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్‌గా పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

**మావోయిస్టుల సమావేశంపై సమాచారంతో..**

బస్తర్ అటవీ ప్రాంతంలో మొత్తం ఏడు జిల్లాలు ఉండగా కాంకేరు జిల్లా ఛోట్ బెటియా పోలీస్ స్టేషన్ పరిధిలోని బినాగుండ, కరోనార్ మధ్య హాపటోలా, (ఛోట్ బెటియా పోలీస్ స్టేషన్‌కు తూర్పున 15 కి.మీ దూరంలో) మాడ్ సమీప అటవీ ప్రాంతంలో ఈ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మాడ్ ప్రాంతంలో మావోయిస్టు నేతలు సమావేశం మిగతా 2వ పేజీలో ▶

మంగళవారం సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు హాజరైన ప్రజలు


# ఏడాదిలో సర్కార్ పతనం

## నారాయణపేటలో సీఎం భయం చూస్తే అలాగే అన్పిస్తోంది
## సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్


సభలో ప్రసంగిస్తున్న కేసీఆర్

- ప్రజలు ప్రభుత్వంపై తిరగబడుతున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడు పార్టీ మారతారో తెలియదు.. ఆ పార్టీకి రెండు సీట్ల కంటే ఎక్కువ వచ్చేలా లేవు
- బీఆర్ఎస్ పాలనలో ప్రజలను, రైతులను కాపాడుకున్నాం
- తెలంగాణను సాధించినట్లుగానే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెస్తా
- హామీలు నెరవేరాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చురుకుపెట్టాలి
- బీజేపీ అక్కరకు రాని చుట్టం.. ఆ పార్టీకి ఓటేస్తే మంజీరాలో వేసినట్లే

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏడాదిలో పడిపోతుందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రభుత్వంపై జనం తిరగబడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడు పార్టీ మారతారో తెలియదని వ్యాఖ్యానించారు. తెలంగాణను తెచ్చినట్లుగానే రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీసుకువస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ వద్ద నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు.

**రుణమాఫీపై మాట మార్చారు:** 'రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రైతాంగం ప్రభుత్వంపై తిరగబడుతోంది. సర్వే రిపోర్టులు వస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రెండు సీట్ల కంటే మిగతా 2వ పేజీలో ▶

**బీ ఫారాలు.. రూ.95 లక్షలు**
- ఎంపీ అభ్యర్థులకు ఇవ్వనున్న కేసీఆర్
- రేపు తెలంగాణ భవన్‌లో ఎన్నికల వ్యూహాలపై అధినేత దిశానిర్దేశం

10లో

### కలుషితాహారం ఘటనలో
# విద్యార్థి మృతి
**మొత్తం 28 మందికి అస్వస్థత**


ప్రశాంత్ (ఫైల్)

భువనగిరి క్రైం: భువనగిరిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని ఆస్పత్రిలో చేరిన విద్యార్థుల్లో మంగళవారం ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నెల 12వ తేదీన తెల్లవారుజామున 15 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. 6వ తరగతి చదువుతున్న భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన సీహెచ్. ప్రశాంత్(12)తో పాటు మరో విద్యార్థి కళ్యాణ్ కృష్ణ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రశాంత్ పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి చొరవతో జూబ్లీహిల్స్‌లోని మిగతా 2వ పేజీలో ▶




హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీలో శ్రీవాస్తవతో సహచరుల సంబరం


ఫలితాల అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషం పంచుకుంటున్న అనన్య రెడ్డి

# సివిల్స్‌లో తెలుగు తేజాలు

- టాప్ 3లో మహబూబ్‌నగర్ వాసి అనన్యరెడ్డి
- మొదటి వందలో నాలుగు ర్యాంకులు మనోళ్లకే..
- సివిల్స్‌లో 36 మంది ఎంపిక
- విజేతల్లో రైతు, నిరుపేద కుటుంబాల యువకులు

సాక్షి, హైదరాబాద్: సివిల్స్‌లో ర్యాంకు సాధించడం దేశంలో చాలామంది కల. ఇందులో ఈసారి తెలుగు విద్యార్థులు సత్తా చాటి తమ లక్ష్యాన్ని అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దోనూరు అనన్యరెడ్డి మూడో ర్యాంకు సాధించారు. వంద లోపు ర్యాంకుల్లో ముగ్గురు తెలుగువాళ్లే ఉన్నారు. నందాల సాయి కిరణ్ 27వ ర్యాంకు సాధిస్తే, కేఎన్ చందన జాహ్నవి 50, మెరుగు కౌశిక్ 82వ ర్యాంకు సాధించారు. మొత్తం ర్యాంకుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు 36 మంది ఉన్నారు. అలాగే, ఇతర కేంద్ర సర్వీసులకు 20 మందికిపైగా ఎంపికయ్యారు. మొత్తమ్మీద కేంద్ర సర్వీసులకు 56 మందికిపైగా తెలుగు తేజాలు ఎంపికవడం విశేషం. అఖిల భారత సర్వీసుల్లో పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్స్– 2023 కోసం గత ఏడాది మే 28న ప్రిలిమ్స్ నిర్వహించింది. ప్రిలిమినరీలో అర్హత పొందిన వారికి గత నవంబర్‌లో మెయిన్స్ పరీక్ష నిర్వహించగా, ఈ పరీక్ష ఫలితాలను డిసెంబర్ 8న వెల్లడించారు. మెయిన్స్‌లోనూ అర్హత పొందిన వారికి జనవరి 2, ఏప్రిల్ 9 మధ్య వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తంగా పొందిన మార్కుల ఆధారంగా ర్యాంకులను యూపీఎస్సీ మిగతా 3వ పేజీలో ▶

**సివిల్స్ టాపర్ ఆదిత్య**
అఖిల భారత సర్వీసులకు 1,016 మంది ఎంపిక - 6లో

# గల్ఫ్ కార్మికులకు జీవిత బీమా..

- రాష్ట్ర రైతుల తరహాలోనే..
- ఆయా దేశాల ప్రతినిధులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం..

- ప్రజాభవన్‌లో ప్రత్యేక వ్యవస్థ.. టోల్ ఫ్రీ నంబర్
- ఏజెంట్లకు చట్టబద్ధత ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ
- కొన్నిసార్లు ఓటమి కూడా మంచి భవిష్యత్తుకు దోహదపడుతుందని వ్యాఖ్య
- జీవన్‌రెడ్డి కేంద్ర మంత్రి అవుతారని భావిస్తున్నట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రైతుల తరహాలోనే గల్ఫ్ కార్మికులకు కూడా జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణకు చెందిన 15 లక్షల కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నాయని.. వీరి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉండే తెలంగాణ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం కోసం సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రజాభవన్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17లోపు ఈ వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేసే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. గల్ఫ్ దేశాల ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

**అధికారంలోకి రాగానే గల్ఫ్ సమస్యలపై దృష్టి**

ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయ పార్టీలు గల్ఫ్ కార్మికుల సమస్యలను పట్టించుకుంటాయన్న అభిప్రాయం ఉందని, కానీ తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీనియర్ ఐఏఎస్ అధికారి శేషాద్రి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి, తెలంగాణ గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉన్న తెలంగాణ వారి హక్కులకు రక్షణ కల్పించాలని నిర్ణయించామని రేవంత్ చెప్పారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేయాలని కూడా నిర్ణయించినట్లు తెలిపారు. పలు రాష్ట్రాల గల్ఫ్ విధానాలు అధ్యయనం చేసి రూపొందించిన డాక్యుమెంట్‌లో సవరణలు, సూచనల కోసం లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజాభవన్‌లో సమావేశం ఏర్పాటు చేస్తామని మిగతా 2వ పేజీలో ▶

## సాక్షి ఎలక్షన్ 2024

**జాతీయం..**

ముందస్తు ఎమర్జెన్సీ పరాజయం..

అచ్చోట.. ముచ్చెమట

ఆల్‌రౌండర్
- వివరాలు 11లో

**తెలంగాణ**

పైచేయి ఎవరిది?
మూడు పార్టీలకు లోక్‌సభ ఎన్నికలు అగ్నిపరీక్షే.. మెజారిటీ సీట్లు వస్తేనే కాంగ్రెస్ సర్కారుకు 'సుస్థిరత'..
- వివరాలు 10లో

**ఆంధ్రప్రదేశ్**

ఫ్యాన్ గాలి ప్రచండం..
ఏ ఊళ్లో ఏ నోట విన్నా ఈ మాటే..
జగన్ పాలనలో జనం హ్యాపీ
- వివరాలు 12లో

**ఇదండీ సంగతి**



ఇంకా ఏమీ అల్లర్లు జరగలేదట మేడం!
మీ దీక్ష ఫ్లాపవుతుందేమోనని అనిపిస్తోంది!

# ఇదంతా సీబీఐ, సునీత ఆడుతున్న డ్రామా

- వివేకా కేసులో సీబీఐ దర్యాప్తు లోపభూయిష్టం
- హత్య చేసినట్లు దస్తగిరే ఒప్పుకున్నాడు.. వెంటనే ఎందుకు అరెస్టు చేయలేదు?
- అతనికి ముందస్తు బెయిల్ వచ్చేలా సీబీఐ, సునీత సహకరించారు
- ఆపై అప్రూవర్ వ్యవహారాన్ని బయటకు తెచ్చారు
- ఇలా దస్తగిరికి ప్రయోజనాన్ని కల్పించి, వారికి కావల్సిన పేర్లను చెప్పించారు
- మీడియా సమావేశంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు సునీతక్క చెబుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి చెప్పారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు శాస్త్రీయ విధానంలో కాకుండా, పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని అన్నారు. ఇదంతా దస్తగిరిని అడ్డం పెట్టుకొని, హియర్ సే ఎవిడెన్స్ అంటూ సీబీఐ, సునీత తదితరులు కలిసి ఆడుతున్న డ్రామా అని స్పష్టం చేశారు. ఎంపీ అవినాశ్ మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అసలు దస్తగిరి అప్రూవర్‌గా మిగతా 5వ పేజీలో ▶

# పేదలపై బాణాలా?

**చంద్రబాబుకు పది మంది సేనానులు.. మీ గురి ఎవరిపై?.. భీమవరం మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్**




- ప్రజలకు అందుతున్న పథకాలు, వ్యవస్థలపై బాణాలా?.. నేను ఒక్కడినే కానీ ఒంటరిని కాదు.. నాకు తోడుగా పేదల సైన్యం
- రాష్ట్రమంతటా కోట్ల హృదయాలు జగన్‌ను కోరుకుంటున్నాయి
- రొయ్యకు మీసం.. బాబుకు మోసం పుట్టుకతోనే వచ్చాయ్
- బాబుకు - అభివృద్ధికి ఏం సంబంధం? అంతా సెల్ఫ్ డబ్బా..
- సింగపూర్ కట్టాడా? మైక్రోసాఫ్ట్ తెచ్చాడా? బుల్లెట్ ట్రైను తెచ్చాడా?
- కొత్త పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు తెచ్చాడా? జిల్లాకో హైటెక్ సిటీ కనిపించిందా?
- బాబు రిపోర్ట్ అంతా బోగస్.. మన ప్రోగ్రెస్ రిపోర్ట్ మీరే చూడండి
- కొంగ జపం ఎందుకని నిలదీస్తే నాపై శాపనార్థాలు.. కోపంతో ఊగిపోతున్నారు
- దత్తపుత్రుడు కార్లు, భార్యల మాదిరిగా నియోజక వర్గాలనూ మారుస్తున్నాడు
- నిన్ను మిగతావాళ్లూ అనుసరిస్తే అక్క చెల్లెమ్మల బతుకులు ఏం కావాలి?

- వివరాలు 5లో

# రేవంత్ కచ్చితంగా బీజేపీలోకి జంప్

- కాంగ్రెస్ మనిషా.. బీజేపీ మనిషా..? ఆ పార్టీ నాయకులే చెప్పాలి
- లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో మార్పులు
- రాష్ట్రానికి పైసా పనిచేయని బీజేపీని పండబెట్టి తొక్కుదాం
- జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు డీలిమిటేషన్‌లో నష్టం చేసే ప్రయత్నాలు
- తెలంగాణ లోక్‌సభ సీట్లు తగ్గకుండా మాట్లాడాలంటే బీఆర్ఎస్ ఉండాలి
- బీఆర్ఎస్ ఆదిలాబాద్ సమావేశంలో కేటీఆర్



సాక్షి, ఆదిలాబాద్: 'లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో చాలా మార్పులు జరుగుతాయి.. రేవంత్ కచ్చితంగా బీజేపీలోకి జంప్ అవుతాడు.. అసలు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ మనిషా? బీజేపీ మనిషా? కాంగ్రెస్ నేతలే ఇప్పుడు చెప్పాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆ వివరాలు కేటీఆర్ మాటల్లోనే.. 'చౌకిదార్ చోర్ అని రాహుల్‌గాంధీ అంటే.. మిగతా 2వ పేజీలో ▶

## క్లుప్తంగా...

### రాముడి ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందుదాం

**గవర్నర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు**



సాక్షి, హైదరాబాద్: శ్రీ రామనవమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. ధర్మం, ఆదర్శాలకు సాక్షాత్తు రూపమైన శ్రీరాముడి జన్మనక్షత్రం 'పునర్వసు'సందర్భంగా దేశవ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి జరుపుకుంటారని మంగళవారం విడుదల చేసిన ఓ సందేశంలో పేర్కొన్నారు. పవిత్ర ప్రేమ, అన్యోన్యతకు ప్రతీకగా శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం జరుపుకుంటారని తెలిపారు. ఈ శుభ సందర్భంగా రాముడు ఆచరించిన ఆదర్శాలు, ధర్మసూత్రాల నుంచి స్ఫూర్తి పొందుదామని పిలుపునిచ్చారు. జైశ్రీరామ్ నినాదంతో గవర్నర్ తన సందేశాన్ని ముగించారు.

### ప్రజలకు సీతారాముల ఆశీస్సులుండాలి

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలందరికీ సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యాన్ని దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఆదర్శ పాలకుడు శ్రీరాముడు: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: హిందువుల ఆరాధ్య దైవం శ్రీరామచంద్రమూర్తి జయంతి, సీతారాముల కల్యాణ పర్వదినం శ్రీరామనవమి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యపాలన చేసిన శ్రీరాముడు ఆదర్శ పరిపాలకుడని కేసీఆర్ పేర్కొన్నారు. అన్యోన్య దాంపత్యానికి పుణ్యదంపతులైన సీతారాములు ఆదర్శనీయులని తెలిపారు. సీతారాముల కరుణకటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఉండాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలని భద్రాద్రి సీతారామచంద్రులను కేసీఆర్ ప్రార్థించారు.

### శ్రీరామనవమి ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నింపాలి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: శ్రీ రామనవమి పర్వదినం సందర్భంగా ప్రజలకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామనవమి పండుగ ప్రజల జీవితాల్లో ఆయురారోగ్యాలను, సుఖశాంతులను, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. 'ఆదర్శ వ్యక్తిత్వం, మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముడి జీవితం భారతీయులందరికీ ఆదర్శం. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ధర్మాన్ని నిక్కచ్చిగా పాటించడం శ్రీరామచంద్రుడి జీవితం నుంచి మనకు లభించే అతిముఖ్యమైన పాఠం. ఈ ఆదర్శాన్ని మనకు గుర్తుచేసే పండుగే శ్రీరామనవమి'అని తన సందేశంలో పేర్కొన్నారు. మే 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లోనూ ధర్మానికి అండగా నిలుద్దాం. రామరాజ్య స్థాపనలో భాగస్వాములమవుదాం'అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

### శ్రీరాముడి బాటలో నడుద్దాం

**మంత్రుల శ్రీరామనవమి శుభాకాంక్షలు**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు మంత్రులు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామచంద్రుడు ధర్మసంస్థాపన, విలువల ప్రతిష్టాపన, పితృవాక్య పరిపాలన వంటి సద్గుణాలను సమాజానికి అందించారని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ (సీతక్క) వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆ యుగపురుషుడు నడిచిన బాటలో నడిచి విలువలున్న సమాజ నిర్మాణంలో భాగం అవుదామని మంత్రులు పిలుపునిచ్చారు. శ్రీరాముని జీవితం ఎంతటి విషమ పరిస్థితుల్లోనైనా సత్యం, ధర్మానికి కట్టుబడి ఉండాలనే సందేశాన్నిస్తుందన్నారు.

### కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో రౌజ్ అవెన్యూ కోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా పడింది. సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించాల్సి ఉంది. కానీ న్యాయమూర్తి సెలవులో ఉండటంతో విచారణ వాయిదా పడింది. దీంతో, ఈ నెల 22న ఈడీ కేసులో బెయిల్‌తోపాటే ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి విచారించనున్నట్లు కోర్టు తెలిపింది.



సుల్తాన్‌పూర్ సభలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో పద్మాదేవేందర్, సునీతా లక్ష్మారెడ్డి, దేశపతి శ్రీనివాస్, హరీశ్‌రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, మహమూద్ అలీ, మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్ తదితరులు

# ఏడాదిలో సర్కార్ పతనం

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్కువ వచ్చేలా లేవు. నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి భయం చూస్తే ఈ ప్రభుత్వం ఏడాది కూడా ఉండేలా లేదు. ముఖ్యమంత్రే జంప్ కొడతడో.. ఎవరు ఎప్పుడు పోయి బీజేపీలో కలుస్తరో తెలుస్తలేదు. ఇక్కడో మాట మాట్లాడి ఢిల్లీకి వెళ్లి బీజేపీకి ఓట్లేయాలని టీవీల్లో చెబుతాడు.. ఎవరికి ఎవరు బీ టీమో, ఎవరు ఎవరితో కలిసిపోయారో ప్రజలు ఆలోచన చేయాలి. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చింది. డిసెంబర్ 9 లోపే రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి.. ఇప్పుడు ఆగస్టు 15 అంటోంది. రేవూరి ప్రకాశ్‌రెడ్డి అయితే తర్వాత చేస్తామంటున్నారు. కానీ రూ.2 లక్షల రుణమాఫీ చేయించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుంది. ఇందుకోసం అందరం కలిసి పోరాటం చేస్తాం..'అని కేసీఆర్ చెప్పారు.

**బోనస్..బోగసేనా?**

'తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు మేం గౌరవం ఇచ్చాం. ఉద్యోగులకు పీఆర్సీలు ఇచ్చాం.. వేతనాలు పెంచాం.. మేధావులైన ఉద్యోగులు ఆలోచన చేయాలి.. ఈ ఎన్నికల్లో పిచ్చోళ్లలాగా ఓట్లు వేయొద్దు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలను కడుపులో పెట్టుకున్నాం. రైతులను కళ్లల్లో పెట్టుకుని కాపాడుకున్నాం. అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. కానీ ఈ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వలేదు. పంటలు చేతికందాయి కానీ కొనే దిక్కులేదు. పంటలకు బోనస్ అన్నరు.. బోనస్ బోగసేనా?

**రాష్ట్రమంతా పోస్టుకార్డు ఉద్యమం**

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తాం. పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లాలో రైతులు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమం రాష్ట్రమంతా చేపడతాం. ఊరుకునేది లేదు. అందరం కలిసి కొట్లాడతాం. ఎన్నికల కోడ్ ఉందంటూ తప్పించుకునే ప్రయత్నం చేయొద్దు. బోనస్‌కు సంబంధించిన బాండ్లు రాసివ్వాలి. అలా రాసిచ్చినా మేము ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయం. రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి. నష్టపోయిన పంటలకు రూ.25 వేల సాయం వెంటనే చెల్లించాలి..' అని కేసీఆర్ డిమాండ్ చేశారు.

**అప్పుడు వరి కోతలు..కరెంటు కోతలు**

'మా ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా వరి కోతలే ఉండేవి. ఇప్పుడు కరెంట్ కోతలు, క్రాప్ హాలిడేలు ఉంటున్నాయి. మేము కడుపులో పెట్టుకున్న రైతులు ఇప్పుడు ఆగం అవుతున్నారు. లిల్లీపుట్ గాళ్ల ప్రభుత్వం మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సింగూరు నుంచి ఒక్క చుక్క నీళ్లు ఇవ్వలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఈ ప్రాజెక్టుపై నిర్మించతలపెట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను కోల్డ్‌స్టోరేజీలో పెడుతోంది. ఈ ఎత్తిపోతల పథకాలు పూర్తి కావాలన్నా, కాళేశ్వరం జలాలు రావాలన్నా బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించాలి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు ఎందుకు వేయాలని తెలివిలేనోళ్లు అంటున్నారు. ఇప్పుడే బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలి. సీట్లు గెలిపించాలి. ఆనాడు టీఆర్ఎస్‌ను గెలిపించకపోతే తెలంగాణ వచ్చేదా? బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే తెలంగాణ హక్కుల సాధన సాధ్యమవుతుంది. పాలిచ్చే బర్రెను వదిలేసి, దున్నపోతుకు గడ్డేస్తే ప్రయోజనం ఉండదు..'అని మాజీ సీఎం అన్నారు.

**కాంగ్రెస్‌కు ఓట్లేస్తే హామీలన్నీ ఎగ్గొడతారు**

'మిషన్ భగీరథ పథకాన్ని తెచ్చి ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాం. ఈ పథకాలను సరిగ్గా నడపడం కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి చేత కావడం లేదు. ఆరేళ్లుగా వచ్చిన నల్లా నీళ్లు ఇప్పుడు ఎందుకు ఆగిపోయాయి? కల్యాణలక్ష్మి పథకంతోపాటు, తులం బంగారం ఇస్తామని ముఖం చాటేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. మళ్లీ ఆ పార్టీకి ఓట్లేస్తే ఇచ్చిన హామీలన్నీ ఎగ్గొడతారు. బీజేపీ అక్కరకు రాని చుట్టం. పదేళ్ల పాలనలో తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. జాతీయ ప్రాజెక్టు ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఆ పార్టీకి ఓటేస్తే మంజీరాలో పడేసినట్లే. తెలంగాణకు న్యాయం జరగాలంటే ఈ రెండు ఆగం పార్టీలను కాకుండా, తెలంగాణ హక్కుల కోసం పేగులు తెగేలా కొట్లాడే బీఆర్ఎస్‌ను గెలిపించాలి..'అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

**పోలీసుల అరాచకాలు బంద్ చేయాలి**

'రాష్ట్రంలో పోలీసుల అరాచకాలు బంద్ చేయాలి. లేకుంటే మేము అధికారంలోకి వచ్చాక మీ గతేందో ఆలోచన చేయాలి. అన్నీ రికార్డు చేస్తున్నాం. పార్టీ బహిరంగ సభకు వస్తున్న 150 లారీలను పోలీసులు ఆపారు. బీఆర్ఎస్ ఫ్లెక్సీలను పీకేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా మేం ఒక్కరోజు కూడా దౌర్జన్యం చేయలేదు. ప్రజల స్పందన చూసైనా డీజీపీ మారాలి. లేని పక్షంలో ప్రజలే మీ ముందుకు వస్తారు జాగ్రత్త..'అని కేసీఆర్ హెచ్చరించారు. బహిరంగ సభలో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ స్థానాల బీఆర్ఎస్ అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, వెంకట్రామిరెడ్డి, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు.

**లిల్లీపుట్ గాళ్ల ప్రభుత్వం అంబేడ్కర్‌ను పట్టించుకోలేదు**

'ఇంటికి గుడ్డి లక్ష్మి వచ్చినట్లుగానే లిల్లీపుట్ గాళ్లకు అధికారం వచ్చింది. సేవ చేయమని ప్రజలు అధికారం ఇస్తే అడ్డదిడ్డమైన పనులు చేస్తున్నరు. సచివాలయం సమీపంలో 125 అడుగుల ఎత్తున అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఈ లిల్లీపుట్ గాళ్ల ప్రభుత్వం ఆ మహనీయుని జయంతి రోజున అక్కడికి వెళ్లలేదు. పూలమాల వేయలేదు. అంజలి ఘటించలేదు. గేట్లు బంద్ చేసి తాళాలు వేశారు. ఇంత అహంకారమా? కండ కావరమా? కొత్త సచివాలయానికి కూడా అంబేడ్కర్ పేరు ఉంది కదా.. సిగ్గు లేకుండా ఆ సచివాలయంలో ఎందుకు కూర్చుంటున్నారు? అంబేడ్కర్‌ను అవమానించిన కాంగ్రెస్‌కు ఈ పార్లమెంటు ఎన్నికల్లో చురుకు పెట్టాలె..'అని మాజీ సీఎం విజ్ఞప్తి చేశారు.

## జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ రాజేశ్వర్‌రావులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించండి

**కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు**



జస్టిస్ శ్రీనివాసరావు



జస్టిస్ రాజేశ్వర్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: హైకోర్టులోని అదనపు న్యాయమూర్తులు జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాసరావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఇద్దరు న్యాయమూర్తులను శాశ్వత న్యాయమూర్తులుగా సిఫారసు చేస్తూ 2024, ఫిబ్రవరి 13న హైకోర్టు కొలీజియం నిర్ణయించిందని తెలిపింది. ముఖ్యమంత్రి, గవర్నర్‌లు దీనికి తమ సమ్మతి తెలియజేశారని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బీఆర్.గవాయిలతో కూడిన కొలీజియం సమావేశమై శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ రాజేశ్వర్‌రావులకు తగిన అర్హతలు కలిగి ఉన్నారని నిర్ణయించినట్టు వెల్లడించింది. తెలంగాణ హైకోర్టుకు చెందిన ఈ ఇద్దరు న్యాయమూర్తుల తీర్పులు పరిశీలించాలని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు కమిటీని సీజేఐ ఆదేశించారని.. ఆ కమిటీ ఆయా తీర్పులపై సంతృప్తి వ్యక్తం చేసిందని వివరించింది.

## కేసీఆర్ ఇంటి పక్కన బాణామతి కలకలం

**ఆకతాయిల పనే అంటున్న స్థానికులు**



ఖాళీ స్థలంలో చేతబడి చేసిన ఆనవాళ్లు

బంజారాహిల్స్ (హైదరాబాద్): బంజారాహిల్స్ రోడ్ నం.14లోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం పక్కన ఖాళీ స్థలంలో బాణామతి చేసినట్లు ఉన్న ఆనవాళ్లు మంగళవారం కలకలం సృష్టించాయి. కేసీఆర్ నివాసాన్ని ఆనుకొని ఉన్న ఓ ఇంటి పక్కన ఖాళీ స్థలం ఉంది. దీనికి అన్ని వైపులా ప్రహరీతో పాటు పెద్ద గేటు కూడా ఉంది. సోమవారం రాత్రి 11.30 గంటల తర్వాత ఎవరో ఒక వ్యక్తి వచ్చి అక్కడ క్షుద్రపూజలు జరిపారంటూ వదంతులు రావడంతో పోలీసులు, మీడియా మంగళవారం ఉదయం అక్కడికి వెళ్లాయి. ఆ స్థలంలో ముగ్గు పోసి నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చల్లి ఓ బొమ్మను మధ్యలో పెట్టారు. దానికి కొంత దూరంలో కోడి వ్యర్థాలు ప్లాస్టిక్ కవర్‌లో ఉన్నాయి. స్థానికంగా ఉండే కొందరు ఆకతాయి యువకులు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం ఈ పని చేసినట్లుగా అక్కడి యువకులు చెబుతున్నారు. బంజారాహిల్స్ పోలీసులు ఈ ఘటనపై విచారిస్తున్నారు.

## ఎమ్మెల్యే దానం ఇంటి వెనుక అక్రమ నిర్మాణాల తొలగింపు



ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనుక ఆక్రమణలు తొలగించిన అధికారులు

బంజారాహిల్స్(హైదరాబాద్): ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనకాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన అక్రమ నిర్మాణాలను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు తొలగించారు. దానం నాగేందర్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–3లోని తన ఇంటి వెనకాల నాలాను ఆనుకుని ఉన్న వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమించి బ్లూషీట్లు చుట్టి రేకుల షెడ్లు నిర్మించినట్లుగా ఫిర్యాదులు అందుకున్న రెవెన్యూ అధికారులు వాటిని తొలగించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. అక్కడ ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో 175 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పుతో రోడ్డును ఆక్రమించి సర్వెంట్ క్వార్టర్స్‌తో పాటు షెడ్డు నిర్మించినట్లుగా షేక్‌పేట తహసీల్దార్ చేపట్టిన తనిఖీల్లో వెల్లడైంది. ఇటీవల కేటీఆర్ ఈ కబ్జా అంశంపై స్పందించి 'కాంగ్రెస్‌లోకి వెళ్లినందుకు దానం నాగేందర్‌కు ప్రభుత్వ స్థలం నజరానా' అంటూ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు విచారణ చేపట్టి వీటిని తొలగించారు. గతంలో నాగేందర్ ఇంటి వెనుక సినారె భవన నిర్మాణానికి 3,050 గజాల స్థలం కేటాయించగా, ఈ స్థలానికి, నాగేందర్ ఇంటికి మధ్య రోడ్డు ఉందని, ఇది వెనుక ఉన్న 350 గజాల ప్రభుత్వ స్థలానికి అప్రోచ్ రోడ్డు కాగా దీనిని నాగేందర్ ఆక్రమించినట్లుగా గుర్తించారు.

## రేవంత్ కచ్చితంగా బీజేపీలోకి జంప్

▶ మొదటి పేజీ తరువాయి

మోదీ మేరా బడేభాయ్ అని రేవంత్ అంటాడు. అదానీ ఫ్రాడ్‌అని రాహుల్‌గాంధీ అంటే..నా ఫ్రెండ్ అని రేవంత్ అంటాడు. గుజరాత్ మోడల్ గోల్‌మాల్ అని రాహుల్‌గాంధీ అంటే.. గుజరాత్ మోడల్‌ను తెలంగాణలో చేస్తామని రేవంత్‌రెడ్డి అంటాడు. లిక్కర్‌స్కామ్ లేదు.. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అన్యాయమని రాహుల్‌గాంధీ అంటాడు.. రేవంత్‌రెడ్డి మాత్రం కవితమ్మ అరెస్టు కరెక్టే అంటాడు. రేవంత్‌రెడ్డిని చూసి ప్రజలు ఈయన ముఖ్యమంత్రా అని అనుకుంటున్నారు. ఓ చిల్లర వ్యక్తి మాట్లాడినట్టు మాట్లాడుతున్నాడు అనుకుంటున్నారు. ఇప్పుడు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని కొత్తపాట ఎత్తుకున్నాడు. రైతులు కర్రుకాల్చి వాత పెడతారన్న భయంతో కొత్త వాయిదా పెట్టిండు. రైతులు ఇప్పుడు చెప్పుతో కొట్టినట్టు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది. రుణమాఫీ కావాలన్నా.. రూ.2500 కావాలన్నా.. ముసలోళ్లకు రూ.4వేలు కావాలన్నా బీఆర్ఎస్ గెలవాల్సిందే. బీజేపీకి మేము బీ–టీమ్ అని కొంత మంది బేవకూఫ్‌గాళ్లు అంటారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పెద్ద నాయకులందరినీ ఓడించింది బీఆర్ఎస్ కాదా. అలాంటప్పుడు మేం బీ–టీమ్ ఎలా అవుతామో చెప్పాలి.

**డీలిమిటేషన్‌లో నష్టం చేసే ప్రయత్నాలు**

2026లో దేశంలో డీలిమిటేషన్ జరగబోతుంది. జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు కేటాయిస్తారంట. దేశానికి మంచి జరిగేలా జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు నష్టం చేసే ప్రయత్నం చేస్తున్నారు. రేపటి రోజున పార్లమెంట్‌లో తెలంగాణ లోక్‌సభ సీట్లు తగ్గకుండా మాట్లాడాలంటే బీఆర్ఎస్ ఉండాలే.. కాంగ్రెస్, బీజేపీ సన్నాసులు దూడా బసవన్నలు. వాళ్లతో తెలంగాణ ప్రయోజనాలు కాపాడటం చాత కాదు'అని కేటీఆర్ అన్నారు. కాగా ఇటీవల బీజేపీలో చేరిన ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కేటీఆర్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి జోగు రామన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నిర్మల్ జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికులకు జీవిత బీమా..

▶ మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఈ భేటీకి గల్ఫ్ కార్మికుల ప్రతినిధులను ఆహ్వానించి చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. ఏజెంట్లకు చట్ట బద్ధత ఉండేలా..రాష్ట్ర ప్రభుత్వం దగ్గర నమోదు కాకుండా ఏ కార్మికుడినీ ఏజెంట్లు దేశం దాటించే పరిస్థితి లేకుండా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**జీవన్‌రెడ్డి కేంద్రమంత్రి అవుతారని భావిస్తున్నా..**

'కొన్నిసార్లు ఓటమి కూడా మంచి భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. అందుకు నేనే ఉదాహరణ. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నేను ఓడిపోయా. అప్పుడు నా మిత్రులు బాధపడితే శత్రువులు మాత్రం నా పని అయిపోయిందని సంతోషించారు. కానీ మూడు నెలలు తిరిగేసరికి ఎన్నికలొచ్చి ఎంపీనయ్యా. ఆ తర్వాత పీసీసీ అధ్యక్షుడిని అయ్యా. ఆ తర్వాత ముఖ్యమంత్రిని అయ్యా. జీవన్‌రెడ్డి కూడా అదృష్టం వరించి కేంద్రంలో మంత్రి అవుతారని భావిస్తున్నా. కేంద్రంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల పక్షాన మాట్లాడేందుకు, విదేశాంగ మంత్రితో సంప్రదింపులు జరిపేందుకు నిజామాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిని గెలిపించాలి..'అని ముఖ్యమంత్రి కోరారు.

**సాయం చేసేందుకు కేసీఆర్‌కు మనసు రాలేదు: జీవన్‌రెడ్డి**

గత పదేళ్లలో రూ.2 లక్షల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకురావడం ద్వారా గల్ఫ్ కార్మికులు రూ.20 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూర్చారని జీవన్‌రెడ్డి తెలిపారు. గల్ఫ్ నుంచి ప్రతి యేటా 200 వరకు శవపేటికలు వచ్చేవని, పదేళ్లలో 2 వేల మంది చనిపోతే వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.100 కోట్లు ఇచ్చేందుకు కేసీఆర్‌కు మనసు రాలేదని విమర్శించారు.

**గల్ఫ్ గోస లేకుండా చూడండి**

సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గల్ఫ్ గోస లేకుండా చూడాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు. ఎన్నారై సెల్‌ను పటిష్టం చేయాలని, గల్ఫ్ దేశాల్లోని ఎంబసీల్లో తెలుగువారిని నియమించాలని, ప్రత్యేక గల్ఫ్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కేరళ తరహా పాలసీని రూపొందించాలని కోరారు. గల్ఫ్‌లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించినందుకు కృతజ్ఞతగా గల్ఫ్ నుంచి తెచ్చిన ఖర్జూరాలను ముఖ్యమంత్రికి అందజేశారు. టీపీసీసీ ఎన్నారై సెల్ అంతర్జాతీయ కన్వీనర్ మంద భీంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెల్ చైర్మన్ డాక్టర్ వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎమ్మెల్సీల అనర్హతపై త్వరలో నిర్ణయం

**ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్న మండలి చైర్మన్ గుత్తా**

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీలుగా ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిలను అనర్హులుగా ప్రకటించే విషయమై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీలుగా బీఆర్ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన ఈ ఇద్దరు నాయకులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ మార్చి 22న మండలి చైర్మన్ గుత్తాను కలిసి పిటిషన్ అందజేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి శాసనసభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో చేరగా, ఆయన తనయుడు రాజేశ్ నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ టికెట్ పొంది ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక పట్నం మహేందర్‌రెడ్డి శాసనసభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఆయన సతీమణి పట్నం సునీతారెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ఉల్లంఘించి కాంగ్రెస్‌లో చేరారని బీఆర్ఎస్ సాక్ష్యాలతో మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. వీరిద్దరిపై అనర్హత వేటు విషయంపై గుత్తా త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## కలుషితాహారం ఘటనలో విద్యార్థి మృతి

▶ మొదటి పేజీ తరువాయి

రెయిన్‌బో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతి చెందాడు.

**28 మందికి అస్వస్థత:** మంగళవారం మరో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతతో ఆస్పత్రిలో చేరారు. ఇప్పటివరకు కలుషిత ఆహారం తిని మొత్తం 28 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ప్రిన్సిపల్ సస్పెన్షన్:** ఈ ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ విచారణ చేసిన అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ శ్రీనివాస్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కమిషనర్ సీతామహాలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు.

# నెత్తురోడిన బస్తర్

▶ మొదటి పేజీ తరువాయి

అయ్యారన్న పక్కా సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల సమయాన ఇరువర్గాల మధ్య హోరాహోరీగా ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఎన్‌కౌంటర్ రాత్రి వరకు కొనసాగగా..ఎదురు కాల్పుల తర్వాత మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అలాగే ఘటనా స్థలంలో ఏడు ఏకే–47 రైఫిల్స్, మూడు లైట్ మిషన్ గన్స్, రెండు ఇన్సాస్ రైఫిళ్లతో పాటు పెద్ద సంఖ్యలో ఇతర ఆయుధాలు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆయుధాల ఆధారంగా మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలున్నట్లు భావిస్తున్నారు.

**మృతుల్లో మజ్జిదేవ్ భార్య లలిత!**

ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారిని గుర్తించే పనిలో ఉన్న పోలీసులు అజ్ఞాతంలో ఉన్న అనుమానిత మావోయిస్టుల కుటుంబాలకు సమాచారం పంపి ఆరా తీస్తున్నారు. 1995 నుంచి మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న చిన్నన్న 2000 సంవత్సరంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. పార్టీలో వెళ్లేకంటే ముందే వివాహం చేసుకున్న ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన సిరిపల్లె సుధాకర్ అలియాస్ శంకర్, ఆయన భార్య ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూరుకు చెందిన ఆశన్వర్ సుమన అలియాస్ రజిత మరణించినట్లు తెలుస్తోంది. సిరిపల్లె సుధాకర్ దండకారణ్యంలోనే డీవీసీలో పని చేస్తుండగా.. ఆయన భార్య రజిత అదే ప్రాంతంలో డీసీఎస్ స్థాయిలో ఉందని సమాచారం. అదే విధంగా దండకారణ్యం స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాంధర్ అలియాస్ మజ్జిదేవ్ భార్య లలిత కూడా మృతి చెందినట్లు తెలిసింది. లలిత మహారాష్ట్రకు చెందిన వారని గుర్తించారు. అలాగే దండకారణ్యం ఐదవ కంపెనీకి చెందిన కమాండర్ రాజు సలామ్ కూడా మృతుల్లో ఉన్నట్లు తెలిసింది. ఈయనది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంగా చెబుతున్నారు.





గాయపడిన జవానుకు చికిత్స అందిస్తున్న దృశ్యం. మావోయిస్టు లలిత

**మజ్జిదేవ్ కూడా ఉన్నారా?**

ఈ ఎన్‌కౌంటర్ మృతుల్లో దండకారణ్యం అగ్రనేత మజ్జిదేవ్ కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆయన భార్య లలిత మృతి చెందడంతో.. మజ్జిదేవ్ కూడా మృతుల్లో ఉండే అవకాశం లేకపోలేదంటున్నారు. రెండున్నర దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమాల్లో పనిచేస్తున్న మజ్జిదేవ్ పేరు ఇటీవలే వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఇక మరణించిన వారిలో ఉమ్మడి అదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన మావోయిస్టులు కూడా ఉండే అవకాశం ఉందని పోలీసువర్గాలు చెబుతున్నాయి. అటవీ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ జరుగుతోందని తెలిపాయి. గాయపడిన బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు డీఆర్జీ పోలీసులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించాయి.

**ఈ ఏడాదిలో 79 మంది:** లోక్‌సభ ఎన్నికల ముంగిట బస్తర్ అడవుల్లో భీతావహ పరిస్థితి నెలకొంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా దళాలు పట్టుదలగా అడవుల్లోకి చొచ్చుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి ఇప్పటి వరకు వివిధ ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు పార్టీకి చెందిన 79 మంది మరణించారు. ఇందులో మిలీషియా సభ్యులు మొదలు కంపెనీ కమాండర్ల వరకు వివిధ స్థాయి నేతలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 19న లోక్‌సభ ఎన్నికల తొలి విడత 26న రెండో దశ పోలింగ్ జరగనుంది.

**తెలంగాణ పోలీసుల అలర్ట్**

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో భారీ సంఖ్యలో మావోయిస్టులు చనిపోవడంతో రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, ములుగు, మంచిర్యాల జిల్లాల ఎస్పీలను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. ఈ ప్రాంతాల్లో కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. తెలంగాణలో ఇటీవలి కాలంలో మావోల కదలికలు లేనప్పటికీ, ప్రతీకార చర్యలకు పాల్పడవచ్చనే అనుమానంతో తనిఖీలు పెంచినట్టు తెలిసింది.

### మావోయిస్టుల బెడదను నిర్మూలిస్తాం: అమిత్‌షా



న్యూఢిల్లీ: మావోయిస్టుల బెడద నుంచి దేశాన్ని విముక్తం చేయాలని మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లపై చేపట్టిన ఆపరేషన్‌ను విజయవంతం చేసిన భద్రతా బలగాలను ఆయన అభినందించారు. క్షతగాత్రులైన పోలీసులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ కఠిన నిర్ణయాలు, భద్రతా బలగాల ప్రయత్నాల ఫలితంగా నేడు మావోయిజం ఛత్తీస్‌గఢ్‌లోని చిన్న ప్రాంతానికే పరిమితమై పోయిందని అమిత్ షా తెలిపారు. త్వరలోనే దేశం నక్సలిజం రహితంగా మారనుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

### సీఎంను కలసిన హెచ్‌సీఏఏ



మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం ఇస్తున్న హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) అధ్యక్షుడు ఏ.రవీందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, హెచ్‌సీఏఏ సెక్రటరీలు ఉప్పల శాంతిభూషణ్, సంజీవ్ జిల్లెల, ఉపాధ్యక్షురాలు ఏ.దీప్తి, జాయింట్ సెక్రటరీ నవీన్‌కుమార్ వాసిరెడ్డి

### 'ప్రధాని మోదీతో రేవంత్ చీకటి ఒప్పందం'

సాక్షి, హైదరాబాద్: 'రేవంత్ రెడ్డి మొక్క కాదు..జిత్తుల మారి నక్క. సొంత పార్టీ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయిస్తున్నారని కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారు. అమ్ముడుపోయే నేపథ్యం రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉంది. ఓటుకు నోటు కేసులో బెయిలు రద్దు కాకుండా ప్రధాని మోదీతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారు'అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ కుమార్ విమర్శించారు.

# లక్ష్యం.. క్రమశిక్షణే విజయ రహస్యం

## సివిల్స్ ర్యాంకర్ల మనోగతమిది..

● విజేతల్లో నిరుపేద, సాధారణ రైతు కుటుంబాల పిల్లలు

సాక్షి, హైదరాబాద్:

### సాఫ్ట్‌వేర్ మానేసి సివిల్సే లక్ష్యంగా..



సివిల్స్‌కు ఎంపిక కావడమే లక్ష్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకొని మెయిన్స్‌కు ప్రిపేర్ అయిన మెరుగు కౌశిక్.. తొలి ప్రయత్నంలోనే 82వ ర్యాంకుతో సత్తా చాటారు. సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చేసిన ఆయన.. ఢిల్లీలో ఎంబీఏ చేశారు. అందరూ చదివినట్లే చదివానని.. రోజుకు 8–9 గంటలపాటు ప్రిపేర్ అయినట్లు చెప్పారు. చదువుకుంటున్న సమయంలోనే సివిల్స్‌కు ప్రిపరేషన్ మొదలు పెట్టానని, ఆ తర్వాత ఏడాది పాటు జాబ్ చేశానని తెలిపారు. ప్రిలిమ్స్ తర్వాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి మెయిన్స్ రాసినట్లు పేర్కొన్నారు. ఐఏఎస్ కావాలనేది తన లక్ష్యం అని చెప్పారు. తనకు 100లోపు ర్యాంకు వస్తుందని మాత్రం అసలు ఊహించలేదన్నారు. తన తండ్రి నిర్మాణ రంగంలో ఉన్నారని, తల్లి గృహిణి అని చెప్పారు.

### విధి వంచించినా...



విధి వంచించినా.. విశ్వాసం ఆమెను నిలబెట్టింది. కాళ్లు కదలకపోయినా.. పట్టువిడవని సంకల్పం తనను ముందుకు నడిపించింది. ఊహించని అనారోగ్యం ఇంటికే పరిమితం చేసినా.. చదువును మాత్రం ఏనాడు దూరం చేసుకోలేదు. దూరవిద్య ద్వారా చదువులు పూర్తి చేసి కుటుంబ సభ్యులు, గురువుల సహకారంతో విశాఖపట్టణానికి చెందిన హనిత వేములపాటి సివిల్స్‌లో 887వ ర్యాంక్ సాధించి సత్తాచాటారు. తాను ఆత్మవిశ్వాసంతో చదువును కొనసాగించి సివిల్స్ ప్రిపేరయ్యానని ఆమె చెప్పారు. దేశంలోనే అత్యున్నత సివిల్స్ సర్వీసెస్‌కు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

### తాత జస్టిస్... మనవరాలు సివిల్స్ ర్యాంకర్

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామస్వామి మనవరాలు ఐశ్వర్య నీలిశ్యామల సివిల్స్‌లో 649వ ర్యాంకు సాధించారు. బీటెక్ పూర్తి చేసిన ఐశ్వర్య ప్రణాళికాబద్ధంగా ప్రిపేరై ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తాత జస్టిస్ రామస్వామి తనను ఎంతగానో ప్రేరేపించారని, అందుకే ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో సివిల్స్ రాశానని అన్నారు. తండ్రి సివిల్ సర్వెంట్, తల్లి ఉస్మానియా ఆసుపత్రిలో వైద్యురాలు అని, తన మామ ఐఏఎస్ అధికారి అని పేర్కొన్నారు.

### అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కోవాలి : అలేఖ్య

ఖమ్మం జిల్లాలో సాధారణ కానిస్టేబుల్ కూతురు అలేఖ్య. పోలీసు వృత్తిలోనూ నిజాయితీని చాటుకున్న తండ్రిని ఆమె ఆదర్శంగా తీసుకుంది. పాఠశాల విద్య నుంచే సివిల్స్ లక్ష్యంగా ఎంచుకుంది. అనుక్షణం తండ్రి ప్రోత్సాహం ఆమెకు కలిసి వచ్చింది. తన కష్టాలే ఆమెను మానసికంగా బలపడేలా చేశాయి. ఐపీఎస్ కావాలన్న లక్ష్య సాధనలో ఆమె 938వ ర్యాంకు సాధించింది. నాలుగుసార్లు సివిల్స్ విజయానికి దగ్గరగా వెళ్లిన ఆమె ఎన్నడూ నిరుత్సాహ పడలేదు. ఐదోసారి అనుకున్నది సాధించారు. ప్రతీ తల్లిదండ్రీ పిల్లలను ప్రోత్సహించాలని ఆమె చెప్పార. ప్రజా జీవితానికి చేరువగా విధి నిర్వహణ చేయాలని ఆమె కోరుకుంటున్నారు.



### పాలమూరు బిడ్డ... ప్రతిభకు అడ్డా

సివిల్స్ లక్ష్యంగా నిద్రాహారాలు మానేసి చదివిన పాలమూరు బిడ్డ అనుకున్నది సాధించింది. ఆలిండియా మూడో ర్యాంకు సాధించింది. మహబూబ్‌నగర్‌కు జిల్లాకు చెందిన దోనూరు అనన్య రెడ్డి తొలి ప్రయత్నంలోనే విజయ శిఖరాలు అధిరోహించడం విశేషం. అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి, మంజులతకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అనన్యరెడ్డి కాగా.. రెండో సంతానం చరణ్య. పదో తరగతి వరకు మహబూబ్‌నగర్ గీతం హైస్కూల్లో చదివిన అనన్య.. ఇంటర్ విద్యను హైదరాబాద్‌లో అభ్యసించారు. ఢిల్లీలోని మెరిండా హౌస్ కాలేజీలో డిగ్రీ చదివిన ఆమె ఎంతో కష్టపడి చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించినట్లు తెలిపారు. డిగ్రీ చదువుతున్న సమయంలోనే సివిల్స్ మీద దృష్టి సారించానని చెప్పారు. రోజుకు 12 నుంచి 14 గంటల పాటు చదివానని పేర్కొన్నారు. ఆంత్రోపాలజీ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా ఎంచుకున్నానని, ఇందుకు హైదరాబాద్‌లోనే కోచింగ్ తీసుకుని పకడ్బందీగా ప్రిపేరయ్యానని చెప్పారు. అయితే ఈ ఫలితాల్లో మూడో ర్యాంకు వస్తుందని ఊహించలేదన్నారు. చిన్నప్పటి నుంచే సమాజానికి సేవ చేయాలన్న కోరికతోనే సివిల్స్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. తమ కుటుంబంలో సివిల్స్ సాధించిన తొలి అమ్మాయిని తానేనని చెప్పారు. అనన్య తల్లి గృహిణి కాగా, తండ్రి రియల్ ఎస్టేట్ వ్యాపారి.



అనన్య రెడ్డి

### వ్యవసాయ కూలీ కుమారుడు ఐఏఎస్‌కు..



పూడూరు: వ్యవసాయ కూలీ కుమారుడు ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మంచన్‌పల్లికి చెందిన దయ్యాల బాబయ్య, శశికళ దంపతుల కుమారుడు తరుణ్ (24) సివిల్స్‌లో 231వ ర్యాంక్ సాధించారు. 2017లో తరుణ్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 2023లో బీటెక్ పూర్తి చేశారు. ఐఏఎస్‌కు ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నానని, పేదలకు సేవ చేసే అవకాశం వచ్చిందని తరుణ్ తెలిపారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తరుణ్ ఇంటికి వెళ్లి అభినందించారు. మారుమూల గ్రామానికి చెందిన తరుణ్ ఐఏఎస్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు.

### 60 మంది తోటి కానిస్టేబుళ్ల ముందు సీఐ అవమానించారని..



చిక్కడపల్లి: '60 మంది పోలీసుల ముందు ఇన్‌స్పెక్టర్ అవమానించారు. నాపై వ్యక్తిగత కోపంతో తిట్టారు. 2013 నుంచి 2018 వరకు చేసిన కానిస్టేబుల్ జాబ్‌కు ఆరోజే రిజైన్ చేశాను. ఐఏఎస్ సాధించాలని ఆ రోజే కసితో దీక్ష తీసుకున్నాను. నాలుగో ప్రయత్నంలో విజయం సాధించాను' అని 780వ ర్యాంక్ సాధించిన ఉదయ్ కృష్ణారెడ్డి చెప్పారు. తనకు ఐఆర్ఎస్ వస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌లో చేరి ఐఏఎస్ సాధించేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఏపీలోని ఉమ్మడి ప్రకాశం జిల్లా గుడ్లూరు పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తనకు సీఐ చేసిన అవమానమే ఈ రోజు సివిల్స్ సాధించేందుకు దోహదపడిందన్నారు. తనకు జంతువులంటే ఎంతో ప్రేమ అని, మనుషుల కోసం 108 వాహనం ఉన్నట్లే జంతువుల కోసం దేశవ్యాప్తంగా 109 అంబులెన్స్ వాహనం కోసం తన వంతుగా ప్రయత్నం చేస్తానన్నారు. తన చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారని నానమ్మ పెంపకంలో పెరిగానని వివరించారు.

### ఢిల్లీ ఐఐటీ వదిలి.. దూర విద్య చదివి...



ముషీరాబాద్: నల్లగొండ జిల్లా అల్వాలకు చెందిన సత్యనారాయణరెడ్డి స్కూల్ ప్రిన్సిపల్, తల్లి హేమలత టీచర్. తల్లిదండ్రులు ఇద్దరు ఉన్నత విద్యావంతులు కావడంతో కుమారుడు పెంకేసు ధీరజ్‌రెడ్డిని ఐఐటీ చదివించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వారి ఆశలకు తగ్గట్టుగానే ఐఐటీ ఢిల్లీలో సీటు సాధించారు. మొదటి సంవత్సరంలో 9.3 సీజీపీఏ సాధించి ఐఐటీ ఢిల్లీలోనే టాప్ 7లో నిలిచాడు. ఇలా సాగిపోతున్న తరుణంలో ధీరజ్‌రెడ్డికి చదువు పరుగు పందెంలా అనిపించింది. ఎప్పుడూ కంప్యూటర్‌తో కుస్తీ, మెకానికల్ లైఫ్ అనిపించి ఈ చదువు తనకు ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అవాక్కయ్యారు. అయినప్పటికీ కుమారుడిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేని తల్లిదండ్రులు నీకు నచ్చకపోతే ఐఐటీ వదిలేయమని చెప్పారు. దీంతో ఐఐటీని మధ్యలోనే ఆపేసి ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికే డిగ్రీ అడ్మిషన్లు అయిపోవడంతో ఉస్మానియా యూనివర్సిటీలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్(దూర విద్య)లో బీఏ డిగ్రీలో అడ్మిషన్ తీసుకున్నాడు. ఆ అడ్మిషన్ కేవలం డిగ్రీకి మాత్రమే.. వెంటనే సివిల్స్‌పై దృష్టి సారించాడు. తల్లిదండ్రుల్లో మాత్రం కుమారుడి భవిష్యత్తు మీద ఆందోళన మొదలైంది. 2019లో మొదటిసారి సివిల్స్ ఫలితాల్లో 0.6 మార్కులతో రాలేదు. రెండవ ప్రయత్నంలో 17 మార్కులతో, మూడవ ప్రయత్నంలో ప్రిలిమ్స్‌లో ఫెయిలయ్యాడు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి నాలుగోసారి 173వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు దారులు వేసుకున్నాడు.

### మేస్త్రీ కుమారుడికి 574వ ర్యాంక్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కల్కి నగర్ కాలనీకి చెందిన రామారెడ్డిపేట రజనీకాంత్ ఆరో ప్రయత్నంలో 574వ ర్యాంకు సాధించారు. రజనీకాంత్ కుటుంబానిది రాజంపేట మండలం ఆర్గొండ గ్రామం. రామారెడ్డిపేట సిద్ధిరాములు, పద్మ దంపతుల రెండవ కుమారుడు. పేద కుటుంబమే. తల్లి గృహిణి కాగా, తండ్రి భవన నిర్మాణ పనులతోపాటు డ్రైవర్‌గా చేస్తారు. చిన్నప్పటి నుంచి చాలా ఇబ్బందులు పడ్డామని, కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని రజనీకాంత్ చెప్పారు. సామాన్య కుటుంబంలో పుట్టిన తమ అబ్బాయి సివిల్స్ సాధించి తమ జన్మను సార్థకం చేశాడని తల్లిదండ్రులు 'సాక్షి'తో ఆనందం వ్యక్తం చేశారు.

### బీడీ కార్మికురాలి కొడుకు సివిల్స్ ర్యాంకర్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ 27వ ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సాయికిరణ్ తండ్రి నందాల కాంతారావు మహారాష్ట్రలోని భివండిలో చేనేత కార్మికుడిగా పనిచేశారు. తల్లి లక్ష్మీ బీడీలు చుట్టేవారు. కాంతారావు కేన్సర్‌తో 2016లో మరణించారు. ఆ సమయంలో సాయికిరణ్ వరంగల్ ఆర్ఈసీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. 2018లో క్యాంపస్ ఇంటర్వ్యూలో క్వాల్‌కమ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వచ్చింది. బాల్యం నుంచి ఐఏఎస్ కలగా ఉన్న సాయికిరణ్ అప్పటి నుంచి ఓవైపు ఉద్యోగం చేస్తూనే ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతంగా సివిల్స్‌కు ప్రిపేరయ్యాడు. క్రితంసారి విఫలమైనా.. ఈసారి మాత్రం విజయం సాధించి తన స్వప్నాన్ని నెరవేర్చుకున్నాడు.

### మూడోప్రయత్నంలో 50వ ర్యాంకు

హైదరాబాద్ చిక్కడపల్లికి చెందిన కేఎస్ చందన జాహ్నవి సివిల్స్‌లో మూడో ప్రయత్నంలో 50వ ర్యాంకు సాధించారు. ఆమె తండ్రి రాంబాబు ఇంజనీరింగ్ కళాశాలలో బోర్డ్ మెంబర్ కాగా, తల్లి లక్ష్మి స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఆమె తాత ఐఏఎస్‌గా పనిచేశారు. ఎంటెక్ పూర్తి చేసిన ఆమెకు మొదటి ప్రయత్నం (2021)లో ఇండియన్ కార్పొరేట్ లా సర్వీస్‌లో వచ్చింది. రెండో ప్రయత్నం (2023)లో ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌లో ఆలిండియా 313వ ర్యాంక్ వచ్చింది.

## కనీస అర్హత మార్కుల్లో జోక్యం చేసుకోలేం

● ఎస్ఈటీలకు తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సెకండరీ గ్రేడ్ టీచర్ కేటగిరీలో ప్రాథమిక స్థాయిలో బోధించే స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల (ప్రత్యేక అవసరాల పిల్లలు) కనీస అర్హత మార్కుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) జారీ చేసిన నిబంధనలను మారుస్తూ ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. తాజాగా ప్రకటించిన డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల కేటగిరీ కింద 796 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. వీరికి ఇంటర్మీడియట్‌లో కనీస అర్హత మార్కులను ఓసీలకు 50 శాతం, ఇతరులకు 45 శాతంగా నిర్ణయించింది. దీంతో పాటు రెండేళ్ల డీఈడీ పూర్తి చేసి ఉండాలని పేర్కొంది. 50 శాతం అర్హత మార్కులు పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ సంగారెడ్డి జిల్లా ఆందోల్‌కు చెందిన విజయాచారితో పాటు మరో 10 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 28న పాఠశాల విద్యా శాఖ జారీ చేసిన జీవో 4ను కూడా సవాల్ చేశారు. ఓసీలకు ఇంటర్‌లో 45 శాతంగా, ఇతరులకు 40 శాతంగా కనీస అర్హత మార్కులను పరిగణించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.రమేశ్ వాదనలు వినిపిస్తూ.. స్కూల్ ఎడ్యుకేషన్‌లో జీవో ఎంఎస్ నంబర్ 1 కింద జారీ చేసిన సవరించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. అందులో ఓసీలకు ఇంటర్మీడియట్ స్థాయిలో 45 శాతం, ఇతరులకు 40 శాతం కనీస అర్హత మార్కులను తగ్గించారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

## మధుయాష్కీకి రాహుల్, రేవంత్ పరామర్శ

● తల్లి అనసూయమ్మ మృతిపై ఫోన్‌లో సానుభూతి తెలిపిన ఏఐసీసీ అగ్రనేత

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్ చేశారు. యాష్కీ తల్లి అనసూయమ్మ మృతి పట్ల ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మంగళవారం యాష్కీని ఫోన్‌లో పరామర్శించారు. నారాయణపేట బహిరంగసభకు వెళ్లినందున అంత్యక్రియల్లో పాల్గొనలేకపోయాయని చెప్పిన రేవంత్, కేరళ పర్యటనకు వెళ్లి వచ్చిన తర్వాత ఇంటికి వచ్చి పరామర్శిస్తానని యాష్కీతో చెప్పారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, బీజేపీ నేత ఈటల రాజేందర్, బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలు, పలు పార్టీల నేతలు కూడా యాష్కీని ఫోన్‌లో పరామర్శించారు.



## సీసీఎస్ పోలీసుల ఎదుట టీడీపీ నేత శివానందరెడ్డి హాజరు

● బుద్వేల్ అసైన్డ్ ల్యాండ్స్ కేసులో ప్రశ్నించిన అధికారులు

సాక్షి,హైదరాబాద్: హైదరాబాద్ నగర శివార్లలోని బుద్వేల్‌లో ఉన్న 26 ఎకరాల భూమి అసైన్డ్ భూముల కేసులో నిందితుడిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నేత, వెస్సెల్లా గ్రూప్ సీఈఓ, మాజీ పోలీసు అధికారి మాండ్ర శివానందరెడ్డి మంగళవారం మరోసారి హైదరాబాద్ నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటికే ఒకసారి ఈ నెల 10న దర్యాప్తు అధికారి ముందుకు వచ్చివెళ్లిన విషయం తెలిసిందే. తన న్యాయవాదితో కలిసి వచ్చిన ఈయనను సీసీఎస్ పోలీసులు గంటకు పైగా వివిధ అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది.

## యూపీఎస్సీ-2023 ఫలితాల్లో నారాయణ జయభేరి

సాక్షి, హైదరాబాద్: యూపీఎస్సీ-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు అనన్యరెడ్డి, 493వ ర్యాంకు పృథ్వీరాజ్‌కుమార్, 545వ ర్యాంకు సీహెచ్ నరేంద్ర పడాల్, 919వ ర్యాంకు ధరావత్ సాయిప్రకాశ్ సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ పి.సింధూరనారాయణ, పి.శరణినారాయణ కోహెడలోని నారాయణ ఐఏఎస్ అకాడమీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 21 ఏళ్లకే ఐఏఎస్ కలను నెరవేర్చేందుకు నారాయణ ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ అకాడమీని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సివిల్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో నారాయణ ఐఏఎస్ అకాడమీ కోర్ డీన్ ఎస్.రామలింగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగేంద్ర ప్రతాప్, డీన్ మనోజ్‌కుమార్, ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# సివిల్స్‌లో తెలుగు తేజాలు

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం ప్రకటించింది. ఆలిండియా టాపర్‌గా లక్నోకు చెందిన ఆదిత్య శ్రీవాత్సవ నిలవగా, ఒడిశాకు చెందిన అనిమేష్ ప్రదాన్ రెండో స్థానంలో నిలిచారు. తెలంగాణకు చెందిన అనన్య రెడ్డి మూడో ర్యాంకు సాధించారు. 2022 సివిల్స్‌లోనూ తెలుగు విద్యార్థి ఉమాహారతి మూడో స్థానం పొందడం విశేషం.

**1,016 మంది ఎంపిక:** సివిల్స్-2023 కోసం యూపీఎస్సీ 1,016 మందిని ఎంపిక చేసింది. ఇందులో జనరల్ కేటగిరీలో 347 మంది ఉన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా నుంచి 115, ఓబీసీ నుంచి 303, ఎస్సీల నుంచి 165, ఎస్టీ విభాగం నుంచి 86 మంది ఎంపికయ్యారు. పోస్టుల వారీగా చూస్తే ఐఏఎస్ సర్వీసులకు 180 మంది, ఐఎఫ్ఎస్‌కు 37 మంది, ఐపీఎస్‌కు 200 మంది ఎంపికయ్యారు. సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్-ఏ కేటగిరీకి 613 మంది, గ్రూప్ బీ సర్వీసెస్‌కు 113 మంది ఎంపికైనట్టు యూపీఎస్సీ వెల్లడించింది. అభ్యర్థులు పొందిన మార్కులను 15 రోజుల్లో తమ వెబ్‌సైట్‌లో ఉంచుతామని ప్రకటించింది.

**విజేతలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

సివిల్స్ ఫలితాల్లో మెరిసిన తెలుగు రాష్ట్రాల విజేతలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ, ఏపీ నుంచి ఈసారి 50 మందికి పైగా ఎంపికవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మూడో ర్యాంకు సాధించిన పాలమూరుకు చెందిన అనన్య రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**మహేష్ భగవత్ కృషి ఫలించింది**

సివిల్స్ పరీక్షల్లో సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ భగవత్ గైడెన్స్ మంచి ఫలితాలను ఇచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా శిక్షణ పొందుతున్న వారితో ప్రత్యక్షంగా, ఇతర రాష్ట్రాల వారితో ఆన్‌లైన్ ద్వారా ఆయన ఇచ్చిన సూచనలతో 200 మందికి పైగా ర్యాంకులు సాధించారు.

### సివిల్స్‌లో ర్యాంకులు పొందిన తెలుగు విద్యార్థులు

| పేరు | ర్యాంకు | పేరు | ర్యాంకు |
|---|---|---|---|
| దోనూరు అనన్యరెడ్డి | 3 | కిరణ్ సాయింపు | 568 |
| నందాల సాయికిరణ్ | 27 | మన్రిపాటి నాగభరత్ | 580 |
| కేఎస్ చందన జాహ్నవి | 50 | పోతుపురెడ్డి భార్గవ్ | 590 |
| మెరుగు కౌశిక్ | 82 | కె.అర్పిత | 639 |
| రావుల జయసింహా రెడ్డి | 104 | ఐశ్వర్య నెల్లిశ్యామల | 649 |
| పెంకేసు ధీరజ్ రెడ్డి | 173 | సాక్షి కుమారి | 679 |
| జి.అక్షయ్ దీపక్ | 196 | చౌహాన్ రాజ్‌కుమార్ | 703 |
| గణేశ్న భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ | 198 | గాదె శ్వేత | 711 |
| దయ్యాల తరుణ్ | 231 | కొటె అనిల్‌కుమార్ | 743 |
| ఎహ్తేదా ముఫస్సిర్ | 278 | వి.ధనుంజయ్ కుమార్ | 810 |
| బుద్ధి అఖిల్ | 321 | లక్ష్మీ బానోతు | 828 |
| నిమ్మనపల్లి ప్రదీప్ రెడ్డి | 382 | ఆదా సందీప్‌కుమార్ | 830 |
| బన్ను వెంకటేశ్ | 467 | జె.రాహుల్ | 873 |
| కడుమూరి హరిప్రసాద్ రాజు | 475 | హనిత వేములపాటి | 887 |
| పూల ధనుష్ | 480 | కె.శశికాంత్ | 891 |
| కె.శ్రీనివాసులు | 526 | కెసారపు మీన | 899 |
| కొయ్యడ ప్రణయ్‌కుమార్ | 554 | రావూరి సాయి అలేఖ్య | 938 |
| నెల్లూరు సాయితేజ | 558 | గోవద నవ్యశ్రీ | 995 |

# 'నార్త్' ఆధిపత్యానికి తెలుగు విద్యార్థులు అడ్డుకట్ట వేయాలి

● కష్టపడి, ఇష్టపడి చదివితే సివిల్స్ ర్యాంకు సాధించడం కష్టం కాదు

● సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత

సాక్షి, హైదరాబాద్/ముషీరాబాద్/చిక్కడపల్లి: కష్టపడి, ఇష్టపడి చదివితే సివిల్స్‌లో ర్యాంకు సాధించడం పెద్ద కష్టమేమీ కాదని ప్రముఖ విద్యావేత్త, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అభిప్రాయపడ్డారు. సివిల్స్‌లో ఉత్తర భారతదేశం ఆధిపత్యానికి తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అడ్డుకట్టవేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. తమ అకాడమీలో తర్ఫీదు పొందిన మెరుగు కౌశిక్‌కు 82వ ర్యాంకు వచ్చిందని, మొత్తమ్మీద 16 మంది అభ్యర్థులకు సివిల్స్‌లో ర్యాంకులు వచ్చాయన్నారు. ఆమె మంగళవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని తమ విద్యార్థులు లక్ష్యాన్ని సాధించారని తెలిపారు. తమ విద్యార్థుల్లో చాలామంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చి విజయాలు సాధించారని చెప్పారు. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ కావాలనేది ఒక కల అని, ఆ కలను తాము నిజం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల కష్టమే ఇందులో అధికమని చెప్పారు. యూట్యూబ్ నిండా అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్ ఉందని, కానీ వారికి కావాల్సిన సపోర్టు, గైడెన్స్‌ను అందించడమే తమ పని అన్నారు. భవిష్యత్తులో తెలుగు అభ్యర్థులు అధికంగా సివిల్స్‌లోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం అకాడమీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ర్యాంకర్లను సన్మానించారు.




ర్యాంకర్లతో సీఎస్‌బీ అకాడమీ డైరెక్టర్ బాలలత



ఒకరు చెడు కోరికలతో చెడ్డపనులు చేసి, దానికి తగిన దుఃఖం పొందితే, మరొకరు మంచి కోరికలతో మంచి పనులు చేసి అందుకు తగిన దుఃఖం పొందుతారు. దీనర్థం మంచిపనులు చెయ్యొద్దని కాదు; సామాన్యుడు గమనించలేని సున్నితమైన దుఃఖం ఉందని!

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)



సాక్షి

బుధవారం, 17 ఏప్రిల్ 2024

# సంకల్పం సరిపోతుందా?

కొద్దిరోజుల్లో సార్వత్రిక ఎన్నికల తొలి దశ పోలింగ్‌కు దేశం సిద్ధమవుతున్న వేళ పాలక బీజేపీ తన 'సంకల్ప పత్రం'తో ముందుకొచ్చింది. అధికారంలోకి వచ్చాక రాగల అయిదేళ్ళలో తన ప్రణాళికలు ఎలా ఉంటాయో ప్రజల ముందు ఉంచింది. దశాబ్ద కాలంగా ఢిల్లీ గద్దెపై ఉంటూ, రాజకీయాల్లో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించిన ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో సైతం అందుకు తగినట్టే సాగింది. విశేష ప్రజాకర్షక పథకాల జోలికి పోలేదు. ప్రస్తుత విధానాల కొనసాగింపునే ప్రధానంగా ఆశ్రయించింది. పార్టీ కన్నా ప్రధాన రథసారథికే అధిక ప్రాధాన్యమిస్తూ, 'మోదీ కీ గ్యారెంటీ' అంటూ ప్రచారం చేస్తోంది. ఇది మునుపెన్నడూ కాషాయపార్టీలో కనిపించని చిత్రం. ఎన్నికల్లో విజయం కోసం మోదీపై ఆ పార్టీకి ఉన్న నమ్మకానికి నిదర్శనం. ప్రచారంలో ప్రతిచోటా ప్రవచిస్తున్న 'వికసిత భారత్' స్వప్నానికి అనుసంధాయకంగా అభివృద్ధి, ప్రాథమిక వసతి కల్పన, సంక్షేమం, విద్య, పారిశ్రామిక రంగం, అంకుర వ్యవస్థ, ఉత్పాదక రంగం, రైల్వే వగైరాలకు సంబంధించి 'మోదీ గ్యారెంటీ'లను ఈ మేనిఫెస్టోలో జొప్పించడం విశేషం.

వరుసగా మూడోసారి సైతం తమ పార్టీకి అధికార పగ్గాలు దక్కడం ఖాయమన్న ఆత్మవిశ్వాసంతోనో ఏమో ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలను కొనసాగిస్తే చాలనే భావన బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో కనిపించింది. గడచిన కేంద్ర బడ్జెట్‌లో ఎన్నికల ముందస్తు వరాలు కురిపించకుండా ఆర్థికంగా పొదుపు మంత్రాన్ని పఠిస్తూ, పాత విధానాల కొనసాగింపునే కమలనాథులు ఆశ్రయించారు. ఇప్పుడీ సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలోనూ అదే ధోరణిని అనుసరించారు. ప్రజల నుంచి వచ్చిన దాదాపు 15 లక్షల దాకా సూచనలను పరిగణనలోకి తీసుకొని, 'వికసిత భారత్' స్వప్నానికి అనుగుణంగా ఈ మేనిఫెస్టోను రూపొందించామని బీజేపీ చెబుతోంది. మళ్ళీ అధికారంలోకి వచ్చే జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)కి దిశానిర్దేశంగా ఈ 'సంకల్ప పత్రం' పనిచేస్తుందని కమలనాథుల ఉవాచ. వచ్చే 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా, విశ్వశక్తిగా మారుస్తామనేది వారు చూపిస్తున్న సుందర స్వప్నం.

మోదీ ఆదివారం విడుదల చేసిన ఈ 'సంకల్ప పత్రం' ఇప్పటికే సర్కారు అమలు చేస్తున్న ఉచిత రేషన్ పథకం, సురక్షిత మంచినీటి సరఫరా, గృహనిర్మాణం లాంటి దారిద్ర్య నిర్మూలన పథకాలను ఏకరవు పెట్టింది. గత పదేళ్ళలో 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటపడేశామనీ, సామాజిక న్యాయానికి కట్టుబడి ఇతర వెనుకబడిన వర్గాలు, గిరిజనులు, దళితులకు ప్రభుత్వంలో భాగం కల్పించామని చెప్పుకుంది. అదే సమయంలో ఈ 'సంకల్పం'లో కొన్ని వివాదాలూ ఉన్నాయి. ఈసారి ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామాలయ ప్రారంభం చేసి చూపిన బీజేపీ మూడోసారి గద్దెనెక్కితే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తేవాలని చూస్తోంది. అయితే, తెలివిగా యూసీసీ, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), 'ఒకే దేశం – ఒకే ఎన్నిక', సార్వత్రిక ఎన్నికల జాబితా తదితర విస్తృత చర్చనీయాంశాలను తన సైద్ధాంతిక ఎంపికలుగా కాక, సుపరిపాలనకు తప్పనిసరి అన్నట్టు చిత్రిస్తూ మేనిఫెస్టోలో పెట్టింది. అదే సమయంలో 2019 మేనిఫెస్టోలో పేర్కొన్న వివాదాస్పద 'పౌరుల జాతీయ చిట్టా' అంశాన్ని ఈసారి ప్రస్తావించలేదు. వ్యవసాయ చట్టాలపై ఎదురుదెబ్బ తగిలేసరికి, ఈ తడవ వాటి ఊసెత్తకుండా జాగ్రత్తపడింది. రైతులకు గట్టి హామీలివ్వకుండా దాటేసింది.

ప్రధాన ప్రత్యర్థులైన బీజేపీ, కాంగ్రెస్‌ల ఎన్నికల వాగ్దానపత్రాలను విశ్లేషకులు సహజంగానే పోల్చి చూస్తున్నారు. బీజేపీ మేనిఫెస్టో విధానాల కొనసాగింపు ధోరణిలో సాగితే, కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రజాకర్షక బాటన నడిచింది. ముందుగా ప్రకటించిన కాంగ్రెస్‌ది 'న్యాయ్ (గ్యారెంటీల) పత్రం' అయితే, ఆనక వచ్చిన బీజేపీది 'సంకల్ప పత్రం'. యువ న్యాయ్, నారీ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారీ న్యాయ్‌లు అయిదు ప్రధానాంశాలుగా, 25 గ్యారెంటీలతో కాంగ్రెస్ ముందుకొచ్చింది. మహిళలు, యువతరం, అణగారిన వర్గాలు, రైతులు... ఈ నాలుగు వర్గాలూ దేశాభివృద్ధికి నాలుగు స్తంభాలని బీజేపీ సంకల్పం చెప్పుకుంది. కనీస మద్దతు ధరకు 'చట్టపరమైన గ్యారెంటీ' ఇస్తామని కాంగ్రెస్ పేర్కొంటే, బీజేపీ మాత్రం పంటలకు కనీస మద్దతు ధరల్ని 'ఎప్పటికప్పుడు' పెంచుతామన్నదే తప్ప, చట్టంగా భరోసా ఇవ్వలేదు. కులగణనకు కాంగ్రెస్ కట్టుబడితే, అలాంటి డిమాండ్లపై బీజేపీ తన అభిప్రాయం పంచుకోనే లేదు.

రెండు మేనిఫెస్టోల్లో కొన్ని మంచి విషయాలూ లేకపోలేదు. రాగల అయిదేళ్ళలో వ్యవసాయ పరిశోధనలకు రెట్టింపు నిధులిస్తామన్నది కాంగ్రెస్ వాగ్దానం. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద త్వరితగతిన చెల్లింపులు జరుపుతామనీ, పంట నష్టాన్ని మరింత కచ్చితంగా అంచనా వేసేలా సాంకేతికతను వినియోగిస్తామనీ బీజేపీ హామీ ఇస్తోంది. అయితే, దురదృష్టవశాత్తూ రెండు పార్టీలూ వ్యవసాయ రంగానికి సరైన దిశానిర్దేశంలో విఫలమయ్యాయి. నీరు, ఎరువులు, ఇంధనాలను తక్కువగా వినియోగిస్తూనే ఎక్కువ దిగుబడి లాంటి వాటిపై అవి దృష్టిపెట్టలేదు. ఇక, సాంస్కృతిక జాతీయవాదంతో తమిళుల్ని ఆకర్షించేలా 'తిరువళ్ళువర్ సాంస్కృతిక కేంద్రాల' ఏర్పాటు, సామాన్యుల సాధారణ రైలు ప్రయాణ కష్టాల్ని పక్కనబెట్టి ఖరీదైన 'వందేభారత్ రైళ్ళ' విస్తరణ లాంటివి బీజేపీ అనవసర ప్రాధాన్యాలే. దేశంలో ప్రస్తుత ప్రధాన సమస్యలు నిరుద్యోగం, ధరల పెరుగుదల అని సర్వేలన్నీ తేల్చినందున ఏ పార్టీ అయినా వాటిపై దృష్టి పెట్టడం ప్రయోజనం. ఆ మాటకొస్తే ఓటర్లను ఆకర్షించడమే కీలకమైన ఎన్నికల్లో, మేనిఫెస్టోలను తప్పనిసరిగా అమలు చేసి తీరాలన్న చట్టం లేని భారత్‌లో... 'సంకల్పం' శుష్కవచనమైతే నిష్ప్రయోజనం.

# ఆ చట్టానికి కోరలు ఎక్కువే!

విశ్లేషణ



ఉత్కర్ష్ ఆనంద్

**ప్రారంభం నుంచీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) వరుసగా అనేక సవరణలకు గురై మరింత కఠినంగా మారింది. దాంతో చట్ట అన్వయానికీ, వ్యక్తిగత స్వేచ్ఛకూ మధ్య సాధించాల్సిన సమతూకపు ఆవశ్యకత పెరుగుతోంది. పీఎంఎల్ఏ నిబంధనలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించలేదని చెప్పడం ద్వారా ఈడీకి ఉన్న విస్తారమైన అధికారాలను 2002లో సుప్రీంకోర్టు తీర్పు దృఢపరిచింది. ఈ తీర్పు ఫెడరల్ ఏజెన్సీకి అనవసరమైన వెసులుబాటు కల్పించిందని మానవ హక్కుల న్యాయవాదులు విమర్శించారు. ఏ రుజువూ లేకుండానే ఆరు నెలలు నిర్బంధంలో గడిపి, బెయిల్ మీద విడుదలైన 'ఆప్' ఎంపీ సంజయ్ సింగ్ కేసు ప్రాథమిక హక్కులపై పీఎంఎల్ఏ కలిగిస్తున్న ప్రభావాలను పునఃపరిశీలించవలసిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది.**

ఆర్థిక నేరాలకు వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎమ్ఎల్ఏ) ఒక ముఖ్యసాధనం. 2005 జూలైలో అమలులోకి వచ్చినప్పటి నుండి ఈ చట్టం సమూల మార్పులకు గురైంది. 2009, 2012, 2015, 2018, 2019, 2023లో ఈ చట్టానికి చేసిన పలు సవరణలు... అక్రమ ఆస్తులకు వ్యతిరేకంగా దేశం ప్రదర్శిస్తున్న కఠిన వైఖరిని ప్రతిబింబిస్తాయి.

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన తాజా పరిణామం... కఠినమైన చట్టాన్ని అన్వయించడంలో న్యాయపరమైన పర్యవేక్షణ, జవాబుదారీతనాలకు సంబంధించిన క్లిష్టమైన అవసరాన్ని గుర్తించింది. మనీలాండరింగ్‌లో తన ప్రమేయం ఉన్నట్లు రుజువు లేకుండానే ఆరు నెలలు నిర్బంధంలో గడిపిన తర్వాత, సింగ్ బెయిల్ పిటీషన్‌పై సవాలు చేయకూడదని ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) నిర్ణయించుకుంది.

గత కొన్ని సంవత్సరాలుగా, ప్రత్యేకించి 2022లో 'విజయ్ మదన్‌లాల్ చౌదరి' కేసుపై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు తర్వాత, మనీలాండరింగ్ చట్టం నిబంధనలను రాజ్యాంగ సూత్రాలతో సమతుల్యం చేయాలని సుప్రీంకోర్టును ఎక్కువగా కోరడం జరుగుతోంది. పీఎంఎల్ఏ నిబంధనలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించలేదని నొక్కి చెబుతూ ఈడీకి ఉన్న విస్తారమైన అధికారాలను ఆ తీర్పు దృఢపరిచింది. జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం (ఈయన పదవీ విరమణ చేశాక లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు), అక్రమాస్తుల నిరోధ సమస్యను పరిష్కరించడానికి కఠినమైన చర్యల అవసరాన్ని నొక్కి చెప్పింది. పైగా, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) కింద భారతదేశ బాధ్యతలను నెరవేర్చడంలో ఈ చట్టం పాత్రను ధర్మాసనం గుర్తించింది. ఈ తీర్పు ఈడీని బలోపేతం చేసినప్పటికీ, వ్యక్తిగత స్వేచ్ఛలు, విధానపరమైన భద్రతలను పణంగా పెట్టి, ఫెడరల్ ఏజెన్సీకి అనవసరమైన వెసులుబాటు కల్పించిందని న్యాయ నిపుణులు, మానవ హక్కుల న్యాయవాదులు విమర్శలు గుప్పించారు. న్యాయం, వ్యక్తిగత హక్కుల ప్రయోజనాలను సమతుల్యం చేయడానికి బదులుగా, ఈ తీర్పు ఈడీ అధికారాన్ని దుర్వినియోగం చేయగలదనే భయాందోళనలకు తావిచ్చింది.

ఈ తీర్పు వెలువడిన కేవలం ఒక నెల తర్వాత, మరో ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ దానిపై రివ్యూ పిటిషన్లను అంగీకరించింది. నిందితులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) కాపీని తిరస్కరించడం, నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే బాధ్యత నిందితుడి మీద ఉండటం– రెండు అంశాలను పునఃపరిశీలించడానికి ధర్మాసనం అంగీకరించింది. 2022 తీర్పుపై రివ్యూ పిటిషన్ పెండింగులో ఉండగా, వివిధ ఇతర కేసుల్లో మనీలాండరింగ్ చట్టం నిబంధనలను సుప్రీంకోర్టు వివరించాల్సి వచ్చింది, కొన్నిసార్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాల పరిధిని న్యాయస్థానం పరిమితం చేసింది. తదనంతరం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులలో కొన్ని విజయ్ మదన్‌లాల్ చౌదరి తీర్పునకు విరుద్ధమైన అభిప్రాయాన్ని వ్యక్తపరిచాయి.



ఉదాహరణకు, 2023 అక్టోబర్‌లో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ భిన్నమైన దృక్పథాన్ని తీసుకుంది. మనీలాండరింగ్ కేసుల్లో నిందితులకు వారిని అరెస్టు చేసిన కారణాల కాపీని ఈడీ తప్పనిసరిగా అందించాలని ధర్మాసనం ఆదేశించింది. మౌఖికంగా మాత్రమే సమాచారాన్ని అందించడం రాజ్యాంగ హక్కు ఉల్లంఘనగా పరిగణించబడుతుందని పేర్కొంది. అయితే, 2022 తీర్పు, నిందితుడిని అరెస్టు చేయడానికి గల కారణాలను వెల్లడించడం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1)కి తగినంత సమ్మతి కలిగి ఉందని చెప్పింది. వారి అరెస్టుకు కారణాలు తెలియజేయకుండా లేదా వారు ఎంచుకున్న న్యాయవాదిని సంప్రదించే హక్కును తిరస్కరిస్తూ, అరెస్టు చేసిన ఎవరినైనా సరే కస్టడీలో ఉంచకూడదని పేర్కొంది. 2023 తీర్పును సమీక్షించాలని కేంద్రం, ఈడీ గతనెలలో చేసిన అభ్యర్థనను కూడా తోసిపుచ్చడమైనది.

అదేవిధంగా, 2023 ఆగస్టులో తమిళనాడు మంత్రి వి సెంథిల్ బాలాజీ మెడికల్ బెయిల్ పిటిషన్‌పై ఇచ్చిన తీర్పులో, అక్రమాస్తుల నిరోధక చట్టంలోని సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారాలను జాగ్రత్తగా ఉపయోగించాలని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. విధానపరమైన లేదా ముఖ్యమైన ఉల్లంఘనలు ఉన్నట్లయితే, అరెస్టు చేసిన వ్యక్తిని న్యాయమూర్తులు వెంటనే విడుదల చేయాలని ఈ తీర్పు పేర్కొంది. ఈ తీర్పు అధికార దుర్వినియోగాన్ని నిరోధించడంలోనూ, సరైన కారణం లేకుండా అరెస్టులు శిక్షార్హమైనవి కాదని నిర్ధారించడంలోనూ న్యాయవ్యవస్థ పాత్రను బలపరిచింది.

2023 అక్టోబర్‌లో, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన మరో తీర్పు, సత్వర విచారణను కోరుకోవడం ప్రాథమిక హక్కుగా నొక్కి చెప్పింది. అదే సమయంలో అక్రమాస్తుల నిరోధక చట్టంలోని సెక్షన్ 45 ఆరోపించినట్లుగా నేరాభియోగాలకు తాము పాల్పడలేదని నిందితులే రుజువు చేసుకోవాలంటూ వారిపై ప్రాథమికంగా మోపే భారం అనేది వారి బెయిల్ మంజూరుకు సంపూర్ణ అడ్డంకి కాదని స్పష్టం చేసింది. 'నిందితుడికి నిమిత్తం లేని కారణాల వల్ల విచారణ కొనసాగనప్పుడు, సరైన కారణాలు ఉంటే తప్ప, బెయిల్ మంజూరు చేసే అధికారాన్ని ఉపయోగించుకునేలా న్యాయస్థానం మార్గనిర్దేశం చేయవచ్చు. విచారణకు సంవత్సరాల కాలం పట్టే చోట ఇది నిజం' అని చెప్పింది.

2023 నవంబర్‌లో పవన దిబ్బూర్ కేసులో ఇచ్చిన తీర్పులో, మనీలాండరింగ్ దర్యాప్తు ప్రారంభించడానికి భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 120బీ కింద శిక్షార్హమైన నేరపూరిత కుట్ర మాత్రమే సరిపోదనీ, 2002 చట్టం కింద షెడ్యూల్డ్ నేరంగా ఆ కుట్ర ఉండాలనీ ప్రకటించింది. ఈ తీర్పు ఆధారంగానే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై నమోదైన కేసును సుప్రీంకోర్టు గత నెలలో కొట్టేసింది.

సంజయ్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం, మనీలాండరింగ్ నిరోధక చట్టం విషయంలో పురోగమిస్తున్న న్యాయశాస్త్రానికి మరొక ఉదాహరణ. రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం చట్టపరమైన యంత్రాంగాలను దుర్వినియోగం చేయకుండా నిరోధించాల్సిన ఆవశ్యకతను ఇది సూచిస్తుంది. ఈ కేసు దృఢమైన న్యాయ పరిశీలన ప్రాముఖ్యతను గుర్తుచేస్తోంది. మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో, వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించడంలో ప్రభుత్వ అధికారాల మధ్య సమతుల్యతను తిరిగి అంచనా వేయడానికీ, పునశ్చరణ చేయడానికీ ఒక విస్తృత ధర్మాసనం ద్వారా 2022 తీర్పును సమగ్రంగా సమీక్షించవలసిన అవసరాన్ని కూడా ఇది గుర్తుచేస్తోంది.

ఇతర కేసులతో పాటు సంజయ్ సింగ్ కేసు, మనీలాండరింగ్ చట్టపరిధిలో ఉన్న కీలకమైన అంశాన్ని సూచిస్తోంది. ప్రాథమిక హక్కులపై మనీలాండరింగ్ చట్టం కలిగిస్తున్న ప్రభావాలను పూర్తిగా పునఃపరిశీలించవలసిన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. స్వేచ్ఛను కాపాడడానికి ఉద్దేశించిన న్యాయం రాజీ పడకుండా చూసేందుకు ఒక విస్తృత ధర్మాసనం ద్వారా పునఃపరిశీలన చేయాలని ఇది సూచిస్తోంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రాథమిక స్వేచ్ఛలను సవాలు చేస్తూనే ఉన్నందున, అమలు యంత్రాంగాలు న్యాయ, నిష్పక్షపాత సూత్రాలను అధిగమించకుండా చూడటంలో న్యాయవ్యవస్థ జాగరూకతా పాత్ర అనివార్యమవుతోంది.

వ్యాసకర్త జర్నలిస్ట్, కాలమిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### కోల్పోయాను!



చాలాకాలంగా నా ప్రియమైన స్నేహితుడు అయిన ద్వారకేశ్ మరణం బాధాకరం. కమెడియన్‌గా (కన్నడ సినీరంగంలో) కెరీర్‌ను ప్రారంభించి, పెద్ద నిర్మాతగా, దర్శకుడిగా ఎదిగారు. ఎన్నో మంచి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి. ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక నివాళి.

– రజినీకాంత్, నటుడు

### ఓం శాంతి



సెంట్రల్ కశ్మీర్ నుంచి దారుణ వార్త. పాఠశాలకు వెళ్తున్న చిన్నారుల పడవ ఝీలం నదిలో బోల్తాపడింది. పౌర యంత్రాంగం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్, సైన్యం బాడీల వెలికితీతలో పాల్గొంటున్నాయి. కానీ లైఫ్ జాకెట్స్ ఏమయ్యాయి? బాధ్యులను జవాబుదారీగా నిలబెట్టాలి.

– శేష్ పాల్ వైద్, జమ్ము–కశ్మీర్ మాజీ డీజీపీ

### వాళ్లు చెబితే గొప్పా?



తెల్లవాళ్ల ధ్రువీకరణ బలహీనత నుంచి బయటపడాలి. తమ వాదనలు బలపరుచుకోవడానికి అమెరికన్లు విదేశీయుల అభిప్రాయాలను ఉపయోగించుకోరు. కానీ ఇండియన్స్ (లెఫ్ట్, రైట్ రెండు పక్షాలు) తమ పాయింట్ చెప్పడానికి ప్రతీ తెల్ల చెత్తను ఉటంకిస్తారు. కొంత స్వీయ గౌరవం ఉండనీ!

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

### అదీ పరిస్థితి



మణిపూర్‌లో కుకీ–జోలు మైదాన ప్రాంతానికి వెళ్లలేరు: మైతేయిలు కొండ ప్రాంతాలకు పోలేరు. కానీ మాదక ద్రవ్యాలు మాత్రం అంతటికీ వెళ్లగలవు.

– అంగనా చక్రవర్తి, జర్నలిస్ట్

### పరిమిత స్పందన




ఇరాన్‌తో బైడెన్ యుద్ధం కోరుకోవడం లేదనేది స్పష్టం. ఇది ఇజ్రాయెల్ అవకాశాలను బలంగా పరిమితం చేస్తుంది. అలాగని ఇరాన్ దాడికి స్పందించకుండానూ ఇజ్రాయెల్ ఉండలేదు. అంటే, ప్రాంతీయ యుద్ధం రేగని స్థాయిలో మాత్రమే జీజీ (బెంజమిన్ నెతన్యాహూ) స్పందించాల్సి ఉంటుంది.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

# ప్రజాస్వామ్యానికి ప్రమాదకారులెవరు?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

'మనదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. మోదీ ప్రభుత్వం నియంతృత్వ పోకడను ప్రదర్శిస్తోంది. దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలను తన రాజకీయ అవసరాల కోసం వాడుకుంటోంది' అని మోదీ వ్యతిరేక రాజకీయ నాయకులు చేసే వాదనలలో సత్యాసత్యాలను పరిశీలిద్దాం!

2014లో నరేంద్ర మోదీ ప్రధాని పీఠంపై కూర్చుండే నాటికి దేశ ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉండేది? 2004 నుండి 2014 వరకు సోనియాగాంధీ డైరెక్షన్‌తో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా రెండు విడతల యూపీఏ ప్రభుత్వం అనేక కుంభకోణాల్లో పీకల లోతు వరకు కూరుకుపోయింది. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు మన దేశానికి అప్పులు ఇవ్వడానికి మొఖం చాటేశాయి. కాంగ్రెస్ నాయకులు, వారితో జతకట్టిన ప్రాంతీయ పార్టీల నాయకులు అనూహ్యంగా కోట్లకు పడగలెత్తారు. కాంగ్రెస్ పాలన నుండి విముక్తి కావాలని దేశ ప్రజలు కోరుకున్నారు. 2014లో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ అఖండ విజయాన్ని సాధించింది. గుజరాత్ మత ఘర్షణలను పదేపదే చెప్పి, మోదీ ప్రధానమంత్రి అయితే ముస్లింలు ఈ దేశంలో బ్రతకలేరనీ, ముస్లింలందరినీ పాకిస్తాన్‌కి వెళ్లగొడతారనీ, ముస్లింల మత స్వేచ్ఛకు ఇబ్బందులు ఏర్పడతాయనీ మోదీకి వ్యతిరేకంగా విష ప్రచారం చేశారు. అయినప్పటికీ ధర్మం గెలిచింది. మోదీ వ్యతిరేకులకు చావు దెబ్బ తగిలింది.

2019లో సైతం ఇలాంటి భంగపాటే మోదీ వ్యతిరేకులకు ఎదురైంది. 2016 నవంబర్ 8వ తేదీన నోట్ల రద్దుతో మోదీ వ్యతిరేకులకు, తీవ్రవాద సంస్థలకు, మత మార్పిడి సంస్థలకు చావు దెబ్బ తగిలింది. మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశ గౌరవ ప్రతిష్ఠలు అత్యున్నత స్థాయికి చేరడం, ప్రపంచ దేశాలలో మోదీకి సాటి అయిన నాయకుడు లేకపోవడం, ప్రపంచంలో మోదీ హవా సాగడం ఆయన వ్యతిరేకులకు కంటగింపుగా మారింది. 'మా దేశంలో ప్రజాస్వామ్యం మసకబారుతోంది, మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అనుసరిస్తోంది' అని ప్రపంచ వేదికల ముందు మొరపెట్టుకోవడం... అమెరికా, జర్మనీ, ఇంగ్లాండు, యూఎన్ఓ ప్రతిపక్షాల వాళ్లను తృప్తిపరచడం కోసం కంటితుడుపు ఆరోపణలు గుప్పించడం, ఇందుకు ప్రతిగా మోదీ ప్రభుత్వం ఘాటుగా స్పందించడం సర్వసాధారణమైంది.

నిజానికి కాంగ్రెస్ పాలనలోనే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. 1975లో ఎమర్జెన్సీ విధించి, వేల మంది రాజకీయ నాయకులను కార్యకర్తలను జైళ్లలో పెట్టి, వేధించినప్పుడు; ఇందిరాగాంధీ హత్యను సాకుగా చూపి, వేలమంది నిరపరాధులైన సిక్కులను ఊచకోత కోసినప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడలేదా? లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, జగన్ మోహన్ రెడ్డిలపై కేసులు మోపి, జైలుకు పంపించింది కాంగ్రెస్ ప్రభుత్వం కదా? ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌లను అవినీతి కేసుల్లో జైలుకు పంపితే వితండవాదం ఎందుకు చేస్తున్నారు? ఒక 'చాయి వాలా'కు వ్యతిరేకంగా ఇంత మంది ఎందుకు పోరాటం చేస్తున్నారు అనేది సామాన్యుడి ప్రశ్న.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

# సుప్రీంకోర్టు తీర్పులనూ ప్రజలకు చెప్పరా?

అభిప్రాయం



డా॥ నాగసూరి వేణుగోపాల్

ఒకటిన్నర దశాబ్దం క్రితం ఓ పత్రికా యజమాని విశాఖపట్నంలో తన మీద వచ్చిన ఒక వాజ్యం సంబంధించి ఆరోపణ ఎదుర్కొని, విచారణ కోసం కోర్టు కొచ్చారు. అయితే, కోర్టు నుంచి బయటకు వస్తున్నప్పుడు ఆయన మొహం కనబడకుండా, ఇతరులు అసలు చూడకుండా ఫోటోలు తీయకుండా సెక్యూరిటీ సిబ్బందితో బోలెడు గొడుగులు అడ్డం పెట్టుకుని సాగిపోయారు. అది గ్లామరస్ డైరెక్టర్ కె రాఘవేంద్రరావు వలపు పాటల చిత్రీకరణలో పూలల్లో హీరోయిన్ పూర్తిగా కప్పబడినట్టు, ఈ పత్రికా యజమాని గొడుగుల లోపల అదృశ్యమైపోయారు. అది మహాద్భుతమైన వార్తా సందర్భం. తెలుగు పత్రికా రంగం కొన్ని వార్తలను పకడ్బందీగా దాచి పెడుతుంది కనుక, ఆ వార్త ఏ ఇతర ప్రాంతంలో రాలేదు, ఒక్క లీడర్ రమణమూర్తి సంపాదకత్వం వహించే వైజాగ్ దినపత్రికలో ఆ పెద్ద వార్త తొలి పేజీ ఫోటోతో తప్పా. ఈ పత్రికా యజమాని, భారత రాజ్యాంగం ప్రకారం నడిచే కోర్టు విచారణ తర్వాత కెమెరాల నెదుర్కోకుండా మొహం దాచుకోవాల్సిన అగత్యం ఏమిటో?



అది పదేళ్ల క్రితం ఒక తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోతున్న సందర్భం. పార్లమెంట్‌లో మైకులు ఆపివేసి, తలుపులు మూసివేసి నిర్ణయాలు తీసుకుంటున్న సమయం కూడా! సరిగ్గా ఆ రోజునే హైదరాబాదులోని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ఒక కేసును ఎటువంటి సమగ్రమైన విచారణ లేకుండా కొట్టి వేసింది. అదే కేసు 10 ఏళ్ల తర్వాత 2024 ఏప్రిల్ 9న సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాల అభిప్రాయం ఏమిటో తెలుసుకోవాల్సిన అగత్యం ఉందనీ, దీని కోసం పోరాడుతున్న ఉండవల్లి అరుణ్ కుమార్ వాదన కూడా తెలుసుకోవాలనీ, అటు పిమ్మటే దీనికి సంబంధించి పూర్తి తీర్పు చెప్పండనీ... మళ్లీ ఆ కేసును తెలంగాణ హైకోర్టుకి సుప్రీంకోర్టు వెనక్కి పంపించింది. ఈ విషయం రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించింది. ఆ కేసు ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా ప్రాంతానికి చెందిన పత్రికా యజమానిది. కాగా, బాధితులు రెండు రాష్ట్రాల్లోనూ ఉన్నారు, ఆయన వాణిజ్య సామ్రాజ్యమంతా హైదరాబాదులో ఉంది. అయితే ఈ సుప్రీం కోర్టు తీర్పును అసలు చెప్పకుండా, దాని ఊసెత్తకుండా దాచి పెట్టి, మరేవో వేరే వార్తలను పేజీలకు పేజీలు నింపడం ఏమిటో? పదహారేళ్ళ క్రితం విశాఖపట్నం గొడుగులు వ్యవహారం లాంటిదే ఏప్రిల్ 10న ఆ వార్తను కొన్ని పత్రికలు, కొన్ని టీవీ ఛానళ్లు పూర్తిగా చెప్పకుండా దాచడం.

నాలుగు దశాబ్దాల క్రితం ప్రసంగ ప్రతులు ఎన్టీ రామారావుకు ఇచ్చి ఎన్నికల ప్రచారం చేయించి, దాన్నే మరుసటి రోజు వార్తలుగా పెద్ద పెద్ద ఐటమ్స్‌గా పేజీలు నింపేయడంతో మొదలుకొని... నిద్రిస్తున్న బిచ్చగాళ్లను ఫోటోలు తీసి, వాళ్లంతా తెలుగుదేశం పార్టీ టికెట్ల కోసం పడిగాపులు కాస్తున్నారన్నట్టు వార్తలు సృష్టించడం 40 ఏళ్ల క్రితపు విషయం. ముఖ్యమంత్రిని ఒకరు పడదోస్తే వెన్నుపోటు, మరొకరు పడదోస్తే ప్రజాస్వామ్యం అనే పద్ధతిలో ప్రచారం చేసి తెలుగు వారినే కాకుండా మొత్తం భారతదేశాన్ని నమ్మింపజేశారు. తమ వ్యాపారానికి సహకరించే నాయకులకు వత్తాసు పలకడం, తమకు తగరనుకున్న వారి మీద నిందలు తయారు చేయించి, అలాంటి సమాచారాన్నే వార్తల బురదగా చల్లడం... అనేది పాటించిన మరో విధానం.

అయితే ఇప్పుడు మరికొన్ని కొత్త పాత్రలు ప్రవేశించి, వార్తలను ఆక్రమించాయి. తమ పలుకుబడి కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో చిట్ ఫండ్ చట్టం రాకుండా కొన్ని దశాబ్దాలు ఆపగలిగిన వీరు, తామే వార్తలను సృష్టించి, చెలరేగి కొందరిని అందలం ఎక్కించి, మరికొందరిని పంకిలంలో పడదోసే ధోరణి ఇంతవరకు సాగింది. అయితే ఇప్పుడు విశాఖపట్నంలో భవనం, విజయవాడలో భవనం ఎలాగో మిగతావి కూడా అదే పద్ధతిలో తోక ముడిచే రోజులు ఎంతో దూరంలో లేవు. ప్రపంచాన్ని అరచేత్తో మూసి పెట్టి ఈ బొమ్మరిల్లు జర్నలిజాన్ని ఎంతో కాలం నడిపించలేరు.

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి
మొబైల్: 94407 32392

# దివ్య మంగళ స్వరూపులు

సీతారామ కల్యాణ విశేషాలను వాల్మీకి రామాయణం కంటే తులసీ రామాయణం కొంత విపులంగా వర్ణిస్తుంది. శివధనుర్భంగానికి ముందే మిథిలలో ఒక ఉద్యానవనంలో సీతారాముల చూపులు తొలిసారి కలిశాయంటారు తులసీదాసు. సౌందర్యానికి మూర్తీభావమైన సీతను చూసి రాముడు ముగ్ధుడై కళ్ళప్పగించాడు, నోట మాట రాలేదు.

సీతకూ అంతే. అయితే ఆమె తెలివిగా ఒక పని చేసింది. కంటిచూపుతో రాముడిని కట్టి తెచ్చేసుకొని తన హృదయంలో బంధించి, తప్పించుకోకుండా తన కనురెప్పల కవాటాలు మూసేసి తాదాత్మ్య స్థితిలో ఉండిపోయింది.



జ్యోతిర్మయం

ఆ సాయంత్రం ఆకాశంలో చంద్రుడిని చూసినప్పుడు, శ్రీరాముడికి శీతాంశుడిలో సీతే స్ఫురించింది. కానీ క్షణం ఆలోచించిన తరువాత పెదవి విరిచాడు. 'అబ్బే! ఈ చంద్రుడు కళంకితుడు. కాలకూట విషానికి తోబుట్టువు. రాత్రిపూట ఓ వెలుగు వెలుగుతాడు, కానీ పగలు వెలవెలబోతాడు. కొన్నాళ్ళు వృద్ధీ, కొన్నాళ్ళు క్షయం. మధ్యలో గ్రహణాలు. ఇన్ని పరిమితులున్న ఇందుబింబాన్ని, ఎల్లవేళలా ఎనలేని స్వయంప్రకాశంతో అలరారే అయోనిజతో పోల్చడం అసమంజసం' అనుకొన్నాడు.

జానకి సౌందర్యం వర్ణించడానికి తులసీదాసు జంకుతారు. లోకంలో ఉన్న వెర్రి మొర్రి ఉపమానాలు చెప్పి పేలవంగా ఆమెను వర్ణిస్తే, 'ఏమి కుకవి!' అని నలుగురూ నవ్వుతారు. పోనీ ఏ దివ్య స్త్రీలతోనో పోల్చాలంటే మాత్రం ఎవరున్నారు? వాగ్దేవి గొప్పదే కానీ మాటల మారి. అంబిక పూర్తి శరీరమే లేని అర్ధనారి. శ్రీదేవి అంటారా... ఆమె అందం ఆదివిష్ణువుకెరుక కానీ ఆమె కల్లుకూ, కాకోలానికీ చెల్లెలుగా పుట్టిందని జగద్విదితం కదా!

రాముడిదీ అలాంటి అతిలోక సౌందర్యమే. అందుకే సీతా స్వయంవర సభలో రామున్ని చూసి, చతుర్ముఖ బ్రహ్మగారు, 'నాకు ఎనిమిది కళ్లే ఉన్నాయి. ఇవి చాలడం లేదు' అనుకొంటే, ఆరు ముఖాల కుమార స్వామి, 'నాకు పన్నెండు కళ్ళు, బ్రహ్మగారికంటే నేనే భాగ్యశాలిని!' అని భావించాడట. సహస్రాక్షుడు దేవేంద్రుడయితే, 'ఆరోజు గౌతముడు నాకిచ్చిన వెయ్యి కళ్ళ శాపం, ఈరోజు నా పాలిటి వరమైంది' అని ఆనందించాడట.

నమోస్తు రామాయ సలక్ష్మణాయ, దేవ్యై చ తస్యై జనకాత్మజాయై!

– ఎం. మారుతి శాస్త్రి
(నేడు శ్రీరామ నవమి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: శు.నవమి సా.5.27 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి ఉ.7.41 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.9.30 నుండి 11.14 వరకు, దుర్ముహూర్తం: ప.11.33 నుండి 12.24 వరకు, అమృత ఘడియలు: లేవు, శ్రీరామనవమి : రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.11.



పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

# పేదలపై బాణాలా?

## చంద్రబాబుకు పది మంది సేనానులు.. మీ గురి ఎవరిపై?: భీమవరం సిద్ధం సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ''జగన్ ఎప్పుడూ ఒంటరి కాదు.. అందరికీ మంచి చేసిన జగన్‌కు ప్రతి ఇంటా మద్దతు ఉంది. ఏ ఇంట్లో చూసినా తోడుగా పేదల సైన్యం ఉంది. జగనే మళ్లీ రావాలని కోట్ల హృదయాలు ఆశీర్వదిస్తున్నాయి. ఒక్క జగన్ మీద చంద్రబాబు 10 మంది సేనానులను తోడు తెచ్చుకుని బాణాలు గురి పెడుతున్నారు. అవి తగిలేది జగన్‌కా? లేక పేదలకా?''అనేది ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. 16వ రోజు బస్సు యాత్ర సందర్భంగా మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మేమంతా సిద్ధం బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏమన్నారంటే..

### బాబు గురించి చరిత్ర చెబుతున్న నిజం..

భీమవరంలో జన సముద్రం కనిపిస్తోంది. శబరి, ఇంద్రావతి కలసి ఉప్పొంగిన గోదావరిని తలపిస్తోంది. మంచి చేసి మనం, జెండాలు జతకట్టి వాళ్లు తలపడుతున్న ఈ ఎన్నికల యుద్ధంలో ఆ పేదల వ్యతిరేకులను ఓడించి జరుగుతున్న మంచిని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమేనా? సంక్షేమ రాజ్యాన్ని అబద్ధాలు, కుట్రలతో ధ్వంసం చేసేందుకు చంద్రబాబు కూటమి ప్రయత్నిస్తోంది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కావు. మీ ఐదేళ్ల భవిష్యత్తు, అక్కచెల్లెమ్మల సాధికారత, పిల్లల చదువులు, అవ్వాతాతల సంక్షేమం, రైతన్నలకు అందుతున్న భరోసా, పేదలకు సామాజిక న్యాయం కొనసాగుతూ మరో రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మోసపోయి మళ్లీ నష్టపోవాలా? అనేది నిర్ణయించే ఎన్నికలు ఇవి. మీ ప్రతి ఓటు వచ్చే ఐదేళ్లు ఏ దారిలో నడవాలో నిర్ణయిస్తుంది కాబట్టి మీ కుటుంబమంతా కూర్చుని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా.

### కొంగ జపం.. నటిస్తావెందుకయ్యా?

మీరంతా ఈమధ్య చూసే ఉంటారు. చంద్రబాబుకు నాపై కోపం చాలా ఎక్కువగా వస్తోంది. ఆయన మాట్లాడుతున్నప్పుడు హైబీపీ కనిపిస్తోంది. ఏవేవో తిడుతుంటాడు.. శాపనార్థాలు పెడుతుంటాడు. నాకు ఏదో అయిపోవాలని కోరుకుంటూ ఉంటాడు. రాళ్లు వేయండి.. అంతం చేయండని పిలుపునిస్తూ ఉంటాడు ఆ పెద్ద మనిషి. అక్కచెల్లెమ్మలూ.. నాపై చంద్రబాబుకు అంత కోపం ఎందుకో తెలుసా? బాబూ.. చెరువులో కొంగ మాదిరిగా చేపలను తినేందుకు ఎదురు చూస్తూ ఇంకోపక్క జపం చేస్తున్నట్లు నటిస్తావెందుకయ్యా? కొంగ జపాలు ఎందుకు చేస్తున్నావ్? అని అడిగా. అలా అడగడం తప్పా? మీ పేరు చెబితే పేదలకు గుర్తుకొచ్చే పథకంగానీ మంచి పనిగానీ ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? అని చంద్రబాబును అడిగా. ఆయన పేదలకు చేసింది ఏమీ లేకపోగా చంద్రబాబు పేరు చెబితే వెన్నుపోట్లు, మోసం, దగా, అబద్ధాలు, కుట్రలే గుర్తుకొస్తాయి.

### భార్యలను వదిలేసి.. నియోజక వర్గాలనూ మార్చేసి!

ఇక దత్తపుత్రుడి విషయానికి వస్తే.. పెళ్లికి ముందు పవిత్రమైన హామీలిచ్చి పిల్లలను కూడా పుట్టించి నాలుగైదేళ్లకు ఒకసారి కార్లను మార్చేసినట్లుగా భార్యలను వదిలేసి, ఇప్పుడు నియోజక వర్గాలను కూడా అలవోకగా వదిలేస్తున్నావ్! ఏం మనిషివయ్యా నువ్వు? అని ఆయన్ను అడిగా. అందుకే దత్తపుత్రుడిలో కూడా ఈమధ్య బీపీ బాగా కనిపిస్తోంది. ఒకసారి చేస్తే అది పొరపాటు! మళ్లీ మళ్లీ చేస్తే అలవాటు అంటారయ్యా.. దత్తపుత్రా! పవిత్రమైన సాంప్రదాయాన్ని నడి రోడ్డుపైకి తీసుకురావడం, ఆడవాళ్ల జీవితాలను చులకనగా చూపడం ఘోరమైన తప్పుకాదా? ఇదే విషయం నేను అడిగితే తప్పు అట! నిన్ను చూసి అదే తప్పు ప్రతి ఒక్కరూ చేయడం మొదలుపెడితే.. ఇలా నాలుగేళ్లకు, ఐదేళ్లకు ఒకసారి భార్యలను మార్చడం మొదలు పెడితే అక్కచెల్లెమ్మల బతుకులు ఏం కావాలి? అని కనీసం ఆలోచన కూడా చేయడు. ఆ పెద్దమనిషికి నువ్వు చేస్తున్నది తప్పు అని చెబితే బీపీ విపరీతంగా పెరిగిపోతుంది. ఇలా ఇలా.. ఊగిపోతుంటాడు. చేతులు, కాళ్లు, తల.. అన్నీ ఊపేస్తుంటాడు. ఇలా అడిగినందుకే చంద్రబాబుకు, దత్తపుత్రుడికి నాపై కోపం. బాబు వదిన గారికి కూడా కోపం వచ్చింది. బాబు భజంత్రీలకు కూడా పిచ్చి కోపం.. వీళ్లంతా ఊగిపోతూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లలో పూనకం వచ్చినట్లుగా ప్రవర్తిస్తుంటారు.

### పేదలపై బాబు బాణాలు..

జగన్ ఒక్కడే.. చంద్రబాబుకు మాత్రం పది మంది సేనానులు. వారంతా బాణాలు గురి పెట్టారు. కానీ అవి తగిలేది ఎవరికి? జగన్‌కా? లేక పేదలకు జగన్ అందిస్తున్న పథకాలకా? వలంటీర్లు – సచివాలయాల వ్యవస్థలకా? ఆర్బీకేలు – విలేజ్ క్లినిక్స్ వ్యవస్థలకా? నాడు – నేడు, ఇంగ్లీషు మీడియంతో మారిన పిల్లల చదువులకా? వారి బాణాలు తగిలేది ఎవరికి? ఇంటింటికీ అందించే పెన్షన్లకు వారి బాణాలు తగులుతున్నాయి. మీ బిడ్డ బటన్ నొక్కడంతో నేరుగా రూ.2.70 లక్షల కోట్లు పలు పథకాల ద్వారా గత 58 నెలల్లో పేదలకు అందాయి. మరి వాళ్లు వేసే బాణాలు జగన్‌కు తగులుతున్నాయా? లేక ఆ రూ.2.70 లక్షల కోట్లు అందుకున్న అక్కచెల్లెమ్మల కుటుంబాలకు తగులుతున్నాయో ఆలోచన చేయమని కోరుతున్నా.



సభలో ఫ్యాన్ గుర్తును చూపిస్తున్న వైఎస్ జగన్

### జగన్‌కు తోడుగా కోట్ల గుండెలు..

ఈ యుద్ధంలో తలపడటానికి మీరంతా సిద్ధమేనా? జగన్ ఎన్నడూ ఒంటరి కానే కాదు. మంచి చేసిన జగన్‌కు మద్దతుగా ఏ ఇంట్లో చూసినా పేదల సైన్యం తోడుగా ఉంది. ఈరోజు ప్రతి ఇంట్లో జగనే ఉండాలి.. జగనే రావాలి.. మా బిడ్డే కావాలి అని కోట్ల మంది దీవిస్తున్నారు. ఇంటికే వస్తున్న రూ.3 వేల పెన్షన్ అందుకుంటున్న అవ్వాతాతలు జగన్‌కు తోడుగా ఉన్నారు. అమ్మ ఒడి నుంచి చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, ఆసరా, సున్నావడ్డీ, విద్యాదీవెన, వసతి దీవెన దాకా ప్రతి ఇంట్లో పథకాలు అందుకుంటున్న అక్కచెల్లెమ్మలు నా తమ్ముడు, నా అన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారు. బాగుపడ్డ ఆస్పత్రులు, మెరుగైన ఆరోగ్యశ్రీ, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష వీటన్నిటితో జీవితాలు మెరుగైన పేదలంతా మాకు తోడుగా నిలబడే వ్యక్తి ఒక్క జగన్ మాత్రమేనని భావిస్తూ మళ్లీ రావాలని కోరుకుంటున్నారు. ఇన్ని కోట్ల గుండెలు తోడుగా ఉండగా జగన్ ఒంటరి కానే కాదు.

### చంద్రబాబు సెల్ఫ్‌డబ్బా..

అదిగో హైపర్ లూమ్.. బుల్లెట్ రైలు.. మైక్రోసాఫ్ట్ వచ్చేసిందని.. ఏపీలో ఒలంపిక్స్ అని.. ఆమ్‌స్టర్ డ్యామ్, సింగపూర్, వెనిస్‌తో పోటీపడే నగరాన్ని నిర్మిస్తున్నామని చంద్రబాబు సెల్ఫ్‌డబ్బా కొట్టుకోలేదా? మరి సింగపూర్ కట్టాడా? హైపర్ లూమ్ తెచ్చాడా? బుల్లెట్ రైలు వచ్చిందా? మైక్రోసాఫ్ట్ ఏమైనా తెచ్చాడా? రాష్ట్రంలో ఏమైనా ఒలంపిక్స్ జరిగాయా? కొత్తగా ఏమైనా పోర్టులు కట్టాడా? ఫిషింగ్ హార్బర్లు కట్టాడా? కనీసం ఎయిర్‌పోర్టులు ఏమైనా కొత్తవి కట్టాడా? జిల్లాకో హైటెక్ సిటీ మీకేమైనా కనిపించిందా? ఎక్కడైనా ఓ మెడికల్ కాలేజీ కట్టాడా? ఇవన్నీ కట్టకపోతే పోనివ్వండి. ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ స్కూల్‌ని, కనీసం వార్డునైనా బాగు చేశాడా? ఎక్కడైనా ఒక ఊరిలో సచివాలయం, విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశాడా? గ్రామానికి ఫ్యామిలీ డాక్టర్‌ను తెచ్చాడా? మరి బాబు ఏం చేశాడని అభివృద్ధి కింగ్ అంటూ జబ్బలు చరుచుకుంటున్నారు? మీదంతా బోగస్ రిపోర్టు కాదా?

### వెలిగించండి ఫోన్లలో టార్చిలైట్లు..

ఇవాళ ఎక్కడైనా లంచాలు అనే మాట వినిపిస్తోందా? 58 నెలల్లో ఎలాంటి వివక్ష లేని పారదర్శక వ్యవస్థలను తెచ్చింది మీ బిడ్డ కాదా? మాయలు, మోసాలు చేసి గ్రాఫిక్స్ చూపించేవాడిని ఏమంటాం? ఛీటర్.. మోసగాడనే కదా? మాయలోడు అనే కదా అంటాం. మన ఖర్మ ఏమిటోగానీ ఐదేళ్ల క్రితం ఆ మనిషిని మనం ముఖ్యమంత్రి అని అన్నాం. చంద్రబాబు చరిత్రను ప్రతి ఒక్కరికీ వివరించండి. మోసాలతో పోరాడుతూ రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? వారి చీకటి యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మీరంతా సెల్‌ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయండి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని పాలన కొనసాగాలన్నా, వ్యవస్థలు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ సీట్లలో మన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి.

### మీ జగన్ ప్రోగ్రెస్ రిపోర్టు..

- వాయువేగంతో ఏకంగా 17 కొత్త మెడికల్ కాలేజీల పనులు
- కొత్తగా, మరో 4 సీ పోర్టుల పనులు
- కొత్తగా 10 ఫిషింగ్ హార్బర్ల పనులు వడివడిగా
- కొత్తగా ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల పనులు
- 15 వేలకుపైగా సచివాలయాల ఏర్పాటు
- నాడు–నేడుతో బాగుపడ్డ స్కూళ్లు, ఆస్పత్రులు
- కొత్తగా 15 వేలకుపైగా విలేజ్, వార్డు క్లినిక్స్
- కొత్తగా 11 వేలకుపైగా ఆర్బీకేలు
- కొత్తగా ఇప్పటివరకు 3 వేలకుపైగా డిజిటల్ లైబ్రరీల నిర్మాణం
- గ్రామానికే ఫైబర్ గ్రిడ్ సదుపాయం
- రాష్ట్రానికి రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడుల రాక
- విమానాశ్రయాల విస్తరణ, వాయువేగంతో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు
- 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, ఇండస్ట్రియల్ నోడ్స్, ఎంఎస్ఎంఈలకు ఆపన్న హస్తం
- స్వయం ఉపాధిని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ ఆసరా, సున్నావడ్డీ, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, వాహనమిత్ర, మత్స్యకార భరోసా, చేదోడు, తోడు, నేతన్ననేస్తం,
- అభివృద్ధిలో టాప్ 5 రాష్ట్రాల సరసన ఏపీ
- ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా ఇంటివద్దకే పథకాలు, సేవలు

### 2014లో బాబు మోసాలిలా..

- రూ.87,612 కోట్ల రైతు రుణాలను మాఫీ చేశాడా?
- రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా రద్దు చేస్తామన్నాడు, కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు చొప్పున బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నాడు. ఎవరికైనా చేశాడా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు అంటే 60 నెలలు. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, ఇల్లు కూడా ఇస్తామన్నాడు. ఏ ఒక్కరికైనా ఒక్క సెంటు స్థలం ఇచ్చారా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి చేశాడా?
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామని నమ్మబలికిన బాబు చేశాడా?
- ప్రతి నగరంలో హైటెక్ సిటీని నిర్మించాడా?.. భీమవరంలో కనిపిస్తోందా?
- ఇన్ని ప్రధాన హామీల్లో ఒక్కటంటే ఒక్కటైనా అమలు చేశాడా?
- ప్రత్యేక హోదా తెచ్చాడా?
- సూపర్ సిక్స్, సెవన్ అంటూ ఇప్పుడు మళ్లీ మోసాలకు బాబు తయారు.

## తెలుగు వారందరికీ సీఎం జగన్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: శ్రీరామ నవమి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రానికి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## ఏపీలో మూడు రోజులు తేలికపాటి వర్షాలు

**కొన్నిచోట్ల 44–46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం**

సాక్షి, విశాఖపట్నం: రాయలసీమపై మంగళవారం నుంచి ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవించే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మరోవైపు వచ్చే మూడు రోజులు కోస్తాంధ్ర రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో 44నుంచి 46 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల పలుచోట్ల వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కాగా, మంగళవారం రాష్ట్రంలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా కొవిలంలో 45.4 ఉష్ణోగ్రత రికార్డయింది. తుమ్మికపల్లి (విజయనగరం)లో 45.2, రావికమతం (అనకాపల్లి)లో 45.1, మక్కువ (పార్వతీపురం మన్యం)లో 44.4, గోస్పాడు (నంద్యాల)లో 44.3 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి.

## 18న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జూలై నెల కోటాను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎల్రక్టానిక్ డిప్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. ఈ టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు, శ్రీవారి సేవ కోటాను ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ కోటాను మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ కోటాను మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.

## పోలీసుల అదుపులో అనుమానితుడు!

- సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తులో పురోగతి
- ఐదుగురిని లోతుగా విచారిస్తున్న పోలీసులు
- వారిలో ఒకరు కీలక వ్యక్తి, మిగతా వారు సహకరించినట్లు భావన
- విజయవాడకు చెందిన ఓ టీడీపీ నాయకుడిని కూడా విచారిస్తున్న పోలీసులు
- త్వరలోనే కేసును ఛేదిస్తామని పోలీసుల ధీమా
- మీడియాలో వచ్చిన కథనాలను నిర్ధారించని పోలీసులు
- తాము చెప్పేవరకు ఎటువంటి కథనాలూ నమ్మవద్దని వినతి



సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. సీఎం వైఎస్ జగన్ శనివారం రాత్రి విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో 'మేమంతా సిద్ధం'యాత్ర నిర్వహిస్తుండగా పదునైన రాయితో ఆయనపై దాడి చేసిన అనుమానితుడిని గుర్తించినట్టు సమాచారం. అతనితోపాటు మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. ఈ కేసులో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ నాయకుడిని కూడా పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. అజిత్‌సింగ్ నగర్ డాబా కొట్ల జంక్షన్ వద్ద వివేకానంద స్కూల్ ప్రాంగణం నుంచి పదునైన రాయితో సీఎం జగన్‌పై దాడికి పాల్పడినట్టు పోలీసులు ఇప్పటికే నిర్ధారించారు. ఐపీసీ 307 కింద హత్యాయత్నంగా కేసు నమోదు చేసి ఆరు ప్రత్యేక బృందాలతో కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. వీడియో ఫుటేజీలు, కాల్ డేటా, ఇతర శాస్త్రీయ ఆధారాలను అన్ని కోణాల్లో విశ్లేషించారు. అజిత్ సింగ్ నగర్‌తోపాటు ఆ పరిసర ప్రాంతాల్లోని దాదాపు 60 మంది అనుమానితులను విచారించారు. వారిలో నేర చరితులు, అసాంఘిక శక్తులు, ప్రతిపక్ష టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే ముఠాల సభ్యులు, వ్యసనపరులైన అసాంఘిక శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన యువత వంటి వారు ఉన్నారు. అనుమానితులను విడివిడిగా విచారించి కీలక సమాచారాన్ని రాబట్టారు. హత్యాయత్నానికి పాల్పడిన రోజుకు (శనివారానికి) రెండు రోజుల ముందు నుంచి వారు ఎక్కడెక్కడ సంచరించారో వివరాలు సేకరించారు. వారు చెప్పిన సమాచారాన్ని కాల్ డేటా, సీసీ కెమెరాల వీడియో ఫుటేజిలతో పోల్చి చూశారు. సీసీ టీవీ ఫుటేజిల ఆధారంగా కొందరు యువకులపై పోలీసులకు సందేహం కలిగింది. వారిని మరింత లోతుగా విచారించి, కీలక సమాచారాన్ని రాబట్టారు. ఆ యువకుల గుంపే హత్యాయత్నానికి పాల్పడినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వారిలో ఒకరు ప్రధాన నిందితుడిగా, మిగిలినవారు అతనికి సహకరించినట్లు భావిస్తున్నారు. దీనిపై ఇంకా పోలీసులు పూర్తి నిర్ధారణకు రాలేదు. తొందరపడకుండా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఒకటికి రెండుసార్లు పరిశీలించి తుది నిర్ధారణకు రావాలని భావిస్తున్నారు. కాగా హత్యాయత్నానికి పాల్పడిన వారిని గుర్తించడంపై మంగళవారం వివిధ టీవీ చానళ్లు ప్రసారం చేసిన వార్తలను పోలీసులు నిర్ధారించలేదు. అవన్నీ మీడియా ఊహాగానాలేనని చెప్పారు. ఏదైనా విషయాన్ని తాము అధికారికంగా ప్రకటించేంతవరకు నమ్మవద్దని కోరారు. అప్పటివరకు తాము విచారించిన వారందరూ అనుమానితులే తప్ప నిందితులుగా భావించవద్దని చెప్పారు. ఈ కేసును త్వరలోనే ఛేదిస్తామని పోలీసు వర్గాలు తెలిపాయి.

# ఇదంతా సీబీఐ, సునీత ఆడుతున్న డ్రామా

▶ మొదటి పేజీ తరువాయి



మారకముందే ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. 'వివేకా హత్య జరిగిన 40 రోజుల తర్వాత దస్తగిరి సీబీఐ ముందు వాంగ్మూలమిస్తూ అతనే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలి. కానీ, సీబీఐ అతన్ని అరెస్టు చేయలేదు. పైగా, అతనికి ముందస్తు బెయిలు వచ్చేలా సీబీఐ, సునీత సహకరించారు. 2021 అక్టోబరు 21న కోర్టులో దస్తగిరి ముందస్తు బెయిల్ పిటిషన్ వేస్తే సీబీఐ అభ్యంతరం లేదని చెప్పింది. సునీత అభ్యంతరం చెప్పలేదు. ముందస్తు బెయిల్ వచ్చేంత వరకూ వేచి ఉండి, ఆ తర్వాత అప్రూవర్ వ్యవహారాన్ని తీసుకొచ్చారు. ఐపీసీ 306(4)ఏ ప్రకారం అప్రూవర్ అయితే కోర్టులో విచారణ అయ్యే వరకు బెయిల్ రాదు. కాబట్టే బెయిల్ వచ్చిన తర్వాత 306 (4)బి ప్రకారం అప్రూవర్‌గా మార్చారు. ఇక అతను జైలుకెళ్లే అవకాశం లేదు. సీబీఐ, సునీత ఈ విధానాన్ని వాడుకున్నారు. ఒకవేళ హంతకుడినని ఒప్పుకొన్న అతన్ని అరెస్టు చేసి ఉంటే జీవిత కాలం బెయిల్ వచ్చి ఉండేది కాదు. అందుకే హంతకుడినని ఒప్పుకొన్న దస్తగిరి ఒక్క రోజు కూడా జైలులో ఉండకుండా అతనికి ముందస్తు బెయిలు వచ్చేలా సహకరించి, ఆ తర్వాత అప్రూవర్ వ్యవహారాన్ని బయటకు తెచ్చారు. ఇక జీవిత కాలం ఈ కేసులో అతని అరెస్టు ఉండదని హామీ ఇచ్చి, ఈ ప్రయోజనాన్ని కల్పించినందుకు వారికి కావల్సిన పేర్లను అతనితో చెప్పించుకున్నారు. ఇదంతా డ్రామా కాదా?' అని అవినాశ్ ప్రశ్నించారు. దస్తగిరి హియర్ సే ఎవిడెన్స్ అంటూ అప్పటి దర్యాప్తు అధికారి రామ్‌సింగ్, సునీత కలిసి కట్టుకథ అల్లారని, అందువల్లే తన తండ్రి చేయని నేరానికి ఏడాదిగా జైల్లో మగ్గుతున్నారని, రెండున్నరేళ్లు శివశంకర్‌రెడ్డి జైల్లో ఉండాల్సి వచ్చిందని తెలిపారు. గూగుల్ టేకౌట్‌కు కచ్చితత్వం ఉండదని గూగులే వెల్లడించిందని, అయినా దాని ఆధారంగా ఎందుకు దర్యాప్తు చేస్తున్నారని ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న నలుగురు పేర్లు చెప్పినప్పటికీ, వారిని దర్యాప్తు అధికారి అరెస్టు చేయలేదని, కస్టడీలోకి తీసుకొని విచారణ జరిపి వాస్తవాలు రాబట్టలేదని తెలిపారు.

**సునీత అప్పుడొకలా.. ఇప్పుడొకలా..**

వివేకా హత్యపై నర్రెడ్డి సునీత మొదట్లో ఒకలా, ఇప్పుడు ఒకలా మాట్లాడుతున్నారని అవినాశ్ అన్నారు. '2020 జూలై 20న సీబీఐకి సునీత వాంగ్మూలమిస్తూ ఆమె భర్త సెల్‌ఫోన్‌లో వివేకా రాసిన డెత్ నోట్ ఫోటో చూపించారని, అందులో మా తండ్రి డ్రైవర్ ప్రసాద్‌ను డ్యూటీకి త్వరగా రమ్మన్నానని చచ్చేలా కొట్టాడని, ఈ లెటర్ రాసేందుకు చాలా కష్టపడ్డానని, డ్రైవర్ ప్రసాద్‌ను వదిలిపెట్టవద్దని రాసి ఉన్నట్లు చెప్పింది. 2020 ఆగస్టు 27న లెటర్ గురించి ఏమీ తెలియదని, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చూపించారని చెబుతోంది. ఇలా నెలలోనే ఎందుకు మాట మార్చింది? హత్య జరిగిన 10 రోజులకు నాన్నగారు అవినాశ్‌ను ఎంపీని చేసేందుకు, జగనన్నను సీఎంను చేసేందుకు ఏమేమి చేయాల్నో అంతా చేశారని సునీత చెప్పింది. ఈరోజు హత్యకు ఎంపీ టికెట్ మోటివ్ అని చెబుతున్నారు. నాలుగేళ్ల తర్వాత 2023 మే31న సీబీఐ దగ్గరికి వెళ్లి అప్పట్లో సజ్జల రామకృష్ణారెడ్డి ఎలా చెప్పమంటే అలా చెప్పానంది. అప్పటికే 13 సార్లు సీబీఐకి వాంగ్మూలం ఇచ్చిన సునీత ఏనాడూ ఈ విషయాన్ని చెప్పలేదు. అప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పమంటే.. ఇప్పుడు చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణ చెప్పమంటే చెబుతున్నారా' అని అన్నారు.

**శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేస్తేనే వెళ్లాను**

'ఆ రోజు జమ్మలమడుగు వెళ్తున్న నాకు వివేకా బావమరిది నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేశారు. వివేకా చనిపోయినట్లు చెప్పి విలపించారు. వెంటనే ఇంటికెళ్లమన్నారు. నేను వెళ్లి డెడ్‌బాడీని చూసి బయటకు వచ్చేశాను. సీఐకి ఫోన్ చేసి త్వరగా రమ్మన్నాను. డెత్ నోట్‌లో ఉన్న వాస్తవ విషయాన్ని చెప్పకుండా ఘటన స్థలంలోకి నన్ను వెళ్లమని ఎందుకు చెప్పారు? లెటర్‌లో ఉన్న విషయం తెలిసిన వెంటనే నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఎందుకు పోలీసులకు చెప్పలేదు? ఇంక థర్డ్ పర్సన్ ఫోన్‌కాల్ కోసం వెయిటింగ్ ఎక్కడ? శివప్రకాష్‌రెడ్డి థర్డ్ పర్సనా? వివేకా చివరి రెండేళ్లు డబ్బు కోసం చాలా ఇబ్బందులు పడ్డారని పని మనుషులు వాంగ్మూలమిచ్చారు. ఆస్తి అమ్మే అవకాశం లేదు. చెక్ పవర్ రద్దు చేశారు. రెండో భార్య షమీమ్, ఆమె కుమారుడి కోసం ఇబ్బందులు పడ్డారు. డబ్బు కోసం డైమండ్స్, సెటిల్‌మెంట్లు అంటూ తిరగడం ఆరంభించారు' అని తెలిపారు.

### మా ఇద్దర్నీ గెలిపించాలని వివేకా పిలుపు

'నేను చేసే ప్రతి కార్యక్రమాన్నీ వివేకా బలపర్చేవారు. 2014లో వేంపల్లెలో వీధి వీధీ తిరుగుతూ జగన్నను సీఎం చేయాలని, నన్ను ఎంపీగా గెలిపించాలని కోరారు. 2019ఎన్నికల్లో చివరిరోజు కూడా ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఓడించామని చెబుతున్నారు. 854 మంది ఓటర్లలో ఒక్కరినైనా సీబీఐ విచారించిందా? మీకంటే చిన్నోడినైన నాపైన ఎందుకింత ద్వేషం' అని ప్రశ్నించారు.

### వాళ్లు చెబుతున్నవన్నీ అబద్ధాలే

'ఆరోజు రాత్రి అంతా నేను ఫోన్ వాడినట్లు సునీత చెబుతోంది. నేను ఆరోజు ఉదయం 5 గంటలకు నిద్ర లేచాను. ఫోన్ నెట్ ఆన్‌లో ఉంటే మెసేజ్‌లు వస్తుంటాయి. నానుంచి ఎవరికీ మెసేజ్ కానీ, ఫోన్‌కాల్ కానీ వెళ్లలేదు. ఎర్ర గంగిరెడ్డి నుంచి నాకు ఎలాంటి మెసేజ్ రాలేదు. అంటే వాళ్లు చెబుతున్నవన్నీ అబద్ధాలే. ఎవరెన్ని అబద్ధాలు చెప్పినా న్యాయమే గెలుస్తుంది. సీబీఐ ఎప్పటికైనా నా లెంపలేసుకోక తప్పదు. నాకు న్యాయస్థానాలపై నమ్మకం, గౌరవం ఉంది. షర్మిల, సునీత ఆరోపణలను ప్రజలు విశ్వసించరు' అని చెప్పారు. తాను బీజేపీకిలోకి వెళ్తాననడం 'జోక్ ఆఫ్ ది సెంచరీ' అని ఓ విలేకరి ప్రశ్నకు సమాధానంగా అవినాష్ రెడ్డి అన్నారు.

### హార్ట్ ఎటాక్ అన్నది సునీత కుటుంబం చేసిన ప్రచారమే

'హార్ట్ ఎటాక్ అన్న విషయం సునీత కుటుంబం నుంచే ప్రచారమైంది. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి సైతం అదే రోజు మీడియాతో మాట్లాడుతూ హార్ట్ ఎటాక్‌తో వివేకానందరెడ్డి చనిపోయినట్లు శివప్రకాష్‌రెడ్డి చెప్పినట్లుగా తెలిపారు. అదే విషయాన్ని వీడియో ద్వారా వివరించారు. హార్ట్ ఎటాక్ అని ఫిర్యాదు చేయాలని పీఏ కృష్ణారెడ్డికి చెప్పినట్లు సునీత చెప్పారు. డెత్‌నోట్ చదివాక కూడా హార్ట్ ఎటాక్ అని ఎందుకు చెప్పారు' అని ప్రశ్నించారు.

## బెయిలు షరతులు ఉల్లంఘించకూడదు

**చంద్రబాబుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ • బెయిలు రద్దుపై విచారణ వాయిదా**

సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు బెయిలు షరతులను ఉల్లంఘించకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. చంద్రబాబు బెయిలు రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మే 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా వాదనలు ప్రారంభిస్తూ... కేసులో ఛార్జిషీటు దాఖలు చేశారన్నారు. ఈ దశలో జస్టిస్ త్రివేది జోక్యం చేసుకొని.. బెయిలు రద్దుకు సంబంధించి ప్రధాన ఆరోపణ ఏమిటని ప్రశ్నించారు. దీనికి ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. నిందితుడికి హైకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిలు మంజూరు చేసిందని తెలిపారు. నిందితుడు బెయిలు షరతులు ఉల్లంఘించారన్నారు. నిందితుడి కుమారుడు అధికారులను బహిరంగంగా బెదిరిస్తున్నారని, దర్యాప్తునకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించిన అధికారుల పేర్లు ఎర్రబుక్కులో నమోదు చేశానని, అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తానని నిందితుడి కుమారుడు అంటున్నారని తెలిపారు. తన దగ్గర అన్ని వివరాలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాక చూసుకుంటానని నిందితుడి కుమారుడు అన్నారని వివరించారు. అనంతరం ఏపీ సీఐడీ దాఖలు చేసిన ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌ను రికార్డు చేస్తున్నట్లు జస్టిస్ త్రివేది చెప్పారు.


1 ఆదిత్య శ్రీవాస్తవ


2 అనిమేశ్ ప్రధాన్


3 దోనూరు అనన్య రెడ్డి

# సివిల్స్ టాపర్ ఆదిత్య

- అనిమేశ్ ప్రధాన్‌కు రెండో ర్యాంకు
- తెలుగమ్మాయి దోనూరు అనన్యరెడ్డికి మూడో ర్యాంకు
- సివిల్స్-2023 ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023 తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) మంగళవారం ప్రకటించింది. అఖిలభారత స్థాయిలో తొలి ర్యాంకును ఆదిత్య శ్రీవాస్తవ, రెండో ర్యాంకును అనిమేశ్ ప్రధాన్ సొంతం చేసుకున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దోనూరు అనన్యరెడ్డి ఆలిండియా మూడో ర్యాంకు దక్కించుకోవడం విశేషం. నాలుగు ర్యాంకు పి.కె.సిద్ధార్థ్ రామ్‌కుమార్‌కు, ఐదో ర్యాంకు రుహానీకి లభించింది. అఖిలభారత సర్వీసులకు మొత్తం 1,016 మంది ఎంపికయ్యారు. వీరిలో 664 మంది పురుషులు, 352 మంది మహిళలు ఉన్నారు. టాప్-5 ర్యాంకర్లలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు.. టాప్-25 ర్యాంకర్లలో 15 మంది పురుషులు, 10 మంది మహిళలు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో 30 మంది దివ్యాంగులు ఉన్నట్లు యూపీఎస్సీ వెల్లడించింది.

సివిల్స్-2023కి 10.16 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 5.92 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. 14,624 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. వీరిలో 2,855 మంది పర్సనాలిటీ టెస్టు(ఇంటర్వ్యూ)కు అర్హత సాధించారు. చివరకు 1,016 మందిని కేంద్ర సర్వీసులకు యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఇందులో జనరల్ కేటగిరీ అభ్యర్థులు 347 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 115 మంది, ఓబీసీలు 303 మంది, ఎస్సీలు 165 మంది, ఎస్టీలు 86 మంది ఉన్నారు. సివిల్స్-2023 ఫలితాల పూర్తి వివరాలను http:// www.upsc.gov. in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

### టాప్-10 ర్యాంకర్లు

| | |
|---|---|
| 1 | ఆదిత్య శ్రీవాస్తవ |
| 2 | అనిమేశ్ ప్రధాన్ |
| 3 | దోనూరు అనన్యరెడ్డి |
| 4 | పి.కె.సిద్ధార్థ్ రామ్‌కుమార్ |
| 5 | రుహానీ |
| 6 | సృష్టి దబాస్ |
| 7 | అన్మోల్ రాథోడ్ |
| 8 | ఆశిష్ కుమార్ |
| 9 | నౌషీన్ |
| 10 | ఐశ్వర్యం ప్రజాపతి |

**విజేతలకు ప్రధాని మోదీ అభినందనలు**

సివిల్ సర్వీసెస్ పరీక్షలో నెగ్గి, కేంద్ర సర్వీసులకు ఎంపికైన విజేతలకు ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. వారి అంకితభావం, శ్రమకు తగిన ప్రతిఫలం లభించిందని పేర్కొన్నారు. విజేత కృషి, ప్రతిభ దేశ భవిష్యత్తుకు తోడ్పడుతుందని వివరించారు.

### మెరిసిన ఐఐటీ గ్రాడ్యుయేట్

సివిల్స్ తొలి ర్యాంకర్ ఆదిత్య శ్రీనివాస్తవ మెయిన్స్‌లో తన ఆప్షనల్‌గా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నారు. ఆయన ఐఐటీ-కాన్పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్(బీటెక్) పూర్తిచేశారు.

రెండో ర్యాంకర్ అనిమేశ్ ప్రధాన్ ఐఐటీ-రూర్కెలాలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ అభ్యసించారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆప్షనల్‌గా సోషియాలజీని ఎంచుకున్నారు.

తెలుగు యువతి, సివిల్స్ మూడో ర్యాంకర్ దోనూరు అనన్యరెడ్డి ఢిల్లీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్(ఆనర్స్) జాగ్రఫీ చదివారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆమె ఆప్షనల్ సబ్జెక్టు ఆంత్రోపాలజీ.

# చెమటోడ్చాల్సిందే!

## 12 కీలక రాష్ట్రాల్లో పేలవంగా కాంగ్రెస్ పరిస్థితి

- 247 సీట్లకుగాను 232 చోట్ల పార్టీ ఓటమి
- ఈ రాష్ట్రాల్లో 93 శాతం సీట్లు సాధించిన ఎన్డీఏ కూటమి
- ఢిల్లీ, గుజరాత్, రాజస్తాన్, హరియాణా, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో ఖాతా తెరవక హస్తం డీలా

లోక్‌సభ ఎన్నికల రణక్షేత్రంలో బీజేపీతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైన కాంగ్రెస్, తన కూటమి పక్షాలకు క్షేత్రస్థాయి పరిస్థితులు, గత ఎన్నికల ఫలితాలు నీడలా వెంటాడుతున్నాయి. అత్యంత కీలకమైన రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమి పరాభవాన్ని ఎదుర్కొంది. 247 స్థానాలున్న 12 రాష్ట్రాల్లో కేవలం ఏడు శాతం ఓట్లనే ఒడిసిపట్టగలిగింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాల్లో మళ్లీ పూర్వవైభవాన్ని సాధించడం కాంగ్రెస్‌కు తలకు మించిన భారంలా తయారైంది. ఇక్కడ సీట్లు పెంచుకుంటే కానీ అధికారం దక్కే అవకాశం లేకపోవడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కాళ్లకు బలపం కట్టుకుని మరీ విస్తృతస్థాయి ప్రచారం చేస్తున్నారు.

**బీజేపీ హవాకు బ్రేకులు వేయాల్సిందే**

2019 ఎన్నికల్లో కీలక రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర, బిహార్, మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్తాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ, దాని మిత్రపక్షాల హవా కొనసాగింది. ముఖ్యంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల చాణక్యం పనిచేయడంతో గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్, హరియాణా, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో బీజేపీ ఒంటరిగానే క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తంగా ఈ 12 రాష్ట్రాల పరిధిలో 247 లోక్‌సభ స్థానాలుండగా, బీజేపీ, దాని మిత్రపక్షాలు 232 చోట్ల విజయపతాక ఎగరేశాయి. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు అంతా కలిసి కేవలం 15 చోట్ల గెలుపు అందుకున్నాయి. ప్రస్తుతం ఈ రాష్ట్రాల్లో తన సత్తా చూపేందుకు కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తోంది. అయితే ఇటీవలే ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల్లో ఘోర ఓటమి నేపథ్యంలో అక్కడ కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితులే కనిపిస్తున్నాయి. 29 స్థానాలున్న మధ్యప్రదేశ్‌లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం ఒకే స్థానంలో గెలిచింది. ఇటీవలి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 230 సీట్లలోగాను బీజేపీ 164 సీట్లను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 65 స్థానాలకే పరిమితం కావడం ఆ పార్టీకి చిక్కులు తేనుంది. రాజస్థాన్‌లో పాతిక సీట్లుంటే హస్తం పార్టీ కనీసం ఒక్క చోట కూడా గెలవలేదు. తాజాగా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లకుగాను 69 స్థానాలకే పరిమితమై అధికారం కోల్పోవడంతో కాంగ్రెస్‌కు కొత్త సవాళ్లు ఎదురుకానున్నాయి. గత ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్‌లో 11 స్థానాలకుగాను కాంగ్రెస్ కేవలం 2 చోట్ల గెలిచింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటమి పార్టీని తీవ్రంగా కలవరపెడుతోంది. బీజేపీని ఎదుర్కొనేందుకు ఇప్పటికే 'ఇండియా' కూటమిగా ఏర్పడ్డ విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, పరస్పర సహకారంతో ముందుకెళ్తే తప్ప కేంద్రంలో అధికార పీఠం దక్కదు. అందుకే ఈ రాష్ట్రాల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలను సాధించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక 16 పర్యటనలు చేశారు. రాజస్థాన్‌లో 14 చోట్ల సుడిగాలి పర్యటనలు చేసి సభల్లో పాల్గొని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.

ఎలక్షణీయం

**చేజారుతున్న నేతలతో కొత్త తలనొప్పులు**

గుజరాత్‌లో బీజేపీని ఎదురించడం కాంగ్రెస్‌కు సాధ్యమయ్యేలా లేదు. మోదీ సొంత రాష్ట్రంలో 26 ఎంపీ స్థానాలకుగాను కనీసం ఐదు స్థానాలైన గెల్చుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా శ్రమిస్తున్నా, అక్కడ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటం పార్టీని ఇబ్బందికరంగా మారింది. బిహార్‌లో తమ కూటమి నుంచి జేడీయూ నేత నితీశ్ కుమార్ వైదొలగడంతో కాంగ్రెస్ కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక్కడ ఆర్‌జేడీతో పొత్తుతో ముందుకెళుతున్నా కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయి పరిస్థితులు అంత అనుకూలంగా లేవనే వార్తలు వినవస్తున్నాయి. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు సిద్ధార్థ్ సౌరవ్, మురారీ గౌతమ్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఇదే దారిలో ఉన్నట్లుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బిహార్ మాజీ అధ్యక్షుడు అనిల్‌శర్మ ఇటీవలే కమలదళంలో చేరిపోయారు. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), శరద్‌పవార్ ఎన్సీపీలతో కలిసి కాంగ్రెస్ బరిలోకి దిగింది. మహారాష్ట్రలోని 41 స్థానాల్లో ఇండియా కూటమి 10 స్థానాలకు మించి తమ ఖాతాలో వేసుకోవడం అసాధ్యంగా తోస్తోంది. చీలిక తెచ్చి పార్టీని అజిత్ పవార్ హస్తగతం చేసుకోవడం, శివసేన సైతం చీలికవర్గం నేత, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వశం కావడం, హిందూత్వ భావజాలం రాష్ట్రంలో తీవ్రం కావడం, అశోక్ చవాన్, మిలింద్ దేవ్‌రా, బాబా సిద్దిఖీ వంటి సీనియర్లు పార్టీని వీడటం వంటి పరిణామాలు కాంగ్రెస్‌కు కొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. హరియాణాలో మాజీ మంత్రి సావిత్రి జిందాల్ రాజీనామా, మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్‌తో పీసీసీ అధ్యక్షుడు ఉదయ్ భాన్ కుమ్ములాటలు పార్టీకి కొత్త ఎన్నికల పరీక్ష పెడుతున్నాయి. ఢిల్లీలో 7 స్థానాలకుగాను ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు కారణంగా కేవలం 3 సీట్లకే కాంగ్రెస్ పరిమితం అయింది.

-సాక్షి, న్యూఢిల్లీ

### 12 రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపోటములు

| రాష్ట్రం | స్థానాలు | గెలిచినవి | ఓడినవి |
|---|---|---|---|
| ఢిల్లీ | 7 | 7 | 0 |
| ఉత్తరాఖండ్ | 5 | 5 | 0 |
| హిమాచల్ | 4 | 4 | 0 |
| గుజరాత్ | 26 | 26 | 0 |
| రాజస్తాన్ | 25 | 25 | 0 |
| జార్ఖండ్ | 14 | 12 | 2 |
| ఛత్తీస్‌గఢ్ | 11 | 9 | 2 |
| మహారాష్ట్ర | 48 | 41 | 7 |
| బిహార్ | 40 | 39 | 1 |
| మధ్యప్రదేశ్ | 29 | 28 | 1 |
| కర్ణాటక | 28 | 26 | 2 |
| హరియాణా | 10 | 10 | 0 |



ఎన్నికల విచిత్రం

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంకా గాంధీకి మహిళా కళాకారులు నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె వారితో అడుగులు కలిపారు. అస్సాంలోని జోర్హాట్ జిల్లాలో మంగళవారం ఈ సన్నివేశం చోటుచేసుకుంది.

## ఎలక్షన్ బీట్

### సుర్జేవాలాపై 48 గంటల ప్రచార నిషేధం

**న్యూఢిల్లీ:** బీజేపీ ఎంపీ హేమమాలిని ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలాపై ఎన్నికల కమిషన్(ఈసీ) చర్యలు ప్రకటించింది. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలు మొదలుకొని 48 గంటలపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఆయనపై నిషేధం విధించింది. లోక్‌సభ ఎన్నికల మొదటి విడత ప్రచార సమయంలో ఈసీ విధించిన మొదటి నిషేధమిది. హేమమాలినిపై చేసిన వ్యాఖ్యల ఆరోపణలపై ఈసీ గత మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేయగా, అది బీజేపీ సృష్టించిన వీడియో అంటూ సుర్జేవాలా బదులిచ్చారు. హరియాణా రాష్ట్రం కైథాల్ జిల్లా రిటర్నింగ్ అధికారి మాత్రం.. సుర్జేవాలా వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న వీడియో వాస్తవమేనని ఈసీకి నివేదిక అందజేశారు.

### నెల రోజుల్లో ఈసీకి 200 ఫిర్యాదులు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి నెల రోజుల వ్యవధిలో వివిధ రాజకీయ పార్టీలు, నేతలపై 200 వరకు ఫిర్యాదులు అందినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఇందులో 169 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. బీజేపీపై అందిన 51కి గాను 38 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని తెలిపింది. కాంగ్రెస్‌పై వచ్చిన 59 ఫిర్యాదులకుగాను 51, ఇతర పార్టీలపై వచ్చిన 90 ఫిర్యాదులకుగాను 80పై చర్యలు తీసుకున్నామని వివరించింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 15 వరకు నెల రోజుల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను పాటించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే పలు పార్టీల అభ్యర్థుల ప్రచారం తీరు అస్తవ్యస్తంగా ఉందని అభిప్రాయపడింది.

### మంత్రికి బదులు ఆయన భార్యకు టికెట్

**మరో ఏడు పేర్లతో బీజేపీ జాబితా**

**న్యూఢిల్లీ:** రానున్న లోక్‌సభ ఎన్నికలకుగాను మంగళవారం బీజేపీ మరో ఏడుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఇందులో మహారాష్ట్రలోని సతారా సీటుకు మరాఠా రాజు ఛత్రపతి శివాజీ వారసుడు ఉదయన్ రాజె భోసలేకు టికెట్ కేటాయించింది. పంజాబ్‌లోని హోషియార్ స్థానంలో కేంద్రమంత్రి సోమ్ ప్రకాశ్‌కు మొండిచేయి చూపింది. మంత్రి స్థానంలో ఆయన భార్య అనితా సోమ్ ప్రకాశ్‌కు అవకాశమిచ్చింది. పంజాబ్‌లోని భటిండాలో మాజీ ఐఏఎస్ అధికారిణి పరంపల్ కౌర్ సిద్ధును, బెంగాల్‌లోని డైమండ్ హార్బర్ నుంచి అభిజిత్ దాస్‌ను బీజేపీ రంగంలోకి దించింది. తాజా జాబితా కలిపితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 543 సీట్లకుగాను 430 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.

### మోదీ సభల్లో నితీశ్ ఎక్కడ?: తేజస్వీ

**పట్నా:** బిహార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన రెండు బహిరంగ సభలకు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎందుకు హాజరు కాలేదని ఆర్జేడీ అగ్రనేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మంగళవారం ప్రశ్నించారు. నితీశ్ ఎక్కడున్నారు? ఆయనను బీజేపీ ఎందుకు ఆహ్వానించలేదు? నితీశ్‌పై ఇప్పటికీ నాకు గౌరవం ఉంది. నితీశ్ నేతృత్వంలోని జేడీ(యూ) బీజేపీ మిత్రపక్షంగా కొనసాగుతోంది. అయినప్పటికీ మోదీ సభలకు ఆయన హాజరుకాకపోవడం వెనుక కారణం ఏమిటో బయటపెట్టాలి? అని తేజస్వీ యాదవ్ డిమాండ్ చేశారు.

### కశ్మీర్‌ను జైలుగా మార్చారు: మెహబూబా

**పుల్వామా:** జమ్మూ కశ్మీర్‌ను జైలుగా మార్చేశారని, యువతను క్రమంగా అరెస్టు చేస్తున్నారని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆమె మంగళవారం అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించి రోడ్‌షోలో పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో నిర్బంధం అమలవుతోందని, ఎవరినీ గొంతెత్తనివ్వడం లేదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌లో అంతా సవ్యంగానే ఉందని కేంద్రం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. అంతా సవ్యంగా ఉంటే వందలాది మందిని ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలన్నారు.

### స్టార్ క్యాంపెయినర్లుగా కేజ్రీవాల్ దంపతులు

**న్యూఢిల్లీ:** వచ్చే లోక్‌సభ ఎన్నికలకుగాను ఆప్ మంగళవారం గుజరాత్ కోసం విడుదల చేసిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తోపాటు ఆయన భార్య సునీత తదితర 40 మంది నేతల పేర్లు ఉన్నాయి. మద్యం కుంభకోణం కేసులోనే జైలులో ఉన్న ఆప్ నేతలైన మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లతోపాటు పంజాబ్ సీఎం మాన్, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌లు కూడా స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. అయితే, రాజ్యసభ ఎంపీలు హర్భజన్‌సింగ్, స్వాతి మలివాల్‌లకు ఇందులో చోటు దక్కలేదు.

# విజయపతాక ఎగరేయాలి

**ఆ తర్వాతే ప్రధాని అభ్యర్థి ఎవరనేది ప్రకటిస్తాం**

- వచ్చే ఐదేళ్ల పాలనపై మోదీ ఏర్పాట్లు ఆయన అతివిశ్వాసానికి పరాకాష్ట
- పీటీఐ ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడిన ఖర్గే

ఇంటర్వ్యూ

**బెంగళూరు:** వచ్చే ఐదేళ్ల భారతావని దశ, దిశను నిర్దేశించే ఎన్నికల రణరంగంలో విజయబావుటాను ఎగరేశాకే ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థి ఎవరనేది వెల్లడిస్తామని కాంగ్రెస్ సారథి మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మంగళవారం పీటీఐతో ఆయన ముఖాముఖి మాట్లాడుతూ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. '' గెలిచాక వచ్చే ఐదేళ్లలో చేపట్టాల్సిన పథకాలు, పనుల పట్టికలను ముందుగానే సిద్ధంచేసుకుంటున్నట్లు ప్రధాని మోదీ చెబుతున్నారు. అన్ని మంత్రిత్వ శాఖల కార్యదర్శులను పిలిపించి పనులు పురమాయిస్తున్నారు. గెలవకముందే ఆయన చేస్తున్న హడావిడి అంతాఇంతా కాదు. ఈయన అత్యుత్సాహం, అతి ఆత్మవిశ్వాసం భారత్ లాంటి ప్రజాస్వామ్యదేశానికి ఏమాత్రం మంచిదికాదు'' అని వ్యాఖ్యానించారు. '' కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘన విజయాలు లోక్‌సభ ఎన్నికల్లో సానుకూల పవనాలు వీచేలా చేస్తున్నాయి. ఇది నిజంగా శుభపరిణామం. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో ధరవరలను కిందకు దించేలా మేం తెచ్చిన పలు పథకాలు, చేపట్టిన కార్యక్రమాలను జనం మెచ్చారు. మా గ్యారెంటీ స్కీమ్‌లు ఇదే విషయాన్ని నిరూపించాయి కూడా. అందుకే మా గ్యారెంటీ పథకాలపై ఓటర్లు దృష్టిపెట్టారు'' అని అన్నారు. ఈసారి ఎన్డీఏ కూటమి 400 చోట్ల విజయం సాధిస్తుందని మోదీ ముందే ప్రకటించిన విషయాన్ని ఖర్గే వద్ద ప్రస్తావించగా.. '' ఇంకా నయం. ఆయన ఈసారి 600 సీట్లు మావే అనలేదు. ఇంతటి అతి అత్యాశతో చేసే వ్యాఖ్యానాలు వింటుంటే దేశంలో విపక్షమే లేదు.. అంతా నేనే అన్నట్లుగా ఉంది మోదీ వైఖరి'' అని ఖర్గే అసహనం వ్యక్తంచేశారు.

**ఆనాడూ వెలిగిపోతుందన్నారు**

'' 2004లోనూ ఇదే సీన్ కనిపించింది. భారత్ వెలిగిపోతోంది(ఇండియా ఈజ్ షైనింగ్) అంటూ దేశవ్యాప్తంగా భారీ ప్రకటనలు, నినాదాలతో నాటి బీజేపీ సర్కార్ మోతెక్కించింది. వాజ్‌పేయీ మాత్రమే ప్రధాని పదవికి అర్హుడు అన్నట్లు ప్రచారం చేశారు. చివరకు ఏమైంది?. మన్మోహన్ సింగ్ సారథ్యంలో కాంగ్రెస్ నేతృత్వంలో మేం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాం. మన్మోహన్ మెరుగైన ప్రధానిగా నిరూపించుకున్నారు'' అని చెప్పారు.

**అమేథీ, రాయ్‌బరేలీకి టైం ఉంది**

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల నుంచి ఈసారి ఎవరు పోటీ చేస్తారన్న ప్రశ్నకు సమాధానంగా.. ' ఆ స్థానాల్లో పోలింగ్ తర్వాతి ఫేజ్‌లలో ఉందిగా. ఇంకా సమయం ఉంది. ఇప్పుడే చెప్పేస్తే రాజకీయ సర్‌ప్రైజ్ ఏముంటుంది?. ఫీడ్‌బ్యాక్ తీసుకుని అక్కడ అభ్యర్థులు ఎవరు అనేది తర్వాత వెల్లడిస్తాం. అందరి సమ్మతితోనే కాంగ్రెస్‌లో నిర్ణయాలు ఉంటాయి. మోదీలాగా అందరి తరఫున ఇక్కడ ఒక్కరే నిర్ణయాలు తీసుకోరు'' అని అన్నారు. '' ఎలక్టోరల్ బాండ్ల పథకంలో పారదర్శకత లోపించింది. ఒక్క బీజేపీనే భారీగా లాభపడింది. పారిశ్రామికవేత్తలు, సంస్థలను లొంగదీసుకునేందుకు దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపారు. ' చందా ఇచ్చుకో. దందా పుచ్చుకో' అన్న సూత్రం పాటించారు. చేతులు వెనక్కి మెలిపెట్టి మరీ డబ్బులు తీసుకుని ఇప్పుడు పారదర్శకత ఉంది అంటే ఎలా?'' అని ప్రశ్నించారు.



**తుక్డే తుక్డే గ్యాంగ్‌కు సుల్తాన్ మోదీనే**

''కుల, మత, ప్రాంత, వర్ణ ప్రాతిపదికన దేశ ప్రజలను మోదీ విభజిస్తున్నారు. నిజానికి తుక్డే తుక్డే గ్యాంగ్‌కు సుల్తాన్ మోదీనే. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన ఒక్క బీజేపీ నేతనైనా చూపించండి. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలో ఒక్కరైనా దేశం కోసం పోరాడారా?' అని ఖర్గే ఎద్దేవాచేశారు.

**సమాలోచనలతోనే సారథి ఎంపిక**

''ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ వచ్చాక విపక్షాల 'ఇండియా' కూటమిలో చర్చలు జరిపి ఏకాభిప్రాయంతో ప్రధాని అభ్యర్థి ఎవరనేది ప్రకటిస్తాం. ఈసారి నేను పోటీ చేయట్లేదు. గుల్బర్గా(కలబురిగి) సీటు వేరే వాళ్లకు ఇచ్చేశారు' అని తాను ప్రధాని రేసులో లేనని పరోక్షంగా చెప్పారు. గుల్బర్గా(కలబురిగి) నుంచి ఈసారి ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి పోటీచేస్తున్నారు. 2009 నుంచి 2014 వరకు ఖర్గే ఇక్కడి నుంచే ఎంపీగా గెలిచారు.

# దోపిడీకి మరో రూపం

**ఎలక్టోరల్ బాండ్ల మాటున మోదీ దోచేశారు: రాహుల్**

**కోజికోడ్/వయనాడ్:** ప్రధాని మోదీ చేసే దోపిడీకి మరో రూపమే ఎలక్టోరల్ బాండ్లు అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేరళలోని కోజికోడ్ జిల్లాలోని కొడియత్తూర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచార రోడ్‌షోలో రాహుల్ ప్రసంగించారు. '' పట్టణాలు, పల్లెల్లో కొందరు వీధుల్లో భయపెట్టి దోపిడీ చేస్తుంటారు. కేరళలో అయితే దీనిని కొల్ల అడిక్కల్(లూటీ) అంటారు. ఈ పద్ధతిని మోదీ అయితే ఎలక్టోరల్ బాండ్లు అంటారు. మామూలు దొంగ వీధుల్లో చేసే పనినే మోదీ అంతర్జాతీయ స్థాయిలో చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులు కొందరు వ్యాపారవేత్తలనే లక్ష్యంగా చేసుకుని రంగంలోకి దిగుతారు. వారిని లోతుగా విచారిస్తారు. చివరకు మీ వ్యాపారాన్ని అదానీకి ఇచ్చేస్తే బాగుంటుందిగా అంటూ పని ముగిస్తారు'' అంటూ ముంబై ఎయిర్‌పోర్ట్ యాజమాన్య హక్కులు అదానీకి ఇలాగే బదిలీ అయ్యాయని ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బెదిరిన ఇంకొందరు వ్యాపారవేత్తలు బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో చెల్లింపులు జరిపి సమస్య నుంచి బయటపడతారని రాహుల్ ఆరోపణలు గుప్పించారు. '' దేశంలో ఉపద్రవం ఎదురైనపుడు వెంటనే ఎలా ఎదుర్కోవాలో మోదీకి తెలీదు. కోవిడ్ సంక్షోభం వేళ వంటపాత్రలు మోగించాలని, ఫోన్ టార్చ్‌లు ఆన్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు'' అని ఎద్దేవాచేశారు.



**రాజ్యాంగ సవరణే అతిపెద్ద అంశం**

''పాతిక మంది సంపన్నుల రూ.16 లక్షల కోట్ల బ్యాంక్ రుణాలను మోదీ మాఫీచేశారు. రైతు సమస్యలు, నిరుద్యోగం, పెరిగిన ధరలపై ఆయన అస్సలు మాట్లాడరు. గెలిస్తే రాజ్యాంగాన్ని సవరించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇదే అతిపెద్ద అంశం'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## నాపేరు కేజ్రీవాల్.. నేను ఉగ్రవాదిని కాను

**తీహార్ జైలు నుంచి ఢిల్లీ సీఎం సందేశం**

**న్యూఢిల్లీ:** 'నా పేరు అరవింద్ కేజ్రీవాల్..నేను ఉగ్రవాదిని కాను' అంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి దేశ ప్రజలకు సందేశాన్ని పంపించినట్లు ఆప్ నేత సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్‌పై బురదచల్లి బీజేపీ దుష్ప్రచారం సాగిస్తోందని, కానీ ఆయన మరింత బలం పుంజుకుంటారని అన్నారు. మంగళవారం సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడారు. జైల్లో కేజ్రీవాల్‌ను ఉగ్రవాదిలాగా చూస్తున్నారని సంజయ్ సింగ్ ఆరోపించారు. తీహార్ జైలులో ఉండే భయంకరమైన నేరగాడికి సైతం బ్యారక్‌లోనే భార్య, లాయర్‌తో మాట్లాడే అవకాశమిచ్చిన అధికారులు.. కేజ్రీవాల్‌కు మాత్రం పంజాబ్ సీఎం మాన్‌తో గ్లాస్ స్క్రీన్ అవతలి నుంచే మాట్లాడేందుకు అనుమతిచ్చారని ఆరోపించారు. తన పట్ల చూపిస్తున్న వివక్షతో విచారం వ్యక్తం చేసిన కేజ్రీవాల్.. నా పేరు కేజ్రీవాల్..నేను ఉగ్రవాదిని కాను' అంటూ దేశ ప్రజలకు సందేశం పంపించారని వెల్లడించారు. దీని ద్వారా కేజ్రీవాల్.. 2010లో షారుఖ్ ఖాన్ నటించిన మై నేమ్ ఈజ్ ఖాన్ సినిమాలోని డైలాగ్‌ను గుర్తుకు తెచ్చారు.


# రాజ్యాంగానికి రుణపడి ఉన్నా..

- అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఈ స్థాయికొచ్చా: మోదీ
- బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాంలో ఎన్నికల ప్రచారం

**పూర్ణియా/రాయ్‌గంజ్:** అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తాను ఎంతగానో రుణపడి ఉన్నానని ప్రధాని మోదీ అన్నారు. పేద కుటుంబంలో జన్మించిన తాను రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. మోదీ మరోసారి ప్రధాని అయితే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మంగళవారం బిహార్, పశ్చిమ బెంగాల్‌ల్లోని పలు పట్టణాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని పాలుపంచుకున్నారు. అస్సాంలోని గువాహటిలో రోడ్‌లో పాల్గొన్నారు. రాజ్యాంగం గురించి ఇప్పుడు మాట్లాడుతున్నవారు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నానని, తాను ఆ వర్గాల నుంచి రావడమే అందుకు కారణమని పేర్కొన్నారు.

**సీఏఏను అమలు చేసి తీరుతాం...**

పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు తాము భయపడడం లేదని, చట్టాన్ని అమలు చేసి తీరుతామని అన్నారు. సీఏఏను వ్యతిరేకించేవారంతా మోదీ పట్టుదల గురించి తెలుసుకోవాలని చెప్పారు. ప్రతిపక్షాలు ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా దేశంలోకి అక్రమ చొరబాట్లు చోటుచేసుకుంటున్నాయని, దీనివల్ల పేదలకు, దళితులకు అన్యాయం జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని పెద్ద ఘనతగా మోదీ అభివర్ణించారు. రాజ్యాంగం అంటూ గగ్గోలు పెడుతున్న వారు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఇదే రాజ్యాంగాన్ని జమ్మూకశ్మీర్‌లో ఎందుకు అమలు చేయలేదని మండిపడ్డారు.



## బహిరంగ క్షమాపణ చెప్పండి

**రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణలపై సుప్రీం ఆగ్రహం**

**న్యూఢిల్లీ:** కోవిడ్ సమయంలో అల్లోపతి, ఇతర ఆధునిక వైద్య విధానాలను కించపరుస్తూ ప్రకటనలు ఇచ్చిన ఉదంతంలో బాబా రాందేవ్, పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణలపై మంగళవారం సుప్రీంకోర్టు మండిపడింది. '' అల్లోపతిని తక్కువచేసి మాట్లాడితే ఊరుకునేది లేదు. గతంలో కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించి మళ్లీ తప్పుడు, అసత్య ప్రకటనలు ఇచ్చి కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారు. వారంలోపు పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ బహిరంగ క్షమాపణ చెప్పండి'' అని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహించింది. కోవిడ్ వ్యాక్సినేషన్‌పై, ఆధునిక వైద్యవిధానాలపై అసత్య ప్రచారం చేస్తూ తప్పుడు ప్రకటనలు ఇచ్చారంటూ 2022లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేసు వేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా స్వయంగా హాజరవ్వాలన్న కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం రాందేవ్ బాబా, బాలకృష్ణ కోర్టుకొచ్చి బేషరతు క్షమాపణలు చెప్పారు. దీనిపై కోర్టు పై విధంగా స్పందించి బహిరంగ క్షమాపణ కోరింది.

## ఇద్దరు నిందితుల అరెస్ట్

**ముంబై:** ముంబైలోని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద ఆదివారం ఉదయం కాల్పులకు పాల్పడిన ఇద్దరు నిందితులను గుజరాత్ పోలీసులు పట్టుకున్నారు. వీరిపై ముంబై పోలీసులు హత్యాయత్నం కేసుతోపాటు ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులను మంగళవారం ఉదయం హెలికాప్టర్‌లో కచ్ నుంచి ముంబైకి తీసుకువచ్చి స్థానిక మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఘటనకు సూత్రధారులెవరో తేల్చేందుకు లోతైన దర్యాప్తు చేపట్టాల్సి ఉన్నందున 14 రోజుల పాటు కస్టడీకి అప్పగించాలని కోరారు. అయితే, ఈ నెల 25వ తేదీ వరకు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎల్‌ఎస్ పడెన్ ఆదేశాలిచ్చారు.

7

# సాక్షి హైదరాబాద్

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024

● విజయానందం



అశోక్‌నగర్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీలో ఆనందం పంచుకుంటున్న సివిల్స్ ర్యాంకర్లు ఐశ్వర్య నెల్లిశ్యామల (649), హనిత వేము లపాటి (887), కేసారపు మీనా (899), రావూరి సాయి అలేఖ్య(938)

# శోభాయాత్రకు వేళాయే

## సీతారామ్‌బాగ్, ధూల్‌పేట్ గంగాబౌలి, మంగళ్‌హాట్ ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు



దిల్‌సుఖ్‌నగర్‌లో సీతారాముల విగ్రహాల విక్రయాలు..

అబిడ్స్: నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్రకు సర్వం సిద్ధమైంది. సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి, ధూల్‌పేట్ గంగాబౌలి నుంచి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, మంగళ్‌హాట్ మార్గా నుంచి ఆనంద్‌సింగ్‌ల ఆధ్వర్యంలో మూడు శోభాయాత్రలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శోభాయాత్రలో శ్రీరాముడి విగ్రహాలతో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాలు, దేశభక్తిని చాటే మహానేతల విగ్రహాలు ప్రదర్శించనున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు శోభాయాత్ర ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు కొనసాగనుంది. ఈ శోభాయాత్రను తిలకించేందుకు నగరవాసులే కాక ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు.

**రూట్ మ్యాప్ ఇదే..**

సీతారామ్‌బాగ్ నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్, ధూల్‌పేట్ అనిత టవర్, జాలి హనుమాన్, పురానాపూల్ మీదుగా వెళ్తుంది. అనంతరం ధూల్‌పేట్ గంగాబౌలి నుంచి రాజాసింగ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర, ధూల్‌పేట్ మార్గా నుంచి ఆనంద్ సింగ్ శోభాత్రలు ప్రారంభం కానున్నాయి. ఈ మూడు యాత్రలు కలిసి ఒకదాని వెనుక ఒకటి పురానాపూల్ నుంచి జుమ్మెరాత్‌బజార్, బేగంబజార్ ఛత్రి, బర్తన్‌బజార్, సిద్ధిఅంబర్ బజార్, మహారాజ్ గంజ్, గౌలిగూడ, కోఠి ఆంధ్రాబ్యాంక్, కోఠి హనుమాన్ టేక్డీ వరకు కొనసాగుతుంది. హనుమాన్ టేక్డీ వ్యాయామశాలలో రాత్రి ముగింపు సమావేశం నిర్వహిస్తారు.

**ముఖ్య అతిథులుగా...**

శ్రీరామ నవమి శోభాయాత్రకు ఉత్తర భారత దేశం నుంచి శ్రీ చైతన్యానంద మహారాజ్ పాల్గొంటున్నట్లు భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవిందరాతిలు తెలిపారు. బేగంబజార్ ఛత్రి, కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాల్లో భక్తులనుద్దేశించి ప్రసంగిస్తారని వెల్లడించారు.

**500 మంది పోలీసులతో బందోబస్తు**

శ్రీరామ నవమి శోభాయాత్రకు దాదాపు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఏసీపీలు ఇన్‌చార్జిలుగా ఉండి బందోబస్తును పర్యవేక్షిస్తారన్నారు. యాత్ర సాగే రహదారులపై సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచామన్నారు. పోలీసులకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. కాగా సీతారామ్‌బాగ్, బేగంబజార్ ఛత్రి, పురానాపూల్, ధూల్‌పేట్, గంగాబౌలి ప్రాంతాల్లో మంగళవారం డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు.



ధూల్‌పేటలో శోభాయాత్రకు సిద్ధమైన శ్రీరాముడి విగ్రహాలు

# మీరూ.. మీతో వేసవి!

'చదువుకుందాం' కార్యక్రమంలో...




మండు వేసవి. నిప్పులు చెరిగే ఎండలే కాదు ఆహ్లాదభరితమైన ఉదయ సంధ్యలు కూడా పలకరించనున్నాయి. కొత్త దృక్పథాలు, సరికొత్త ఆలోచనలు రూపుదిద్దుకొనే ఒక విలువైన సమయం. ఏడాది పొడవునా చదువులు, పరీక్షలు అంటూ పరుగులు తీసే విద్యార్థులకు వేసవి ఒక విహారాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించే విలువైన సమయం. పటిష్టమైన కెరీర్ నిర్మాణానికి, ఉన్నతమైన వ్యక్తిత్వ వికాసానికి బాటలు పరుచుకోవచ్చు. అభిరుచులను ఆవిష్కరించుకోవచ్చు. నృత్యం, శిల్పం, చిత్రలేఖనం వంటి నచ్చిన కళలకు రంగులద్దుకునే తీరిక సమయం ఈ వేసవి కాలమే. ఈ క్రమంలోనే పలు విద్యా సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వేసవిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పిల్లల అభిరుచికి తగిన విధంగా వాటిని రూపొందిస్తున్నాయి. చిన్నారులూ.. ఇక ఆలస్యమెందుకు మీకు నచ్చిన రంగంలో రాణించేందుకు ఈ వేసవిలో సిద్ధం కండి. - సాక్షి, సిటీబ్యూరో



- వేసవిలో విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- సాహిత్య, సాంస్కృతిక, సంప్రదాయ సంరంభం
- ఉత్తమ వ్యక్తిత్వ వికాసానికి 'సంస్కార్'
- ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యం వైపు పయనం
- 'చదువే' ప్రామాణికంగా పఠనాభిలాష
- వివిధ అంశాలపై నగర చిన్నారులకు కోచింగ్

**సంస్కారమే ఆభరణం..**

స్థితప్రజ్ఞత ఒక అద్భుతమైన వరం వంటిది. ఎంపిక చేసుకొన్న రంగంలో విజయతీరాలను చేరుకొనేందుకు, తమను తాము ఉన్నతమైన వ్యక్తులుగా రూపొందించుకొనేందుకు ఒక గొప్ప సాధనం. ఇదే లక్ష్యంగా రామకృష్ణమఠం 'సంస్కార్-2024' నిర్వహిస్తోంది. ఈ నెల 28న ఇది ప్రారంభం కానుంది. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణనిస్తారు. భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సంప్రదాయ విలువలను బోధిస్తారు. భజనలు, శ్లోకాలు నేర్పిస్తారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాల్లోనూ శిక్షణ ఉంటుంది. నైతిక విలువలను అలవరుస్తారు. ఉత్తమ చేతిరాతలో తర్ఫీదు ఉంటుంది. 8వ తరగతి నుంచి 10వ తరగతి పిల్లలకు ఈ అంశాలన్నింటితో పాటు స్వీయ క్రమశిక్షణను అలవర్చుకోవడం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడం, తమను తాము ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దుకొనేందుకు పాటించాల్సిన పద్ధతులు, దైనందిన జీవితంలో కాలం విలువ తెలుసుకోవడం, కెరీర్‌ను నిర్మించుకోవడం వంటి అంశాలపైన ఈ 'సంస్కార్-24' శిక్షణనిస్తుంది. ఈ నెల 29 నుంచి మే 10 వరకు 12 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ అంశాల్లో ఈ శిక్షణ, అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు సంజీవ్ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 91772 32696.





బొటానికల్ గార్డెన్‌లో చిన్నారులకు పర్యావరణ పాఠాలు

**మొక్కలు చెప్పే పాఠాలు విందామా..**

ఏపుగా పెరిగిన ఆకుపచ్చ మొక్క ఒకటి కొమ్మలను గాలిలో ఊపుతూ సృష్టిలో తన ఉనికిని, ప్రత్యేకతను చాటుకుంటుంది. ఆ కొమ్మలపై వాలిన పక్షులు, చుట్టూ పరుచుకున్న ప్రకృతి, పర్యావరణం జీవవైవిధ్యాన్ని ప్రబోధిస్తాయి. అక్కడ ప్రతి మొక్క, చెట్టు, కొమ్మ, రెమ్మ ప్రతి ఒక్కటీ పాఠాలు చెబుతాయి. మనిషికి, ప్రకృతికి ముడిపడిన బంధాన్ని, అనుబంధాన్ని వివరిస్తాయి. తరగతి గదుల్లో, నాలుగు గోడల మధ్య టీచర్లు బోధించే అంశాలను సమున్నతంగా ఆవిష్కరించేందుకు బొటానికల్ గార్డెన్ చిన్నారులను ఆహ్వానిస్తోంది. ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు, ఆసక్తిని పెంపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ప్రత్యేక కార్యక్రమాలతో పాటు వర్క్‌షాపులను నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు మేనేజర్ సుమన్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఇక్కడ గడపవచ్చు. నిర్వాహకులే మధ్యాహ్నం భోజనం, స్నాక్స్, టీ అందజేస్తారు. ఈ నెల 20, 27, మే నెలలో 4, 11, 18, 25, 31 తేదీల్లో బొటానికల్ గార్డెన్ టూర్ నిర్వహించనున్నారు. వివరాలకు 94935 49399ను సంప్రదించవచ్చు.



రామకృష్ణమఠంలో సంస్కార్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

**సంగీత సాధనపై..**

ఎంతోమంది గానగంధర్వులను సినీరంగానికి పరిచయం చేసిన ప్రముఖ లలిత సంగీత శిక్షణ సంస్థ లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ తన రెగ్యులర్ విద్యార్థుల కోసం ఓ ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు అకాడమీ వ్యవస్థాపకులు కె.రామాచారి తెలిపారు. నెల రోజుల పాటు ఈ ప్రత్యేక శిక్షణనివ్వనున్నామని పేర్కొన్నారు. మే ఒకటో తేదీ నుంచి 31 వరకు రవీంద్రభారతిలోని మినీ ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు లలిత సంగీతం, సినిమా సంగీతం, అన్నమాచార్య సంకీర్తనలు తదితర అంశాలలో శిక్షణనిస్తారు.



**చదువుకుందాం 'డియర్'...**

సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్ 'చదవడాన్ని' ఒక పాఠ్యాంశంగా పరిచయం చేస్తోంది. ప్రతి నెలా మొదటి శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నర్సరీ నుంచి ప్రాథమిక, మాధ్యమిక స్థాయి పిల్లల వరకు ప్రతి ఒక్కరిలో పఠనాభిలాష, ఆసక్తి పెంపొందేవిధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ సువర్ణ తెలిపారు. పిల్లలను వారి తల్లిదండ్రులతో పాటు పుస్తకాలు చదివేలా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకోసం పాఠశాల ఆవరణ మొత్తాన్ని రీడింగ్ జోన్‌గా మార్చినట్లు పేర్కొన్నారు.

# ప్రజా రవాణాపై ఏం చేద్దాం?

అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయం

లీ అసోసియేషన్‌కు బాధ్యతలు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా చేపట్టవలసిన వివిధ రకాల ప్రజా రవాణా వ్యవస్థలపైన అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ లీ అసోసియేషన్‌కు బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం నగర జనాభా, వ్యక్తిగత వాహనాల వినియోగం, రానున్న 2050 నాటికి పెరుగనున్న జనాభా, నగర విస్తరణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రధాన ప్రాంతాల మధ్య కనెక్టివిటీని పెంచేందుకు ఏ విధమైన రవాణా వ్యవస్థలు అవసరమనే అంశంపైన ఈ అధ్యయనంలో నిపుణులు దృష్టి సారించనున్నారు. కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)లో భాగంగా ఈ అధ్యయనం కొనసాగనుందని హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. ఏడాది పాటు ఈ అధ్యయనం కొనసాగనుంది. అనంతరం లీ అసోసియేషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల రవాణా వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సిటీబస్సులు, ఎంఎంటీఎస్ సర్వీసులతో పాటు, మెట్రో రైళ్లు అందుబాటులో ఉన్నాయి. మెట్రో రెండోదశ విస్తరణకు సైతం ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ క్రమంలో భవిష్యత్తులో మెట్రో విస్తరణతో పాటు ఇతర ప్రజా రవాణా వ్యవస్థల ప్రాధాన్యతపైన కూడా నిపుణులు దృష్టి సారిస్తారు. ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరించాలని ప్రభుత్వం ప్రతిపాదించిన నేపథ్యంలో లీ అసోసియేషన్ అధ్యయనం ప్రధానం కానుందని అధికారులు తెలిపారు. జంక్షన్ల విస్తరణ, కొత్త రవాణా సదుపాయాల ఏర్పాటు, వివిధ రవాణా వ్యవస్థల మధ్య కనెక్టివిటీ వంటి అంశాలు కూడా ఇందులో భాగంగా ఉంటాయి. అదే విధంగా లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల నగరవాసులు మెట్రో సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. ఈ మేరకు లీ అసోసియేషన్ అధ్యయనంలో ఇది కూడా ఒక ప్రధాన అంశం కానుందని ఉమ్టా అధికారి ఒకరు తెలిపారు.

**ఇంటింటి సర్వే సైతం...**

- లీ అసోసియేషన్ అధ్యయనంలో భాగంగా గ్రేటర్‌లో ఇంటింటి సర్వే చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి రవాణా అవసరాలను. ప్రస్తుతం వారు వినియోగిస్తున్న వాహనాల వివరాలను సేకరిస్తారు. అలాగే కొన్ని చోట్ల వ్యక్తిగత వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటే మరికొన్ని చోట్ల సెవెన్ సీటర్ ఆటోలు, బస్సుల వినియోగం ఎక్కువగా ఉండవచ్చు. లేదా ఎంఎంటీఎస్ వినియోగించే వారు ఉండవచ్చు. ఇలా ప్రస్తుతం నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజల రవాణా అవసరాలు, సదుపాయాలపైన సమగ్రమైన అధ్యయనం చేయనుంది.

**విస్తరణకు తగిన రవాణా వ్యవస్థ లేదు..**

- బెంగళూరు వంటి నగరాల్లో సుమారు 6000 బస్సులు అందుబాటులో ఉంటే గ్రేటర్‌లో 2550 బస్సులు మాత్రమే ఉన్నాయి.ఎంఎంటీఎస్ రెండో దశలో ఆరు కొత్తలైన్‌లను ఏర్పాటు చేసినప్పటికీ రైళ్లు పూర్తిస్థాయిలో లేవు. ప్రస్తుతం 70 ఎంఎంటీఎస్ సర్వీసులు మాత్రమే తిరుగుతున్నాయి. మరో 100 ఎంఎంటీఎస్ రైళ్లను నడవలసి ఉంది. ఇక మెట్రో రైళ్లు కూడా మూడు కోచ్‌లతోనే నడుస్తున్నాయి. రోజుకు 5 లక్షల మందికి పైగా మెట్రో సేవలను వినియోగించుకుంటున్నా కోచ్‌ల సంఖ్య పెరగడం లేదు. దీంతో రోజుకు 1000 ట్రిప్పులు నడుపుతున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ అన్ని సర్వీసులు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో ప్రజా రవాణా ప్రణాళికలను ప్రభుత్వం ముందు ఉంచనుంది.

# వెళ్లగొట్టుడే!

- అక్రమంగా నివసిస్తున్న విదేశీయులపై ఉక్కుపాదం
- ఎఫ్ఆర్ఆర్ఓ సహాయంతో వారి డిపోర్టేషన్ ప్రక్రియ
- మొరాకో జాతీయుడిని పంపించిన హెచ్-న్యూ టీమ్
- మాదకద్రవ్యాలతో దొరికిన వారు మాత్రం కటకటాల్లోకి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర పోలీసులు నిర్ణయించారు. వీరు చిక్కినప్పుడు అరెస్టు చేస్తే వస్తున్న ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని డిపోర్టేషన్ (బలవంతంగా తిప్పి పంపడం) విధానానికి శ్రీకారం చుట్టారు. ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) సాయంతో మొరాకో జాతీయుడిపై ఈ తరహా అనుమతి పొందారు. అతగాడిని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి స్వదేశానికి పంపినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ ఎస్.రష్మి పెరుమాల్ మంగళవారం పేర్కొన్నారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) ఇన్‌స్పెక్టర్లు కే శ్రీనివాస్, జీఎస్ దానియేల్‌లతో కలిసి బషీర్‌బాగ్‌లోని పాత కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు.

**అరెస్టు చేస్తే నేరాలకు ఊతమే...**

నైజీరియా, సోమాలియా, టాంజానియా, ఐవరీ కోర్టు, మొరాకో తదితర దేశాల నుంచి అనేకమంది వివిధ రకాల వీసాలపై హైదరాబాద్‌కు వస్తున్నారు. వీరిలో కొందరు వీసా, పాస్‌పోర్టుల గడువు ముగిసినా అక్రమంగా నివసిస్తున్నారు. గతంలో ఇలా ఉంటూ చిక్కిన వారిపై ఫారినర్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసేవారు. కోర్టులో దీని విచారణ పూర్తయ్యే వరకు డిపోర్టేషన్ చేయడానికి ఆస్కారం ఉండేది కాదు. అలాగే బెయిల్‌పై బయటకు వస్తున్న ఈ విదేశీయులు జైల్లో ఏర్పడిన పరిచయాలతో సైబర్ నేరాలు, డ్రగ్స్ విక్రయం చేపట్టడంతో కొత్త తల నొప్పులు వచ్చేవి. ఇలాంటి వారిలో కొందరు నగరంతో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరుల్లో ఉన్న కొంతమంది యువతులతో సహజీవనం చేస్తూ వారి ఇళ్లల్లోనే నివాసం ఉంటున్నారు. నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఆధార్ కార్డులు పొందడం చేస్తున్నారు. అత్యంత సమస్యాత్మక వ్యక్తులైన వీరి ప్రభావం సమాజంపై తీవ్రంగా ఉంటోంది. ఈ పరిణామాలను గమనించిన నగర పోలీసులు డిపోర్టేషన్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవల హెచ్-న్యూ అధికారులు డ్రగ్స్ ఆచూకీ కోసం అనుమానిత విదేశీయులపై నిఘా ముమ్మరం చేశారు.

**ఎఫ్ఆర్ఆర్ఓ సాయంతో డిపోర్టేషన్...**

హెచ్-న్యూ అధికారులతో కూడిన బృందాలు రెండు వారాల క్రితం పంజగుట్టలో సోదాలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో అక్రమంగా నివసిస్తున్న మొరాకో దేశస్తుడు అచిబిలీ అమేనీ చిక్కాడు. 2018లో మూడేళ్ల కాలపరిమితి ఉన్న స్టడీ వీసాపై వచ్చిన ఇతడు ఇక్కడే అక్రమంగా ఉండిపోయాడు. మాదకద్రవ్యాలకు అలవాటుపడి పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఇతడి వివరాలు ఎఫ్ఆర్ఆర్ఓకు పంపి మూవ్‌మెంట్ రిస్ట్రిక్షన్ ఆర్డర్ పొందిన అధికారులు సీసీఎస్‌లోని డిపోర్టేషన్ సెంటర్‌లో ఉంచారు. ఆ దేశ ఎంబసీకి సమాచారం ఇచ్చి గుర్తింపులు, ఢిల్లీ కార్యాలయం నుంచి టెంపరరీ ట్రావెల్ డాక్యుమెంట్లు పొందారు. ఇతడికి విమాన టికెట్ ఖరీదు చేసిన సిటీ పోలీసులు సెక్యూరిటీ క్లియరెన్స్, ఎఫ్ఆర్ఆర్ఓ నుంచి ఎగ్జిట్ పర్మిట్ తీసుకున్నారు. వీటి ఆధారంగా మంగళవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి డిపోర్ట్ చేశారు.

**'సరుకు'తో చిక్కితే కటకటాలే...**

అక్రమంగా నిసిస్తున్నా, సక్రమంగా ఉంటున్నా మాదకద్రవ్యాలతో చిక్కితే మాత్రం అరెస్టు చేయాలని అధికారులు నిర్ణయించారు. అచిబిలీ అమేనీతో పాటు హెచ్-న్యూ అధికారులకు పాలస్తీనా దేశీయుడు సయీద్ అలీ మహ్మద్ అల్ ఖద్రీతో పాటు గోవాకు చెందిన రోమై భరత్ కళ్యాణి చిక్కారు. కళ్యాణిపై గతంలో ముంబై, గోవాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. వీరిని తనిఖీ చేసిన నేపథ్యంలో ఎక్స్‌టసీ పిల్స్, ఎండీఎంఏ డ్రగ్, గంజాయి లభించాయి. దీంతో వీరిని అరెస్టు చేసిన పంజగుట్ట పోలీసులు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. డీసీపీ రష్మి పెరుమాల్ మాట్లాడుతూ... 'ఇళ్ల యజమానులు ఎవరికైనా ఇంటిని అద్దెకు ఇచ్చేటప్పుడు వారి వివరాలు, పూర్వాపరాలు ఆరా తీయాలి. విదేశీయుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో డ్రగ్స్ రవాణా, విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం ఉంది. దీనిపై నిఘా ఉంచాం. సరైన పత్రాలు లేకుండా ఉంటున్న విదేశీయుల పైనా దృష్టి పెట్టాం' అని అన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాల్, ఇతర అధికారులు

# నీటి సరఫరా తీరుపై ఆరా




సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో క్షేత్ర స్థాయి తాగునీటి సరఫరా తీరును జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఆరా తీశారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'నల్లా ..డొల్ల! నీళ్లెలా?' అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన..మంగళవారం ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్ల వారీగా ట్యాంకర్ల బుకింగ్స్, డెలివరీ, పెండెన్సీ, పర్యవేక్షణ, అదనపు ట్యాంకర్లు, రోజువారీ, రాత్రి వేళల్లో సరఫరా చేసే ట్రిప్పులు, నీటిసరఫరాను సమీక్షించడంతోపాటు సమగ్ర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా, లోప్రెషర్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం లేకుండా చూడాలని, ఆలస్యమైతే వినియోగదారులకు సందేశం పంపించాలన్నారు. అంతకు ముందు నారాయణగూడ, చిలకలగూడలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. లాగ్‌బుక్స్, నీటి సరఫరా వివరాల్ని అడిగి తెలుసుకున్నారు.

# ముంపు ముప్పును ఎదుర్కొందాం: దానకిశోర్



సాక్షి, సిటీబ్యూరో: రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తిస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జరగరానిది జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో 'మాన్సూన్ యాక్షన్‌ప్లాన్'పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) అన్నివేళలా అప్రమత్తమై ఉండాలన్నారు. ఫైర్, వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ, పోలీస్ తదితర శాఖలన్నీ కలిసి మే నెల చివరి వారంలో లేదా జూన్ మొదటి వారంలో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. వరద ముంపు సమస్యల పరిష్కార చర్యల్లో భాగంగా చేపట్టిన పనుల్లో 52 శాతమే పూర్తయినట్లు గుర్తించిన ఆయన మిగతా పనుల్ని పూర్తిచేయాలని ఆదేశించారు. వాటర్ లాగింగ్ లొకేషన్స్ సైతం 125లో 22 ప్రాంతాల్లో మాత్రమే శాశ్వతంగా పరిష్కరించారని, మిగతావి కూడా పరిష్కరించాలన్నారు. వాటిల్లో 40 లొకేషన్లలో పరిస్థితులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి యుద్ధప్రాతిపదికన శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. జూన్ మొదటి వారంలోగా నాలాలు నీరుపారేలా చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, వాటర్ వర్క్స్ ఎండీ సుదర్శన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఈఎన్‌సీ జియాఉద్దీన్, సీఈలు దేవానంద్, కిషన్, జోనల్ కమిషనర్లు స్నేహశబరీష్, రవి కిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో (నిథమ్ కళాశాల) టూరిజం కోర్సు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్యాటకశాఖ సంచాలకులు కె. నిఖిల తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆమోదిత నిథమ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ ,బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. ఎంబీఏ రెండేళ్లు, బీబీఏ నాలుగేళ్లు, బీఎస్సీ మూడేళ్ల కోర్సులను అందజేయనున్నారు. ఇంటర్న్‌షిప్ కోసం విదేశాలకు పంపిస్తారు. ఇందులో మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఎంట్రెన్స్ తో పాటు దేశ విదేశాల్లో చక్కటి అవకాశాలు లభించనున్నాయి. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా నిథమ్ కోర్సులను అందజేస్తోంది. అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం జిల్లా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పర్యాటక అధికారి ఫోన్ : 9440 81 60 71, హారతి పాటిల్ ఫోన్: 784 24 55 5 81 : 955 37 000 35 నెంబర్‌లను సంప్రదించవచ్చు.

# ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: సామాన్యులతో పాటు విద్యాధికులకూ టోకరా వేస్తూ, భారీ మొత్తాలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పడానికి ఎప్పటికప్పుడు అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులకు సూచించారు. ఈ విభాగంతో పాటు డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ ఆధీనంలోని సీసీఎస్, షీ–టీమ్స్, భరోసా తదితర వింగ్స్‌కు చెందిన అధికారులతో సోమవారం ఆయన భేటీ అయ్యారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి సీపీ నగదు రివార్డులు అందించారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న నిందితులను పట్టుకోవడంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చేసిన కృషిని అభినందించారు. 2023లో ఉమెన్ సేఫ్టీ వింగ్ ప్రారంభమైనప్పటి నుంచి గృహ హింస బాధితులకు సహాయం చేయడంలో సమర్థవంతంగా పని చేస్తోందని సీపీ అన్నారు. ఈ సందర్భంలో కొత్వాల్ భరోసా కేంద్రాన్ని సందర్శించారు.


కొత్వాల్ నుంచి రూ.10 వేల రివార్డు అందుకుంటున్న సైబర్ క్రైమ్ ఏసీపీ ఆర్‌జీ శివ మారుతి

# ఈవీ వాహనాలపై అపోహలను తొలగించాలి

- ప్రత్యేకంగా ఈవీ వాహనాల కొనుగోళ్ల కోసం జూయి యాప్ ఆవిష్కరణ..
- యాప్‌ను ప్రారంభించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు



లక్డీకాపూల్ : ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసే బైయింగ్ అసిస్టెంట్ యాప్ ''జూయి యాప్' మంగళవారం అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్ దాదాపు అన్ని ప్రముఖ ఎలక్ట్రిక్ టూ–వీలర్ బ్రాండ్‌లతో పని చేస్తుంది. ఫైనాన్స్ కోసం యాక్సిస్ బ్యాంక్, లోన్ టాప్, బీమా అవసరాల కోసం రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, చోలా ఎంఎస్, కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లతో భాగస్వామ్యమైందని జూయి యాప్ వ్యవస్థాపకులు మహంత్ మల్లికార్జున, ప్రణయ్ కొమ్ములు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఈ యాప్‌ను ఆవిష్కరించడం విశేషమన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఈవీ, బ్యాటరీ వాహనాలు విస్తరిస్తున్నప్పటికీ కొనుగోలుదారుల్లో ఈవీ వాహనాలపై అపోహలు ఉన్నాయన్నారు. జూయి ఈ అపోహలను పరిష్కరించడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రజలకు దగ్గర చేయడంలో సహాయం చేయాలని సూచించారు.

# ఆ కారు నడిపిందీ రహీలే!

- 2022 నాటి ప్రమాదంలోనూ షకీల్ కుమారుడే నిందితుడు
- జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు... పక్కాగా సాగని దర్యాప్తు
- స్నేహితుడు వాహనం నడిపినట్లు గోల్‌మాల్ చేసిన వైనం
- ఎట్టకేలకు అసలు విషయం గుర్తించిన వెస్ట్‌జోన్ అధికారులు
- అప్పట్లో పని చేసిన పోలీసుల వ్యవహారశైలీ పరిగణనలోకి


తండ్రి షకీల్‌తో కొడుకు రహీల్ (ఫైల్)


ప్రమాదానికి కారణమైన కారు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: పంజగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ ఎదురుగా చోటు చేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం'లో ఇటీవల అరెస్టైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ మరో కేసులో నిందితుడిగా మారాడు. 2022లో జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్న 'మహేంద్ర థార్ యాక్సిడెంట్'కు ఇతడే కారణమని అధికారులు తేల్చారు. ఈ కేసులోనూ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ పాత్రపై ప్రాథమిక ఆధారాలు సేకరించారు. అప్పట్లో జూబ్లీహిల్స్ కేసు దర్యాప్తు చేసిన, పర్యవేక్షించిన అధికారుల చుట్టూ ఉచ్చుబిగుస్తోందని సమాచారం. ప్రజాభవన్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదం కేసులో రహీల్, ఇద్దరు పోలీసులు సహా 15 మంది అరెస్టు అయిన విషయం విదితమే. ఆ ప్రమాదంలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ యాక్సిడెంట్ తెరపైకి తెచ్చింది.

**ప్రాణాలు కోల్పోయిన రెండు నెలల చిన్నారి..**

జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో 2022 మార్చి 17వ తేదీ రాత్రి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ వైపు నుంచి జూబ్లీహిల్స్ వైపు దూసుకువచ్చిన మహేంద్ర థార్ కారు రోడ్డుపై బుడగలు విక్రయించే వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన కాజల్ చౌహాన్, సారికా చౌహాన్, సుష్మ చౌహాన్ భోస్లే గాయపడగా.. కాజల్ కుమారుడు రఘువీర్ (రెండు నెలలు) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ వాహనంపై ఎమ్మెల్యే షకీల్ స్టిక్కర్ ఉండటంతో అప్పట్లో రహీల్‌పై ఆరోపణలు వచ్చాయి. మరుసటి రోజు స్పందించిన షకీల్ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. సదరు కారు తన సోదరుడిదని (కజిన్), తానూ అప్పుడప్పుడు వాడుతుంటానని పేర్కొన్నారు. సోదరుడి కుటుంబం కారులో వెళుతుండగా జూబ్లీహిల్స్ రోడ్ నం.45 వద్ద సిగ్నల్ సమీపంలో బెలూన్లు అమ్ముకునే యువతికి కారు గాయమైందని, ఆ భయంలో ఆమే పసిపాను పడేయడంతో దుర్ఘటన జరిగిందని చెప్పుకొచ్చాడు. పసిపాపను కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని చెప్పానని పేర్కొన్నాడు.

**అప్పట్లో పోలీసులూ క్లీన్‌చిట్ ఇచ్చేశారు...**

అదే నెల 19న విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు రహీల్‌కు క్లీన్ చిట్ ఇచ్చేశారు. ఆ వాహనాన్ని తానే నడుపుతున్నట్లు షకీల్ బంధువు సయ్యద్ అఫ్నాన్ అహ్మద్ లొంగిపోయినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇతడి పక్కన సీటులో రహీల్ కూర్చోగా... వెనుక సీటులో స్నేహితుడు మహ్మద్ మాజ్ ఉన్నట్లు వెల్లడించారు. వాహనంలో సేకరించిన వేలిముద్రలు సైతం అఫ్నాన్ ఫింగర్ ప్రింట్స్‌తో సరిపోలినట్లు చెప్పుకొచ్చారు. ఇలా ఈ ప్రమాదంలో రహీల్ పాత్ర లేనట్లు తేల్చేశారు. అయితే ప్రజాభవన్ వద్ద ప్రమాదం కేసు దర్యాప్తులో భాగంగా నాటి కేసుపై దృష్టి పెట్టిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీళ్లు నాటి రికార్డులను పరిశీలించగా అనేక లోపాలు కనిపించాయి. కాజల్ వాంగ్మూలంలో ఎక్కడా ప్రమాద సమయంలో డ్రైవింగ్ ఎవరు చేశారనే ప్రస్తావన లేదు. ఆమెతో అఫ్నాన్‌కు టెస్ట్ ఐడెంటిఫికేషన్ పెరేడ్ నిర్వహించిన దాఖలాలు లేవు. మరోపక్క అప్పట్లో పోలీసుల ప్రకటించిన వేలిముద్రల రికార్డులు కోర్టుకు సమర్పించలేదు. అదే ఏడాది నవంబర్‌లో దాఖలు చేసిన చార్జిషీట్ లోపభూయిష్టంగా ఉన్నట్లు తేల్చారు. ఈ వ్యవహారం వెనుక షకీల్–రహీల్ పాత్రను అనుమానించిన వెస్ట్‌జోన్ పోలీసులు ఆ ఫైల్‌ను రీ–ఓపెన్ చేశారు.

**విచారణలో అసలు విషయం వెలుగులోకి...**

'జూబ్లీహిల్స్ ప్రమాదం' కేసు దర్యాప్తులో భాగంగా వెస్ట్‌జోన్ పోలీసులు ఫిర్యాది, ఇతర బాధితురాళ్లను విచారించారు. నిందితుడిగా ఉన్న అఫ్నాన్‌ను సైతం ప్రశ్నించగా రహీల్ పాత్ర వెలుగులోకి వచ్చింది. దీంతో నాటి దర్యాప్తు అధికారి విచారణలోనూ ఆరోపణలకు బలాన్నిచ్చే అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. వీటి ఆధారంగా ముందుకెళ్లిన పోలీసులు రహీల్‌ను నిందితుడిగా చేర్చారు. ప్రజాభవన్ వద్ద ప్రమాదంతో దుబాయ్ పరారైన ఇతడు ఇటీవలే వచ్చి అరెస్టై బెయిల్ పొందాడు. రహీల్‌ను జూబ్లీహిల్స్ యాక్సిడెంట్ కేసులో అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని నిర్ణయించారు. అలా వెలుగులోకి వచ్చే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటారు. అప్పట్లో ఈ కేసు సెటిల్ చేయడంలో ఓ పోలీసు ఉన్నతాధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. అతడే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు రూ.5 లక్షలు ఇప్పించినట్లు తెలిసింది. దీంతో ఈ కేసులో ఆయనతో పాటు మరో అధికారీ విచారణ ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. రహీల్ విచారణ తర్వాతే షకీల్ పాత్రపై స్పష్టత వస్తుందని పోలీసులు చెబుతున్నారు.

# నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 18 నుంచి నామినేషన్ల స్వీకరణ
- పోలింగ్ శాతం పెంచేందుకు కృషి
- ఓటర్లను చైతన్యపరిచే వీడియోలకు అవార్డులు
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు ఈనెల 18న నోటిఫికేషన్ వెలువడనుందని, ఈ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ తెలిపారు. ఆదివారం సెలవురోజు మినహా 18 నుంచి 25 వరకు ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు తమపై ఏవైనా క్రిమినల్ కేసులుంటే వాటి వివరాలను తప్పనిసరిగా పత్రికలు, చానెళ్ల ద్వారా వెల్లడించాలన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ జరిగిన 75 బూత్‌ల పరిధిలో సర్వే చేశామని, పోలింగ్ పెంచేందుకు తగిన వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్టిక్కర్ క్యాంపెయిన్‌లతో పాటు వీడియోల ద్వారా, కమ్యూనిటీల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లను చైతన్య పరిచేలా రూపొందించిన 10 బెస్ట్ వీడియోలకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. పోలింగ్‌రోజున కూలీలు ఓటు వేసేలా అడ్డాల వద్ద కూలీలుండకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఉమెన్, యూత్ తదితర మోడల్ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని పోలింగ్‌బూత్‌లలో తాగునీటితో సహా అన్ని కనీస సదుపాయాలు కల్పిస్తామని, సెలవులున్నందున ఊర్లకు వెళ్లకుండా ఓటర్లను చైతన్యపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శిక్షణకు హాజరుకాని పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే రెండు సార్లు నోటీసులిచ్చామని, త్వరలో వారిపై ఎఫ్ఐఆర్ బుక్ చేయడంతో పాటు ఇతర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని, తగిన చర్యల కోసం ఎన్నికల సంఘానికి నివేదిస్తామని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ప్రభుత్వ వాహనాలనూ తనిఖీలు చేస్తామన్నారు. ఆయా రాజకీయ పార్టీలపై ఇప్పటి వరకు ఐదు కేసులు నమోదయ్యాయన్నారు.

**8 ఫిబ్రవరి వరకు జిల్లాలో ఓటర్లు**

| | |
|---|---|
| పురుషులు | :23,30,574 |
| మహిళలు | :22,39,240 |
| థర్డ్‌జెండర్ | :324 |
| మొత్తం | :45,70,138. |
| వీరిలో 18-19 ఏళ్ల యువ ఓటర్లు | :65,595 |

కొత్తగా దరఖాస్తుచేసుకున్న వారి వివరాలతో ఓటర్ల అనుబంధ జాబితా ఈనెల 25న వెలువరిస్తారు.

| | |
|---|---|
| పోలింగ్ లొకేషన్లు | :1675 |
| పోలింగ్ కేంద్రాలు | : 3986 |

**నామినేషన్ల స్వీకరణ ఇక్కడ**

హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో, కంటోన్మెంట్ అసెంబ్లీకి కంటోన్మెంట్ సీఈఓ ఆఫీస్‌లో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నెలల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యబృందం

బంజారాహిల్స్: నాలుగు నెలల వయస్సున్న శిశువుకు సంక్లిష్టమైన ఊపిరితిత్తుల శస్త్ర చికిత్సను బంజారాహిల్స్‌లోని అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా చేశారు. పుట్టుకతో వచ్చే పల్మనరీ ఎయిర్‌వే మాల్ఫార్మేషన్‌తో బాధపడుతున్న శిశువుకు పీడియాట్రిక్ యూరాలజీ చీఫ్ సర్జన్ డాక్టర్ వీవీఎస్ చంద్రశేఖరం నేతృత్వంలో వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేసింది. దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం డాక్టర్ చంద్రశేఖరం వెల్లడించారు. థొరాకోస్కోపిక్ లోబెక్టమీ సహా అధునాతన సాంకేతికతలను ఉపయోగించి శస్త్ర చికిత్స చేసిన వైద్యులు అతి తక్కువ కోత పద్ధతుల ద్వారా ఊపిరితిత్తుల్లో వ్యాధి భాగాన్ని తొలగించారు. లక్ష మంది శిశువుల్లో 30–42 మందికి మాత్రమే ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ సమస్యలను సకాలంలో గుర్తించడం వల్ల పెద్దయ్యాక ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, కేన్సర్‌ల నుంచి చిన్నారులను రక్షించవచ్చునని తెలిపారు.

## ఈ నెల 30 నుంచి పోస్టల్ బ్యాలెట్ ముద్రణ షురూ

లక్డీకాపూల్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం యంత్రాలపై అమర్చే బ్యాలెట్ పత్రాలను నగరంలోనే ముద్రించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. మే 3 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని యోచిస్తున్నారు. ఆ దిశగా ఈ నెల 30 నుంచి పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు సన్నాహాలు చేపట్టారు. మే 2వ తేదీలోగా బ్యాలెట్లను సిద్ధం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు ముద్రణ ప్రక్రియ అంతా ఆయా జిల్లాల్లోనే జరగనున్నది. సాధారణ పోలింగ్‌కు నాలుగు రోజుల ముందుగానే ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండడంతో 8వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 85 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. వృద్ధులతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులు, దివ్యాంగులు కూడా పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకునేందుకు అవకాశం ఉంటుంది.

## నామినేషన్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం గురువారం నుంచి ప్రారంభంకానుంది. సికింద్రాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ ఆఫీస్, హైదరాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయం లక్డీకపూల్‌లోని కలెక్టర్ ఆఫీస్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఆయా కార్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధిస్తూ నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం ఈ పరిధుల్లో అనుమతి లేకుండా నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం. ఈ నెల 29 వరకు అమలులో ఉండే నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# రౌడీ షీటర్ల బైండోవర్

- లోక్ సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత
- అధికారులకు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు



సాక్షి, సిటీబ్యూరో: గత ఎన్నికల సమయంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని రౌడీ షీటర్లతో పాటు సస్పెక్ట్, హిస్టరీ షీట్లు ఉన్న వారిని ముందస్తుగానే బైండోవర్ చేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి అధికారులను ఆదేశించారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో విధిగా పర్యటిస్తూ నిఘా పెట్టాలని సూచించారు. త్వరలో జరగనున్న లోకసభ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణతో పని చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని సూచించారు. అక్రమం డబ్బు, మద్యం తరలింపు, ఉచితాలపై నిఘా పెట్టాలని, అవసరమైన చోట మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను తమ కింది స్థాయి సిబ్బందికి అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, డీసీపీలు జీ వినీత్, నితికా పంత్, నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, కే ప్రసాద్, సృజన కర్ణం, నర్సింహా కొత్తపల్లి, సాయిశ్రీ, డీవీ శ్రీనివాసరావు, డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి జీహెచ్‌ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతియేటా జరిగే జీహెచ్‌ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపులు ఈనెల 25 నుంచి మే 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ శిబిరాల్లో 44 క్రీడాంశాల్లో బాలబాలికలకు శిక్షణనివ్వనున్నారు. 6–16 ఏళ్ల మధ్య వయసు కలిగిన విద్యార్థులకు ఉదయం 6.15 గంటల నుంచి 8.15 గంటల వరకు రెండు గంటలపాటు వివిధ క్రీడాంశాల్లో శిక్షణనిస్తారు. సమ్మర్ కోచింగ్ క్యాంపుల ఫీజులు ఆయా క్రీడాంశాలను బట్టి రూ.10, రూ.50, రూ.100 లుగా ఉన్నాయి. ఇతర వివరాలకు స్థానిక జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కేంద్రాల్లో సంప్రదించవచ్చు. జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణ శిబిరాలకు ఎంతో కాలంగా ఆదరణ ఉంది. ఫీజులు నామమాత్రం కావడంతోపాటు అనుభవజ్ఞులైన కోచ్‌లు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు వీటికి ప్రాధాన్యతనిస్తారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు స్పోర్ట్స్‌కు సంబంధించిన క్విజ్‌ల నిర్వహణ, ఎంపిక చేసిన క్రీడాంశాల్లో ఇంటర్‌సెంటర్ టోర్నమెంట్స్ నిర్వహిస్తారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను శిబిరాలకు ఆహ్వానిస్తారు. 25వ తేదీన ఖైరతాబాద్‌జోన్‌లో శిక్షణ శిబిరాలను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. చార్మినార్ జోన్‌లో 26వ తేదీన, సికింద్రాబాద్ జోన్‌లో 27న, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లలో 30న, ఎల్‌బీనగర్ జోన్‌లో మే ఒకటో తేదీన ప్రాంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లో క్రికెట్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, హాకీ, టెన్నిస్, తైక్వాండో, క్యారమ్స్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు.

## అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్: ఇతర రాష్ట్రాల నుంచి మాదకద్రవ్యాలను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎల్‌బీనగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రం, జోద్‌పూర్ ప్రాంతానికి చెందిన మనోజ్ వైష్ణోయి, కరీంనగర్‌లో గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. అదే ప్రాంతానికి చెందిన అతడి స్నేహితుడు బుద్దారామ్ అలియాస్ శివ్‌జీ ట్రక్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇద్దరు కలిసి నల్లమందు, ఎండీఎంఏ తదితర మత్తు పదార్థాలను విక్రయించి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో బుద్దారామ్ రాజస్థాన్ నుంచి మాదకద్రవ్యాలను అక్రమ రవాణా చేసి నగరంలో విక్రయిస్తున్నారు. వీరిపై గతంలో మీర్‌పేట పోలీసులు ఇదే తరహా కేసులు నమోదు చేశారు. అయినా పోలీసుల కళ్లు కప్పి దందా చేస్తూనే ఉన్నారు. వీరి కదలికలపై సమాచారం అందడంతో ఎల్‌బీనగర్ ఎస్ఓటి పోలీసులు సోమవారం ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 500 గ్రాముల నల్లమందు, 100 గ్రాముల ఎండీఎంఏ, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరికి మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శాండ్‌స్టోన్ ఇన్‌ఫ్రా యాజమాన్యం అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో స్ప్రింగ్ సిటీ ఫేజ్–1, స్ప్రింగ్ సిటీ ఫేజ్–2 ప్రాజెక్టుల్లో పెట్టుబడి పేరుతో భారీ మొత్తం వసూలు చేసి మోసం చేసిన కేసులో సిటీ సీసీఎస్ పోలీసులు శాండ్‌స్టోన్ ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యాన్ని అరెస్టు చేశారు. వీరు అనేక మంది నుంచి రూ.86.75 లక్షలు వసూలు చేసి మోసం చేసినట్లు డీసీపీ ఎన్‌శ్వేత మంగళవారం వెల్లడించారు. శాండ్‌స్టోన్ ఇన్‌ఫ్రా సంస్థకు మలికిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఆయన భార్య ఎరువ శ్రీలక్ష్మి డైరెక్టర్‌గా ఉన్నారు. వీరు సుల్తాన్‌పూర్‌లో రెండు ఫేజులలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల్లో ప్లాట్స్ ఖరీదు చేసి పెట్టుబడి పెట్టాలని, భారీ మొత్తాలు లాభాలు వస్తాయనంటూ నమ్మబలికారు. వీరి మాటలు నమ్మిన అనేక మంది పెట్టుబడులు పెట్టి మోసపోయారు. కొందరు బాధితుల ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు మంగళవారం నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

## చెల్లని చెక్కులిచ్చిన వారిపై ఎఫ్ఐఆర్‌లు

**చర్యలు చేపట్టిన జీహెచ్‌ఎంసీ**

సాక్షి,సిటీబ్యూరో: చెక్ 'బౌన్సర్ల'పై జీహెచ్‌ఎంసీ చర్యలు చేపట్టింది. ఆస్తిపన్ను చెల్లింపుల కోసం చెల్లని చెక్కులిచ్చిన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరానికి(2023–24) జీహెచ్‌ఎంసీకి మొత్తం రూ.1921 కోట్లు ఆస్తిపన్నుగా వసూలైంది. అందులో చెక్కుల ద్వారా జరిగిన చెల్లింపుల్లో రూ.11 కోట్ల మేర చెక్కులు బౌన్సయినట్లు అధికారులు గుర్తించారు. సర్కిళ్ల వారీగా అలాంటి చెక్కులిచ్చిన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 5, శేరిలింగంపల్లిలో 4, చందానగర్‌లో 13, యూసుఫ్‌గూడలో 8, కుత్బుల్లాపూర్‌లో 4, కూకట్‌పల్లిలో 1, మూసాపేటలో 4 ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి వారు ఇంకా ఉన్నారు. జీహెచ్‌ఎంసీకి చెల్లని చెక్కులిచ్చిన వారు బౌన్సయిన చెక్ తాలూకు నగదును వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయనున్నట్లు హెచ్చరించారు. ఇకపై ఆస్తిపన్ను చెల్లించేవారు చెక్‌బౌన్స్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్తిపన్ను బకాయిలున్న వారు వాటిని చెల్లించి ప్రస్తుతం అమల్లో ఉన్న ఎర్లీబర్డ్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎర్లీబర్డ్ ద్వారా 5 శాతం రాయితీకి ఈనెల 30 వరకు గడువు ఉంది.

## గడపగడపకు ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

**బంజారాహిల్స్:** జీహెచ్ఎంసీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిత్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. బంజారాహిల్స్‌లోని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి యూత్ కాంగ్రెస్ నేషనల్ కో–ఆర్డినేటర్ సురభి దిద్వేడి, నరేష్ హాజరయ్యారు. నాగేందర్ మాట్లాడుతూ గడపగడపకూ ప్రచారం చేయడం వల్ల ప్రజలకు మరింత చేరువవుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, పథకాల అమలు గురించి ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలని సూచించారు.

## 'నామినేషన్'కు రండి..!



ఆహ్వానపత్రాలు పంపిణీ చేస్తున్న చింతల

**ఫిలింనగర్:** సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి ఈ నెల 19న నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కార్యకర్తలు, నేతల తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ స్వామి వివేకానందనగర్ బస్తీలో మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ పదేళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరిస్తూ ఆహ్వాన పత్రాలు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బోజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్, హనుమంతు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా దశసహస్ర తులసి అర్చన



తులసీ అర్చన చేస్తున్న అర్చకులు

**ఫిలింనగర్:** ఫిలింనగర్ దైవసన్నిధానం ఆలయంలో కోదండ రామస్వామికి శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం దశ సహస్ర తులసి అర్చన కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయంలో సీతారాములుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

## 'నోహో' వంటకాలు రెడీ



**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రొగ్రెసివ్ ఏషియన్ కిచెన్ నోహోను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నోహో మేనేజింగ్ డైరెక్టర్ అమన్ చైనాని మాట్లాడుతూ సంప్రదాయ ఆసియా వంటకాలను నగరవాసుల ముంగిటకు తీసుకు వచ్చే విధంగా నోహోను తీర్చిదిద్దినట్లు చెప్పారు. భోజనప్రియుల అభిరుచులకు అనుగుణంగా సృజనకు పెద్దపీట వేస్తూ రుచికరమైన వంటకాలను అందించడమే నోహో లక్ష్యమన్నారు.

## బీజేపీలో చేరికలు



బీఆర్ఎస్ నేతలకు బీజేపీ కండువాలు వేస్తున్న రామచంద్రారెడ్డి

**వెంకటేశ్వరకాలనీ:** ప్రజలంతా ప్రధాని మోదీ నాయకత్వాన్ని మరోసారి కోరుకుంటున్నారని ఈ నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తున్నారని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత సర్వోత్తమ్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు చంద్రశేఖర్, గడ్డం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



**బంజారాహిల్స్:** ఎన్నికల సందర్భంగా జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ ఐ లు మెహర్ రాకేష్, గోపి ఇతర పోలీసులు ఇందులో పాల్గొన్నారు. కేంద్ర బలగాలు కూడా పాల్గొని గాయత్రీ హిల్స్‌ఇతర ప్రాంతాల్లో పర్యటించారు.

## మున్నూరుకాపుల ఐక్యతను దెబ్బతీస్తున్నారని నిరసన



ధర్నా నిర్వహిస్తున్న మున్నూరు మహాసభ ప్రతినిధులు

**కాచిగూడ:** మున్నూరుకాపుల ఐక్యతను మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్టుబోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ప్రాంగణంలోని మహాసభ కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా మెయిన్ గేటుకు తాళం వేసి ట్రస్టుబోర్డు చైర్మన్ మ్యాడం వెంకట్‌రావు అడ్డుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో లింగిశెట్టి హనుమంతరావు, బి.ఆర్.జితేందర్, మణికొండ రమేష్ కుమార్, కట్టెల సుభాష్, షేక్‌పేట పెంటయ్య, నర్సింగ్‌రావు, కొంతం సురేష్ బాబు, గోపాల రాధకృష్ణ, గంగం రవి, శ్రీనివాస్, పిల్లి మాణిక్ ప్రభు, రవికాంత్, ప్యాట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు చైతన్యానికి గైడ్

- ఇంటింటికీ పంపిణీ చేస్తున్న బూత్ లెవల్ అధికారులు
- ఎన్నికల సంఘం వినూత్న ప్రయత్నం
- ప్రలోభాలకు గురికాకుండా ఓటేయాలని అవగాహన



ఓటరు గైడ్ పంపిణీ చేస్తున్న బీఎల్ఎం హేమలత

**బంజారాహిల్స్:** వచ్చే నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్ శాతం పెంచే దిశలో ఎన్నికల అధికారులు వినూత్న ఆలోచనలు, చర్యలు, ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ఓటర్లందరూ తేలికగా పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేసే విధంగా వివిధ రూపాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి పోలింగ్ శాతం పెంచేవిధంగా ఓటరు గైడ్ తీసుకువచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్ నియోజకవర్గంలోని 245 పోలింగ్ బూత్‌ల్లో బూత్ లెవల్ అధికారులు ఓటర్లకే కాకుండా రద్దీ ప్రాంతాల్లో ఓటరు గైడ్‌లను పంపిణీ చేస్తున్నారు. దీనిలో ఓటరు నమోదు నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వరకు సమగ్ర వివరాలు ఉన్నాయి.

### బీఎల్‌వోల వద్ద అందుబాటులో..

కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన బుక్‌లెట్లు ప్రతి బీఎల్‌వో వద్ద అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతీ యువకుల కోసం కళాశాలలు, సంస్థల వద్దకు వెళ్లి ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిన వివిధ యాప్‌లు, వాటి పనితీరు, ఓటరు ప్రతిజ్ఞ తదితర అంశాలను కూడా ఈ బుక్‌లెట్‌లో పొందుపరిచారు. చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటరు అప్రమత్తత, పరిశీలన, నిజాయితీ గల ఓటరు అనే నినాదాలతో ఈ బుక్‌లెట్‌ను రూపొందించారు. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో దీనిని ప్రవేశపెట్టినప్పటికీ తాజాగా స్వల్ప మార్పులతో తీసుకువచ్చారు. మరోవైపు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) బృందాలు రంగంలోకి దిగి ఫ్లెక్సీలు, బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్నారు. మద్యానికి, డబ్బులకు ఓటును అమ్ముకోకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని చైతన్యం చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి, సీ–విజిల్ యాప్ వివరాలు ఇందులో ఉన్నాయి. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సిబ్బంది, ఓటు హక్కు వినియోగం, వేలికి సిరా చుక్క పెట్టడం, ఈవీఎం యంత్రాల బీప్ శబ్దం, వీవీ ప్యాట్లలో ఓటు నమోదు అయిందో లేదో తెలుసుకోవడం... ఇలా ప్రతి అంశంతో కూడిన ఓటింగ్ ప్రక్రియను సులువుగా తెలుసుకునేలా దీనిని ముద్రించారు. ఈ సందేశాత్మక పుస్తకాలతో ఓటింగ్ శాతం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలి

ఔట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ విజ్ఞప్తి



తమకు న్యాయం చేయాలని కోరుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

**పంజగుట్ట:** ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలద్వారా కాకుండా నేరుగా ప్రభుత్వం ఒక బోర్డు ఏర్పాటు చేసి దానిద్వారా తమకు వేతనాలు చెల్లించాలని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ మైనార్టీ ఔట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గత 8 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్ మహమ్మద్, ప్రధానకార్యదర్శి రేష్మ ఫర్వీన్, ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫి, కోశాధికారి షేక్ అబ్దుల్ షఫీలు మాట్లాడుతూ ఒక్కరోజు కూడా సెలవు లేకుండా అతితక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు తీసుకునేది ఒక వేతనం, మాకు ఇచ్చేది మాత్రం అతితక్కువ అన్నారు. తమను విధుల్లో తీసుకునే సమయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకుంటున్నారని, కాని డైలీ లేబర్ అని హేళన చేస్తున్నారని అన్నారు. తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## అలరించిన 'సీతారాముల' వేషధారణ



సంస్కార్ స్కూల్‌లో శ్రీరామనవమి వేడుకలు

**శ్రీనగర్‌కాలనీ:** చిన్నారులు సీతారాముల వేషధారణను ధరించి రామాయణ చరిత్రను తెలిపేలా చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంగళవారం ఎర్రగడ్డ 'సంస్కార్ ది లైఫ్'స్కూల్‌లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణ, ప్రదర్శన అలరించాయి. రామాయణ చరిత్రను ఉపాధ్యాయులు చిన్నారులకు తెలియజేశారు. స్కూల్ సీఈవో మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి పాల్గొన్నారు.



## మోదీని ఓడించండి: అనిల్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్...

**వెంగళరావునగర్:** భారతదేశాన్ని ముక్కలుగా విభజిస్తున్న ప్రధాని మోదీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తెలియజేశారు. టీ–హబ్ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి అనిల్‌కుమార్ యాదవ్ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దేశంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలతోపాటు కులాలను కలిపి ఐక్యంగా ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. అయితే మోదీ మాత్రం మతం పేరుతో ప్రజలను, దేశాన్ని విడగొడుతున్నట్లు విమర్శించారు. ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మన తెలంగాణ గొంతును పార్లమెంట్‌లో వినిపించి మనకు రావాల్సిన నిధులను తీసుకుని వస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, బాబా ఫసీయుద్దీన్, వనం సంగీత యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు అసద్, భవానీశంకర్, ఫిరోజ్‌ఖాన్, ప్రీతి, బి.సురేఖ, మనోజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'మార్కెటింగ్ ట్రెండ్స్' పై జాతీయ సదస్సు





సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ అప్పారావు తదితరులు

**కాచిగూడ:** 'భారతదేశంలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో ఇటీవలి ట్రెండ్స్'అనే అంశంపై నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్‌లో మంగళవారం రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. దేశ వ్యాప్తంగా వివిధ కళాశాలల విద్యార్థులు, విద్యావేత్తలు, పరిశోధనా పండితులు, పరిశ్రమల నిపుణులు పాల్గొని సెమినార్ సావనీర్‌లో ప్రచురించిన పరిశోధన ఫలితాలను ఈ సందర్భంగా సమర్పించారు. ప్రతి సవాలులో ఒక అవకాశం ఉంటుందని, ప్రతి అడ్డంకిలో ఆవిష్కరణకు మార్గం ఉంటుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలివైన చర్చలు, ప్రకాశవంతమైన ప్రదర్శనలు, సహకార మార్పిడిలు జరిగి జ్ఞానాన్ని పంచుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అప్పారావు, భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ ఎస్.జైకిషన్, డాక్టర్ వై.అశోక్, డాక్టర్ విద్యాధర్ రెడ్డి, డాక్టర్ ఎస్ రాజేశ్వర్ రావు, ప్రొఫెసర్ డాక్టర్ ఇంద్రకంటి శేఖర్, డాక్టర్ వరలక్ష్మీ, డాక్టర్ కె.నిర్మల, కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు చైర్మన్ పి.కృష్ణారావు, కె.అర్చన, ఎ.మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు అభినందన

**లిబర్టీ:** ఉత్తమ విద్యార్థులుగా ఎదిగి దేశ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. విద్యారంగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర మరువలేనిదన్నారు.

## దళిత బహుజన అభ్యర్థులను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

**లిబర్టీ:** దళిత బహుజన అభ్యర్థులను చట్టసభల్లోకి పంపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరు కృష్ణస్వరూప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానంతో, గౌతమ బుద్ధుని తాత్విక వెలుగులో సమతా రాజ్యాన్ని స్థాపించాలని కోరారు. దళితుల అభ్యర్థులను లోక్‌సభకు పంపిస్తే దళిత సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

## పెళ్లి పేరిట మోసగించిన వ్యక్తికి రిమాండ్

**ఖైరతాబాద్:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడమేకాక బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ తుమ్మలబస్తీలో నివాసముండే కోమటి శ్రీనుబాబు(45) రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇతనికి ఇద్దరు పిల్లలు. కాగా, నేరెడ్‌మెట్ ఎక్స్‌రోడ్డులో హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసే మహిళ(34)ను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. పెళ్లిచేసుకోవాలని ఆమె ఒత్తిడి చేయగా బెదిరింపులకు పాల్పతున్నాడు. ఈ మేరకు శ్రీనుబాబుపై మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి అతడిని రిమాండ్‌కు తరలించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కేసు

**రహమత్‌నగర్:** ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇంటింటికీ తిరిగి కానుకలు పంచుతున్న బీఆర్ఎస్ నాయకులపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డివిజన్‌లోని స్వరాజ్‌నగర్‌లో సోమవారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారి వద్ద నుండి 100 డబ్బాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పలువురిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేశారు.

## ఇన్సూరెన్స్ పేరిట ఆన్‌లైన్‌లో టోకరా

**వెంగళరావునగర్:** ఇన్సూరెన్స్ పాలసీ పేరుతో మహిళ నుంచి ఆన్‌లైన్‌లో రూ.50 వేలు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం ప్రాంతానికి చెందిన కర్నాటి సరస్వతి ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ మధురానగర్‌లో నివాసం ఉంటోంది. ఈ నెల 6న ఆమెకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాము ఐసీఐసీఐ ఇన్సూరెన్స్ విభాగం నుంచి మాట్లాడుతున్నామని తెలియజేసి వాట్సాప్‌లో లింక్ పంపుతున్నామని, దానిని ఓపెన్ చేయాలని చెప్పారు. ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే రూ.10 వేల చొప్పున ఐదుసార్లు తన అకౌంట్ నుంచి నగదు డెబిట్ అయింది. తొలుత రూ.2 డెబిట్ చేశారు. మొత్తం 50 వేల 2 రూపాయలు కొట్టేశారు. దాంతో ఆందోళన చెందిన ఆమె సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు తెలియజేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధిని చూసి ఓటెయ్యండి: పద్మారావుగౌడ్



జవహర్‌నగర్‌లో పర్యటిస్తున్న పద్మారావుగౌడ్

**వెంగళరావునగర్:** రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి తనను గెలిపించాలని సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఓటర్లను కోరారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్‌లతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచుతూ తనకు ఓటేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీల వల్ల రాష్ట్రానికి ఒరిగిన లాభమేమిలేదని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, సురేష్ ముదిరాజ్, పవన్ ముదిరాజ్, నర్సింగరావు, పూజారి బాల్‌రాజ్, కిట్టు, బాలు రజక, అఫ్సర్, వేణు, కుమార్ నాయక్, సుశీల్, జింకా ఆలీస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కార్పొరేటర్ దేదీప్య విజయ్ ఆధ్వర్యంలో మహిళలు పద్మారావుగౌడ్‌కు హారతులిచ్చి స్వాగతం పలికారు.

## హెరిటేజ్ సిటీగా నామినేట్ చేసేందుకు కృషి



విద్యార్థులకు హైదరాబాద్ చరిత్రపై అవగాహన కల్పిస్తున్న చరిత్రకారులు, ఆర్కిటెక్ట్‌లు

చరిత్రకారిణి, అర్బన్ ప్లానర్ వసంత శోభ

**బంజారాహిల్స్:** ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరాన్ని ఈ ఏడాది యునెస్కో నిర్వహించే హెరిటేజ్ సదస్సులో హెరిటేజ్ సిటీగా నామినేట్ చేసేందుకు తాము కృషి చేస్తున్నట్లు చరిత్రకారిణి, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్, అర్బన్ ప్లానర్ వసంత శోభ తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెరిటేజ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వందల ఏళ్ల క్రితం నాటి చిత్రాలతో పాటు మ్యాప్‌లు, హెరిటేజ్ కట్టడాల చిత్రాలు, తదితర వివరాలను ఆర్కిటెక్ట్ విద్యార్థులతో డిజటలైజ్ చేయించి ఆ నమూనాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 400 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరంలో ఎంతో చారిత్రక సంపద ఉన్నదని, వాటిని కాపాడటంతో పాటు భావితరాలకు తెలియజేయాలనే గొప్ప ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించబోతున్నట్లు ఆమె తెలిపారు. తొలిసారిగా మన దేశం ఈ ఏడాది యునెస్కో నిర్వహించ బోయే వరల్డ్ హెరిటేజ్ సదస్సుకు ఢిల్లీ వేదికగా ఆతిథ్యం ఇవ్వబోతున్నదని, అందువల్ల హైదరాబాద్‌కు మరింత ఖ్యాతి వచ్చేలా యునెస్కో గుర్తింపునకు నామినేట్ అయ్యేందుకు తాము కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్ట్ విద్యార్థులకు నగర చరిత్రను తెలిపే పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి. సురేష్, జేఎన్ఐఏఎస్ ప్రిన్సిపాల్ శాలిని కాకాని, జర్నలిస్ట్ అయాన్ అలీ, ఆసిఫ్ అలీఖాన్, శశాంక్, రాహుల్, నాగరాజు రావిడి, ఇందిర కొల్లి తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణం చూతము రారండి



**ఫిలింనగర్:** శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాలు, రకరకాల పూలమాలలతో ప్రాంగణాలను తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని నందినగర్ గ్రౌండ్‌లో, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో, శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో, ఫిలింనగర్ దైవసన్నిధానం, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని గౌరీశంకర్ కాలనీలో శ్రీసీతారామచంద్రస్వామి, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–18లోని శ్రీసీతారామ, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని శ్రీఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాల వద్ద భక్తుల కోసం మంచినీటి సౌకర్యం, ఇతర ఏర్పాట్లు సిద్ధం చేశారు.



## నేడు రామ్‌జానకీ రథయాత్ర



బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశంకర్

**రహమత్‌నగర్:** ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి రామ్‌జానకీ రథయాత్ర మహోత్సవం జరగనుంది. ఇందుకోసం హైందవ సేన అన్ని ఏర్పాట్లు చేసింది. ఎస్పీఆర్ హిల్స్ రామాలయం నుంచి యాత్ర సాయంత్రం ప్రారంభమై, బంజారానగర్ హనుమాన్ ఆలయం వరకూ కొనసాగనుంది. ఈ క్రమంలోనే రామాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. వీధులన్నీ కాషాయ తోరణాలతో నిండిపోయాయి. బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌లో రామాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఎస్ఆర్‌నగర్ డివిజన్ డీసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్, డీఐ భూపాల్‌గౌడ్‌లు రథయాత్ర జరిగే ప్రాంతాలను పరిశీలించారు.

ఉత్సవాలు శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలి: వీరశేఖర్, (బోరబండ ఎస్‌హెచ్‌ఓ)

ఉత్సవాలు శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలి. ఇతర మతాలను ఉద్దేశించి ప్రసంగాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దు. రథయాత్ర వెంట పోలీసు బలగాలు ఉంటాయి. యువత సంయమనం పాటించాలి. ఎన్నికల కోడ్ అమలులో ఉందన్న విషయం మరిచిపోవద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

## 'లా ఎక్సలెన్స్'కు ర్యాంకుల పంట

**చిక్కడపల్లి:** సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో అశోక్‌నగర్‌లోని 'లా ఎక్సలెన్స్'కు ఐఏఎస్ అకాడమీకి మంచి ర్యాంకులు వచ్చాయి. ఈ సందర్భంగా అకాడమీ అధినేత రాంబాబు మాట్లాడుతూ తమ అకాడమీకి 35 ర్యాంకులు వచ్చాయని ఇందులో, 200లోపు ర్యాంకులు ఉండటం గర్వకారణమని అన్నారు. సందర్భంగా 703 ర్యాంకర్ రాజ్‌కుమార్ చౌహాన్‌తోపాటు ఇతరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజకుమార్ చౌహాన్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సహంతో జిల్లా గిరిజన ప్రాంతానికి చెందిన తాను ఐఏఎస్‌కు సెలక్ట్ కావడం సంతోషంగా ఉందని, పేదలకు సేవ చేసే అవకాశం లభించిందని అన్నారు.

# పైచేయి ఎవరిది?

**మూడు పార్టీలకు లోక్‌సభ ఎన్నికలు అగ్ని పరీక్షే**

మెజారిటీ సీట్లు వస్తేనే కాంగ్రెస్ సర్కారుకు 'సుస్థిరత'

పట్టు సాధించకపోతే ఎలాగని బీఆర్ఎస్ మథనం

డబుల్ డిజిట్‌తో 'గేమ్‌చేంజ్' సాధ్యమంటున్న బీజేపీ



కల్వల మల్లికార్జున్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. వచ్చే ఫలితాలే రాష్ట్ర రాజకీయాలతోపాటు తమ పార్టీ భవిష్యత్‌ను కూడా శాసిస్తాయని బలంగా నమ్ముతున్నాయి. దీంతో ఒక్కోపార్టీ ఒక్కో రకమైన వ్యూహంతో ఎన్నికల బరిలోకి దిగాయి. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ మాత్రం ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ మినహా మిగతా చోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది. లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా ప్రత్యర్థులు ఎవరో తేలడంతో అటు పార్టీలు, ఇటు అభ్యర్థులు ప్రచారక్షేత్రంలో బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలో సాధించిన ఫలితాలతో సంబంధం లేకుండా ప్రత్యర్థి పార్టీలపై ఆధిక్యానికి శ్రమిస్తున్నాయి. అన్ని పార్టీలు రెండంకెల సీట్లు సాధించే లక్ష్యంతో పావులు కదుపుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలరూపంలో ఎదురైన అగ్నిపరీక్షను గట్టెక్కడం ద్వారా రాష్ట్ర రాజకీయాలపై పట్టు సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

### సుస్థిరపాలన : కాంగ్రెస్


గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 65 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వ మనుగడపై బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో నిరంతరం కలకలం రేపుతున్నాయి. ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున వలసలు ఉంటాయని కాంగ్రెస్‌వర్గాలు కొంతకాలంగా ధీమాతో ఉన్నా, అంతగా అనుకూలించడం లేదు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సాధించే ఫలితాలపైనే ఇతర పార్టీల నుంచి చేరికలు ఆధారపడి ఉంటాయనే అంచనాకు వచ్చినట్టు కనిపిస్తోంది. ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటోంది. వీటికి తోడు అదనంగా సాగు, తాగునీటి కష్టాలు, కరెంటు కోతలు, వరికి బోనస్, రైతు రుణమాఫీ వంటివి కాంగ్రెస్‌కు ప్రతికూల అంశాల జాబితాలో వచ్చి చేరాయి. వీటిని అధిగమించడమే అతిపెద్ద సవాలుగా భావిస్తున్న ఆ పార్టీ అసెంబ్లీ ఫలితాలను మించిన రిజల్ట్ వస్తుందని లెక్కలు వేసుకుంటోంది.

### వరుస వలసలు : బీఆర్ఎస్

పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి అన్ని స్థాయిల్లో నాయకులు, కేడర్ పార్టీని వీడుతున్నారు. పార్టీ టికెట్ ఇచ్చినా వద్దనుకొని మరీ అభ్యర్థులు ఇతర పార్టీల్లోకి వెళ్లడం కేడర్ మనోస్థైర్యాన్ని దెబ్బ తీసింది. వీటికి తోడు కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటు, ఎమ్మెల్సీ కవిత అరెస్టు, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలు పార్టీపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలను ప్రజాక్షేత్రంలో ఎత్తిచూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఎదురవుతున్న వరుస విమర్శలకు బీఆర్ఎస్ సమాధానాలు చెప్పాల్సి వస్తోంది. ఓ వైపు ఆత్మరక్షణ చేసుకుంటూనే కాంగ్రెస్, బీజేపీపై బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత, పార్టీ సంస్థాగత బలం ఆధారంగా ఎక్కువ సీట్లు సాధించేలా పావులు కదుపుతోంది. పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావు స్టార్ క్యాంపెయినర్లుగా లోక్‌సభ ఎన్నికల్లో రెండు జాతీయపార్టీల కంటే ఎక్కువ సీట్లు సాధించడమే ఏకైక మార్గంగా పనిచేస్తున్నారు.

### మోదీ మంత్రం : బీజేపీ

2019లో నాలుగు ఎంపీ సీట్లలో గెలుపొందిన బీజేపీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా డబుల్ డిజిట్ స్థానాల్లో గెలవాలని భావిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో 25 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో మెజారిటీ సాధించిన బీజేపీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది సీట్లకే పరిమితమైంది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలతోపాటు, ఇతర కీలక నేతలను చేర్చుకొని అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తి చేసింది. కేంద్రంలో మోదీపాలన, రామ మందిరం అంశాలు భారీగా ఓట్లు రాల్చుతాయని బీజేపీ శిబిరం లెక్కలు వేసుకుంటోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ బలహీనతలు తమకు చాలా నియోజకవర్గాల్లో కలిసి వస్తుందని భావిస్తోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన సంస్థాగత బలం లేకపోవడం బీజేపీ ప్రధాన బలహీనతగా కనిపిస్తోంది. మే మొదటివారం నుంచి రాష్ట్రంలో జరిగే ప్రధాని మోదీ వరుస పర్యటనలు 'గేమ్ చేంజర్'గా నిలుస్తాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు సాధిస్తే రాష్ట్రంలో అధికారం చేపట్టే దిశగా బీజేపీ అడుగులు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది.




**అసెంబ్లీ రిజల్ట్స్ ప్రామాణికం కాదంటున్న గత ఫలితాలు**

2018 అసెంబ్లీ ఎన్నికల్లో 88 సీట్లు గెలుపొందిన బీఆర్ఎస్ 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాల నాటికి 17 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యం కోల్పోయింది. ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు, మరో ఇద్దరు స్వతంత్రులు బీఆర్ఎస్‌లో చేరినా 2019 ఎన్నికల్లో రెండంకెలు దాటలేక 9 లోక్‌సభ సీట్లకే పరిమితమైంది.

ఒకే అసెంబ్లీ సీటును గెలుచుకున్న బీజేపీ మాత్రం అనూహ్యంగా పుంజుకొని ఏకంగా 25 సెగ్మెంట్లలో మెజారిటీ సాధించి నాలుగు లోక్‌సభ సీట్లను గెలుచుకుంది.

మరోవైపు మిత్రపక్షం టీడీపీతో కలిసి 21 అసెంబ్లీ సీట్లను గెలుచుకున్న కాంగ్రెస్ వెంటనే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మూడు సీట్లకే పరిమితమైంది.

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన సీట్లు, సాధించిన ఓట్లను ఏ పార్టీ కూడా లోక్‌సభ ఎన్నికల్లో ప్రామాణికంగా తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో పైచేయి సాధిస్తామనే ధీమా మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లో కనిపిస్తోంది.



## బీ ఫారాలు.. రూ. 95 లక్షలు

**బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు ఇవ్వనున్న అధినేత కేసీఆర్**

రేపు తెలంగాణ భవన్‌లో ఎన్నికల వ్యూహాలపై అధినేత దిశానిర్దేశం

అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా కీలక నేతల రాక

బస్సు యాత్ర రూట్‌మ్యాప్‌పైనా నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం, ఇతర వ్యూహాలపై చర్చించేందుకు బీఆర్ఎస్ ఈ నెల 18న కీలక సమావేశం ఏర్పాటు చేసింది. తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో ఈ భేటీ జరగనుంది. పార్టీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 18న జరిగే సమావేశంలో వారికి బీ ఫారాలు అందజేస్తారు. ఎన్నికల ఖర్చుల కోసం ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి పార్టీ తరపున ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షల చొప్పున చెక్కులను కేసీఆర్ అందజేస్తారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, పార్టీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు హాజరవుతారు. భేటీ అనంతరం పార్టీ నేతలతో కలిసి కేసీఆర్ మధ్యాహ్నం భోజనం చేస్తారు.

**ఆత్మస్థైర్యం పెంచేలా..**

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై సమావేశంలో కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. ప్రచారంలో లేవనెత్తాల్సిన అంశాలు, పార్టీ కేడర్‌తో సమన్వయం, ఓటు బ్యాంకును కాపాడుకోవడం తదితరాలపై సూచనలు చేస్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయామనే భావనతో ఉన్న ప్రజలకు మరింత చేరువయ్యేలా దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు చెప్పాయి. వాగ్దానాల అమలులో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సీఎంగా కేసీఆర్ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లేలా సూచనలు చేస్తారన్నాయి. ఇటీవలి కాలంలో పార్టీ నిర్వహించిన సర్వే ఫలితాలను కూడా పార్టీ నేతలకు వివరించి వారిలో ఆత్మస్థైర్యం నూరిపోసేలా కేసీఆర్ ప్రసంగం ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇదిలాఉంటే ఇప్పటికే చేవెళ్ల, అందోలులో ప్రజా ఆశీర్వాద సభల పేరిట బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఇటీవలి సూర్యాపేట, నల్లగొండ, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో బస్సు యాత్రకు వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకుని మరోమారు బస్సు యాత్ర చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ నెల 18న జరిగే భేటీలో కేసీఆర్ బస్సు యాత్ర, రూట్‌మ్యాప్‌పైనా చర్చించి షెడ్యూల్ ఖరారు చేస్తారు.



## నామినేషన్ల నుంచే మోత మోగాలి

**భారీ జనసమీకరణతో అట్టహాసంగా అభ్యర్థుల నామినేషన్లు వేయాలని కాంగ్రెస్ నిర్ణయం**

ఈ నెల 19, 21 తేదీల్లో మహబూబాబాద్, భువనగిరి నామినేషన్ల కార్యక్రమానికి సీఎం రేవంత్ .. వీలును బట్టి మరికొన్ని చోట్ల పాల్గొనే అవకాశం

**నేడు కేరళకు సీఎం రేవంత్**

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో నామినేషన్ల దాఖలు సందర్భంగా భారీ జనసమీకరణ చేయడం ద్వారా ఆదిలోనే ప్రచార క్షేత్రం నుంచే ప్రతిపక్షాలను వెనక్కు నెట్టాలనే వ్యూహాన్ని అమలు పరచనుంది. నామినేషన్ల దాఖలు కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సభలను నిర్వహించనుండగా, కొన్ని చోట్ల సీఎం రేవంత్ పాల్గొననున్నారు. ప్రస్తుతానికి మూడు నామినేషన్ల సభలకు వెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈనెల 19న మహబూబాబాద్‌లో పి. బలరాం నాయక్, 21న భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ల సభకు ఆయన హాజరు కానున్నారు. మిగిలిన చోట్ల కూడా షెడ్యూల్‌లోని వెసులుబాట్లను బట్టి రేవంత్ వెళ్తారని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. రేవంత్ వెళ్లని పక్షంలో ఆ జిల్లాకు చెందిన మంత్రులు, లోక్‌సభ ఇంచార్జి తదితర నేతలు హాజరు కానున్నారు.

**లక్షకు తగ్గకుండా..**

ప్రతి చోటా నామినేషన్ సందర్భంగా కనీసం లక్ష మందిని సమీకరించి సభలను నిర్వహిస్తామని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు. ఈ సభల ఏర్పాటుతోనే ప్రతిపక్షాలు బెంబేలెత్తాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీ ఖాయమనే భావనను ప్రజల్లో కలిగించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామని ఆయన చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 22వ తేదీలోగా మంచి రోజులుండటంతో చాలా మంది కాంగ్రెస్ అభ్యర్థులు ఆలోపే ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ తర్వాత వీలును బట్టి సభల ఏర్పాటు ద్వారా భారీఎత్తున మరో సెట్ నామినేషన్లు వేయనున్నారు.

**నేడు కేరళకు సీఎం రేవంత్..**

కేరళలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం కేరళ వెళ్తున్నారు. రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్న వాయనాడ్ నియోజకవర్గంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు,. అలాగే గురువారం నాడు అలెప్పీలోనూ ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆ తరువాత రెండు రోజులు రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసే బహిరంగ సభల్లో పాల్గొంటారు.

## కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా వంశా తిలక్



**బీజేపీ అధిష్టానం ప్రకటన..**

సాక్షి, న్యూఢిల్లీ/కంటోన్మెంట్ (హైదరాబాద్): బీజేపీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ టికెట్ డాక్టర్ తక్కెళ్ల టీఎస్ వంశా తిలక్‌కు దక్కింది. కంటోన్మెంట్ నుంచి వంశా తిలక్ పోటీ చేస్తారని ఆ పార్టీ అధిష్టానం మంగళవారం ప్రకటించింది. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి టీఎస్ సదాలక్ష్మి కుమారుడైన తిలక్ వైద్యునిగా సేవలు అందిస్తున్నారు. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు పలువురు నాయకులు పోటీ పడ్డారు. అయితే రాజకీయ, సామాజిక సమీకరణాలు, కుటుంబ నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకున్న బీజేపీ జాతీయ నాయకత్వం తిలక్ వైపు మొగ్గు చూపింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సాధారణ ఎన్నికలతో పాటు మే 13వ తేదీన ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ నుంచి లాస్య నందిత సోదరి నివేదిత, కాంగ్రెస్ తరపున గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన నారాయణ శ్రీ గణేశ్ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన నారాయణ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు.

**ఉస్మానియా నుంచి ఎంబీబీఎస్**

తిలక్ తండ్రి పద్మశ్రీ టీవీ నారాయణ స్వాతంత్ర్య సమరయోధులు కాగా ఏపీపీఎస్సీ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగానూ పనిచేశారు. తల్లి సదాలక్ష్మి ఉమ్మడి ఏపీలో తొమ్మిది మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. తొలి ఎస్సీ మహిళా డిప్యూటీ స్పీకర్‌గానూ గుర్తింపు పొందారు. ఇక వంశా తిలక్ ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక కమిటీ సభ్యుడైన తిలక్, ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జాతీయ సలహాదారుగా కొనసాగుతున్నారు. ఢిల్లీలోని రామ్ మనో హర్ లోహియా ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. భాగ్యనగర్ ఖాదీ సమితి చైర్మన్‌గా, ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారిగా వ్యవహరించారు.

**నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా**

కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని తిలక్ చెప్పారు. తన తల్లి స్వస్థలమైన బొల్లారంతో పాటు కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికి తన జీవితం అంకితం చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి టికెట్ కేటాయించిన బీజేపీ పెద్దలకు, సహకరించిన స్థానిక నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## జైలులో విషం ఇచ్చి చంపేస్తారేమో?



**ఆస్పత్రి సాకుతో కాల్చి చంపుతారేమో? : అక్బరుద్దీన్ ఒవైసీ**

సాక్షి హైదరాబాద్/గోల్కొండ: 'మృత్యువు అంటే భయం లేదు..అక్బరుద్దీన్ ఒవైసీని జైలులో వేసి విషం ఇచ్చి చంపేస్తారేమో? అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీలను కూడా జైలుకు పంపి ఆస్పత్రికి తీసుకెళ్లే సాకుతో తుపాకీ తూటతో కాల్చి చంపేస్తారేమో'అని మజ్లిస్ శాసన సభాపక్షనేత అక్బరుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి బహదూర్‌పురాలో జరిగిన ఈద్ మిలాప్ ఆయన పాల్గొని ప్రసంగించారు. 'భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో తెలియదు? మృత్యువు ఎలా వస్తోందో తెలియదు? తమను చంపేస్తారేమో తెలియదు కానీ..ఇలా జరగదు అని చెప్పలేం. ఒక్కసారి కళ్లు మూసుకొని ఆలోచించండి. మజ్లిస్ పార్టీ, ఒవైసీ బ్రదర్స్ లేనిదే మన పరిస్థితేమిటని'అని అక్బరుద్దీన్ ప్రశ్నించారు.

**ఈడీ, సీబీఐలకు భయపడం**

ఈడీ, సీబీఐ అరెస్టులకు భయపడే పార్టీ తమది కాదని అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. తమకు లొంగనివారిని, మద్దతు తెలపనివారిని ఈడీ, సీబీఐల పేరుతో అరెస్టులు చేస్తూ జైళ్లలో పెడుతుందని ఆరోపించారు.

## ఎంపీగా పోటీచేస్తా.. అనుమతివ్వండి

**ప్రభుత్వానికి ఒక వ్యవసాయ విస్తరణాధికారి లేఖ**

**మూడు నెలలు సెలవు ఇవ్వాలని... ఓడితే మళ్లీ చేర్చుకోవాలని వినతి**



సాక్షి, హైదరాబాద్: ఎంపీగా పోటీ చేయడానికి అనుమతివ్వాలని ఒక ప్రభుత్వ ఉద్యోగి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వ్యవసాయశాఖ కార్యదర్శిలకు లేఖ రాశారు. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలంలో వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ)గా పనిచేస్తున్న కళ్లేపల్లి పరుశురాములు ఈ మేరకు మంగళవారం ఈ లేఖ రాశారు. ఎంపీగా పోటీ చేసేందుకు ఇన్‌సర్వీస్‌లో భాగంగానే మూడు నెలలు సెలవు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగస్తులు మెటర్నిటీ లీవ్ మీద జీతం, సర్వీస్‌తో కూడిన ఆరు నెలల సెలవు కలిగి ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖలో వ్యవసాయ డిప్లొమా చదివిన ఏఈవోలు నాలుగేళ్లు ఇన్‌సర్వీస్‌లో జీతంతో కూడిన సెలవులతో బీఎస్సీ అగ్రికల్చర్ చదవడానికి అవకాశం ఉందనీ, అది వారి వ్యక్తిగత అవసరాల కోసం మాత్రమేనని ఏఈవో ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా ప్రజలకు న్యాయమైన సౌకర్యాలు కల్పించడానికి న్యాయమైన పరిపాలన కోసం ఎంపీగా పోటీ చేయడానికి 3 నెలల జీతంతో కూడిన, సర్వీసుతో కూడిన సెలవు ఇప్పించాలని పరశురాములు కోరారు. ఒకవేళ తాను ఓడిపోయినా ఉద్యోగం ఇవ్వాలని, ఒకవేళ ఎంపీగా గెలుపొంది పదవీకాలం ముగిసిన తర్వాత కూడా తన ఉద్యోగం తనకు ఉండే విధంగా సెలవు మంజూరు చేయాలని కోరారు. ఒకవేళ అనుమతి ఇవ్వకుంటే, ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయకూడదో, దానివల్ల దేశానికి లేదా రాష్ట్రానికి కానీ నష్టమేమిటో తెలపాలని కోరడం కొసమెరుపు.

## కరీంనగర్ ఎంపీ బరిలో నేరెళ్ల బాధితుడు

**స్వతంత్ర అభ్యర్థిగా బాధితుడు కోల హరీశ్**

**బాధితులకు న్యాయం జరగాలనే పోటీలో..**



తంగళ్లపల్లి (సిరిసిల్ల): కరీంనగర్ ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు నేరెళ్ల బాధితుడు కోల హరీశ్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా నేరెళ్లలో మీడియాతో మాట్లాడారు. నేరెళ్ల ఘటన బాధితులకు ఎనిమిదేళ్లు గడుస్తున్నా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరగాలంటే తమ గోడును పార్లమెంట్‌లో వినిపించాలని అందు కోసం ఎంపీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

## 'కాంగ్రెస్‌కు ఓటెందుకు వేయాలో రేవంత్‌రెడ్డి చెప్పాలి'



సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 15 లోగా రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, ఇతర హామీలు నెరవేరుస్తామంటూ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఇది మరో ఎత్తుగడ అని మండిపడ్డారు. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని గ్యారెంటీల అమలు నుంచి తప్పించుకోవాలని చూస్తే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మంగళవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రైతులు ఓటెందుకు వేయాలో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ సర్కార్ కూడా మాటల గారడీలతో కాలం వెళ్లబుచ్చుతోందని మండిపడ్డారు.

## నా విజయానికి సహకరించండి

**కోదండరాంను కలిసిన భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్**

సాక్షి, హైదరాబాద్: తన గెలుపునకు సహకరించాలని భువనగిరి ఎంపీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ఎం.కోదండరాంను కోరారు. ఈ మేరకు మంగళవారం కోదండరాంను ఆయన నివాసంలో కిరణ్ కలిశారు. భువనగిరి నియోజకవర్గంలోని టీజేఎస్ శ్రేణులు తనతో కలిసి వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కిరణ్ వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి భవానీ రెడ్డి తదితరులున్నారు.

# బీఆర్ఎస్ సమన్వయకర్తలు వీరే..

**అసెంబ్లీ సెగ్మెంట్‌లకు ఇన్‌చార్జ్‌లను నియమించిన కేటీఆర్**

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 9 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలో నియమించిన సమన్వయకర్తల వివరాలను వెల్లడించారు.

**వరంగల్ లోక్‌సభ స్థానం**

పరకాల: ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్, పాలకుర్తి: మధుసూదనాచారి, మెట్టు శ్రీనివాస్, స్టేషన్ ఘన్‌పూర్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ వెస్ట్: మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకన్న, ఎస్.సుందర్‌రాజ్, వరంగల్ ఈస్ట్: ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వర్ధన్నపేట: కె.వాసుదేవారెడ్డి, సమ్మారావు, భూపాలపల్లి: ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.

**మెదక్ లోక్‌సభ స్థానం**

సంగారెడ్డి: ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు: భూపాల్‌రెడ్డి, నర్సాపూర్: ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మెదక్ : డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, దుబ్బాక: మనోహర్‌రావు, గజ్వేల్: రోజారాధాకృష్ణ శర్మ, సిద్దిపేట: ఫారూఖ్‌హుస్సేన్.

**కరీంనగర్ లోక్‌సభ స్థానం**

కరీంనగర్: ఎమ్మెల్సీ టి.భానుప్రసాద్‌రావు, సిరిసిల్ల: తుల ఉమ, వేములవాడ: గూడూరి ప్రవీణ్, చొప్పదండి: పన్యాల భూపతిరెడ్డి, హుజురాబాద్: నారదాసులక్ష్మణ్‌రావు, మానకొండూర్: కొండూరి రవీందర్‌రావు, హుస్నాబాద్: ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు.

**జహీరాబాద్ లోక్‌సభ స్థానం**

జహీరాబాద్: దేవిశ్రీప్రసాద్‌రావు, ఆందోల్: పట్నం మాణిక్యం, నారాయణఖేడ్: మఠం భిక్షపతి, కామారెడ్డి: జనార్దన్‌గౌడ్, ఎల్లారెడ్డి: తిరుమల్‌రెడ్డి, బాన్సువాడ: ధఫేదర్‌రాజు, జుక్కల్: పోచారం భాస్కర్‌రెడ్డి.

**పెద్దపల్లి లోక్‌సభ స్థానం**

చెన్నూరు : తొంగల సత్యనారాయణ, బెల్లంపల్లి: గంట రాములు, మంచిర్యాల: కోలేటి దామోదర్ గుప్తా, రామగుండం: సీహెచ్.రాకేష్, మంథని: ఓరుగంటి రమణారావు, పెద్దపల్లి: రవీందర్‌సింగ్, ధర్మపురి: రఘువీర్‌సింగ్.

**భువనగిరి లోక్‌సభ స్థానం**

ఇబ్రహీంపట్నం: ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మునుగోడు : గోపగాని వెంకటనారాయణ గౌడ్, భువనగిరి : నంద్యాల దయాకర్‌రెడ్డి, నకిరేకల్: ఎలిమినేటి సందీప్‌రెడ్డి, తుంగతుర్తి: బూడిద భిక్షమయ్యగౌడ్, ఆలేరు: ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, జనగామ: కంచర్ల రామకృష్ణారెడ్డి.

**నల్లగొండ లోక్‌సభ స్థానం**

నల్లగొండ : తిప్పన విజయసింహారెడ్డి, నాగార్జున సాగర్: బండ నరేందర్‌రెడ్డి, హుజూర్‌నగర్: ఒంటెద్దు నరసింహారెడ్డి, దేవరకొండ: రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మిర్యాలగూడ: బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ: కటికం సత్తయ్యగౌడ్, సూర్యాపేట: ఇస్లావత్ రామచందర్‌నాయక్.

**నాగర్‌కర్నూలు లోక్‌సభ స్థానం**

నాగర్‌కర్నూలు: వాల్యానాయక్, గద్వాల: ఎండీ.ఇంతియాజ్ అహ్మద్, అలంపూర్: దేవర మల్లప్ప, కల్వకుర్తి: చాడ కిషన్‌రెడ్డి, వనపర్తి: బైకాని శ్రీనివాస్, అచ్చంపేట: నవీన్‌కుమార్‌రెడ్డి, కొల్లాపూర్: ఆంజనేయగౌడ్.

**నిజామాబాద్ లోక్‌సభ స్థానం**

కోరుట్ల : ఎల్.రమణ , ఆర్మూర్: కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నిజామాబాద్‌అర్బన్: ప్రభాకర్ రెడ్డి , అలీం, బాల్కొండ: ఎల్ఎంబీ.రాజేశ్వర్, నిజామాబాద్‌రూరల్: వి.గంగాధర్‌గౌడ్ , బోధన్: డి.విఠల్‌రావు, జగిత్యాల: దావా వసంత, లోక బాపురెడ్డి.

## కాంగ్రెస్‌లో చేరిన కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి

**మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు కూడా..**

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత సముద్రాల వేణుగోపాలాచారి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి, వేములవాడ, మానకొండూరు ఎమ్మెల్యేలు ఆదిశ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు. జీహెచ్‌ఎంసీకి చెందిన సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి కూడా సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నేత కేఎల్లార్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ బీజేపీ పరమేనా?

చురు (రాజస్తాన్, ఏప్రిల్ 19)

**కీలక అభ్యర్థులు:** దేవేంద్ర ఝఝారియా (బీజేపీ), రాహుల్ కాస్వాన్ (కాంగ్రెస్)


దేవేంద్ర ఝఝారియా

ఉత్తర రాజస్తాన్‌లోని ఈ లోక్‌సభ స్థానం థార్ ఎడారికి ముఖద్వారం. బీజేపీ కంచుకోట. రెండుసార్లు పారాలంపిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన జావెలిన్ క్రీడాకారుడు ఝఝారియా పార్టీ తరఫున బరిలో ఉన్నారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి కాస్వాన్ బీజేపీ మాజీ కావడం విశేషం! గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ తరఫున భారీ మెజారిటీతో నెగ్గారు. ఈసారి టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లోకి ఫిరాయించి పోటీని ఆసక్తికరంగా మార్చేశారు. ఆయన బలమైన జాట్ నేత కావడంతో బీజేపీకి గట్టి పోటీ ఎదురవుతోంది. ఎందుకంటే ఇక్కడి 22 లక్షల మంది ఓటర్లలో నాలుగో వంతు జాట్లే! మహిళా రెజ్లర్ల నిరసనలు, సాగు బిల్లులు తదితరాలతో జాట్లు బీజేపీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దాంతో, 'నరేంద్రుని దేవేంద్రుడు' ప్రచారమే దేవేంద్ర ఝఝారియాను గట్టెక్కిస్తుందని బీజేపీ ఆశిస్తోంది.

## చతుర్ముఖ పోటీ!

నగీనా (యూపీ, ఏప్రిల్ 19)

**కీలక అభ్యర్థులు:** చంద్రశేఖర్ ఆజాద్ (ఏఎస్పీ-కేఆర్), సురేంద్రపాల్ సింగ్ (బీఎస్పీ), మనోజ్‌కుమార్ (ఎస్పీ), ఓం కుమార్ (బీజేపీ)


చంద్రశేఖర్ ఆజాద్


ఈ లోక్‌సభ ఎన్నికల్లో చతుర్ముఖ పోరాటాలు జరుగుతున్న అతి తక్కువ స్థానాల్లో నగీనా ఒకటి. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) అభ్యర్థి చంద్రశేఖర్ ఆజాద్ రంగప్రవేశమే ఇందుకు కారణం. స్థానికంగా తిరుగులేని ఆదరణ భీం ఆర్మీ చీఫ్ అయిన ఈ దళిత నేత సొంతం. ఈ ఎస్సీ రిజర్వుడు స్థానంలో వారి జనాభా 20 శాతం దాకా ఉంటుంది. అయితే ముస్లింలు 43 శాతమున్నారు. వారి దన్నుకు తోడు రాష్ట్రీయ శోషిత్ సమాజ్ అధ్యక్షుడు స్వామిప్రసాద్ మౌర్య మద్దతు కూడా ఆజాద్‌కు కలిసొచ్చే అంశం. 2009 నుంచి ఏ పార్టీ కూడా ఇక్కడ రెండోసారి గెలవలేదు!

## తీవ్ర పోటీకి వేదిక

తిరువనంతపురం (కేరళ, ఏప్రిల్ 26)

**కీలక అభ్యర్థులు:** శశి థరూర్ (కాంగ్రెస్), రాజీవ్ చంద్రశేఖర్ (బీజేపీ), పన్యన్ రవీంద్రన్ (సీపీఐ)


శశి థరూర్


రాజీవ్ చంద్రశేఖర్

అసలే సంప్రదాయ ప్రత్యర్థి అయిన లెఫ్ట్ ఫ్రంట్. దానికి తోడు బీజేపీ నుంచి కేంద్ర మంత్రి రాజీవ్ రూపంలో గట్టి ప్రత్యర్థి. దాంతో కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ శశి థరూర్ గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. ఎంపీగా ఆయన పనితీరుపై స్థానిక జనం పెదవి విరుస్తుండటం మరింత ప్రతికూలంగా మారింది. అర్బన్ సీటు కావడంతో పాటు ఏకంగా 66 శాతం హిందూ జనాభా ఉండటం బీజేపీకి కలిసొచ్చే అవకాశముంది. రాజీవ్ గెలిస్తే కేరళలో కాషాయ పార్టీ నెగ్గిన తొలి స్థానంగా తిరువనంతపురం చరిత్ర సృష్టించనుంది. 2005లో ఇక్కడ గెలిచిన సీపీఐ అగ్ర నేత రవీంద్రన్ ఈసారి ఎవరి ఓట్లను ఏ మేరకు చీలుస్తారన్న దాన్నిబట్టి విజేత ఎవరో తేలవచ్చంటున్నారు.

## తమిళనాట హోరాహోరీకి వేదిక

కోయంబత్తూర్ (తమిళనాడు, ఏప్రిల్ 19)

**కీలక అభ్యర్థులు:** కె.అన్నామలై (బీజేపీ), గణపతి పి.రాజ్‌కుమార్ (డీఎంకే), సింగై జి.రామచంద్రన్ (అన్నాడీఎంకే)


కె.అన్నామలై

తమిళనాట పాగా వేయాలన్న బీజేపీ వ్యూహానికి ఈ స్థానం కేంద్ర బిందువుగా మారింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ అన్నామలై బరిలో ఉండటమే అందుకు కారణం. దాంతో పొత్తులో భాగంగా పదేళ్లుగా వామపక్షాలకు కేటాయిస్తూ వస్తున్న ఈ స్థానంలో ఈసారి డీఎంకే పోటీ చేయడ తప్పలేదు. నగర మేయర్ రాజ్‌కుమార్‌ను పార్టీ బరిలో దింపింది. జౌళి పరిశ్రమకు కేంద్రమైన కోయంబత్తూరు మాంచెస్టర్ ఆఫ్ ద సౌత్‌గా పేరుబడింది. స్థానికేతర జనాభా ఎక్కువగా ఉన్న ఈ స్థానంపై బీజేపీ చాలా ఆశలే పెట్టుకుంది. తమిళనాడులో బీజేపీ నెగ్గిన తొట్టతొలి లోక్‌సభ స్థానాల్లో కోయంబత్తూరు ఒకటి. 1998, 1999ల్లో ఇక్కడ ఆ పార్టీ గెలిచింది!

# అచ్చోట ముచ్చెమట

### తొలి రెండు విడతల్లో 9 'హాట్ సీట్లు'

### ముఖాముఖి, త్రిముఖ, చతుర్ముఖ పోటీలు

### దేశమంతటి దృష్టినీ ఆకర్షిస్తున్న వైనం

లోక్‌సభ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. రెండు రోజుల్లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. కానీ ఈసారి ఎన్నికలు పరమ బోరింగ్‌గా సాగుతున్నాయన్న అభిప్రాయం గట్టిగా విన్పిస్తోంది. కాకపోతే తొలి, రెండో విడతల్లో పోలింగ్ జరిగే 191 లోక్‌సభ స్థానాల్లో 9 'హాట్ సీట్లు' మాత్రం దేశమంతటి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. రసవత్తర పోటీకి వేదికగా మారాయి. ఎందుకంటే వాటిలో కొన్ని స్థానాల్లో ఇండిపెండెంట్లు బరిలో దిగి ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మరికొన్ని చోట్ల అగ్రనేతలకు పెనుసవాలు ఎదురవుతోంది. ఇంకొన్ని చోట్ల సిట్టింగులకు గట్టి ఎదురుగాలి వీస్తోంది. ఆ సీట్లపై ఓ లుక్కేద్దాం...!

– సాక్షి, నేషనల్ డెస్క్

## పప్పూ ప్రతీకార పోటీ!

పూర్ణియా (బిహార్, ఏప్రిల్ 26)

**కీలక అభ్యర్థులు:** పప్పూ యాదవ్ (స్వతంత్ర), బీమా భారతి (ఆర్జేడీ), సంతోష్‌కుమార్ కుష్వాహా (జేడీ-యూ)



పప్పూ యాదవ్

సీమాంచల్‌లోని ఈ సాదాసీదా లోక్‌సభ స్థానం కాస్తా రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ రంగప్రవేశంతో సంకుల సమరానికి పోటీకి వేదికగా మారి దేశమంతటినీ ఆకర్షిస్తోంది. 1990ల్లో పూర్ణియా ఎంపీగా ఉన్న ఆయన 20 ఏళ్ల అనంతరం ఎన్నికల బరిలో దిగుతున్నారు! ఆర్జేడీ, కాంగ్రెస్‌ రెండూ టికెట్ నిరాకరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తూ సిట్టింగ్ ఎంపీ కుష్వాహాతో పాటు ఆర్జేడీ అభ్యర్థి బీమా భారతికి చెమటలు పట్టిస్తున్నారు. నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ పప్పూ కంటతడి పెట్టిన తీరు కూడా ఓటర్లను బాగా కదిలించింది.

## రాహుల్‌కు గట్టి పోటీ

వయనాడ్ (కేరళ, ఏప్రిల్ 26)

**కీలక అభ్యర్థులు:** రాహుల్‌గాంధీ (కాంగ్రెస్), అన్నీ రాజా (సీపీఐ), కె.సురేంద్రన్ (బీజేపీ)


రాహుల్‌గాంధీ

కొండ ప్రాంతమైన ఈ లోక్‌సభ సీటు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీకి సురక్షిత స్థానమని చెప్పేముందు ఇకపై ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిందే. 2019లో ఏకంగా 4.3 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచిన రాహుల్ ఈసారి కేరళ బీజేపీ చీఫ్ కె.సురేంద్రన్, సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు! మైనారిటీ ప్రాబల్య స్థానమైన వయనాడ్‌లో 32 శాతం ముస్లింలు, 13 శాతం క్రైస్తవులున్నారు. ఇండియా కూటమి భాగస్వాములు కాంగ్రెస్, సీపీఐ మధ్య ముఖాముఖి పోరు సాగుతుందని భావించినా బీజేపీ సురేంద్రన్‌ను బరిలో దించడంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఆయనకు మద్దతుగా స్మృతీ ఇరానీ వంటి అగ్ర నేతలు ముమ్మర ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.

## గొగొయ్ వర్సెస్ గొగొయ్

జోర్హాట్ (అసోం, ఏప్రిల్ 19)

**కీలక అభ్యర్థులు:** గౌరవ్ గొగొయ్ (కాంగ్రెస్), తపన్‌కుమార్ గొగొయ్ (బీజేపీ)



గౌరవ్ గొగొయ్

ఈ స్థానం కాంగ్రెస్ కంచుకోట. ఒకప్పుడు మాజీ సీఎం తరుణ్ గొగొయ్ ప్రాతినిధ్యం వహించారు. 2019లో మాత్రం బీజేపీ అభ్యర్థి తపన్‌కుమార్ గొగొయ్ గెలుపొందారు. ఈసారి రాష్ట్ర కాంగ్రెస్ దిగ్గజం గౌరవ్ గొగొయ్ బరిలో దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. తరుణ్ తనయునిగా కూడా ఆయనకు ప్రజల్లో చాలా ఆదరణ ఉంది. దాంతో ఈ స్థానాన్ని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అహోం ప్రతిష్ఠ ప్రధానాంశంగా ప్రచారం చేస్తోంది. 2019లో కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన సుశాంత బోర్గోహెయిన్ చేరిక బీజేపీకి కలిసొచ్చే అంశం.

## యువ నేత జోరు

బార్మేర్-జైసల్మేర్ (రాజస్తాన్, ఏప్రిల్ 26),

**కీలక అభ్యర్థులు:** కైలాశ్ చౌదరి (బీజేపీ), ఉమేదా రాం బెనీవాల్ (కాంగ్రెస్), రవీంద్రసింగ్ భాటీ (స్వతంత్ర)


రవీంద్రసింగ్ భాటీ

సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరితో పాటు బెనీవాల్‌కు కూడా స్వతంత్ర అభ్యర్థి రవీంద్రసింగ్ భాటీ చుక్కలు చూపిస్తున్నారు. ఆయన సభలకు జనం భారీగా విరగబడుతున్నారు. ఇటీవలి రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బార్మేర్ లోక్‌సభ పరిధిలోని షెవో స్థానం నుంచి మంచి మెజారిటీతో నెగ్గారాయన. అప్పుడూ ఇండిపెండెంట్‌గానే పోటీ చేశారు. చౌదరి పనితీరుపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి ఉండటంతో భాటీ ఈసారి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. దాంతో, 'నా కారణంగా ప్రధాని మోదీని శిక్షించకండి' అంటూ ఓటర్లను చౌదరి వేడుకోవాల్సి వస్తోంది! 19 శాతమున్న జాట్లు, 12 శాతముండే రాజ్‌పుత్‌లు ఇక్కడ నిర్ణాయకం కానున్నారు.

## కమలం వికసించేనా!

త్రిసూర్ (కేరళ, ఏప్రిల్ 26)

**కీలక అభ్యర్థులు:** సురేశ్ గోపీ (బీజేపీ), కె.మురళీధరన్ (కాంగ్రెస్), వి.ఎస్.సునీల్‌కుమార్ (సీపీఐ)


సురేశ్ గోపీ

1952 నుంచీ ఒకసారి లెఫ్ట్, మరోసారి కాంగ్రెస్ నెగ్గుతూ వస్తున్న ఈ స్థానంపై బీజేపీ గట్టిగా దృష్టి పెట్టింది. 'ఆపరేషన్ త్రిసూర్'లో భాగంగా ఈ ఆలయ నగరిని ప్రధాని మోదీ ఇప్పటికే పలుమార్లు చుట్టేశారు. మలయాళ సినీ స్టార్ సరేశ్ గోపీని బరిలో దించారు. ప్రత్యర్థులిద్దరూ బలమైన నేతలు కావడంతో త్రిముఖ పోరు నెలకొంది.

## రాముడికి ఓ బెంజ్.. 10 కోట్ల ఆస్తులు!



రఘుకులసోముడైన జగదభిరామునికి బెంజ్ కారేమిటా అనుకుంటున్నారా? ఇది జగదేక చక్రవర్తి శ్రీరాముడి గురించి కాదు. టీవీ రామాయణంలో రాముని పాత్రధారి అరుణ్ గోవిల్ గురించి! 80వ దశకంలో దూరదర్శన్‌లో వచ్చిన రామాయణం సీరియల్‌కు లభించిన ఆదరణ అంతా ఇంతా కాదు. ఆదివారమొస్తే చాలు.. ఉదయాన్నే దేశమంతా 'వినుడు వినుడు రామాయణ గాథ'ను వింటూ టీవీలకు అతుక్కుపోయిన రోజులవి. ఇప్పటికీ అరుణ్ గోవిల్ ఎక్కడ కన్పించినా రామున్నే చూసినంత ఆనందంతో కాళ్లకు నమస్కరించి భక్తి పారవశ్యంలో మునిగిపోతుంటారు. ఇటీవలే బీజేపీలో చేరిన ఈ 72 ఏళ్ల టీవీ రాముడు యూపీలోని మీరట్ నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు. తనకు రూ.62.99 లక్షల విలువైన మెర్సిడెస్ బెంజ్‌తో పాటు రూ.3.19 కోట్ల చరాస్తులు, రూ.5.67 కోట్ల స్థిరాస్తులు, బ్యాంకులో రూ.1.03 కోట్లు, చేతిలో రూ.3.75 లక్షల నగదు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్లో గోవిల్ వెల్లడించారు. రూ.14.64 లక్షల కారు రుణముందని చెప్పారు. సీరియల్లో రాక్షససంహారం చేసిన ఈ టీవీ రామునిపై ఎలాంటి క్రిమినల్ కేసులూ లేవండోయ్!

**17 ఏళ్లకు సొంతూరికి...**


గోవిల్ పుట్టింది మీరట్‌లోనే. ముంబైలో స్థిరపడ్డారు. రాముడు 14 ఏళ్ల వనవాసం తర్వాత అయోధ్యలో అడుగుపెడితే ఈ టీవీ రాముడు 17 ఏళ్ల 'సిటీ'వాసం తర్వాత సొంతూరికి చేరారు. ఆయన కోసం మీరట్‌లో 2009 నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన రాజేంద్ర అగర్వాల్‌ను బీజేపీ పక్కనబెట్టింది! సమాజ్‌వాదీ నుంచి అతుల్ ప్రధాన్, బీఎస్పీ తరఫున దేవవ్రత్ త్యాగి గోవిల్ ప్రత్యర్థులు. ''ఈ ఎన్నికలతో నేను కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నా. రాముడి ఆశీర్వాదం తప్పకుండా ఉంటుంది'' అని విశ్వాసం వెలిబుచ్చారు గోవిల్. అయోధ్య రామమందిర ప్రారంభ వేడుకల్లో ఆయన సీరియల్ సీత దీపికా చిఖలియా, లక్ష్మణుడు సునీల్ లాహరితో సహా పాల్గొనడం విశేషం.

– సాక్షి, నేషనల్ డెస్క్

# ముందస్తు ఎమర్జెన్సీ పరాజయం

## సంచలనాల ఐదో లోక్‌సభ

గతం


1975 జూన్ 25న ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో భారీ ర్యాలీలో ప్రసంగిస్తున్న లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్

సొంత పార్టీయే బయటకు పొమ్మంది. అయినా, ఆమె తగ్గలేదు. ఉక్కు సంకల్పంతో పోరాడారు. ప్రజాక్షేత్రంలోనే బలం నిరూపించుకున్నారు. తిరుగులేని ఎత్తులతో ప్రతిపక్షాలతో పాటు స్వపక్షంలోని తన్మదీయులనూ చిత్తు చేశారు. లోక్‌సభను ఏడాది ముందే రద్దు చేసి ప్రజాతీర్పు కోరిన ఇందిరాగాంధీ అనుకున్నది సాధించారు. ఘర్షణకు దిగిన పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పడమే గాక పోఖ్రాన్ అణు పరీక్షతో మన శక్తిని ప్రపంచానికి చాటారు. కానీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే అత్యంత చీకటి కోణంగా చెప్పదగ్గ ఎమర్జెన్సీ విధింపు నిర్ణయంతో చెరగని మచ్చ మిగుల్చుకున్నారు. ఇలాంటి ఎన్నో విశేషాలకు 1971–77 ఐదో లోక్‌సభ కాలం సాక్షిగా నిలిచింది...

– సాక్షి, నేషనల్ డెస్క్

నాలుగో లోక్‌సభను ప్రధాని ఇందిర 1970 డిసెంబర్‌లో ఏడాది ముందే రద్దు చేయడం వెనుక గట్టి కారణాలే ఉన్నాయి. కాంగ్రెస్ అప్పటికే రెండుగా చీలింది. ఇందిర తీరు నచ్చని వ్యతిరేక వర్గం సిండికేట్‌గా ఏర్పడ్డారు. రాష్ట్రపతి ఎన్నిక ఇరు వర్గాల బలపరీక్షకు వేదికైంది. నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ అభ్యర్థిగా సిండికేట్ ప్రకటించింది. తన విశ్వాసపాత్రుడే ఆ పదవిలో ఉండాలని ఇందిర భావించారు. ఉప రాష్ట్రపతి వి.వి.గిరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దించారు. విప్ జారీ చేయకున్నా, ఆత్మ ప్రబోధానుసారం ఓటేయాలంటూ పార్టీ నేతలకు పిలుపునిచ్చి అనుకున్నది సాధించారు. గిరిని గెలిపించుకున్నారు. కాంగ్రెస్ నుంచి ఇందిర బహిష్కరణ తర్వాత 68 ఎంపీలు కాంగ్రెస్ (ఓ) వైపు నిలిచారు. దాంతో లోక్‌సభలో ఇందిర సారథ్యంలోని కాంగ్రెస్ (ఆర్) బలం 220 మంది ఎంపీలకు పడిపోయింది. డీఎంకే, అకాలీదళ్, లెఫ్ట్, స్వతంత్రుల మద్దతుతో అధికారాన్ని నిలబెట్టుకోవాల్సి వచ్చింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ముందస్తు ఎన్నికలకు వెళ్లారు ఇందిర.

**ఐదో లోక్‌సభలో పార్టీల బలాబలాలు**

(మొత్తం స్థానాలు 521)

| పార్టీ | స్థానాలు |
|---|---|
| కాంగ్రెస్(ఆర్) | 352 |
| సీపీఎం | 25 |
| సీపీఐ | 23 |
| డీఎంకే | 23 |
| భారతీయ జనసంఘ్ | 22 |
| కాంగ్రెస్ (ఓ) | 16 |
| తెలంగాణ ప్రజాసమితి | 10 |
| ఇతరులు | 36 |
| స్వతంత్రులు | 14 |

### విపక్షాలు గుంపుగా వచ్చినా...


ఇందిరను ఏకాకిని చేసేందుకు భారతీయ జనసంఘ్, స్వతంత్ర, సోషలిస్టు పార్టీలతో కాంగ్రెస్ (ఓ) చేతులు కలిపినా లాభం లేకపోయింది. 238 స్థానాల్లో పోటీ చేసి కాంగ్రెస్ (ఓ) గెలిచింది 16 మాత్రమే. బ్యాంకుల జాతీయీకరణ, రాజ భరణం రద్దు వంటి నిర్ణయాల ప్రాతిపదికన ప్రజామోదం కోరి ఇందిర ఘనవిజయం సాధించారు. అభ్యర్థులను కాకుండా తనను చూసి ఓటేయాలన్న ఆమె పిలుపు బాగా క్లిక్కయింది. అలాగే 'గరీబీ హటావో, దేశ్ బచావో' నినాదమూ సూపర్‌హిట్టయింది. ఇందిరా కాంగ్రెస్43.68 శాతం ఓట్లతో ఏకంగా 352 సీట్లు సొంతం చేసుకుంది. ప్రాంతీయ పార్టీల ఎదుగుదలను మాత్రం ఇందిర అడ్డుకోలేకపోయారు. సీపీఎం 25, సీపీఎం 23, భారతీయ జనసంఘ్ 22 సీట్లు నెగ్గగా స్వతంత్ర పార్టీ 8 స్థానాలతో సరిపెట్టుకుంది. డీఎంకే 23 లోక్‌సభ స్థానాలతో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలదొక్కుకుంది.

### విశేషాలు...

- ఐదో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ 1971 మార్చి 1 నుంచి 10 మధ్య కేవలం పది రోజుల్లోనే పూర్తయింది.
- 1952 నుంచి లోక్‌సభ, దేశవ్యాప్తంగా అసెంబ్లీలకు జమిలిగా కొనసాగుతూ వస్తున్న ఎన్నికలకు ఇందిర ముందస్తు నిర్ణయంతో తొలిసారి తెర పడింది.
- దేశ ఆర్థిక పరిస్థితి మెరుగైంది. హరిత విప్లవ ఫలాలు అందివచ్చాయి.
- 1971లో పాక్ మనపై యుద్ధానికి తెగబడింది. తూర్పు పాకిస్తాన్ ప్రజల స్వతంత్ర పోరాటానికి మద్దతుగా భారత బలగాలు బరిలో దిగి 13 రోజుల్లోనే పాక్ పీచమణిచాయి. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ నియాజీ ఏకంగా 93,000 మంది సైనికులతో లొంగిపోయారు. డిసెంబర్ 16న బంగ్లాదేశ్ అవతరించింది.
- 1974 మే 18న రాజస్తాన్‌లోని పోఖ్రాన్‌లో తొలి అణ్వస్త్ర పరీక్షలు విజయవంతంగా జరిగాయి. అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా తర్వాత అణు సామర్థ్యమున్న దేశంగా భారత్ అవతరించింది.

### చెరగని మరక... ఎమర్జెన్సీ

1975 జూన్ 25. ఎమర్జెన్సీ విధిస్తూ ఇందిర నిర్ణయం తీసుకున్న రోజు. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే దుర్దినంగా మిగిలిపోయింది. ప్రజల సాధారణ హక్కులనూ కర్కశంగా కాలరాసిన ఈ కఠిన నిర్ణయానికి ఇందిర మొగ్గు చూపడానికి పలు కారణాలు చెబుతుంటారు. వాటిలో ముఖ్యమైంది మాత్రం 1971 లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా ఆమె గెలుపు చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పే! అధికార యంత్రాంగాన్ని ఇందిర దుర్వినియోగం చేశారని, అనుమతించిన పరిమితికి మించి ఖర్చు చేశారని ఆమె చేతిలో ఓడిన రాజ్ నారాయణ్ కోర్టుకెక్కారు. ఇందిర ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారంటూ 1975 జూన్ 12న కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆమె ఎన్నికను రద్దు చేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ సిన్హా ప్రకటించారు. ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా, ఏ పదవినీ చేపట్టకుండా నిషేధం విధించారు. ఇందిర సుప్రీంకోర్టుకు వెళ్లగా కొన్ని షరతులతో హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ జూన్ 24న తీర్పు వెలువరించింది. మర్నాడే లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో కూడిన ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీని ఉద్దేశించి ఉగ్రూతలూగించే ప్రసంగం చేశారు. దాంతో అదే రోజు ఇందిర ఎమర్జెన్సీ విధించారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా వెనక్కు తగ్గలేదు.




1977 మార్చి 21 దాకా ఎమర్జెన్సీ అరాచకాలు కనీవినీ ఎరగని రీతిలో కొనసాగాయి. ఫలితంగా 1977 ఎన్నికల్లో ఇందిర ఘోర ఓటమి చవిచూడటంతో కేంద్రంలో తొలి కాంగ్రెసేతర సర్కారు గద్దెనెక్కింది.

## సుప్రియా సులే

# ఆల్‌రౌండర్



శరద్ పవార్ వంటి రాజకీయ దిగ్గజానికి ఏకైక సంతానం. గారాలపట్టి. అలా తండ్రి నీడలోనే రాజకీయాల్లో ప్రవేశించినా తొందర్లోనే బలమైన నాయకురాలిగా ఎదిగి తనదైన ముద్ర వేశారు సుప్రియా సులే. బారామతి ఎంపీ, ఎన్సీపీ (ఎస్పీ) వర్కింగ్ ప్రెసిడెంట్. కానీ తాను సాధారణ పార్టీ కార్యకర్తనే అని గర్వంగా చెప్పుకుంటారు. అంతకుముందు జర్నలిస్టుగా సామాజిక సమస్యలపై లోతైన అవగాహన పెంచుకున్నారు. ఊపిరి సలపని రాజకీయాల నడుమ కూడా కుటుంబానికి చాలా ప్రాధాన్యమిస్తారు. ఆల్‌రౌండర్‌గా అన్ని పాత్రలకూ సమ న్యాయం చేస్తుంటారు.

పరిచయం

### ఉత్తమ పార్లమెంటేరియన్

పుట్టిందే రాజకీయ కుటుంబం. దాంతో చిన్నప్పట్నుంచే రాజకీయ వ్యవహారాలపై సుప్రియకు లోతైన అవగాహన ఉంది. అయినా తొలుత రాజకీయాలను కెరీర్‌గా ఎంచుకోలేదు. కొంతకాలం జర్నలిస్టుగా చేశారు. పెళ్లి తర్వాత పదేళ్లు విదేశాల్లోనే ఉన్నారు. తండ్రి, మామ అనారోగ్యం బారిన పడటంతో తిరిగొచ్చారు. 2006లో రాజకీయ రంగప్రవేశం చేసి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బారామతి లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తండ్రి రాజ్యసభకు వెళ్లడంతో 2009 ఎన్నికల్లో అక్కడ బరిలో దిగారు 3 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లోనూ నెగ్గి బారామతిని బలమైన కోటగా మార్చుకున్నారు. ఎన్సీపీలో చీలిక నేపథ్యంలో ఈసారి మాత్రం వదిన సునేత్ర నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు.

### ఉమన్ ఆఫ్ ద డెకేడ్..

ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే కొద్దిమంది నేతల్లో సుప్రియ ఒకరు. స్వయం సహాయక సంఘాలతో కలిసి పని చేశారు. గిరిజనులు, ఆదివాసీల కోసం పాఠశాలల నిర్మాణానికి, వికలాంగుల హక్కుల సాధనకు కృషి చేశారు. మహిళల సమస్యలపై నిత్యం గొంతెత్తుతుంటారు. భ్రూణహత్యలు, వరకట్న వ్యవస్థపై పలు ఉద్యమాలు జరిపారు. మహిళా సాధికారతకు పోరాటం, సామాజిక సేవకు ప్రతిష్టాత్మక 'ముంబై ఉమన్ ఆఫ్ ద డెకేడ్' అవార్డు అందుకున్నారు. పలుమార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

### నేల విడిచి సాము చేయొద్దని...

రాజకీయాలు, కుటుంబం మధ్య సుప్రియ చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఉంటారు. బంధుత్వానికి చాలా విలువిస్తారు. ''మా అమ్మ బలమైన వ్యక్తి. నాన్న కంటే గట్టిది. నాన్న పబ్లిక్ లైఫ్‌ను ఎక్కువగా ఇష్టపడతారు. అమ్మ అజ్ఞాతాన్ని ప్రేమిస్తుంది. జీవన పోరాటంలో మాకెప్పుడూ అండగా నిలుస్తూ వచ్చింది. రాజకీయాలు, సామాజిక సవాళ్లను అధిగమించడమెలాగో నాన్న చూపితే, ఎప్పుడూ నేల విడిచి సాము చేయొద్దని అమ్మ నేర్పింది. అందుకే కుటుంబం పట్ల నేను బాధ్యతగా ఉంటా. ఎంపీగా ప్రజల సమస్యలను చర్చిస్తున్నప్పుడు కూడా.. కొడుకు చదువు, కూతురు పుట్టినరోజు కేక్ ఎలా ఉండాలి వంటివి నా మనసులో మెదులుతూ ఉంటాయి'' అంటారామె. సుప్రియకు నచ్చే నేత సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి. పార్టీ, సిద్ధాంతాల పట్ల ఆయన నిబద్ధత తనకు ప్రేరణనిస్తాయంటారు. పార్లమెంటేరియన్లుగా దివంగత అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్‌లనూ బాగా ఇష్టపడతారు.


### ప్రేమ వివాహం

చిరునవ్వుతో వెలిగే బక్కపలుచని ముఖం. మాటల్లో మృదుత్వంతో ఇట్టే ఆకట్టుకునే సుప్రియ 1969 జూన్ 30న జన్మించారు. బర్కిలీలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో నీటి కాలుష్యంపై అధ్యయనం చేశారు. ఓ దినపత్రికలో జర్నలిస్టుగా చేస్తుండగా ఫ్యామిలీ ఫ్రెండ్ ఇంట్లో సదానంద్ బాలచంద్ర సులేతో జరిగిన పరిచయం ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. వారికిద్దరు పిల్లలు.

# ఫ్యాన్ గాలి ప్రచండం

## ఏ ఊళ్లో ఏ నోట విన్నా ఈ మాటే

- జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీ సర్వేలదీ అదే మాట
- రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులదీ ఆ మాటే
- ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- బస్సు యాత్రలో జగన్‌కు అడుగడుగునా నీరాజనాలు పలుకుతుండటమే తార్కాణం
- జనసేన, బీజేపీతో జత కలిసిన టీడీపీకి మరోసారి ఘోర పరాభవం ఖాయం
- సీఎం జగన్‌పై నమ్మకమే వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయానికి బాట
- చంద్రబాబు మోసకారి కావడం వల్లే ఘోర ఓటమి బాటలో కూటమి




**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని అన్ని వర్గాల ప్రజలు నిర్ధారణకు వచ్చారు. రాజకీయ విశ్లేషకులు, జాతీయ స్థాయి సర్వే సంస్థలు సైతం ఇదే విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నాయి. గతంలో ఏం చేశామన్నది చెప్పుకోవడానికి ఏమీ లేక, భవిష్యత్‌లో ఫలానా చేస్తామని నమ్మకంగా చెప్పడంలో విశ్వసనీయత లేక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఓటమి బాటలో పయనిస్తోందని స్పష్టం చేస్తున్నాయి. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయభేరి మోగించింది. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా ఇంత భారీ విజయం సాధించిన దాఖలాలు లేవు. అధికారంలోకి వచ్చాక ప్రజా సంకల్ప పాదయాత్రలో.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో తొలి ఏడాదే 95 శాతం.. మొత్తమ్మీద 99 శాతం సీఎం జగన్ అమలు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా.. లంచాలకు తావు లేకుండా.. వివక్షకు చోటు లేకుండా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు. డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా పేదలకు రూ.4.49 లక్షల కోట్ల లబ్ధి కలిగింది. దేశ చరిత్రలో ఈ స్థాయిలో పేదలకు మంచి చేసిన దాఖలాలు ఎక్కడా లేవు. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దనే ప్రజలకు అందిస్తున్నారు. వైద్య, విద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సంస్కరణలు తెచ్చి.. అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు. వీటన్నింటి వల్ల సుపరిపాలనతో నవచరిత్ర లిఖించిన సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకూ పెరుగుతోంది.

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్.. వేదికగా ఒకటే చర్చ.. 'ఈసారీ వైఎస్సార్‌సీపీనే వస్తుంది.. జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేలన్నీ పక్కాగా లెక్కలేసి చెబుతున్నాయి. సైంటిఫిక్ పారామీటర్స్‌తో సర్వే చేసి మరీ నొక్కి వక్కాణిస్తున్నాయి. పత్రికలకు సంపాదకులుగా పనిచేసిన వాళ్లు, సీనియర్ పాత్రికేయులు కూడా అదే చెబుతున్నారు. కచ్చితంగా నేను నమ్ముతున్నా. ఎందుకంటే జగన్ చేసిన మంచి పనులు అలాగున్నాయి కాబట్టి' అంటూ ఊరూరా జనం చెబుతున్నారు.

'మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయితేనే మా బతుకులు మారతాయని మా నమ్మకం. మేమంతా జగన్ బాటలోనే నడుస్తాం. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఘోర పరాజయం తప్పదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యం. జగన్ అంటే విశ్వాసం.. చంద్రబాబు అంటే మోసం..' అని నిన్న సిద్ధం సభల్లో.. ఇప్పుడు బస్సు యాత్రలో అశేష ప్రజానీకం తేల్చి చెబుతున్నారు.

### 58% మహిళల ఓట్లు జగన్‌కే



ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల నాడి తెలుసుకోవడానికి ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తున్నాం. 50% కంటే ఎక్కువ ఓట్లతో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయం. సీఎం జగన్ నాయకత్వానికి మహిళలు 58% మంది మద్దతు పలుకుతున్నారు. దేశంలో ఏ నాయకుడికీ మహిళల్లో ఇంతటి ఆదరణ లేదు. సంక్షేమ పథకాల నుంచి కేబినెట్, నామినేటెడ్ పదవుల వరకూ మహిళలకు పెద్దపీట వేస్తూ సాధికారతకు జగన్ తీసుకున్న చర్యలే ఆయన నాయకత్వంపై మహిళల్లో అత్యధికంగా ఆదరణ ఉండటానికి కారణం.

**పార్థ దాస్**
**సెఫాలజిస్ట్, చాణక్య కన్సల్టెన్సీ**

### జగన్‌పై విశ్వసనీయతే విజయానికి సోపానం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల నాడి తెలుసుకోవడానికి ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తున్నాం. 50 శాతం కంటే ఎక్కువ ఓట్లతో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయం. సీఎం జగన్ నాయకత్వానికి మహిళలు 58 శాతం మంది మద్దతు పలుకుతున్నారు. దేశంలో ఏ నాయకుడికీ మహిళల్లో ఇంతటి ఆదరణ లేదు. సంక్షేమ పథకాల నుంచి కేబినెట్, నామినేటెడ్ పదవుల వరకూ మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళా సాధికారతకు సీఎం జగన్ తీసుకున్న చర్యలే ఆయన నాయకత్వంపై మహిళల్లో అత్యధికంగా ఆదరణ ఉండటానికి కారణం.



**పద్మజా జోషి, సీనియర్ న్యూస్ ఎడిటర్, టైమ్స్‌నౌ**

### అప్రతిహతంగా బస్సు యాత్ర

వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి భీమిలి (ఉత్తరాంధ్ర), దెందులూరు (ఉత్తర కోస్తా), రాప్తాడు (రాయలసీమ), మేదరమెట్ల (దక్షిణ కోస్తా)లలో నిర్వహించిన సిద్ధం సభలకు జనం కడలిలా తరలివచ్చారు. ఉమ్మడి, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సభలు అతి పెద్ద ప్రజా సభలుగా నిలిచాయి. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన బస్సు యాత్రకు జనం అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. సీఎం జగన్‌ను చూసేందుకు యువతీ యువకులతో కలిసి చంటి బిడ్డలను చంకనేసుకుని మహిళలు పోటీపడుతూ బస్సు వెంట పరుగులు తీస్తున్నారు. మండుటెండైనా.. అర్ధరాత్రయినా సీఎం వైఎస్ జగన్‌ను దగ్గరి నుంచి చూసేందుకు.. కరచాలనం చేసేందుకు.. మాట కలిపేందుకు.. వీలైతే ఫొటో దిగేందుకు జనం పోటీ పడుతున్నారు. మేలు చేశాం.. ఓటేయండి అనేది మామూలుగా నేతల మాట. కానీ.. బస్సు యాత్రలో తద్భిన్నంగా 'మీ పాలన వల్ల మాకు మంచి జరిగింది.. మళ్లీ మిమ్మల్నే గెలిపించుకుంటాం' అంటూ ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు భరోసా ఇస్తున్నారు. రాజకీయాలలో ఇలాంటి అరుదైన ఘట్టాలను తానెన్నడూ చూడలేదని సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ జత కలిశాక, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభలకు జనం ముఖం చాటేస్తుండటం.. నాడు సిద్ధం సభలు.. నేడు బస్సు యాత్రకు వస్తున్న స్పందనను చూస్తుంటే.. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని పలువురు రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

**మరో చారిత్రక విజయం ఖాయం**

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ మీడియా సంస్థలు, చాణక్య, బీపీఎస్, జన్‌మత్ పోల్స్, లోక్ పోల్స్, పోల్ స్ట్రాటజీ గ్రూప్, పొలిటికల్ క్రిటిక్, మాట్రిజ్ వంటి పొలిటికల్ కన్సల్టెన్సీలు అటు దేశ వ్యాప్తంగా.. ఇటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నాడి తెలుసుకునేందుకు ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తున్నాయి. టైమ్స్‌నౌ-ఈటీజీ, జీన్యూస్-మాట్రిజ్, డెక్కన్ 24/7 వంటి జాతీయ మీడియా సంస్థలు.. చాణక్య, మాట్రిజ్ నుంచి జన్‌మత్ పోల్స్ వరకూ పొలిటికల్ కన్సల్టెన్సీలు నిర్వహించిన డజనుకు పైగా సర్వేల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని వెల్లడించాయి. దాంతో జనసేన-బీజేపీతో చంద్రబాబు జట్టుకట్టారు. మూడు పార్టీల జెండాలు జత కలిసినా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ముందు కూటమి నిలబడలేదన్నది సర్వేల్లో వెల్లడైంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో మద్దతు పెరుగుతూ వస్తోందని సర్వేలు వెల్లడించాయి. సుమారు 50 శాతానికిపైగా ఓట్లతో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని మార్చి రెండో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకు నిర్వహించిన సర్వేలు తేల్చి చెబుతున్నాయి.

**మార్చి రెండో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకూ జాతీయ మీడియా సంస్థలు, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేల్లో వెల్లడైంది ఇదీ..**

| సర్వే సంస్థ పేరు | వైఎస్సార్‌సీపీ గెలిచే స్థానాలు | | | టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గెలిచే స్థానాలు | | |
|---|---|---|---|---|---|---|
| | ఓట్ల శాతం | శాసనసభ | లోక్‌సభ | ఓట్ల శాతం | శాసనసభ | లోక్‌సభ |
| డెక్కన్ 24/7 | 51 | 135-140 | 21-22 | 46 | 35-40 | 3-4 |
| న్యూస్ ఎరినా ఇండియా (ఎలక్‌సెన్స్) | 50.38 | 127 | - | 45.58 | 48 | - |
| టైమ్స్‌నౌ-ఈటీజీ | 49 | - | 21-22 | 45 | - | 3-4 |
| జీన్యూస్-మాట్రిజ్ | 48 | 133 | 19 | 44 | 42 | 6 |
| బీపీఎస్ (భారత్ పొలిటికల్ సర్వే) | 54.2 | 150-156 | 21-23 | 42.9 | 19-25 | 2-4 |
| చాణక్య | 49.2 | 102-107 | 16 | 45.1 | 55-60 | 8 |
| జన్‌మత్ పోల్స్ | 49.8 | 120-123 | 20-21 | 46.2 | 52-53 | 4-5 |

## గుసగుస

### ఇంట గెలవనోడు..



ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నది నానుడి. జనసేనాని పవన్‌కల్యాణ్ మాత్రం ఇంటి మాట దేవుడెరుగు.. రచ్చ గెలిచి బీజేపీ అధిష్టానం వద్ద మార్కులు కొట్టేస్తే చాలనుకుంటున్నట్లున్నారు. తమ పార్టీ అభ్యర్థుల తరఫున ఒక రోజు ప్రచారం చేస్తే.. వారం రోజులు జ్వరం తెచ్చుకునే ఆయన ఇప్పుడు తమిళనాడు బాటపట్టనున్నారు. చెన్నై సౌత్ బీజేపీ అభ్యర్థి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ గెలుపు కోసం ఈయన ప్రచారం చేస్తారట. ఇప్పటికే తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై కోసం లోకేశ్ ప్రచారం చేసినా.. పెద్దగా ఫాయిదా రాలేదట. ఇప్పుడు పవన్‌ని పంపిస్తే అక్కడున్న తెలుగువారి ఓట్లన్నీ గంపగుత్తగా వచ్చేస్తాయని, రాష్ట్ర బీజేపీలో ఉంటూ టీడీపీతో అంటకాగే నేతలు చెప్పారట. దీంతో కొన్నాళ్లయినా ఇక్కడి టీడీపీ తరఫున ప్రచారం చేసే అగత్యం తప్పుతుందని, పవన్ బ్యాగ్ సర్దుకుని చెన్నై చెక్కేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### కాయ పేరు చెప్పి..



చెట్టుపేరు చెప్పి కాయలమ్మడం మనకు తెలుసు. నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ మాత్రం కాయ పేరు చెప్పి.. చెట్టు(తన)ను అమ్మకానికి పెడుతున్నారు. తన కుమారుడు డాక్టర్ కృష్ణతేజ ఆర్థిక భరోసా, మంది బలానికి తోడు, నిండా ముంచిన జనసేనాని, తన వర్గం (గోరంట్ల బుచ్చయ్యచౌదరి) కోసం సీటు కాజేసిన చంద్రబాబు చెప్పిన మాటల్ని నమ్మి రాజమండ్రి రూరల్‌ని వదిలి నిడదవోలు చేరారు. ఇక్కడ టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ బూరుగుపల్లి శేషారావు, కుందుల సత్యనారాయణ వర్గం దుర్గేష్‌కు అడుగడుగునా ధమ్కీ ఇస్తోంది. కుందుల ప్రచారానికి వస్తే తానొచ్చేది లేదని శేషారావు చెప్పేశారట. దీంతో కుందులతో కందుల కలవలేని పరిస్థితి. బూరుగుపల్లితో కలిసి కందుల ప్రచారం చేయడంతో కుందుల వర్గం రగిలిపోతోందట. తమ నాయకుడి వద్ద భారీగా సొమ్ము తీసుకుని, టికెట్ హామీ ఇచ్చి, మాట తప్పిన లోకేశ్‌కు బుద్ధి చెప్పేందుకైనా కందుల దుర్గేష్‌ను ఓడించి తీరతామని భీష్మ ప్రతిజ్ఞ చేశారట. దీంతో కందుల తనయుడు రాజమండ్రిలోని కడియం నుంచి ఓ 200 మందిని నిడదవోలు పంపించి, తన తండ్రికి ప్రచారంలో సహకారం అందిస్తున్నారట.


### పురందేశ్వరి దెబ్బ.. బీజేపీ అబ్బా



రాష్ట్రంలో బీజేపీని మరో పదేళ్ల వరకు కోలుకోలేనంత పెద్ద దెబ్బ కొట్టారట ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి. సోము వీర్రాజు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నంతవరకు పార్టీలో లేశమాత్రమైనా జవసత్వాలుండేవి. పురందేశ్వరి ప్రవేశించాక.. గంగ.. చంద్రముఖిలా మారినట్లు బీజేపీని మళ్లీ టీబీజేపీగా మార్చేశారు. కూటమి సర్దుబాటు సీట్లలో తమకు వచ్చిన స్థానాల్లో కూడా చంద్రబాబు సానుభూతి పరులకే కట్టబెట్టారు. ఇందుకు ప్రతిగా రాజమండ్రిలో తన గెలుపునకు చంద్రబాబు పనిచేస్తారని నమ్ముకున్నారు. ఇప్పటి వరకు బాబు ఆ దిశగా చేసిన ప్రయత్నాలు శూన్యమేనని బీజేపీ శ్రేణులు ఆక్షేపిస్తున్నాయి. బాబు నిర్లిప్తతకు కారణం రఘురామకృష్ణరాజుకు నర్సాపురం సీటు కేటాయించడంలో పురందేశ్వరి విఫలమవడమే. దీంతో కినుక వహించిన బాబు తన పార్టీ శ్రేణుల్ని అలర్ట్ చేయట్లేదట.

# జగన్ పాలనలో జనం హ్యాపీ

- సీఎం వైఎస్ జగన్ హయాంలో భారీగా పెరిగిన తలసరి ఆదాయం
- ఐదేళ్లలో పెరిగిన తలసరి ఆదాయం రూ.**88,448**
- చంద్రబాబు పాలనలో రూ.**60,128** మాత్రమే
- దేశ జాతీయ సగటును మించి రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల




**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెరుగుదలే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయనడానికి, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందనడానికి తలసరి ఆదాయమే కొలమానం. చంద్రబాబు ఐదేళ్ల పాలనలోకన్నా గత ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో తలసరి ఆదాయం పెరుగుదల ఎక్కువగా ఉంది. రెండేళ్లు కోవిడ్ సంక్షోభం నెలకొన్నప్పటికీ, దాన్ని అధిగమించి వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.88,448 పెరిగింది. కోవిడ్ సంక్షోభం లేకపోయినప్పటికీ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల రూ.60,128 మాత్రమే. చంద్రబాబు ప్రభుత్వం చివరి ఏడాది 2018-19లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,031 మాత్రమే ఉండగా, సీఎం జగన్ పాలనలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2,42,479కి పెరిగింది. అంతేకాకుండా 2019-20 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్లలో జాతీయ సగటును మించి రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల నమోదైంది. 2019-20లో దేశ జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1,34,432 ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,14,000కు చేరింది. ఇదే సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019-20లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,60,341 ఉండగా 2023-24 నాటికి రూ.2,42,479 కు చేరింది. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2018-19లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,031తో దేశంలో 17వ స్థానంలో ఉంది. కోవిడ్ సంక్షోభం ఉన్నప్పటికీ 2019-20లో రాష్ట్ర తలసరి ఆదాయం వరుసగా పెరుగుతూ 2022-23 నాటికి దేశంలోనే 9వ స్థానంలో రాష్ట్రం నిలిచింది.

### తలసరి ఆదాయం అంటే..

తలసరి ఆదాయం అనేది రాష్ట్ర జనాభా ఆర్థిక శ్రేయస్సు ముఖ్యమైన సూచిక. ఇది వ్యక్తులు, కుటుంబాలపై ఆచరణాత్మక ప్రభావాలను కలిగి ఉంటుంది. తలసరి ఆదాయం అంటే సాధారణంగా ప్రజలు వస్తువులు, సేవలపై ఖర్చు చేయడానికి డబ్బుని కలిగి ఉండటం. ఇది వారి జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది. విద్య, ఆరోగ్య సంరక్షణ, ఇతర అవసరాలను తీర్చడంలో ముఖ్యమైన అంశంగా ఉంటుంది. ఏదైనా రాష్ట్రం, ఆ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కొలమానం తలసరి ఆదాయమే.

### జగన్ సర్కారు కోవిడ్ సంక్షోభాన్ని అధిగమించిందిలా..

రెండేళ్ల పాటు కోవిడ్ సంక్షోభంతో రాష్ట్రానికి ఆదాయం తగ్గిపోయినప్పటికీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం నవరత్నాల పథకాలను యథాతథంగా అమలు చేసింది. ఈ సమయంలో ప్రజల చేతుల్లో డబ్బులు ఉంటేనే ఆర్థిక రంగానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ చేసింది. జీవనోపాధి కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకొంది. వ్యవసాయంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, అభివృద్ధి కార్యకలాపాలు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంది. ప్రజల ఆదాయ మార్గాలను పెంచేందుకు అన్ని రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగే వాతావరణాన్ని కల్పించింది. ఫలితంగా కోవిడ్ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించింది. రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల ఎక్కువగా నమోదైంది.

## మీకు తెలుసా?

### వైరిచర్ల వర్సెస్ శత్రుచర్ల


2009లో రద్దయిన పార్వతీపురం (ఎస్టీ) లోక్‌సభ నియోజకవర్గంలో శత్రుచర్ల, వైరిచర్ల గిరిజన రాజవంశీకుల మధ్య పోటీ ఉండేది. 1952 నుంచి 2004 వరకు 14 సార్లు ఇక్కడ ఎన్నికలు జరగగా, ప్రతిసారి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్, శత్రుచర్ల విజయరామరాజు పోటీ పడ్డారు. 1977, 1980, 1984 ఎన్నికల్లో వైరిచర్ల ఎన్నికయ్యారు. 1989, 1991, 1998 ఎన్నికల్లో శత్రుచర్ల గెలిచారు.

### పదిసార్లు గెలిచిన తండ్రీకొడుకులు

శ్రీకాకుళం జిల్లా సోంపేట నియోజకవర్గంలో తండ్రీ కొడుకులు పదిసార్లు గెలుపొందారు. గౌతు లచ్చన్న 1952 నుంచి వరుసగా నాలుగుసార్లు, 1978లో ఒకసారి విజయం సాధించగా, ఆయన కుమారుడు గౌతు శ్యామ సుందర శివాజీ 1985 నుంచి వరుసగా ఐదుసార్లు గెలుపొందడంతో వీరిద్దరే దాదాపు 50 ఏళ్లు సోంపేటకు ప్రాతినిధ్యం వహించారు. ఈ నియోజకవర్గం 2009లో రద్దయ్యింది.

## ఇంటర్వ్యూ

# ఏపీలో పాలన ఎక్స్‌ట్రార్డినరీ... అంతే!



- మా ఇంట్లో పనివారి జీవితాలే అందుకు సాక్ష్యం
- ప్రస్తుతం నేను రాజకీయాల్లో లేను...
- ఏ పార్టీతోనూ నాకు సంబంధాలు లేవు...
- నేను గమనించిన విషయం చెప్తున్నానంతే...
- ప్రముఖ సినీ నటుడు రఘుబాబు

తెలుగు నేలకు తేజస్సు వచ్చింది అంటున్నారు ప్రముఖ సినీ నటుడు రఘుబాబు. 'జగన్ ప్రభుత్వ పరిపాలన గురించి సింపుల్‌గా చెప్పాలంటే ఎక్స్‌ట్రార్డినరీ అంతే. అంతకుమించి చెప్పడానికి మరో మాట నా దగ్గర లేదు.' అంటూ కుండబద్దలు కొట్టేశారాయన. తాను ప్రస్తుతం రాజకీయాల్లో లేననీ ఏ పార్టీతోనూ ఎటువంటి సంబంధాలు లేవనీ. ఏ అవసరం కోసమైనా అబద్ధాలు చెప్పాల్సిన అవసరం తనకు లేదంటున్న ఆయన తన సొంత ఊరిలోని తన ఇంట్లో పనిచేసే పనివారి జీవితాల్లో వచ్చిన మార్పే ప్రస్తుత పాలనకు నిదర్శనం అన్నారు. 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే...

### అనూహ్యమైన పాలన ఇది..

నిజంగా జగన్ పరిపాలన ఈ స్థాయిలో ఉంటుందని గత ఎన్నికల ముందు నేను ఏమాత్రం ఊహించలేదు. ఈ రకమైన అద్భుతమైన మార్పుల్ని నేను ముందుగా ఊహించలేదనేది నిజం. రాష్ట్రంలో మూలాల నుంచి మార్పును జగన్ కోరుకుంటున్నారనేది నాకు అనిపిస్తోంది. ఇప్పుడు మారుమూల ఊళ్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు చూస్తుంటే విదేశాల్లోని స్కూల్స్ గుర్తొస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం అంటే అవమానంగా భావించేవారు. ఆ దశ పోయి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకడం లేదని బోర్డులు పెట్టడం అంటే వాటి గొప్పతనం తెలుస్తుంది. అవి కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా మారడంతో అంతకు ముందు 20, 30శాతం కూడా విద్యార్థులు కనిపించని పరిస్థితి నుంచి ఇప్పుడు 100 శాతం ఆక్యుపెన్సీ నేను గమనించాను.

### మా సొంత ఊళ్లో... ఎంత మార్పో!

మాది ప్రకాశం జిల్లాలోని రావినూతల గ్రామం. తరచుగా మా ఊరుకు వెళుతుంటాం. దాంతో ఆ గ్రామంలో వచ్చిన మార్పులు ఎన్నో మాకు తెలుస్తున్నాయి. గ్రామ సచివాలయాలు కావచ్చు, వలంటీర్లు ఇళ్లకు రావడం... ప్రభుత్వ పథకాలు, ప్రతీదీ ఇంటికి తీసుకొచ్చి అందించడం గొప్పగా అనిపిస్తోంది. అక్కడ మా ఇంట్లో పని చేసే పనివాళ్ల పిల్లలు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాల్ని ఉపయోగించుకుని దర్జాగా రాజమండ్రిలోని ఇంజనీరింగ్ కాలేజ్‌లో చదువుకోగలుగుతున్నారు. ఇది మేం ఊహించని మార్పు. మేం వాళ్లు చేసే పనికి తగ్గ జీతాలు ఇచ్చినా... అడపాదడపా అదనంగా ఆర్థిక సాయం చేసినా కూడా వాళ్ల జీవితాల్ని సమూలంగా మార్చలేం. ఇప్పుడు అమలవుతున్న ప్రభుత్వ పథకాల వల్ల వాళ్ల జీవితాలు మారిపోతున్నాయి. పిల్లలు బాగా చదువుకోగలగడం వల్ల ఎన్నడూ చూడనంత ఆత్మవిశ్వాసం వారిలో కనిపిస్తోంది. ఇది మాకు చాలా ఆనందాన్ని అందిస్తోంది. ఈ పథకాలు ఇలాగే కొనసాగాలని, ఈ పాలన పేదలకు మరింత కాలం మేలు కలుగజేయాలని కోరుకుంటున్నాను.

– సత్యార్థ్

## క్లుప్తంగా...

### దళితబంధు పేరుతో కోట్లు వసూలు చేశారు

● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం



వేలేరు: తాటికొండ రాజయ్య ఓ దొంగ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓ గజదొంగ.. అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో దళితబంధు పేరుతో పేద దళితుల దగ్గర రూ.కోట్లు వసూలు చేశాడని, వాటి ఆధారాలు తన వద్ద ఉన్నాయని ప్రకటించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రాష్ట్రంలోనే అత్యంత అవినీతిపరుడని, గతంలో ప్రారంభించిన పైప్‌లైన్ పనుల్లో రూ.104 కోట్లు కాంట్రాక్టర్ వద్ద రూ.6 శాతం కమీషన్లు తీసుకున్నాడని ఆరోపించారు. ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకుని వైద్య కళాశాల, వర్సిటీలు, భూకబ్జాలు, తమ్ముడి పేరుతో అనేక అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, రాజేశ్వర్‌రెడ్డి అవినీతి నిరూపిస్తే తన పదవికి ఆయన రాజీనామా చేయాలని సవాల్ విసిరారు.

### 'బీజేపీ రైతు వ్యతిరేక విధానాలను వివరించాలి'

సాక్షి, హైదరాబాద్: బీజే పీ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను పార్లమెంటు ఎన్నికల్లో రైతులకు వివరించాలని జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అఖిలేష్ శుక్లా సూచించారు. గాంధీభవన్‌లో మంగళవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధ్యక్షతన కిసాన్ కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో శుక్లా మాట్లాడుతూ స్వామినాథన్ సిఫారసులను బీజేపీ అమలు చేయకపోవడంతో ధాన్యానికి క్వింటాపై రూ.664 తేడా వచ్చిందని, ఎకరానికి రూ.15818 రైతులు నష్టపోతున్నారని వివరించారు. కనీస మద్దతు ధరను చట్టబద్ధత చేయడంలో బీజేపీ విఫలమైందని విమర్శించారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డి పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ నిర్ణయం శుభపరిణామం

దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మికులకు బీమా కల్పించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణ యం శుభపరిణామమని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. గల్ఫ్ కార్మికుల్లో 80 శాతం పైచిలుకు బీసీలే ఉన్నారని, గల్ఫ్ దేశాలకు భారతీయ కార్మికులు నేడు ఒక నిత్యావసరంగా మారిన విషయాన్ని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. లాభాలను ఆర్జించవచ్చని వెల్లడించారు. మన ఉత్పత్తులను దుబాయ్‌లోని అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానం చేసేలా సీఎం చొరవ చూపాలని సురేశ్ విజ్ఞప్తిచేశారు.

### ఇంద్రవెల్లి అమరుల స్ఫూర్తి సభలు జరపండి

మావోయిస్టు తెలంగాణ కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖ


సాక్షి, హైదరాబాద్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తిని చాటేలా ఈనెల 20న రాష్ట్రంలోని గ్రామాలు, గూడేలు, బస్తీల్లో, పట్టణాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖరాశారు. ఇంద్రవెల్లి అమరుల పోరాట స్ఫూర్తితో ఆదివాసులు, ఆదివాసేతరులు, కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాలని జగన్ తన లేఖలో కోరారు.

### వడదెబ్బతో పోస్టుమన్ మృతి

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పోస్టుమన్ గూళ్ల ఎల్లయ్య (52) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం ఎండలోనే తిరుగుతూ ఉత్తరాలు బట్వాడా చేశాడు. అనంతరం ఇంటికి రాగానే సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎల్లయ్య మృతి చెందాడు.

### సీట్లివ్వకుంటే బీజేపీని బొంద పెడతాం

చెన్నయ్య హెచ్చరిక



పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వుడ్ పార్లమెంట్ స్థానాల్లో ఒకటి, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని మాలలకు కేటాయించని పక్షంలో బీజేపీని బొంద పెడతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. ఆయన మంగళవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ దేశవ్యాప్తంగా 400 సీట్లు సంపాదించి రాజ్యాంగాన్ని సంపూర్ణంగా మార్చేందుకు కుట్ర చేస్తోందన్నారు.

భద్రాచలం జిల్లా

# చుంచుపల్లిలో 44.2 డిగ్రీలు

● చాలా చోట్ల సాధారణం కంటే 3 డిగ్రీల మేర పెరుగుదల
● రాష్ట్రంలో వేడెక్కిన వాతావరణం
● నేటి నుంచి మరింతగా పెరగనున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పులు కూడా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత నాలుగైదు రోజులుగా కాస్త చల్లబడ్డ గరిష్ట ఉష్ణోగ్రతలు మళ్లీ వేగంగా పెరిగాయి. మంగళవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదయ్యాయి. అధిక ఉష్ణోగ్రతలకు తోడుగా ఉక్కపోత... పలు ప్రాంతాల్లో వడగాల్పుల ప్రభావంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మంగళవారం రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 42.6 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.3 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఖమ్మంలో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 5.1 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదు కాగా, భద్రాచలంలో 3 డిగ్రీలు, నల్లగొండతో పాటు పలు ప్రాంతాల్లో 2 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కావడం గమనార్హం.

**పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యాయి. రాష్ట్ర ప్రణాళిక శాఖ వాతావరణ పరిశీలన కేంద్రాల్లో నమోదైన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో అత్యధికంగా భద్రాచలం జిల్లా చుంచుపల్లిలో గరిష్ట ఉష్ణోగ్రత 44.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలో ఇదే అత్యధికం. ఆ తర్వాత నల్లగొండ జిల్లా మాడుగులపల్లిలో 43.8 డిగ్రీలు, ములుగు జిల్లా మంగపేటలో 43.8డిగ్రీలు, నిజామాబాద్‌లో 43.3 డిగ్రీలు, కరీంనగర్ జిల్లా వీణవంకలో 43.2 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా మంథనిలో 43.1 డిగ్రీలు, మహబూబా బాద్ జిల్లా మరిపెడలో 43.0 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**నేటి నుంచి మరింతగా**

బుధవారం నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. సాధారణ ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదుకావొచ్చని అంచనా వేసింది. రాష్ట్రానికి దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు వివరించింది. గరిష్ట ఉష్ణోగ్రతలకు తోడుగా రెండు రోజుల పాటు వడగాల్పులు వీస్తాయని సూచించింది.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు(సెల్సియస్‌లలో)

| కేంద్రం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| భద్రాచలం | 42.6 | 27.0 |
| ఖమ్మం | 42.5 | 26.0 |
| రామగుండం | 41.6 | 24.8 |
| నల్లగొండ | 41.5 | 24.4 |
| నిజామాబాద్ | 41.4 | 26.7 |
| మహబూబ్‌నగర్ | 41.2 | 27.1 |
| ఆదిలాబాద్ | 40.8 | 26.2 |
| మెదక్ | 40.6 | 22.3 |
| హనుమకొండ | 40.5 | 25.0 |
| హైదరాబాద్ | 39.8 | 27.1 |
| హకీంపేట్ | 39.0 | 26.9 |
| దుండిగల్ | 38.6 | 25.4 |



మంగళవారం ఆదిలాబాద్‌లో పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరైన మాజీ మంత్రులు కేటీఆర్, జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు ఎండవేడికి తాళలేక ఇబ్బందిపడ్డారు. సమావేశం ఆద్యంతం పార్టీ కండువాలతో చెమటను తుడుచుకుంటూ కనిపించారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బాసర ట్రిపుల్ ఐటీలో

## మరో విద్యార్థి ఆత్మహత్య



అరవింద్ (ఫైల్)

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పీయూసీ–2 చదువుతున్న బుచ్చుక అరవింద్ హాస్టల్ గదిలో మంగళవారం ఉరివేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన అరవింద్ ఇటీవలే ఇంటికి వెళ్లి ఈ నెల 12న క్యాంపస్‌కు తిరిగివచ్చాడు. హాజరుశాతం తక్కువగా ఉందని అరవింద్‌ను అధికారులు పరీక్షకు అనుమతించలేదని సమాచారం. దీంతో మనస్తాపం చెందిన అరవింద్..తోటి విద్యార్థులు పరీక్షకు వెళ్లిన కొద్దిసేపటికే ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

**మృతికి కళాశాల యాజమాన్యమే కారణం**

తొగుట(దుబ్బాక): తమ కుమారుడు ఆత్మహత్యకు కళాశాల యాజమాన్యమే కారణమని అరవింద్ తల్లిదండ్రులు ఆరోపించారు. అరవింద్‌కు నాలుగు నెలల క్రితం డెంగీ సోకిందని, చికిత్స చేయించుకొని తిరిగి కళాశాలకు వెళ్లాడని వారు చెప్పారు. అయితే హాజరుశాతం తక్కువగా ఉందని, పరీక్షలకు అనుమతించమని చెప్పారని, దీంతో ఫీజు కట్టడానికి తాను డబ్బులు పంపామన్నారు. అయినా తమ కుమారుడిని పరీక్షలకు అనుమతించకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు వారు కన్నీటిపర్యంతమయ్యారు.

**ఐదు నెలల్లో ముగ్గురు**

● బాసర ఆర్జీయూకేటీలో గడిచిన ఐదునెలల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.
● 2023, నవంబర్ 25న నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. ● 2024, ఫిబ్రవరి 22న రంగారెడ్డి జిల్లాకు చెందిన టి.శిరీష ఆత్మహత్య చేసుకుంది.
● తాజాగా అరవింద్ ఆత్మహత్య చేసుకున్నాడు.
● 2023–24 విద్యాసంవత్సరంలో ఆర్జీయూకేటీలో మొత్తం ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా బాసరలోనే ఎక్కువ మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. క్యాంపస్‌లో ఉండే అధికారులు విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేయలేకపోతున్నారు. 9 వేల మంది విద్యార్థులు చదివే క్యాంపస్‌లో విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి సారించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

### మాదిగలను అస్థి పంజరాలుగా మార్చే కుట్ర

● ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, నాగర్‌కర్నూల్: మాదిగలు, దళితులను అస్థిపంజరాలుగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రపన్నిందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో మాదిగల రాజకీయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల ఆత్మగౌరవ సభకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలసి హాజరయ్యారు. బీఎస్పీ అధినేత మాయావతి అనుమతితోనే బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని ప్రకటన చేశానని, మరుసటి రోజే పొత్తు వద్దని ఆమె చెప్పారన్నారు. దీని వెనుక కాంగ్రెస్ కుట్ర దాగి ఉందని చెప్పారు. రాష్ట్రంలో పేద విద్యార్థుల కోసం వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేసిన పార్టీలో తాను చేరానని, దళితులను అణచివేసే పార్టీలో కాదని చెప్పారు.

### సీఎంకు కురుమల గోస పట్టదా?

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడిన కురుమల గోస పట్టదా? అంటూ ముఖ్యమంత్రిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి సి.రమేశ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కురుమల ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రత్యేకంగా కురుమ కార్పొరేషన్, ఉన్ని బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని, కురుమ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. కురుమలకు రూ.10 లక్షల ప్రమాద బీమా, గొర్రెల పెంపకందారులు, గొర్రెలకు బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సౌధ అటాచ్

● 20 ఏళ్ల క్రితం పూర్తయిన పనుల కేసులో కోర్టు ఉత్తర్వులు
● జూన్ 5న తమ ముందు హాజరుకావాలని సీఈకి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధ భవనాన్ని ఓ కేసులో అటాచ్ చేస్తూ ప్రిన్సిపల్ స్పెషల్ కోర్టు (ట్రయల్ అండ్ డిస్పోజల్ ఆఫ్ కమర్షియల్ డిస్పూట్స్) ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 5న తమ ముందు హాజరుకావాలని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్(ఆర్‌డీ)ని ఆదేశించింది. అయితే ఈ నోటీసులు తీసుకునేందుకు ట్రాన్స్‌కో అధికారులు నిరాకరించారు. దీంతో కోర్టు వర్గాలు నోటీసులను అక్కడ గోడకు అంటించి వెళ్లాయి. 1999 సంవత్సరంలో రూ.2,63,00,000 అంచనా వ్యయం కింద నల్లగొండ జిల్లాలో సబ్ స్టేషన్ల ఏర్పాటు కోసం విజయ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు ప్రభుత్వం పనులు అప్పగించింది. ఈ పనులను పూర్తి చేయడానికి ఆరు నెలల గడువిచ్చింది. అయితే స్థలాల అప్పగింత, మెటీరియల్ సరఫరాలో జాప్యం, సకాలంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో 2002, జనవరిలో పనులు పూర్తయ్యాయి. పనులు ముగిసినా ప్రభుత్వం నుంచి రావాల్సిన కొంత మొత్తం చెల్లింపులు ఆగిపోయాయి. ఈ చెల్లింపుల పరిష్కారానికి 2005లో జస్టిస్ పీఎల్ఎన్ శర్మ ఆర్బిట్రేటర్‌గా నియామకమయ్యారు. రూ.1,04,35,583 విజయ్ ఎలక్ట్రికల్స్‌కు చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి 2009లో ఆదేశాలు జారీ చేశారు. అయితే దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం 2011లో కోర్టును ఆశ్రయించగా, ఇది 2022లో డిస్మిస్ అయ్యింది. దీంతో విజయ్ కంపెనీ 2023లో సివిల్ కోర్టులోని కమర్షియల్ కోర్టును ఆశ్రయించింది. ట్రాన్స్‌కో సీఈ(ఆర్ఈ), సీఈ(ప్రాజెక్టులు), నల్లగొండ టీఎస్పీడీసీఎల్ ఎస్ఈని ప్రతివాదులుగా పేర్కొంది. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన స్పెషల్ కోర్టు విచారణను జూన్ 5కు వాయిదా వేసింది. విజయ్ కంపెనీకి రూ.2,56,30,759 చెల్లించే వరకు భవనాన్ని విక్రయించకుండా, తాకట్టు పెట్టకుండా అటాచ్‌లోనే ఉంచనున్నట్లు పేర్కొంది.

ఒకే ఒక్క రైస్ మిల్లు...

## రూ. వంద కోట్ల ధాన్యం దగా

● కొమరబండంలోని శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ నిర్వాకం
● సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించినట్లు గుర్తించిన అధికారులు
● మిల్లుపై రాష్ట్ర విజిలెన్స్ అధికారుల ఆకస్మిక దాడులు
● పరారీలో మిల్లు యజమాని నీల సత్యనారాయణ



అధికారులు దాడులు నిర్వహించిన కోదాడలోని శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్

కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ సమీపంలోని కొమరబండంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ప్రభుత్వం సరఫరా చేసిన రూ.100 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. గడిచిన రెండేళ్లుగా సీఎంఆర్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఈ మిల్లుపై మంగళవారం రాష్ట్ర విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు 30 మంది బృందంగా ఏర్పడి మూకుమ్మడి దాడి చేశారు. దాడి విషయాన్ని ముందుగానే పసిగట్టిన మిల్లు యజమాని నీలా సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, మిల్లు భాగస్వాములు పరారైనట్లు అధికారులు తెలిపారు. దాడుల నిర్వహిస్తున్న టీమ్‌లకు జిల్లా అడిషినల్ కలెక్టర్ బీఎస్ లత, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, పోలీస్ అధికారులు సహకారం అందించారు.

**3 సీజన్‌ల నుంచి బియ్యం ఇవ్వడంలేదు.**

కొమరబండ వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండ్రస్ట్రీస్ గత రెండేళ్లుగా, మూడు సీజన్‌లకు సంబంధించి సుమారు రూ.90 కోట్ల విలువ చేసే కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉందని అధికారులు తెలిపారు. 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 15,628 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా కేవలం 7,067 టన్నులు ఆ మిల్లు ఇచ్చిందనీ, 8,607 టన్నుల బియ్యం బకాయి పడిందని చెప్పారు. ఇక ఇదే సంవత్సరం యాసంగి సీజన్‌కు సంబంధించి 10,408 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 202 టన్నుల బియ్యం మాత్రమే సదరు మిల్లు నుంచి వచ్చిందని, 10, 206 టన్నులు బకాయి పడిందని వివరించారు. దీంతో పాటు 2023–24 వానాకాలం సీజన్‌కు సంబంధించి 2748 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 261 టన్నులు మాత్రమే వచ్చిందనీ, ఇంకా 2487 టన్నులు బకాయి ఉందని తెలిపారు. ఈ మూడు సీజన్‌లకు సంబంధించి మొత్తం 21,300 టన్నుల బియ్యం ఇవ్వాలని దీని విలువ రూ.90 కోట్ల వరకు ఉంటుందని, అపరాధ రుసుంతో కలిపితే దాదాపు రూ.100 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

**ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లర్**

కోదాడకు చెందిన శ్రీ వెంకటేశ్వరరైస్ ఇండ్రస్ట్రీస్ యజమాని నీల సత్యనారాయణ కస్టమ్ మిల్లింగ్ రైస్ సక్రమంగా ఇవ్వకపోవడంతో 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించి మిల్లుకు కేటాయించిన 15,237 టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర స్థాయిలో వేలం వేశారు. వేలంలో ధాన్యం దక్కించుకున్న వారు మిల్లు వద్దకు ధాన్యం కోసం వెళితే అక్కడ ఆ ధాన్యం లేదని చెప్పి, దాన్ని మర పట్టించి ఆ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నట్లు అధికారులు తెలిపారు. ఇలా ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్‌పై పూర్తి నివేదికను రాష్ట్ర కమిషనర్‌కు అందిస్తామని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు

## రేవంత్ కుట్ర

● ఫోన్ ట్యాపింగ్ పేరిట కేసీఆర్, కేటీఆర్ ప్రతిష్టపై బురద
● కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: కొందరు పోలీసు అధికారులను బదిలీ చేయడం ద్వారా రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని భారత రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషనర్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి మంగళవారం బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం సమర్పించారు. గత నెల 16వ తేదీ నుంచి తెలంగాణలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓ సామాజిక వర్గానికి చెందిన అధికారులను లక్ష్యంగా చేసుకుని కొందరు పోలీసు అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తద్వారా బీఆర్ఎస్ నాయకత్వం ప్రతిష్టను దెబ్బతీసి, ఎన్నికల్లో కాంగ్రెస్ అనుకూల వాతావరణం ఏర్పడేలా పనిచేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి నుంచి ఎప్పటికప్పుడు అందుతున్న ఆదేశాలకు అనుగుణంగా హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్.విజయ్‌కుమార్‌తో పాటు విచారణ అధికారిగా ఉన్న బంజారాహిల్స్ ఏసీపీ వెంకటగిరి కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగులో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాత్ర ఉందంటూ మీడియాకు లీకులు ఇస్తున్నారన్నారు. కేటీఆర్ చేతిలో నాలుగుమార్లు ఓటమి పాలైన కేకే మహేందర్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేసిన నిరాధార ఫిర్యాదులను పోలీసులు స్వీకరించినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేత జైలు కూడు తినిపిస్తానని ముఖ్యమంత్రి కాక ముందు, ఆ తర్వాత కూడా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని పలు ఆధారాలను కూడా బీఆర్ఎస్ పార్టీ ఈసీకి సమర్పించింది. ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్, కేటీఆర్‌పై త్వరలో కేసులు నమోదు అవుతాయని మంత్రులు కూడా వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయాలని పోలీసు, రెవెన్యూ యంత్రాంగంపై సీఎం రేవంత్ ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఎలాగైనా బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ లేకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ ప్రయత్నిస్తున్నాడని ఈసీకి పంపిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కొన్ని మీడియా సంస్థలతో కాంగ్రెస్ చేతులు కలిపి బీఆర్ఎస్ ఎన్నికల అవకాశాలను దెబ్బతీసే ప్రయత్నాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

హామీలు అమలు చేయకుంటే

## రేవంత్ రాజీనామా చేస్తారా?

● బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్
● మళ్లీ బూటకపు మాటలతో మోసం చేసేందుకు సిద్ధం
● రేవంత్ ఓ గజినీ.. ఎప్పుడు ఏ ప్రకటన చేస్తారో తెలియదని ధ్వజం
● రేపు సీఎం జైలుకెళ్లినా.. అది బీజేపీ పనే అంటారని విమర్శ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన రుణమాఫీ వంటి హామీలన్నీ సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15లోగా అమలు చేస్తారా లేక సీఎం పదవికి రాజీనామా చేస్తారా అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్ తీరు చూస్తుంటే హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. అసలు ఇచ్చిన హామీల మీద సీఎంకు పట్టుందా? వాటికి కావాల్సిన నిధుల కోసం ఎప్పుడైనా ఆలోచించారా..? అని నిలదీశారు. మంగళవారం మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారెంటీలను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇచ్చారని చెప్పి రేవంత్ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ ఓ గజినీ అని ఎప్పుడు ఏం స్టేట్‌మెంట్ ఇస్తారో ఆయనకే తెలీదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర రైతాంగాన్ని మళ్లీ బూటకపు మాటలు, హామీలతో మోసం చేసేందుకు సీఎం సిద్ధమయ్యారని విమర్శించారు.

**ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఐదు సీట్లు కూడా రావు**

రేవంత్‌కు అప్పుడే లోక్‌సభ ఎన్నికల ఓటమి భయం పట్టుకుందని మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఐదు సీట్లు కూడా గెలిచే అవకాశం కూడా లేదని, ఇప్పటికే దీనిపై రేవంత్‌కి ఇంటెలిజెన్స్ రిపోర్ట్ కూడా అందిందన్నారు. డమ్మీ అభ్యర్థులు అంటూ ఇతర పార్టీల గురించి మాట్లాడుతున్న సీఎం కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థుల మాటేమిటో చెప్పాలన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కలిసి నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి జైలుకి వెళ్లినా అది బీజేపీ పనే అంటారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

## మెగా ఫుడ్ పార్కుతో రాష్ట్రం నుంచి ఎగుమతులు

● వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: మెగా ఫుడ్ పా ర్కులోని ప్రాసెసింగ్ యూనిట్లతో రాష్ట్రం నుంచి ఎగుమతులు ఎక్కువై.. పంట ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. పంటలు సాగుచేసే రైతుల్లో నమ్మకం, సాగు విస్తీర్ణం పెరుగుతాయని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో రాష్ట్రవాటాగా వచ్చే నిధులను మెగాఫుడ్ పా ర్కుకు సంపూర్ణంగా వినియోగించుకొనేందుకు ప్ర ణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మెగా ఫుడ్ పార్కుపై సంబంధిత అధికారులతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించారు. ఖమ్మం జిల్లా బుగ్గపాడు(సత్తుపల్లి మండలం)లోని 60 ఎకరాలలో 109.59 కోట్ల వ్యయంతో చేపట్టే మెగాఫుడ్ పార్కులో ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మెగాఫుడ్ పార్కులో ఆయిల్ పాం, కొబ్బరి, కోకో, మామిడి పంటల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం సంబంధిత కంపెనీలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించారు. ఇప్పటికే 6 కంపెనీలు యూనిట్లు నెలకొల్పడానికి ముందుకు వచ్చాయని మంత్రి తెలిపారు. ఫుడ్ పార్కులో లీజు ప్రాతిపదికన యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు అనుమతుల మంజూరు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

**ఆయిల్ పాంలో పెంపకంలో వేగం పెంచాలి**

గత మూడేళ్లలో కాలంలో ఆయిల్ పాం ప్లాంటేషన్‌లో పురోగతి, లక్ష్యాలపై మంత్రి సమీక్షించారు. తక్కువ పురోగతి ఉన్న కంపెనీలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ధాన్యం కొనుగోళ్ల తీరుపై సంతృప్తి

● మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పర్యటించిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం కొనుగోళ్ల తీరుపై పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లతో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల అధికారులతో సమీక్షించి, ఇప్పటి వరకు సాగిన ధాన్యంసేకరణ తీరును అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి తరుగు పేరుతో అదనంగా ధాన్యం తీసుకోవడం గానీ, రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత మిల్లర్లు రైతులకు ఫోన్లు చేసి తరుగు తీయడం, ధాన్యం తిరస్కరించడం వంటి చర్యలను సహించేది లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లులకు చేరుతున్న తీరు, మిల్లుల్లో ధాన్యం నిల్వలను కూడా కమిషనర్ పరిశీలించారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలానికి చెందిన రైతు పల్లా సందీప్‌కు ఫోన్ చేసి, కొనుగోలు ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించిన రెండు రోజుల్లో డబ్బులు ఖాతాలో జమైనట్టు సందీప్ కమిషనర్‌కు చెప్పారు.

## రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే పీడీయాక్ట్

● దందాలో ఎంతటివారున్నా వదిలి పెట్టం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ: రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని..అలాంటి వారిపై పీడీయాక్ట్ నమోదు చేయిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఈ దందాను కొందరు వ్యాపారంగా మార్చారని, ఇక వారి ఆటలు సాగనివ్వబోమని, ఇందులో ఎంతటివారున్నా వదిలి పెట్టమన్నారు. ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఇప్పటికే ఆదేశించినట్టు తెలిపారు.

**ఇండియా కూటమిదే అధికారం**

లోక్‌సభ ఎన్నికల్లో ఇండియాకూటమి దేశవ్యాప్తంగా మెజారిటీ సీట్లు సాధించి అధికారంలోకి రాబోతుందని మంత్రి ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ దేశాన్ని మతపరంగా విభజించి ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రవిభజన సమయంలో తెలంగాణకు రావాల్సిన సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, హైదరాబాద్‌లో రెండున్నర లక్షల ఐటీ ఉద్యోగాల కల్పిస్తామని చెప్పిన బీజేపీ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 15 సీట్లకు పైగా గెలుస్తుందని, నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి దేశంలోనే అధిక మెజారిటీ సాధించబోతున్నాడని పేర్కొన్నారు.

## ‘తప్పించమని నేనే అడిగా’

ఐపీఎల్‌లో వరుస వైఫల్యాల తర్వాత శారీరకంగా, మానసికంగా కూడా విరామం అవసరమని తాను భావించానని...అందుకే తుది జట్టు నుంచి తనను తప్పించాలని తానే కోరినట్లు ఆర్‌సీబీ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ వివరణ ఇచ్చాడు. ముంబైతో మ్యాచ్‌లో వేలికి గాయం కాగా, అదే కారణంగా సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్‌ను ఆడించలేదని వినిపించగా... అదేమీ కారణం కాదని అతనే చెప్పాడు. ‘నేను తీసుకుంది సులువైన నిర్ణయం. కెప్టెన్, కోచ్‌ల వద్దకు వెళ్లి నా స్థానంలో మరొకరిని ప్రయత్నించేందుకు ఇది సరైన సమయమని చెప్పా. ప్రస్తుతం నాకు శారీరకంగా, మానసికంగా విరామం తప్పనిసరి అనిపించింది. అన్ని విధాలా కోలుకున్న తర్వాత మళ్లీ వచ్చి మెరుగైన ప్రదర్శన ఇవ్వగలనని నమ్ముతున్నా’ అని మ్యాక్స్‌వెల్ చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో ఆడిన 6 ఇన్నింగ్స్‌లలో కలిపి అతను 5.33 సగటుతో 32 పరుగులే చేశాడు. ఇందులో 3 సార్లు డకౌట్ కాగా, ఒక్కటే మ్యాచ్‌లో ఐదుకంటే ఎక్కువ బంతులు ఆడాడు. కోల్‌కతాతో మ్యాచ్‌లో రెండు సార్లు క్యాచ్ జారవిడిస్తే 19 బంతుల్లో 28 పరుగులు చేశాడు.



# రాయల్స్‌కు బట్లర్ జోష్


బట్లర్ విజయానందం

- వీరోచిత శతకంతో గెలిపించిన ఓపెనర్
- 2 వికెట్ల తేడాతో కోల్‌కతాపై రాజస్తాన్ విజయం
- నరైన్ మెరుపు సెంచరీ వృథా

**కోల్‌కతా:** కోల్‌కతాతో మ్యాచ్‌లో రాజస్తాన్ విజయలక్ష్యం 224...14 ఓవర్ల తర్వాత 128/6తో అసాధ్యంగా కనిపించింది. చివరి 6 ఓవర్లలో 96 పరుగులు కావాలి! ఈ దశలో బట్లర్ 42 పరుగుల వద్ద ఉన్నాడు. కానీ బట్లర్‌తో పాటు పావెల్ బ్యాటింగ్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. వరుసగా 6 ఓవర్లలో 17, 17, 16, 18, 19, 9 పరుగుల చొప్పున రాబట్టిన రాయల్స్ విజయాన్ని అందుకుంది. ఇందులో బట్లర్ 6 ఫోర్లు, 5 సిక్స్‌లు బాదగా...పావెల్ 1 ఫోర్, 3 సిక్స్‌లు బాదాడు. ఆఖరి ఓవర్లో తొలి బంతినే సిక్స్‌గా కొట్టి 55 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్న బట్లర్... సింగిల్ తీయకుండా ఆఖరి బంతి దాకా నిలబడి గెలిపించాడు. 15వ ఓవర్లో 36 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన బట్లర్ తర్వాత సంచలన ఇన్నింగ్స్ ఆడిన మరో 21 బంతుల్లోనే వందకు చేరుకున్నాడు. దీంతో మంగళవారం జరిగిన పోరులో రాజస్తాన్ రాయల్స్ 2 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై అనూహ్య విజయం సాధించింది. తొలుత నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. సునీల్ నరైన్ (56 బంతుల్లో 109; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు) తొలి సెంచరీ సాధించాడు. తర్వాత రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 224 పరుగులు చేసి గెలిచింది. జోస్ బట్లర్ (60 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. పావెల్ (13 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించాడు.

**నరైన్ ధనాధన్**

ఫిల్ సాల్ట్ (10) లైఫ్‌ను సద్వినియోగం చేసుకోకపోగా, రఘువంశీ (18 బంతుల్లో 30; 5 ఫోర్లు) రాణించాడు. ఓపెనర్ నరైన్ 4, 6తో జట్టు పవర్‌ప్లేలో 56/1 స్కోరు చేసింది. సగం ఓవర్లు (10) ముగిసేసరికి నైట్‌రైడర్స్ సరిగ్గా 100/1 స్కోరు చేసింది. నరైన్ సిక్సర్‌తో 29 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఆ మరుసటి ఓవర్లో కుల్దీప్ సేన్... రఘువంశీ ఆట ముగించడంతో రెండో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7), రసెల్ (13) జతయినా... పెద్ద స్కోర్లేమీ చేయలేకపోయారు. కానీ నరైన్ ఫోర్లు, సిక్స్‌లతో తన ఆట తీరును కొనసాగించాడు. చహల్ 16వ ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదేయడంతో ఆ ఓవర్లో 23 పరుగులు వచ్చాయి. దీంతోనే అతని సెంచరీ 49 బంతుల్లో పూర్తయ్యింది. 18వ ఓవర్లో బౌల్ట్ యార్కర్‌తో నరైన్ పోరాటానికి ముగింపు పలికాడు.


నరైన్

రింకూ సింగ్ (9 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మెరుపులతో నైట్‌రైడర్స్ 200 పైచిలుకు స్కోరు చేసేసింది.

**బట్లర్ మెరుపులతో...**

ఓపెనర్ యశస్వి జైస్వాల్ (9 బంతుల్లో 19; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడిన అది కాసేపే కావడం, టాపార్డర్‌లో కెప్టెన్ సంజూ సామ్సన్ (12) చెప్పుకోదగ్గ స్కోరే చేయలేక పోవడం రాజస్థాన్ లక్ష్యఛేదనపై ప్రభావం చూపింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఓపెనింగ్ చేసిన బట్లర్ క్రీజును అట్టిపెట్టుకున్నాడు. కానీ ధాటిగా ఆడలేకపోయాడు. రియాన్ పరాగ్ (14 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా ఆడే క్రమంలో వికెట్ కోల్పోగా... ధ్రువ్ జురెల్ (2), అశ్విన్ (8), హెట్‌మైర్ (0) చేతులెత్తేయడంతో 121 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది.

### ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × ఢిల్లీ
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| రాజస్తాన్ | 7 | 6 | 1 | 12 | 0.677 |
| కోల్‌కతా | 6 | 4 | 2 | 8 | 1.399 |
| చెన్నై | 6 | 4 | 2 | 8 | 0.726 |
| హైదరాబాద్ | 6 | 4 | 2 | 8 | 0.502 |
| లక్నో | 6 | 3 | 3 | 6 | 0.038 |
| గుజరాత్ | 6 | 3 | 3 | 6 | -0.637 |
| పంజాబ్ | 6 | 2 | 4 | 4 | -0.218 |
| ముంబై | 6 | 2 | 4 | 4 | -0.234 |
| ఢిల్లీ | 6 | 2 | 4 | 4 | -0.975 |
| బెంగళూరు | 7 | 1 | 6 | 2 | -1.185 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

### స్కోరు వివరాలు

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** సాల్ట్ (సి) అండ్ (బి) అవేశ్ 10; నరైన్ (బి) బౌల్ట్; రఘువంశీ (సి) అశ్విన్ (బి) కుల్దీప్ సేన్ 30; శ్రేయస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 11; రసెల్ (సి) జురెల్ (బి) అవేశ్ 13; రింకూసింగ్ నాటౌట్ 20; వెంకటేశ్ (సి) జురెల్ (బి) కుల్దీప్ సేన్ 8; రమణ్‌దీప్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం** ( 20 ఓవర్లలో 6 వికెట్లకు) 223. **వికెట్ల పతనం:** 1-21, 2-106, 3-133, 4-184, 5-195, 6-215.
**బౌలింగ్:** ట్రెంట్ బౌల్ట్ 4-0-31-1, అవేశ్ ఖాన్ 4-0-35-2, కుల్దీప్ సేన్ 4-0-46-2, చహల్ 4-0-54-1, అశ్విన్ 4-0-49-0.

**రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి (సి) వెంకటేశ్ (బి) వైభవ్ 19; బట్లర్ నాటౌట్ 107; సామ్సన్ (సి) నరైన్ (బి) హర్షిత్ 12; పరాగ్ (సి) రసెల్ (బి) హర్షిత్ 34; జురెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నరైన్ 2; అశ్విన్ (సి) రఘువంశీ (బి) వరుణ్ 8; హెట్‌మైర్ (సి) శ్రేయస్ (బి) వరుణ్ 0; పావెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నరైన్ 26; బౌల్ట్ రనౌట్ 0; అవేశ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 224. **వికెట్ల పతనం:** 1-22, 2-47, 3-97, 4-100, 5-121, 6-121, 7-178, 8-186. **బౌలింగ్:** స్టార్క్ 4-0-50-0, వైభవ్ 3-0-45-1, హర్షిత్ రాణా 4-0-45-2, నరైన్ 4-0-30-2, వరుణ్ 3-0-36-2, రసెల్ 1-0-17-0.


జ్యోతిని వెలిగిస్తున్న నటి మారియా మినా

# కౌంట్‌డౌన్ @100

- మరో వంద రోజుల్లో పారిస్ ఒలింపిక్స్
- గ్రీస్‌లో జ్యోతి ప్రజ్వలనం

**ఒలింపియా (గ్రీస్):** ప్రపంచ క్రీడా పండుగ పారిస్ ఒలింపిక్స్-2024కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో 100 రోజుల్లో ఈ మెగా ఈవెంట్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఎప్పటిలాగే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఒలింపిక్స్ పుట్టిల్లు గ్రీస్‌లో జ్యోతి ప్రజ్వలన ఘట్టాన్ని నిర్వహించారు. తొలి ఒలింపిక్స్ నిర్వహించిన ప్రాచీన ఒలింపియాలో ఈ ఆకర్షణీయమైన కార్యక్రమం జరిగింది. ప్రాచీన సంప్రదాయ వేషధారణలో గ్రీక్ నటి మారియా మినా జ్యోతిని వెలిగించింది. సాధారణంగా సూర్య కిరణాలను అక్కడే ఉంచిన ప్రత్యేక అద్దంపై ప్రసరింపజేసి దాని ద్వారా జ్యోతిని వెలిగిస్తారు. అయితే మంగళవారం అంతా చల్లగా మారి వాతావరణంగా అనుకూలంగా లేకుండా పోయింది. దాంతో అక్కడ అందుబాటులో ఉంచిన ఇతర ప్రత్యామ్నాయ పద్ధతిలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. లాంఛనం ముగిసిన తర్వాత తొలి టార్చ్‌ను రోయింగ్‌లో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అయిన గ్రీస్ ఆటగాడు స్టెఫనోస్ దూస్కస్ అందుకోగా... రెండో టార్చ్ బేరర్‌గా ఆతిథ్య ఫ్రాన్స్‌కు చెందిన మాజీ ఒలింపిక్ స్విమ్మింగ్ చాంపియన్ లారా మనాడూ నిలిచింది. ఈ టార్చ్ ఇక్కడినుంచి మొదలై గ్రీస్ దేశంలో సుమారు 5 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఏప్రిల్ 26న పారిస్ ఒలింపిక్స్ నిర్వాహక కమిటీ వద్దకు ఇది చేరుతుంది. అనంతరం ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు కూడా దీనిని తీసుకెళతారు.


ఒలింపిక్ టార్చ్‌లతో స్టెఫనోస్ దూస్కస్, లారా మనాడూ

# అగ్ర స్థానంలోనే గుకేశ్

- హంపికి మరో ‘డ్రా’
- క్యాండిడేట్స్ చెస్ టోర్నీ



**టొరంటో:** ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు డి.గుకేశ్ పది రౌండ్ల తర్వాత కూడా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. గుకేశ్, నెపోమ్నియాచి (రష్యా) మధ్య జరిగిన పదో రౌండ్ గేమ్ ‘డ్రా’గా ముగిసింది. ఈ గేమ్ అనంతరం వీరిద్దరు కూడా చెరో 6 పాయింట్లతో సంయుక్తంగా తొలి స్థానంలో కొనసాగుతున్నారు. ఇతర గేమ్‌లలో ఫిరూజా అలీరెజా (ఫ్రాన్స్)పై ఫాబియానో కరువానా (అమెరికా)... నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)పై హికారు నకమురా (అమెరికా) విజయం సాధించారు. ఇద్దరు భారత ఆటగాళ్లు విదిత్ గుజరాతీ, ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ ‘డ్రా’ అయింది. ప్రజ్ఞానంద, నకమురా (5.5 పాయింట్లు) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపికి మరో ‘డ్రా’ ఎదురైంది. పదో గేమ్‌లో హంపి, జోంగి తాన్ (చైనా) సమ ఉజ్జీలుగా నిలిచారు. అయితే మరో భారత ప్లేయర్ ఆర్.వైశాలి...సలిమోవా (బల్గేరియా)పై గెలుపొందింది. చైనాకు చెందిన లీ టింగ్‌జీ, జోంగి తాన్ ప్రస్తుతం 6.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

## సినిమా


● సాయి పల్లవి
● రణ్‌బీర్ కపూర్


● ‘జై హనుమాన్’ పోస్టర్

అంతా రామమయం... ఈ జగమంతా రామమయం...
ఈరోజు దాదాపు ఎక్కడ చూసినా రామ నామమే.
వెండితెర పైనా రామ నామం వినపడబోతోంది.
రాముడిపై ఇప్పటికే పలు చిత్రాలు వచ్చాయి.
త్వరలో కొన్ని చిత్రాలు రానున్నాయి.
ఈ శ్రీరామ నవమి సందర్భంగా
ఆ శ్రీరాముడి చిత్రాల గురించి
తెలుసుకుందాం.

# రాముడి చిత్రమ్

● రాముడు ఆజానుబాహుడు.. అందగాడు... వీరం, కరుణ, ప్రేమ... ఇలా సకల గుణాలూ ఉన్నవాడు. ఎన్ని ఉన్నా అసలు రాముడంటే సౌమ్యంగా కనిపించాలి. రణ్‌బీర్ కపూర్ దాదాపు అలానే ఉంటారు. అందుకే దర్శకుడు నితీశ్ తివారీ తన ‘రామాయణ్’ చిత్రానికి రాముడిగా రణ్‌బీర్ కపూర్‌ని ఎన్నుకున్నారు. అందం, అభినయం రెండూ మెండుగా ఉన్న సాయి పల్లవిని సీత పాత్రకు ఎంపిక చేసుకున్నారు. అధికారికంగా ప్రకటించలేదు కానీ ఈ చిత్రం షూటింగ్ ఈ మధ్యే ముంబైలో ఆరంభించారు. ఈ చిత్రానికి నమిత్ మల్హోత్రా ఓ నిర్మాత కాగా ‘కేజీఎఫ్’ ఫేమ్ యశ్ మరో నిర్మాత. ఈ చిత్రంలో రావణుడి పాత్రను కూడా యశ్ చేస్తారట. నేడు ఈ చిత్రం గురించి అధికారిక ప్రకటన వచ్చే చాన్స్ ఉంది. వచ్చే ఏడాది దీపావళికి ‘రామాయణ్’ రిలీజవుతుందని సమాచారం.


● అరుణ్ గోవిల్

● 1980లలో రాముడంటే బుల్లితెర వీక్షకులు చెప్పిన పేరు అరుణ్ గోవిల్. ‘రామాయణ్’ సీరియల్‌లో రాముడిగా అంత అద్భుతంగా ఒదిగిపోయారాయన. ఇప్పటికీ రాముడంటే చాలామంది అరుణ్ పేరే చెబుతారు. రాముడి కథాంశంతో ఇటీవల విడుదలైన ‘695: ట్రైంప్ ఆఫ్ ఫైత్’లో ఆయన నటించారు. “ఒక కాలాతీత కథలో మళ్లీ నటించడం గౌరవంగా భావిస్తున్నాను. ‘695: ట్రైంప్ ఆఫ్ ఫైత్’ అనేది కేవలం సినిమా మాత్రమే కాదు.. మన సాంస్కృతిక వారసత్వం” అని పేర్కొన్నారు అరుణ్ గోవిల్. రామ జన్మభూమిపై రజనీష్ బెర్రీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జనవరిలో విడుదలైంది.

● ఫీమేల్ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తూ వస్తున్న కంగనా రనౌత్‌ది కథానాయికల్లో సెపరేట్ రూట్. స్వతహాగా రాముడి భక్తురాలైన కంగనా ఇప్పటికే రామ మందిరం నేపథ్యంలో ‘అపరాజిత అయోధ్య’ చిత్రాన్ని, ‘సీత: ది ఇన్‌కార్నేషన్’ చిత్రాన్ని ప్రకటించారు. కానీ ఇవి పట్టాలెక్క లేదు. గత ఏడాది తన ‘తేజస్’ చిత్రం విడుదల సందర్భంగా అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామ మందిరాన్ని సందర్శించారు కంగనా రనౌత్. ఆ సమయంలో అయోధ్యపై తాను కథ సిద్ధం చేశానని పేర్కొన్నారామె. “ఇది ఆరువందల ఏళ్ల పోరాటం. ఇప్పుడు రామ మందిరం సాధ్యమైంది. అయోధ్యపై కథ రాయడానికి నేను చాలా పరిశోధించాను” అని కూడా చెప్పారు కంగనా రనౌత్. అయితే ఈ చిత్రాన్ని ఎప్పుడు ఆరంభిస్తారనేది తెలియజేయలేదు.

● తేజ సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ‘హను మాన్’ గడచిన సంక్రాంతికి విడుదలై, ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ఈ చిత్రానికి రెండో భాగంగా ‘జై హనుమాన్’ రానుంది. ‘జై హనుమాన్’ కథ రాయడానికి ఓ పాన్ ఇండియా స్టార్ స్ఫూర్తి అన్నట్లుగా ప్రశాంత్ వర్మ ఓ సందర్భంలో పేర్కొన్నారు. రెండో భాగం ప్రధానంగా హనుమంతుడి నేపథ్యంలో సాగుతుందని టాక్. వార్తల్లో ఉన్న ప్రకారం హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తారట. ‘హను మాన్’ చిత్రం చూసి, ప్రశాంత్ వర్మకు రణ్‌వీర్ ఫ్యాన్ అయ్యారని సమాచారం. ఇటీవల ఈ ఇద్దరి మధ్య ‘జై హనుమాన్’ గురించి చర్చలు జరిగాయని, రణ్‌వీర్‌కు స్క్రిప్ట్ కూడా నచ్చిందని భోగట్టా. కాగా.. ప్రశాంత్–రణ్‌వీర్ కాంబినేషన్‌లో రూపొందనున్నది ‘జై హనుమాన్’ కాదు.. వేరే చిత్రం అనే మరో ప్రచారం కూడా జరుగుతోంది. ఏది ఏమైనా ప్రశాంత్ వర్మ ‘జై హనుమాన్’ తెరకెక్కించడం ఖాయం. ఈ చిత్రం నటీనటుల గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**ఇవే కాదు.. రాముడిపై ఇటు దక్షిణాది అటు ఉత్తరాదిన మరిన్ని చిత్రాలకు సన్నాహాలు జరుగుతున్నాయి.**


● కంగనా రనౌత్


● విశాల్

## ఆ అమ్మాయి నా ప్రాణం

‘తమిళనాడు బోర్డర్‌లో ఏం జరుగుతోంది’ అనే డైలాగ్‌తో ‘రత్నం’ సినిమా ట్రైలర్ ఆరంభమైంది. విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘రత్నం’. హరి దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్‌పై కార్తికేయన్ సంతానం నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో సీహెచ్ సతీష్ కుమార్, కె. రాజ్‌కుమార్ రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ‘రత్నం’ మూవీ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ‘రేయ్... ఆ అమ్మాయి నా ప్రాణం, నా ఊపిరి... చెయ్యేస్తావారా...’, ‘తిరుత్తణి కాదు... వేలూరు కాదు... తమిళనాడు కాదు... కేరళ కాదు... నిన్ను వెతుక్కుంటూ వచ్చి నరికేస్తాను రా’ అంటూ విశాల్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ‘‘మాస్ యాక్షన్, లవ్ నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘రత్నం’. యాక్షన్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న హరి దర్శకత్వంలో రాబోతున్న ఈ మూవీపై మంచి హైప్ ఏర్పడింది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవీశ్రీ ప్రసాద్.

## కన్నప్పలో అక్షయ్ కుమార్


● మోహన్‌బాబు, అక్షయ్ కుమార్, విష్ణు మంచు

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ‘కన్నప్ప’ చిత్రం షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతోన్న చిత్రం ‘కన్నప్ప’. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు అక్షయ్ కుమార్. ఈ సందర్భంగా మోహన్‌బాబు, విష్ణు మంచు కలిసి అక్షయ్‌కి స్వాగతం పలికారు. ‘‘శివ భక్తుడైన కన్నప్ప కథను ‘కన్నప్ప’గా తెరపైకి తీసుకొస్తున్నాం. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ మూవీ రూపొందుతోంది. హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. అక్షయ్‌తో పాటు ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం’’ అన్నారు మేకర్స్.

## త్వరలో వందో సినిమా చేస్తాం - ఆర్‌బీ చౌదరి

‘‘మా ‘సూపర్ గుడ్ ఫిలింస్’ బేనర్‌లో ‘భవనమ్’ 95వ సినిమా. అలాగే 96, 97, 98వ సినిమాలు కూడా షూటింగ్ జరుపుకుంటున్నాయి. త్వరలో 100 సినిమాల మైలురాయిని చేరుకోబోతున్నాం. ‘భవనమ్’ చిత్రాన్ని బాలాచారి చక్కగా తీశాడు. ఈ మూవీ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది’’ అని నిర్మాత ఆర్‌బీ చౌదరి అన్నారు. అజయ్, సప్తగిరి, ధనరాజ్, ‘షకలక’ శంకర్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన పాత్రల్లో బాలాచారి కూర్మెళ్ల దర్శకత్వం వహించిన చిత్రం ‘భవనమ్’. సూపర్ గుడ్ ఫిలింస్ సమర్పణలో ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను, ‘యాదమ్మ..’ అంటూ సాగే జానపద పాటని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బాలాచారి మాట్లాడుతూ– ‘‘సూపర్ గుడ్‌లో ఇరవై ఏళ్ల క్రితం ‘విద్యార్థి’ అనే సినిమా చేశాను. చౌదరిగారు ‘భవనమ్’ కోసం మరో అవకాశం ఇచ్చారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది’’ అన్నారు.


● ‘షకలక’ శంకర్, ఆర్‌బీ చౌదరి, సప్తగిరి

## నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను - శ్రద్ధా దాస్

‘‘కొంచెం గ్యాప్ తర్వాత నేను తెలుగులో నటించిన సినిమా ‘పారిజాత పర్వం’. ఇందులో నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను. నా క్యారెక్టర్ సినిమా మొత్తం ఉంటుంది. ఈ మూవీలో కొంచెం సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఉంటాయి. అందరూ మా సినిమాని ఆదరిస్తారని ఆశిస్తున్నాను’’ అని హీరోయిన్ శ్రద్ధా దాస్ అన్నారు. సునీల్, శ్రద్ధా దాస్, చైతన్యా రావు, మాళవికా సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహించిన చిత్రం ‘పారిజాత పర్వం’. మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా ‘పారిజాత పర్వం ప్రీ కిడ్నాప్ ఈవెంట్’ పేరుతో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ‘‘నిర్మాత మహీధర్‌కి సినిమాలంటే ప్యాషన్. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి’’ అన్నారు. ‘‘సినిమా బాగా వచ్చింది.. అందరూ ఎంజాయ్ చేస్తారు’’ అన్నారు మహీధర్ రెడ్డి, దేవేష్. ‘‘హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘పారిజాత పర్వం’’’ అన్నారు సంతోష్ కంభంపాటి. ‘‘మా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని నమ్ముతున్నాను’’ అన్నారు చైతన్యా రావు.


● శ్రద్ధా దాస్, చైతన్యా రావు

సాక్షి బిజినెస్
బుధవారం
17-4-2024

### స్టాక్‌ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్‌ ▽ | 456 | 72,944 |
| నిఫ్టీ ▽ | 125 | 22,148 |

| విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్‌ | 15,899 | △ 13 |
| డోజోన్స్‌ | 37,857 | △ 122 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,166 | △ 89 |
| డాక్స్‌ | 15,509 | △ 328 |
| హాంగ్‌సెంగ్‌ | 3,007 | ▽ 50 |
| నికాయ్‌ | 38,471 | ▽ 762 |

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

### బులియన్‌ (రూ.లలో)

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 73,302 | △1,488 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 73,008 | △1,487 |
| వెండి (కేజీ) | 83,213 | ▽ 239 |

### ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | ఒకటి | 83.04 | 84.06 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | ఒకటి | 104.56 | 106.76 |
| € | యూరో | ఒకటి | 87.82 | 90.16 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | ఒకటి | 53.77 | 54.97 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్‌ | ఒకటి | 53.20 | 55.12 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | ఒకటి | 59.26 | 63.40 |
| SAR | సౌదీ రియాల్‌ | ఒకటి | 21.37 | 22.88 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | ఒకటి | 21.84 | 23.58 |
| ¥ | చైనా యువాన్‌ | ఒకటి | 10.40 | 12.38 |

## ఎంఎఫ్‌ ఆస్తులు రూ. 53.4 లక్షల కోట్లు

- 2023–24లో 35 శాతం జూమ్‌
- వార్షికంగా రూ. 14 లక్షల కోట్ల జమ
- 17.78 కోట్లకు ఫోలియోల సంఖ్య



న్యూఢిల్లీ: దేశీయంగా మ్యూచువల్‌ ఫండ్స్‌(ఎంఎఫ్‌లు) ఆస్తులు గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 35% జంప్‌ చేశాయి. రూ. 53.4 లక్షల కోట్లను తాకాయి. వార్షికంగా రూ. 14 లక్షల కోట్లమేర ఎగశాయి. ఇందుకు ప్రధానంగా రిటైల్‌ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, లాభాల పరుగు తీస్తున్న ఈక్విటీ మార్కెట్లు ప్రభావం చూపాయి. వెరసి 2020–21 ఏడాది(41 శాతం వృద్ధి) తదుపరి గరిష్టస్థాయిలో ఎంఎఫ్‌ ఆస్తులు బలపడినట్లు వార్షిక నివేదికలో ఫండ్స్‌ దేశీ అసోసియేషన్‌(యాంఫీ) వెల్లడించింది. ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) పురోగతి.. ఫండ్స్‌ పరిశ్రమలో పెరుగుతున్న ఇన్వెస్టర్లను ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. ఫలితంగా మార్చి చివరికల్లా ఫోలియోల సంఖ్య 17.78 కోట్లను తాకింది. ఇది సరికొత్త రికార్డు కాగా.. ఇన్వెస్టర్ల బేస్‌ 4.46 కోట్లకు చేరింది. ఇన్వెస్టర్ల సంఖ్యలో మహిళల వాటా 23 శాతంకావడం గమనార్హం!

**సిప్‌ దన్ను**

క్రమబద్ధ పెట్టుబడుల(సిప్‌) పథకాలను ఇన్వెస్టర్లు ఆదరిస్తుండటంతో వీటి సంఖ్య బలపడుతోంది. దీంతో నెలవారీ నికర పెట్టుబడులు మార్చిలో రూ. 19,300 కోట్లకు చేరాయి. పూర్తి ఏడాదిలో సిప్‌ పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్ల నికర పెట్టుబడులు లభించాయి. ఇది ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తిని పట్టిచూపుతోంది. అంతేకాకుండా క్రమశిక్షణతోకూడిన పెట్టుబడులను ప్రతిబింబిస్తోంది. దేశీ ఎంఎఫ్‌ పరిశ్రమకు గతేడాది మైలురాయివంటిదని యాంఫీ నివేదిక పేర్కొంది. ఏయూఎం చెప్పుకోదగ్గవిధంగా రూ. 14 లక్షల కోట్లమేర పెరిగి సరికొత్త రికార్డ్‌ నెలకొల్పుతూ రూ. 53.4 లక్షల కోట్లకు చేరినట్లు వివరించింది. 2022–23లో ఫండ్స్‌ ఏయూఎం విలువ రూ. 39.42 లక్షల కోట్లు మాత్రమేనని ప్రస్తావించింది. ఈక్విటీ, హైబ్రిడ్‌, సొల్యూషన్‌ ఆధారిత పథకాలు తదితరాలలో ప్రధానంగా రిటైల్‌ ఇన్వెస్టర్లు భారీగా ఇన్వెస్ట్‌ చేసినట్లు పేర్కొంది. పరిశ్రమ ఆస్తుల్లో వీటి వాటా 58 శాతంకాగా.. ఫోలియో సంఖ్యలో 80 శాతాన్ని ఆక్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఇవన్నీ ఎంఎఫ్‌ల ద్వారా క్యాపిటల్‌ మార్కెట్లలో పెరుగుతున్న కుటుంబ మదుపును ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేసింది.

**ఈక్విటీకే ఓటు**

గతేడాది పెట్టుబడుల్లో ఈక్విటీ ఆధారిత పథకాలు 55 శాతం వృద్ధిని అందుకుని ఆస్తులలో రూ. 23.5 లక్షల కోట్లకు చేరాయి. ఇందుకు పెట్టుబడులతో పాటు.. మార్క్‌టు మార్కెట్‌(ఎంటుఎం) లాభాలు సహకరించాయి. అయితే మరోవైపు రుణ పథకాల ఫండ్స్‌ 7 శాతమే బలపడ్డాయి. ఏయూఎంలో రూ. 12.62 లక్షల కోట్లకు చేరాయి. అయినప్పటికీ అంతక్రితం రెండేళ్లలో ఆస్తులు తగ్గుతూ వచ్చిన అంశంతో పోలిస్తే మెరుగేనని నివేదిక తెలియజేసింది.

## మూడోరోజూ పతనమే

- సెన్సెక్స్‌ 456 పాయింట్లు డౌన్‌
- నిఫ్టీ 125 పాయింట్ల క్షీణత
- మూడు వారాల దిగువకు సూచీలు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు




ముంబై: పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలతో స్టాక్‌ సూచీలు మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ, మెటల్‌, బ్యాంకులు, ఫైనాన్స్‌ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్‌ 456 పాయింట్లు నష్టపోయి 72,944 వద్ద నిలిచింది. నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 22,148 వద్ద స్థిరపడింది. ఇవి 3 వారాల కనిష్ట స్థాయిలు కాగా.. నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్థమంతా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 715 పాయింట్లు నష్టపోయి 72,685 వద్ద, నిఫ్టీ 147 పాయింట్లు క్షీణించి 22,125 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్‌ నుంచి ఇంధన, ఆయిల్‌, విద్యుత్‌, వినిమయ, పారిశ్రామిక, కన్జూమర్‌ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు దాదాపు సగం నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్‌ఈ మిడ్‌, స్మాల్‌ సూచీలు 0.57%, 0.05% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,468 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, డీఐఐలు రూ.2,040 కోట్ల షేర్లను కొనుగోలు చేశాయి.

- శ్రీరామ నవమి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు. బులియన్‌, ఫారెక్స్‌ మార్కెట్లు కూడా పనిచేయవు. కమొడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- అమెరికా వడ్డీ రేట్ల వాయిదా అంచనాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్‌ 4%, ఎంఫసీస్‌ 3.50%, కోఫోర్జ్‌ 3%, పర్సిస్టెంట్‌, విప్రో, హెచ్‌సీఎల్‌ టెక్‌, టెక్‌ మహీంద్రా, టీసీఎస్‌ షేర్లు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.
- వెల్త్‌మేనేజ్‌మెంట్‌, బ్రోకింగ్‌ కంపెనీల ఏర్పాటుకు బ్లాక్‌రాక్‌తో ఒప్పందం చేసుకోవడంతో జియో ఫైనాన్సియల్‌ సర్వీసెస్‌ షేరు 2% లాభపడి రూ.362 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.372 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ మార్కెట్‌ విలువ రూ.4,733 కోట్లు పెరిగి రూ.2.30 లక్షల కోట్లకు చేరింది.
- సెన్సెక్స్‌ మూడు రోజుల్లో 2,094 పాయింట్ల పతనంతో బీఎస్‌ఈలో మార్కెట్‌ విలువలో రూ.7.93 లక్షల కోట్లు మాయమయ్యాయి.

### రికార్డు కనిష్టానికి రూపాయి

- 83.61కి దేశీ కరెన్సీ విలువ



డాలర్‌ మారకంలో రూపాయి విలువ 17 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇరాన్‌–ఇజ్రాయిల్‌ యుద్ధ ఉద్రిక్తతలతో ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్‌ 5 నెలల గరిష్టానికి బలపడటం ప్రధాన కారణం. ఉదయం ఫారెక్స్‌ మార్కెట్లో 83.51 వద్ద మొదలైంది. రోజంతా నష్టాల్లో కదలాడి ఇంట్రాడే కనిష్టం(83.61) వద్ద స్థిరపడింది. ఈ ఏడాది మార్చి 22న ఇదే స్థాయి(83.61) వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. వెరసి గడిచిన నాలుగు వారాల్లో దేశీయ కరెన్సీ రెండోసారి జీవితకాల కనిష్టాన్ని నమోదు చేయడం గమనార్హం.

## మళ్లీ మెరిసిన పసిడి, వెండి

**బంగారం కొత్త రికార్డు రూ. 73,750**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల భయాలతో పసిడి, వెండి పరుగు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ధోరణులకు తగ్గట్లు దేశీయంగా వెండి, బంగారం ధరలు మంగళవారం మరో రికార్డు స్థాయిని తాకాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ ప్రకారం దేశ రాజధానిలో ఉదయం పసిడి 10 గ్రాముల ధర రూ. 700 పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి అయిన రూ. 73,750ని తాకింది. అదే విధంగా వెండి ధర కూడా కేజీకి రూ. 800 పెరిగి రూ. 86,500 స్థాయిని తాకింది. ఎంసీఎక్స్‌లో జూన్‌ కాంట్రాక్టు ధర ఇంట్రా–డేలో రూ. 72,927 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లు చూస్తే కామెక్స్‌లో ఔన్సు (31.1 గ్రాముల) పసిడి ధర 15 డాలర్లు పెరిగి 2,370 వద్ద ట్రేడయ్యింది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగినంత కాలం బంగారం బులిష్‌గానే ఉండనున్నట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ జతిన్‌ త్రివేది తెలిపారు.



### కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

| 17-4-2024 ఫామ్‌ ధర... | |
|---|---|
| విశాఖ | 419-00 |
| చిత్తూరు | 483-00 |
| ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి | 404-00 |
| విజయవాడ | 404-00 |
| రిటైల్‌ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్‌ | 405-00 |
| వరంగల్‌ | 407-00 |
| రిటైల్‌ ధర | 4.65 |

## క్రిసిల్‌ క్యూ1 లాభం డౌన్‌

**షేరుకి రూ. 7 డివిడెండ్‌**



న్యూఢిల్లీ: రేటింగ్‌ దిగ్గజం క్రిసిల్‌ ఈ ఆర్థిక సంవత్సరం(2024) తొలి త్రైమాసికం(క్యూ1)లో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చిలో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 5 శాతంపైగా క్షీణించి రూ. 138 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023) ఇదే కాలం(క్యూ1)లో రూ. 146 కోట్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్‌ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 751 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ1లో రూ. 732 కోట్ల టర్నోవర్‌ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 539 కోట్ల నుంచి రూ. 563 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. గతేడాది(2023)కిగాను కంపెనీ బోర్డు షేరుకి రూ. 7 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 14న డివిడెండ్‌ చెల్లించనుంది. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో జీడీపీ 6.8 శాతం వృద్ధిని సాధించవచ్చని క్రిసిల్‌ రేటింగ్స్‌ అంచనా వేసింది.

క్రిసిల్‌ షేరు 3% తగ్గి రూ. 4,700 వద్ద ముగిసింది.

## సోనీతో విలీనంపై జీ పిటిషన్‌ ఉపసంహరణ

న్యూఢిల్లీ: సోనీతో విలీన ప్రతిపాదన అమలయ్యేలా ఆదేశాలివ్వాలంటూ ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్‌ (జీల్‌) ఉపసంహరించుకుంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. షేర్‌హోల్డర్లకు మరింత విలువ చేకూర్చే అవకాశాలను ఉపయోగించుకోవడంపై, సోనీపై ఆర్బిట్రేషన్‌ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడంపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. సోనీ భారత వ్యాపార విభాగం, జీల్‌ విలీనంపై కొన్నాళ్లుగా కసరత్తు జరిగినప్పటికీ ఒప్పందం కుదరని సంగతి తెలిసిందే.

## జ్యువెలరీ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్‌

- రూ. 5 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు
- ఏబీసీ డిజిటల్‌ సూపర్‌ యాప్‌ ఆవిష్కరణ



ముంబై: ఆదిత్య బిర్లా గ్రూప్‌ కొత్తగా జ్యువెలరీ రిటైల్‌ వ్యాపారంలోకి అడుగుపెట్టనుంది. ఇందుకోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్‌ చేయనుంది. మంగళవారం ఆదిత్య బిర్లా క్యాపిటల్‌ డిజిటల్‌ (ఏబీసీడీ) సూపర్‌ యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ చైర్మన్‌ కేఎం బిర్లా ఈ విషయాలు వెల్లడించారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌ ఈ మధ్యే పెయింట్స్‌ వ్యాపారంలోకి కూడా ప్రవేశించిన సంగతి తెలిసిందే. మరోవైపు, డిజిటల్‌ ప్లాట్‌ఫాం ద్వారా వచ్చే మూడేళ్లలో 3 కోట్ల మంది పైగా కొత్త కస్టమర్లను చేర్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు బిర్లా వివరించారు. ప్రస్తుతం రుణాలు, బీమా, అసెట్‌ మేనేజ్‌మెంట్‌ తదితర వ్యాపార విభాగాల ద్వారా ఆదిత్య బిర్లా క్యాపిటల్‌ సుమారు 3.5 కోట్ల మంది కస్టమర్లకు సేవలు అందిస్తోంది. సూపర్‌ యాప్‌లో 22 ఉత్పత్తులు, సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

---

# భవిత



## జాబ్‌ పాయింట్‌

### ఆర్‌పీఎఫ్‌, ఆర్‌పీఎస్‌ఎఫ్‌లో 4,660 పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్‌ బోర్డు(ఆర్‌ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా అన్నీ రైల్వే రీజియన్లలో రైల్వే ప్రొటెక్షన్‌ ఫోర్స్‌(ఆర్‌పీఎఫ్‌), రైల్వే ప్రొటెక్షన్‌ స్పెషల్‌ ఫోర్స్‌(ఆర్‌పీఎస్‌ఎఫ్‌)లో సబ్‌ ఇన్‌స్పెక్టర్‌(ఎస్‌ఐ), కానిస్టేబుల్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,660
» **పోస్టుల వివరాలు:** సబ్‌ ఇన్‌స్పెక్టర్‌(ఎస్‌ఐ)–452, కానిస్టేబుల్‌–4208.
» **ఆర్‌ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్‌, అజ్మీర్‌, బెంగళూరు, భోపాల్‌, భువనేశ్వర్‌, బిలాస్‌పూర్‌, చండీఘడ్‌, చెన్నై, గోరఖ్‌పూర్‌, గువాహటి, జమ్మూ–శ్రీనగర్‌, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్‌, పాట్నా, ప్రయాగ్‌రాజ్‌, రాంచీ, సికింద్రాబాద్‌, సిలిగురి, తిరువనంతపురం.
» **అర్హత:** కానిస్టేబుల్‌ పోస్టులకు పదో తరగతి, ఎస్‌ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి కానిస్టేబుల్‌ పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్‌ఐ పోస్టులకు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** నెలకు ఎస్‌ఐ పోస్టులకు రూ.35,400. కానిస్టేబుల్‌ పోస్టులకు 21,700
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(సీబీటీ), ఫిజికల్‌ ఎఫిషియెన్సీ టెస్ట్‌, ఫిజికల్‌ మెజర్‌మెంట్‌ టెస్ట్‌, మెడికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్‌, సర్టిఫికేట్‌ వెరిఫికేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 14.05.2024
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌:** https://rpf.indianrailways.gov.in

### సింగేణి కాలరీస్‌ కంపెనీ లిమిటెడ్‌, కొత్తగూడెంలో 327 ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్‌ కంపెనీ లిమిటెడ్‌(ఎస్‌సీసీఎల్‌).. వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్‌, నాన్‌ ఎగ్జిక్యూటివ్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 327

**పోస్టుల వివరాలు**

» **ఎగ్జిక్యూటివ్‌ కేడర్‌:** మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(ఈ–ఎం), ఈ2 గ్రేడ్‌–42, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(సిస్టమ్స్‌), ఈ2 గ్రేడ్‌–07.
» **నాన్‌–ఎగ్జిక్యూటివ్‌ కేడర్‌:** జూనియర్‌ మైనింగ్‌ ఇంజనీర్‌ ట్రైనీ(జేఎంఈటీ), టీ–ఎస్‌ గ్రేడ్‌ సి–100, అసిస్టెంట్‌ ఫోర్‌మెన్‌ ట్రైనీ(మెకానికల్‌), టీ–ఎస్‌ గ్రేడ్‌ సి–09, అసిస్టెంట్‌ ఫోర్‌మెన్‌ ట్రైనీ (ఎలక్ట్రికల్‌), టీ–ఎస్‌ గ్రేడ్‌ సి–24, ఫిట్టర్‌ ట్రైనీ, క్యాట్‌ 1–47,ఎలక్ట్రీషియన్‌ ట్రైనీ, క్యాట్‌ 1–98.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** గరిష్ట వయసు 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 04.05.2024
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌:** https://scclmines.com

### ఇండియన్‌ ఆర్మీలో టెక్నికల్‌ గ్రాడ్యుయేట్‌ కోర్సు

ఇండియన్‌ ఆర్మీ 140 టెక్నికల్‌ గ్రాడ్యుయేట్‌ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ విడుదల చేసింది. దీనిద్వారా డెహ్రాడూన్‌లోని ఇండియన్‌ మిలిటరీ అకాడెమీలో 2025లో ప్రారంభమయ్యే కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30 (140వ టెక్నికల్‌ గ్రాడ్యుయేట్‌ కోర్సు)
» **కోర్‌ ఇంజనీరింగ్‌ స్ట్రీమ్‌:** సివిల్‌, కంప్యూటర్‌ సైన్స్‌, ఎలక్ట్రికల్‌, ఎలక్ట్రానిక్స్‌, మెకానికల్‌, ఇతర ఇంజనీరింగ్‌ స్ట్రీమ్స్‌.
» **అర్హతలు:** సంబంధిత ఇంజనీరింగ్‌ విభాగంలో బీఈ/బీటెక్‌ ఉత్తీర్ణులు లేదా కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.01.2025 నాటికి 20–27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ల షార్ట్‌ లిస్టింగ్‌, స్టేజ్‌1, స్టేజ్‌ 2 టెస్టులు, ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్‌ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు డెహ్రాడూన్‌లోని ఇండియన్‌ మిలిటరీ అకాడెమీలో శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో లెఫ్టినెంట్‌ ర్యాంకుతో షార్ట్‌ సర్వీస్‌ కమిషన్‌ లభిస్తుంది. శిక్షణ అనంతరం పర్మనెంట్‌ కమిషన్‌ ఇస్తారు.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 09.05.2024
» **వెబ్‌సైట్‌:** https://joinindianarmy.nic.in/Authentication.aspx

## ఆర్థిక, గణాంక కొలువుల పిలుపు

» మొత్తం 48 పోస్టులతో ఐఈఎస్‌/ ఐఎస్‌ఎస్‌ నోటిఫికేషన్‌
» రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఎకనామిక్స్‌, స్టాటిస్టిక్స్‌లో పీజీ, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

**కేంద్ర సర్వీసుల్లో ఉన్నత కొలువులు కోరుకునే యువతకు మరో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! యూపీఎస్‌సీ.. ఐఈఎస్‌, ఐఎస్‌ఎస్‌-2024 నోటిఫికేషన్‌ విడుదల చేసింది. దీనిద్వారా జూనియర్‌ టైమ్‌ స్కేల్‌తో.. పలు శాఖల్లో.. అసిస్టెంట్‌ డైరెక్టర్‌, రీసెర్చ్‌ ఆఫీసర్‌ హోదాలో కొలువుదీరొచ్చు!! ఎకనామిక్స్‌, స్టాటిస్టిక్స్‌లో పీజీ, బ్యాచిలర్‌ డిగ్రీ అర్హతతో ఈ ఉన్నత స్థాయి పోస్టులకు పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో ఐఈఎస్‌, ఐఎస్‌ఎస్‌ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్‌ తదితర వివరాలు..**

**ఐఈఎస్‌/ఐఎస్‌ఎస్‌**

ఐఈఎస్‌.. ఇండియన్‌ ఎకనామిక్‌ సర్వీస్‌. ఐఎస్‌ఎస్‌..ఇండియన్‌ స్టాటిస్టికల్‌ సర్వీస్‌. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల ఆర్థిక సంబంధ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు అవసరమైన నిపుణుల ఎంపికకు యూపీఎస్సీ ప్రతిఏటా నిర్వహించే పరీక్ష.. ఐఈఎస్‌/ఐఎస్‌ఎస్‌.

**మొత్తం 48 పోస్టులు**

యూపీఎస్‌సీ తాజాగా విడుదల చేసిన ఐఈఎస్‌/ఐఎస్‌ఎస్‌–2024 నోటిఫికేషన్‌ ద్వారా రెండు విభాగాల్లో కలిపి మొత్తం 48 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇండియన్‌ ఎకనామిక్‌ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్‌ స్టాటిస్టికల్‌ సర్వీస్‌లో 30 పోస్టులు ఉన్నాయి.

**విద్యార్హత**

- **ఐఈఎస్‌:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌/అప్లైడ్‌ ఎకనామిక్స్‌/బిజినెస్‌ ఎకనామిక్స్‌/ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్‌ గ్రాడ్యుయేషన్‌ ఉండాలి.
- **ఐఎస్‌ఎస్‌:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి స్టాటిస్టిక్స్‌/మ్యాథమెటికల్‌ స్టాటిస్టిక్స్‌/అప్లైడ్‌ స్టాటిస్టిక్స్‌ ఒక సబ్జెక్టుగా డిగ్రీ లేదా ఈ సబ్జెక్టులు స్పెషలైజేషన్‌గా పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 2024, ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

**రెండు దశల ఎంపిక ప్రక్రియ**

ఐఈఎస్‌, ఐఎస్‌ఎస్‌ ఎంపిక ప్రక్రియ రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో వేయి మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

**రాత పరీక్షలు వేర్వేరుగా**

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్ష ఐఈఎస్‌, ఐఎస్‌ఎస్‌ అభ్యర్థులకు వేర్వేరుగా ఉంటుంది.

**వెయి మార్కులకు ఐఈఎస్‌ రాత పరీక్ష**

ఐఈఎస్‌ రాత పరీక్ష ఆరు పేపర్లలో మొత్తం 1,000 మార్కులకు జరుగుతుంది. అవి.. పేపర్‌–1 జనరల్‌ ఇంగ్లిష్‌ 100 మార్కులు, పేపర్‌–2 జనరల్‌ స్టడీస్‌ 100 మార్కులు, పేపర్‌–3 జనరల్‌ ఎకనామిక్స్‌–1, 200 మార్కులు; పేపర్‌–4 జనరల్‌ ఎకనామిక్స్‌–2, 200 మార్కులు; పేపర్‌–5 జనరల్‌ ఎకనామిక్స్‌–3, 200 మార్కులు; పేపర్‌–6 ఇండియన్‌ ఎకనామిక్స్‌ 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఐఈఎస్‌ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్‌ విధానంలోనే ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం మూడు గంటలు.

**ఐఎస్‌ఎస్‌.. రాత పరీక్ష ఇలా**

ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్‌ఎస్‌ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్‌, డిస్క్రిప్టివ్‌ ప్రశ్నలతో పేపర్లు ఉంటాయి. అవి..పేపర్‌–1 జనరల్‌ ఇంగ్లిష్‌–100 మార్కులు, పేపర్‌–2 జనరల్‌ స్టడీస్‌–100 మార్కులు, పేపర్‌–3 స్టాటిస్టిక్స్‌–1(ఆబ్జెక్టివ్‌), 200 మార్కులు; పేపర్‌–4 స్టాటిస్టిక్స్‌–2(ఆబ్జెక్టివ్‌), 200 మార్కులు; పేపర్‌–5 స్టాటిస్టిక్స్‌–3, 200 మార్కులు; పేపర్‌–6 స్టాటిస్టిక్స్‌–4, 200 మార్కులకు ఉంటాయి. మొత్తం 1000 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్‌ 3,4 తప్ప మిగతా పేపర్లు డిస్క్రిప్టివ్‌ విధానంలో ఉంటాయి. ఆబ్జెక్టివ్‌ పేపర్లకు రెండు గంటలు, డిస్క్రిప్టివ్‌ పేపర్లకు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

**పర్సనల్‌ ఇంటర్వ్యూ**

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్‌ లిస్ట్‌ రూపొందిస్తారు. ఇందులో చోటు సంపాదించిన వారికి మలిదశలో చివరగా 200 మార్కులకు పర్సనల్‌ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే.. రాత పరీక్షలో మార్కులు, ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
- ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్‌ 30
- ఆన్‌లైన్‌ దరఖాస్తు సవరణ: 2024, మే 1 నుంచి 7 వరకు
- పరీక్ష తేదీలు: 2024, జూన్‌ 21 నుంచి
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్‌
- వెబ్‌సైట్‌: www.upsc.gov.in

**రాత పరీక్షలో రాణించేలా**

ఐఈఎస్‌, ఐఎస్‌ఎస్‌ పరీక్షల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు అకడమిక్‌గా పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్‌ పేపర్లు, మోడల్‌ పేపర్ల సాధన కూడా కలిసొస్తుంది.

**జనరల్‌ ఇంగ్లిష్‌**

ఐఈఎస్‌, ఐఎస్‌ఎస్‌ రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్‌ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్‌ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. వొకాబ్యులరీని, రీడింగ్‌ కాంప్రహెన్షన్‌ టెక్నిక్స్‌ను పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో ఎక్కువగా ప్యాసేజ్‌ రైటింగ్‌, ప్రెసిస్‌ రైటింగ్‌ ప్రాక్టీస్‌ చేయాలి.

**జనరల్‌ స్టడీస్‌**

ఈ పేపర్‌ కూడా రెండు సర్వీసులకు ఒకే మాదిరిగా ఉంటుంది. ఎక్కువగా కరెంట్‌ ఈవెంట్స్‌, జనరల్‌ నాలెడ్జ్‌ నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. శాస్త్ర సాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారత దేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి.

**జనరల్‌ ఎకనామిక్స్‌-1**

ఇందులో రాణించడానికి సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్‌, స్టాటిస్టికల్‌ ఎకనోమెట్రిక్‌ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్‌ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. అప్లికేషన్‌ ఓరియెంటేషన్‌తో ఉండే ఈ పేపర్‌ కోసం లారెంజ్‌ వక్ర రేఖ, ఏంజెల్‌ సూత్రం, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్పకాల–దీర్ఘకాల వ్యయ రేఖలు, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

**జనరల్‌ ఎకనామిక్స్‌-2**

స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్‌ ఆఫ్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ ప్లానింగ్‌, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉండే పేపర్‌ ఇది. దీనికోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్‌ నేషనల్‌ ఇన్‌కమ్‌, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్‌ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు–కారణాలు,ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్‌ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తాజా కార్యకలాపాలపైనా దృష్టి పెట్టాలి.

**జనరల్‌ ఎకనామిక్స్‌-3**

ఇందులో ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్‌ ఎకనమిక్స్‌ అంశాలు సమ్మిళితంగా ఉంటాయి. ఈ పేపర్‌లో మంచి మార్కుల కోసం పన్ను సంస్కరణలు, గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్‌ జీడీపీ, ఇండస్ట్రియల్‌ ఎకనమిక్స్‌ తదితర అంశాలపై అవగాహన పొందాలి.



ఐఈఎస్‌, ఐఎస్‌ఎస్‌-2024

**ఇండియన్‌ ఎకనామిక్స్‌**

సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ ప్రిపరేషన్‌ సాగించాలి. స్థిరీకరణ–నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్‌ సిఫార్సులు, టోకు ధరల సూచీ–రిటైల్‌ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్‌, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్‌ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

**సబ్జెక్ట్‌ పేపర్లకు సన్నద్ధత ఇలా**

- స్టాటిస్టిక్స్‌–1 పేపర్‌లో రాణించాలంటే.. పలు సిద్ధాంతాలపై పట్టు సాధించాలి. స్టాటిస్టికల్‌ మెథడ్స్‌, న్యూమరికల్‌ అనాలిసిస్‌ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- స్టాటిస్టిక్స్‌–2 పేపర్‌లో.. లీనియర్‌ మోడల్స్‌, ఎస్టిమేషన్‌, హైపోథిసిస్‌ టెస్టింగ్‌, మల్టీవెరైటీ అనాలిసిస్‌(ఎస్టిమేషన్‌ ఆఫ్‌ మీన్‌ వెక్టార్‌ అండ్‌ కో వేరియన్స్‌ మ్యాట్రిక్స్‌ తదితర అంశాలపై దృష్టిసారించాలి.
- స్టాటిస్టిక్స్‌–3 పేపర్‌లో.. శాంప్లింగ్‌ టెక్నిక్స్‌, ఎకనామిక్‌ సాటిస్టిక్స్‌, డిజైన్‌ అండ్‌ అనాలిసిస్‌ ఆఫ్‌ ఎక్స్‌పెరిమెంట్స్‌, ఎకనోమెట్రిక్స్‌ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- స్టాటిస్టిక్స్‌–4 పేపర్‌లో.. స్టాటిస్టికల్‌ క్వాలిటీ కంట్రోల్‌ అండ్‌ ఆపరేషన్స్‌ రీసెర్చ్‌ ,డెమోగ్రఫీ అండ్‌ వైటల్‌ ఛార్ట్స్‌, కంప్యూటర్‌ సిస్టమ్‌–సాఫ్ట్‌వేర్‌ కాన్సెప్ట్స్‌, డేటాబేస్‌ మేనేజ్‌మెంట్‌ వంటి కంప్యూటర్‌ సంబంధ అంశాలపై పట్టుసాధించాలి.
- డేటా ఆధారిత అంశాలు అధికంగా ఉండే స్టాటిస్టిక్స్‌ సబ్జెక్ట్‌ పేపర్లలో మంచి స్కోర్‌ చేయాలంటే.. వేగంతోపాటు కచ్చితత్వం, సునిశిత పరిశీలన అవసరం. ప్రిపరేషన్‌ సమయంలోనే ప్రతి అంశాన్ని నిర్దిష్ట కాలపరిమితి విధించుకుని చదవాలి. ముఖ్యంగా ఆయా సిద్ధాంతాలు, వాటిని వినియోగించి డేటా రూపకల్పన, ఛార్ట్స్‌, గ్రాఫ్స్‌ రూపకల్పన వంటి అంశాలపై పట్టు సాధించాలి.

క్లుప్తంగా...

## రామయ్య సన్నిధిలో సుప్రీం న్యాయమూర్తి



**భద్రాచలం టౌన్:** భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ మంగళవారం దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కూడా స్వామి దర్శనానికి రాగా, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం స్వామిని దర్శించుకున్నాక వారికి ఆలయ అధికారులు ప్రసాదంతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీవో దామోదరరావు పాల్గొన్నారు. దేవాదాయ, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హన్మంతరావు సైతం రామయ్యను దర్శించుకుని పూజలు చేశారు.

## సికింద్రాబాద్‌-దానాపూర్ మధ్య 24 ప్రత్యేక రైళ్లు

**సాక్షి, హైదరాబాద్:** వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్‌-దానాపూర్ మధ్య 24 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రోజూ రాకపోకలు సాగించే సికింద్రాబాద్‌-దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా ఒక క్లోన్ రైలును నడపనున్నట్లు తెలిపారు. ఇది దానాపూర్ ఎక్స్‌ప్రెస్ కంటే ముందే బయల్దేరనుంది. హైదరాబాద్ నుంచి ఇటార్సీ, ప్రయాగ్‌రాజ్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, దానాపూర్‌కు ప్రయాణికులు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని పూర్తిగా అన్ రిజర్వ్‌డ్ కోచ్‌లతో ఈ ప్రత్యేక సాధారణ రైళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇది ప్రతి గురువారం సికింద్రాబాద్ నుంచి, ప్రతి శనివారం దానాపూర్ నుంచి అందుబాటులో ఉంటుంది. ఈనెల 18 నుంచి జూన్ నెలాఖరు వరకు ఈ సాధారణ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి.

## పీఆర్సీ కమిషన్ ముందు 13 డిమాండ్లు

### చైర్మన్‌కు పోలీస్ అధికారుల సంఘం వినతిపత్రం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ పోలీస్ సిబ్బందికి సంబంధించిన 13 ప్రధాన డిమాండ్లపై రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు ఐజీ పర్సనల్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి, ఇతర ప్రతినిధులు పీఆర్సీ చైర్మన్, సభ్యులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధాన ప్రతిపాదనల్లో పోలీస్ కానిస్టేబుళ్లకు ఎస్జీటీ స్కేల్, ఎస్సై ర్యాంకు అధికారులకు గెజిటెడ్ హోదా, సీనియర్లకి వెయిటేజ్ ఇంక్రిమెంట్స్, రిస్క్ అలవెన్స్ బేసిక్‌తో పాటు 15 శాతం, పెట్రోల్ అలవెన్స్ నెలకు రూ. 3,000, అంత్యక్రియల ఖర్చులు రూ.50 వేలు, కుటుంబ సభ్యులు మరణించినప్పుడు 15 రోజుల ప్రత్యేక సెలవు, యూనిఫామ్ అలవెన్స్ 16,000, రోజుకు ఫీడింగ్ చార్జీలు రూ. 500, పీటీఓ సిబ్బందికి 30 శాతం పొల్యూషన్ అలవెన్స్, కన్వీనియన్స్ అలవెన్స్ రూ. 2,500, ఏటా పోలీసులకు హెల్త్ చెకప్, వెల్నెస్ సెంటర్‌లో ఓపీ వైద్యం ప్రధాన అంశాలుగా ఉన్నాయి.



ఎదుర్కోలు వేడుక సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సీఎస్ శాంతికుమారి

# నేడే భద్రాద్రి రామయ్య కల్యాణం

**పెళ్లి వేడుకలకు ముస్తాబైన ఆలయం**

- ఉదయం 9:30 గంటలకే పెళ్లి పనులు మొదలు
- మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో జీలకర్ర, బెల్లం... అనంతరం కనుల పండువగా తలంబ్రాల వేడుక
- కల్యాణ వేడుకలపై ఎన్నికల నియమావళి ప్రభావం.. ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం, జిల్లా యంత్రాంగం
- ఎదుర్కోలు వేడుక సందర్భంగా ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు అందజేసిన సీఎస్ శాంతికుమారి

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** శ్రీ సీతారాముల కల్యాణానికి భద్రాచలం ముస్తాబైంది. మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన కల్యాణ మంటపంలో అభిజిత్ లగ్నంలో సీతారాములు ఒక్కటి కానున్నారు. ఈ వేడుకను చూసేందుకు ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భద్రాచలానికి చేరుకుంటున్నారు. వారికి ఇబ్బంది తలెత్తకుండా దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

### పెళ్లి తంతు ఇలా..

ఉదయం 9:30 గంటల తర్వాత శంఖ, చక్ర, ధనుర్బాణాలను ధరించి సీతతో కూడిన శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీలో మిథిలా స్టేడియంలోని కల్యాణ మంటపానికి తీసుకొస్తారు. వేదికపై సీతారామ లక్ష్మణులను వేంచేపు చేస్తారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం గావిస్తారు. ఆ తర్వాత యోద్వాహం నిర్వహించి అప్పటివరకు మంటపంలోనే ఉన్న సీతమ్మను శ్రీరాముడికి ఎదురుగా కూర్చోబెడతారు. ఆ తర్వాత సీతమ్మకు యోక్త్ర బంధనం చేస్తారు. ఆపై సీతారాముల వంశగోత్రాల ప్రవరలు ఉంటాయి. అనంతరం కల్యాణం కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలను సీతారాములకు ధరింపజేస్తారు. అదే విధంగా భక్త రామదాసు చేయించిన చింతాకు పతకం సీతమ్మకు, పచ్చల హారం రామయ్యకు అలంకరిస్తారు. లక్ష్మణుడికి రామ మాడను ధరింపజేస్తారు.

### అభిజిత్ లగ్నంలో

చైత్రశుద్ధ నవమి, అభిజిత్ లగ్నం మధ్యాహ్నం 12 గంటలకు కాస్త అటుఇటుగా రావడం పరిపాటి. ముహూర్త సమయం కాగానే వధూవరులైన సీతారాముల తలలపై జీలకర్ర, బెల్లం ఉంచుతారు. ఆ తర్వాత శ్రీరామదాసు చేయించిన మూడు బొట్లు ఉన్న మంగళసూత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మూడు సూత్రాలు ఉన్న తాళిని సీతమ్మ వారి మెడలో కట్టడంతో కల్యాణ వేడుకలో కీలక ఘట్టం ముగుస్తుంది. ముత్యాలు కలిపిన, గోటితో ఒలిచిన తలంబ్రాలను వధూవరులైన సీతారాములపై పోస్తారు. తలంబ్రాల కార్యక్రమం ముగిసిన తర్వాత స్వామి, అమ్మవార్లకు తాత్కాలిక నివేదన అనంతరం బ్రహ్మముడి వేసి మంగళ హారతి అందిస్తారు. కల్యాణం ముగించుకున్న సీతారాములను వేడుకగా పల్లకీలో భద్రాచల వీధుల్లో ఊరేగిస్తూ ఆలయంలోనికి తీసుకెళ్తారు.

### పూర్తయిన ఏర్పాట్లు

సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తుల కోసం దేవస్థానంతో పాటు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మిథిలా స్టేడియాన్ని సెక్టార్లుగా విభజించి వేర్వేరు ధరల్లో టికెట్లను ఇప్పటికే విక్రయించారు. శ్రీరామ నవమికి ఉండే రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. వేసవి కావడంతో ప్రధాన రహదారి నుంచి ఆలయ ప్రాంగణం వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ పెరిగిపోవడంతో భద్రాద్రిలో భక్తులకు వసతి లభించడం దుర్లభంగా మారింది. లాడ్జీల్లో రేట్లు రెండు, మూడింతలు పెంచేశారు. పెరిగే ట్రాఫిక్‌కు తగ్గట్టుగా గోదావరిపై రెండో వంతెనను అందుబాటులోకి తెచ్చారు. నవమి వేడుకల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా 238 బస్సులను నడిపిస్తోంది. నవమి ప్రత్యేక బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం చెల్లుబాటు అవుతుందని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

### ఘనంగా ఎదుర్కోలు వేడుక

శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆలయంలో మంగళవారం రాత్రి ఎదుర్కోలు వేడుకను కనుల పండువగా నిర్వహించారు. రామయ్య తరఫున కొందరు, సీతమ్మవారి తరఫున కొందరు అర్చకులు విడిపోయి 'మా వంశమే గొప్పదంటే..కాదు కాదు.. మా వంశమే గొప్ప' అంటూ సంవాదం చేసుకుంటూ కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.




కుమారుడికి వివాహం జరిపించి తలంబ్రాలు వేస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

## కన్నుమూసిన బిడ్డకు కల్యాణం

- 20 ఏళ్లుగా శ్రీరామనవమి రోజు వివాహం
- ఇంటి వద్దే గుడి కట్టి పూజలు...కొడుకుపై కన్నవారి ప్రేమ

**బయ్యారం:** ఎదిగిన కొడుకు అర్ధంతరంగా కన్నుమూస్తే కన్నవారికి అంతకు మించిన విషాదం మరొకటి ఉండదు. ఆ తల్లిదండ్రులది కూడా అలాంటి వేదనే. కానీ వారు చనిపోయిన కొడుకును దైవంగా కొలుస్తున్నారు. ఏటా శ్రీరామనవమిరోజు.. బిడ్డకు వివాహం చేస్తూ ప్రేమను చాటుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సంతులాల్‌పోడుతండాకు చెందిన భూక్య లాలు, సుక్కమ్మలకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు రాంకోటి ఇంటర్ చదువుతున్న సమయంలో.. అదే తండాకు చెందిన యువతిని ప్రేమించాడు. ఆ యువతితో పెళ్లికి పెద్దలు నిరాకరించటంతో రాంకోటి 2003లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో కొడుకు కలలో వచ్చి తనకు గుడి కట్టించి వివాహం చేయాలని కోరినట్లు సుక్కమ్మ భర్తతో చెప్పింది. దీంతో వారు కొడుకు జ్ఞాపకార్థం ఇంటి ఆవరణలోనే గుడి కట్టించి అందులో కొడుకు విగ్రహంతోపాటు పెళ్లి కుమార్తె నమూనా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహాలకు ఏటా శ్రీరామనవమి రోజు వివాహం జరిపిస్తున్నారు. ఇలా 20 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. వివాహానంతరం బంధుమిత్రులకు విందును సైతం ఏర్పాటు చేసి కొడుకు జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు ఆ తల్లిదండ్రులు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కుమారుడి వివాహానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు వారు తెలిపారు.

**టు డేస్ గ్రాఫిక్**




**నోట్:** అభివృద్ధి చెందిన దేశాల్లో కేన్సర్ కేసులు ఎక్కువగా ఉండటానికి చాలా కారణాలున్నాయి. అక్కడి వృద్ధుల జనాభా, జీవన శైలితోపాటు ఆయా దేశాల్లో అత్యాధునిక వైద్య వ్యవస్థ అందుబాటులో ఉంది. ఇక్కడ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకునే వాళ్లు కూడా ఎక్కువ. దీని వల్ల కేన్సర్‌ను ముందుగానే గుర్తించడానికి అవకాశం ఉంటుంది. అదే సమయంలో కేసుల నమోదు సంఖ్యా పెరుగుతుంది.

**ఆధారం:** ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన ఇనీషియేటివ్ ఫర్ కేన్సర్ రిజిస్ట్రీ డెవలప్‌మెంట్

## భద్రాద్రి సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఈసీ అనుమతి

**సాక్షి, హైదరాబాద్:** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా భద్రాచలం రామాలయంలో నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవం ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు అనుమతినిచ్చింది. ప్రత్యక్ష ప్రసారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని తొలుత కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించగా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. మరోవైపు బీజేపీ కూడా శ్రీరామ కల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడానికి అనుమతించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. ఈ అంశం వివాదాస్పదం కావడంతో ఈసీ తన నిర్ణయాన్ని మార్చుకుని అనుమతివ్వడం గమనార్హం. కాగా, భద్రాచల శ్రీరాముని కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఈసీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఈవో వికాస్‌రాజ్‌కు లక్ష్మణ్ నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు.

## పోలీసులు సూచించిన మార్గంలోనే యాత్ర: హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** నగరంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు సూచించిన మార్గంలోనే శ్రీరామ శోభాయాత్ర చేపట్టాలని, అందుకు అధికారులు అనుమతివ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తమకు కేసరి హనుమాన్ మందిర్ – దరియాబాగ్ – గిర్కపల్లి – రాంసింగ్‌పురా ప్రధాన రహదారి–కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాల–ఆర్య సమాజ్–లైబ్రరీ సెంటర్ – కుల్సుంపురా పార్క్–కార్వాన్ మార్కెట్–శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం–అంద్రుని కార్వాన్–క్రాంతి భవన్ – పటేల్ హోటల్–శ్రీ గంగా పరమేశ్వరి ఆలయం మార్గంలో శ్రీరామ శోభాయాత్ర జరిపేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని, అనుమతి ఇచ్చేలా టప్పాచబుత్ర పీఎస్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో కేసరి హనుమాన్ యువ సంఘటన్ నగర అధ్యక్షుడు అద్దాల కార్తీక్ పిటిషన్ దాఖలు చేశారు. 17న ఉదయం 10 గంటల నుంచి యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ సూచించిన మార్గంలో శోభాయాత్రకు అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసులు సూచించిన మార్గంలోనే యాత్ర నిర్వహించాలని ఆదేశిస్తూ, వాదనలను ముగించారు.

## అతివలు కాని 'అతివల' కోసం అందాల పోటీ!



మిస్ ఇండియా, మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ పోటీల గురించి అందరికీ తెలుసు.. మరి మిస్ ఏఐ గురించి విన్నారా? ఇదేం పోటీ అనుకుంటున్నారా? ప్రపంచంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) 'అతివల' కోసం ఓ బ్యూటీ కాంటెస్ట్ జరగనుంది! అదెలా అంటారా? కంప్యూటర్ సృష్టించిన యువతులు.. వాటి అందం, సాంకేతికత, సోషల్ మీడియా వాడకానికి సంబంధించి పరస్పరం పోటీ పడనున్నాయి. నలుగురు సభ్యులతో కూడిన జడ్జీల ప్యానెల్ ముందు టాలెంట్ ప్రదర్శించనున్నాయి. ఈ పోటీకి సంబంధించి మరో ఆశ్చర్యకరవిషయం ఏమిటంటే న్యాయ నిర్ణేతల్లో రెండు ఏఐ జడ్జీలు కూడా ఉంటాయట. ఏఐ టూల్స్ వాడకంలో నైపుణ్యం, ప్రతిభ, హావభావాలు మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకొని విజేతలను ఎంపిక చేయనున్నారు. ఈ పోటీలో గెలిచిన ఏఐ సుందరికి రూ. 15 లక్షల ప్రైజ్ మనీ సైతం లభించనుంది. ద ఫన్‌వే సంస్థ ఈ పోటీ నిర్వహిస్తోంది. ఈ పోటీలో పాల్గొనాలంటే ఏఐ అతివల ఫొటోలను వాటి సృష్టికర్తలు నిర్వాహకులకు పంపాల్సి ఉంటుంది. 'ఈ ప్రపంచాన్ని మరింత మెరుగ్గా మార్చడంపై మీకున్న కల ఏమిటి? లాంటి ప్రశ్నలు మొదలు ఏఐ గురించిన సాంకేతిక అంశాల వరకు ప్రశ్నలు ఏఐ అతివలకు ఎదురుకానున్నాయి. ఈ పోటీకి వేలాది ఎంట్రీలు వస్తాయని భావిస్తున్నట్లు ఫన్‌వే తెలిపింది. వాటిల్లోంచి టాప్ 10 ఏఐ చిత్రాలను వడపోసి చివరకు టాప్ 3 విజేతలను మేలో జరిగే ఆన్‌లైన్ అవార్డుల కార్యక్రమంలో ప్రకటిస్తామని 'ఫన్‌వే' చెప్పింది. – సాక్షి, సెంట్రల్ డెస్క్

## అనుమతుల్లేని మందుల దుకాణాలపై కొరడా

- డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా రూ.1.30 లక్షల మందుల స్వాధీనం

**సాక్షి, హైదరాబాద్:** లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా నడుపుతున్న మందుల దుకాణాలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సోదాల్లో రూ.1.30 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్లు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తిలోని శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రిలో సోదాలు నిర్వహించగా.. లైసెన్స్ లేకుండానే ఫార్మసీ నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. చార్మినార్‌లో మీర్ హుస్సేన్ హైదర్ రిజ్వీ అనే వ్యక్తి అనధికారికంగా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఉప్పల్ మండలం కొత్తపేటలో నిర్వహించిన సోదాల్లో మందులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. లైసెన్స్‌లు లేని మందుల దుకాణాలు, అధిక ధరలకు మందుల విక్రయాలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. టోల్‌ఫ్రీ 1800–599–6969 నంబర్‌కు పనిదినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు.

## క్రిమినల్ కేసుల సమాచారం ఇవ్వడానికి అభ్యంతరమేంటి?

- బీజేపీ పిటిషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- వివరాలు ఇవ్వడంతో పిటిషన్‌పై ముగిసిన వాదనలు

**సాక్షి, హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు తమపై ఉన్న క్రిమినల్ కేసుల జాబితా అడిగితే ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. వారి అభ్యర్థన సరైందే కదా అని పేర్కొంది. వివరాలు ఎందుకు ఇవ్వలేదో తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది. తమ పార్టీ అభ్యర్థులపై ఉన్న కేసుల వివరాలను అధికారులు ఇవ్వడం లేదంటూ బీజేపీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం ఉదయం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులపై ఎక్కడెక్కడ ఎన్ని కేసులు ఉన్నాయో వివరాలు ఇవ్వాలని గత నెల 7న, 14న డీజీపీకి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఇప్పటివరకు వివరాలు ఇవ్వలేదని చెప్పారు. స్పందించిన న్యాయమూర్తి.. అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 23కు వాయిదా వేశారు. అయితే మధ్యాహ్న భోజన విరామం తర్వాత పిటిషనర్ తరఫు న్యాయవాది.. తాము డీజీపీ నుంచి కోరిన సమాచారం అందిందనడంతో వాదనలను ముగించారు.

### ఏబీ వెంకటేశ్వర్‌రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వు

**సాక్షి, హైదరాబాద్:** ఏపీ సర్కార్ తనను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. ఏపీ అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరాం సమర్పించిన ఆధారాలను పరిశీలించి ఈ నెల 23న తీర్పు వెల్లడిస్తామని చెప్పింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలు తెచ్చినట్లు ఆరోపణలు రావడంతో ఏపీ ప్రభుత్వం వెంకటేశ్వర్‌రావును సస్పెండ్ చేసింది. ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది. అనంతరం సస్పెన్షన్ పూర్తయి ఆయన విధుల్లో చేరారు. విధుల్లో చేరిన తర్వాత తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ట్యాపింగ్ కేసులో సాక్షులను బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ప్రభుత్వం మరోసారి ఆయనను సస్పెండ్ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ వెంకటేశ్వర్‌రావు గత ఏప్రిల్‌లో క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరాం, జీపీ పాండురంగారెడ్డి వాదనలు వినిపించారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 